# జానపద పౌరాణిక గేయాలలో స్త్రీ పాత్రల మనస్తత్వ విశ్లేషణ

(రామాయణం - భారతం -భాగవతం)

**పరిశోధన**

**యస్. కాంతికిరణ్**

**పర్యవేక్షణ**

**డా)) రేమిల్ల వెంకట రామకృష్ణశాస్త్రి**

**A THESIS SUBMITTED TO THE UNIVERSITY OF HYDERABAD**

**For the Award of Ph.D. Degree in Telugu**

**Department of Telugu**

**University of Hyderabad**

**2011**

శ్రీ

# JANAPADA POURANIKA GEYALALO STREE PATRALA MANASTATVA VISHLESHANA

## (Ramayanam – Bharatam – Bhagavatam)


**Reasearcher**

S. Kantikiran


**Supervisor**

Dr. R.V.R.Krishna Sastry

A THESIS SUBMITTED TO THE UNIVERSITY OF HYDERABAD

For the Award of Ph.D. Degree in Telugu


Department of Telugu

University of Hyderabad


2011

Department of Telugu
School of Humanities
University of Hyderabad
Hyderabad – 500046

Date:

# CERTIFICATE

This is to certify that I **S.Kantikiran** have carried out the research embodied in the present thesis for the full period prescribed under Ph.D Ordinances of the University of Hyderabad. My topic of the Ph.D programme is**"Janapada pouranika Geyalalo stree Patrala Manastatva Vishleshana (Ramayanam-bharatam-bhagavatam)"**

I declare to the best of my knowledge that no part of this thesis was erlier submitted for the award of research degree of any university.

**S.Kantikiran**

**Reg No : 06HTPH03**

**Research Supervisor**

**Head of the Department**

**Dean of the School, Humanities**

# విషయసూచిక


కృతజ్ఞతలు

ముందుమాట

ప్రవేశిక                                                    పుట

1. జానపదం వస్తుప్రక్రియా వైవిధ్యం    1 - 17

1.1. జనపదం-జానపదం-జానపదులు    1-2

1.2. జానపద విజ్ఞానం    2-4

1.3. జానపద సాహిత్యం    4-7

1.4.జానపద గేయం    7-9

1.5. జానపద గేయ లక్షణాలు    9-10

1.6.జానపద గేయం -పాశ్చాత్యుల కృషి    10-12

1.7.జానపద గేయం భారతీయుల కృషి    12-13

1.8.జానపద గేయాలకు తెలుగువారికృషి    13-16

1.9.జానపద గేయాలకు ఇతరులు చేసిన కృషి    16-17

2. జానపదుల పౌరాణిక గేయాలు విషయ వర్గీకరణ 18-27

1. రామాయణం జానపద గేయాలు 20-24

2. మహాభారతం - జానపద గేయాలు 24-26

3.భాగవతం - జానపద గేయాలు 26-27

4.ఇతర పురాణగేయాలు 27 -27

3. మనస్తత్త్వ శాస్త్రం మానవుల స్వభావవైవిధ్యం 28-56

3.1.మనోవిజ్ఞాన శాస్త్రం లేక మనస్తత్వశాస్త్రం 28-29

3.2.అపసామన్య మనోవిజ్ఞాన శాస్త్రం 30-30

3.2.1. కామేచ్ఛ సిద్ధాంతం 30-30

3.2.2. మానసిక ప్రక్రియలు 31-34

3.2.3. హిస్టీరియా 34-34

3.2.4. స్థిరీభవనం 35-35

3.2.5. తదాత్మీకరణం 35-35

3.2.6. వ్యత్యయీకరణం 35-35

3.2.7. ఆత్మన్యూనతా భావం 36-38

3.2.8. సృజనాత్మక ఆత్మ 38-38

3.2.9. ఆధిక్యతాభావం 38-38

3.2.10. వ్యక్తి జీవితం 38-40

3.2.11. వ్యక్తి వికాసం - దశలు 40-42

3.2.12. ఆత్మభావన 42-43

3.2.13. అస్తిత్వవాద సిద్ధాంతం 43-44

3.3. భారతీయుల సిద్ధాంతాలు 45-45

**3.4. అంతఃకరణం** **45-45**

3.4.1. మనస్సు 46-47

3.4.2. బుద్ధి 48-49

3.4.3. అహంకారము 49-49

3.4.3.1. అరిషడ్వర్గాలు 49-49

i. కామం 50-50

ii.క్రోధం 51-52

iii. లోభం 52-52

iv. మోహం 53-53

v.మదం 53-53

vi.మాత్సర్యం 53-54

3.4.4. చిత్తం 54-55

**3.5. ప్రవర్తనా లక్షణములు** **55-56**

4. రామాయణం స్త్రీల మనస్తత్వ విశ్లేషణ 57 - 102

4.1.సీత 58-72

4.2.ఊర్మిళ 73-78

4.3.కైక 79-84

4.4. శూర్పణఖ 85-90

4.5.మండోదరి 91-95

4.6.సులోచన 96-98

4.7.భూదేవి 99-102

5. భారతం స్త్రీల మనస్తత్వ విశ్లేషణ 103-144

5.1.ద్రౌపది 104-112

5.2.సుభద్ర 113-120

5.3.గంగ 121-124

5.4.గౌరి 125-137

5.5.చిత్రాంగి 138-144

6.భాగవతం స్త్రీల మనస్తత్వ విశ్లేషణ 145 -183

6.1. సత్యభామ 146-156

6.2.రుక్మిణి 157-162

6.3.చెంచీత 163-170

6.4.యశోద 171-177

6.5.ఉష 178-183

7.ముగింపు 184-193

పాద సూచికలు

ఉపయుక్త గ్రంథ సూచి

# కృతజ్ఞతలు

పర్యవేక్షకులుగా పరిశోధనాంశాన్ని సూచించి, సకాలంలో పరిశోధనను పూర్తిచేయుటకు కారకులైన ఆచార్య రేమిల్ల వెంకట రామకృష్ణశాస్త్రిగారికి,

2006వ సంవత్సరంలో Ph.D పరిశోధనకు అవకాశం కల్పించిన తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య పరిమి రామనరసింహంగారికి,

2011వ సంవత్సరంలో Ph.D Submitionకు అవకాశం కల్పించిన తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య ఎన్.యస్.రాజుగారికి,

M.A నుండి Ph.D వరకు నిరంతరం నన్ను ప్రోత్సహిస్తూ విలువైన సలహాలు, సూచనలు అందించిన డా|| డి. విజయలక్ష్మిగారికి,

పరిశోధనలో భాగంగా సహ పర్యవేక్షకులుగా నన్ను ప్రోత్సహిస్తూ, విలువైన సలహాలు, సూచనలు అందించిన ఆచార్య జి. అరుణకుమారిగారికి, డా|| పి. రాములుగారికి,

ఎం.ఫిల్ నుండి పి.హెచ్.డి వరకు నా పరిశోధనలో భాగంగా నన్ను ప్రోత్సహిస్తున్న ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారికి, ఆచార్య శరత్‌జ్యోత్స్నారాణిగారికి, ఆచార్య తుమ్మల రామకృష్ణగారికి, డా|| దార్ల వెంకటేశ్వరరావుగారికి, డా|| పి.పవన్‌కుమార్‌గారికి, డా|| బి.భుజంగరెడ్డిగారికి,

తెలుగుశాఖ ఆఫీస్ స్టాఫ్ విష్ణువర్ధన్‌గారికి, శ్రీధరన్‌గారికి, కిషన్‌గారికి,

సోదర సమానులు, జి.గోవింద్‌గారికి, ఓమ్ ప్రకాష్‌గారికి, జి.యన్.సుబ్బారావుగారికి, జి.వెంకట్రామయ్యగారికి మరియు మిత్రులు ఎల్. రవికుమార్, భిక్షపతి, ప్రజాపతి, శ్యామలాంబ, విజయ్, ప్రభాకర్, రవీందర్, మహేంద్ర, సరస్వతి, మాణిక్యరావు, సుబ్బారావులకు

కృతజ్ఞతలతో

**యస్. కాంతికిరణ్**

# ముందుమాట

**'జానపద పౌరాణిక గేయాలలో స్త్రీ పాత్రల మనస్తత్త్వవిశ్లేషణ'** అనే అంశాన్ని పి.హెచ్.డి పరిశోధనకై గ్రహించి, పరిశోధనలో జానపదుల గేయలలో కేవలం పౌరాణిక గేయాలైన రామాయణ, భారత, భాగవత గేయలను మాత్రమే, అవీ ముద్రిత రూపంలో ఉన్న గేయాలను మాత్రమే పరిశోధనకు ఎంచుకున్నాను. ఈ గేయాలలో స్త్రీ పాత్రల మనస్తత్త్వాన్ని పాశ్చాత్యుల, భారతీయుల మనస్తత్త్వ సిద్ధాంతాల ఆధారంగా పరిశీలించాను.

పరిశోధనాంశాన్ని 7 అధ్యాయాలుగా విభజించి పరిశోధనగావించాను.

1.జానపదం -వస్తు ప్రక్రియా వైవిధ్యం

2.జానపదుల పౌరాణిక గేయాలు విషయ వర్గీకరణ

3.మనస్తత్త్వ శాస్త్రం మానవుల స్వభావ వైవిధ్యం

4.రామాయణం -స్త్రీల మనస్తత్త్వ విశ్లేషణ

5.భారతం స్త్రీల మనస్తత్త్వ విశ్లేషణ

6. భాగవతం స్త్రీల మనస్తత్త్వ విశ్లేషణ

7.ముగింపు

## 1.1.జనపదం-జానపదం-జానపదులు

మానవుని ప్రస్థానాన్ని సూచించే దశలను అడవి, జనపదం, నాగరికం అని పేర్కొనవచ్చు. దీనినే 'హెన్రీలూయీ మోర్గాన్' 1.Savagery 2. Barbarism 3.Civilization అని పిలిచారు.

మనిషి అరణ్య జీవనం సాగిస్తున్నప్పుడు ఆహారం కొరకు ఎంతో శ్రమపడేవాడు. క్రూర మృగాలతో పోరాటాలు సాగించేవాడు. అతడు సంచార జీవిగా తిరుగుతూ దొరికినవి తిని జీవనం గడిపేవాడు. అప్పటికి అతనికి ఆహారాన్ని ఉత్పత్తి చేసుకోవడం తెలియదు. ఉత్పత్తి సాధనాలను ఏర్పాటు చేసుకోలేదు. అది ఆటవిక దశ. ఆటవిక దశ తరువాత మనిషి ఎదిగి, ఆహార సంపాదన దశ నుండి ఆహారోత్పత్తి దశకు చేరుకున్నాడు. పంట పండించడానికి ఆ పంటను కైవసం చేసుకోవడానికి సంచార లక్షణాన్ని వదలి స్థిర నివాసాలను ఏర్పరచుకోవడం నేర్చుకున్నాడు. అటువంటి ఆవాసాలే జానపదాలు. మూడవ దశలో మానవుడు వ్యవసాయ ప్రధానమైన జానపద దశను విడిచిపెట్టి యాంత్రికాభివృద్ధిచే, సాంకేతిక విజ్ఞానంచే భాసించే నాగరిక దశను చేరుకున్నాడు. ఈ విధంగా అత్యంత ప్రాచీన కాలం నుంచి సాగిస్తున్న సంప్రదాయాలను కాపాడే ప్రదేశం జనపదమని చెప్పవచ్చు. [1]

ఆంగ్ల భాషలోని 'Folk' అను పదానికి సమానార్థకంగా తెలుగులో జనపదం, జానపదులు అనే అర్థాలను ఉపయోగిస్తున్నాం. హిందీవారు 'లోక్' అనీ కన్నడం వారు 'జనపద'మని సమానార్థకాలుగా వాడుతున్నారు.

*ఆంధ్ర శబ్దరత్నాకరంలో*, *చాణక్యశతకంలో*, *రామాయణంలోని* అయోధ్యాకాండలో, విశాఖదత్తుని 'ముద్రారాక్షసం' నాటకంలో, తిక్కన రచనల్లో 'జనపదం' అంటే 'దేశం' అనే అర్థంలో ప్రయోగంలో ఉన్నది. భవభూతి '*ఉత్తర రామచరిత్ర*'లో జనపదం అంటే 'గ్రామ' పరంగా, 'జాతి' పరంగా ఉన్నది. కాళిదాసు '*మేఘసందేశం*'లో జనపద శబ్దం 'పల్లె' అనే అర్థంలో, ఎర్రన రచనల్లో 'గ్రామీణులు' అనే అర్థంలో, శ్రీకృష్ణదేవరాయలు '*ఆముక్తమాల్యద*'లో 'గ్రామం' అనే అర్థంలో, అయ్యలరాజు నారాయణామాత్యుని '*హంసవింశతి*' లో 'గ్రామం' అనే అర్థంలో, కొరవి గోపరాజు '*సింహాసన ద్వాత్రింశిక* 'లో జనపద శబ్దం 'గ్రామం' అనే అర్థంలో ఉన్నది.[2]

'డండెస్' '*ఆంధ్రుల జానపద విజ్ఞానం*' గ్రంథంలో జానపదులంటే ఏదైనా ఒక్కవిషయంలోనైనా భాగస్వామ్యం కలిగిన జనసముదాయం. వీరు ఒకే భాషకుగానీ, ఒకే భౌగోళిక ప్రాంతానికిగానీ, ఒకే మతానికిగానీ, ఒకే వృత్తికిగానీ సంబంధించినవారై ఇవి తమ సంప్రదాయాలు అని చెప్పుకునే సంప్రదాయాలు ఉండాలంటారు.

ఈ విధంగా జానపదం అన్న మాటకు ఎంతో మంది ఎన్నో నిర్వచనాలను ఇచ్చినప్పటికీ మనం మాత్రం జానపదులంటే గ్రామీణులు, నిరక్షరాస్యులు అనే అర్థాలనే స్వీకరిస్తున్నాం.

## 1.2. జానపద విజ్ఞానం

మానవుడు సంఘజీవి. సంఘమంటే సంస్కృతిని ఆచరణలో పెట్టే మనుష్య సమాహారం. అంతేకాక పరస్పరాపేక్షతో తమకుతాము సాంఘిక, ఆర్థిక రంగాలలో కొన్ని కట్టుబాట్లను నిర్ణయించుకొని ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వంతో ఏర్పడిన మనుష్య సముదాయం. మానవుడు సంఘంలో ఒక సభ్యుడిగా సంఘంలోని అలవాట్లను, ఆచార వ్యవహారాలను, కళా స్వరూపాలను గ్రహించడం సంస్కృతి అవుతుంది. అలాంటి మానవ సంఘ సంస్కృతిని అధ్యయనం చెయ్యడమే జానపద విజ్ఞానం. జానపద విజ్ఞానం, జానపద సంస్కృతి, జానపద జీవనం అను మూడు పారిభాషిక పదాలు వేరైనా అర్థం మాత్రం ఒక్కటే.

జనపదంలో నివసించేవారి ఆచారాలు, సంప్రదాయాలు, కథలు, నృత్యం, నాటకాలు, పండుగలు మొదలైనవన్నీ జానపదం అనిపించుకుంటాయి. జనపదంలోని సాహిత్యం జానపద సాహిత్యమవుతుంది. దీన్నే 'జానపద విజ్ఞానమని' అంటారు. జానపద విజ్ఞానాన్ని శాస్త్రిబద్ధంగా ప్రతిపాదించుటకు 'హెరాల్డ్-బ్రున్ వాన్ట్' తన '*The Study of American Folklore*' అను గ్రంథంలో ''మౌఖికంగా గానీ రూఢాత్మకంగా గానీ ఏదైనా ఒక జన సమూహంలో వివిధ రూపాలతో సాంప్రదాయికంగా ప్రసారమయ్యే సాంస్కృతిక సంబంధమైన విషయాలు'' జానపద విజ్ఞానం అవుతుందన్నారు. జర్మనీ భాషలోని Volkskilied అనే పదానికి అనువాదంగా Folkloreను ఉపయోగిస్తున్నాము. Folklore అనే పదాన్ని 1846లో థాంస్ రూపొందించారు. ఈ ఆంగ్ల పదానికి సమానార్థకంగా తెలుగులో 'జానపదవిజ్ఞానం'ను వాడుతున్నాము.[3]

నాయని కృష్ణకుమారిగారు '*శిష్ట సాహిత్యంలో జానపద విజ్ఞాన ధోరణులు*' గ్రంథంలో జానపద విజ్ఞానం గురించి వివరిస్తూ, వ్యక్తుల జీవితాలలో నిత్యమూ మిళితమైనటువంటి మతసిద్ధాంతాలు, వ్రతాలు, పూజలు, శకునాలు, దేవతలు, దెయ్యాలు ఇలాంటివన్నీ జానపదుల విజ్ఞానమేనని పేర్కొన్నారు. జి.నాగయ్యగారు జానపద విజ్ఞానాన్ని గురించి వివరిస్తూ, జానపదుల కళలు, సంగీతం, భాష, నాటకం మొదలైనవన్నీ జానపదుల విజ్ఞానంలోకే

వస్తాయన్నారు. అలాగే 'శిష్ట సాహిత్యంలో జానపద విజ్ఞాన ధోరణులు' గ్రంథంలో తంగిరాల వెంకట సుబ్బారావుగారు జానపద విజ్ఞానాన్ని 5 విభగాలుగా విభజించారు అవి

1. జానపద సాహిత్యం లేక శాబ్దిక కళలు

2. జానపద భాష

3.జానపద  కళలు లేక శాబ్దిక కళలు

4.జానపద శాస్త్రిములు

5. వస్తు సంస్కృతి లేదా జానపద పరికరములు

జానపద విజ్ఞానాన్ని సూక్ష్మంగా స్థూలంగా అనేక మంది అనేక విధాలుగా వివరించారు. ఎంత మంది ఎన్ని రకాలుగా విభజించినా స్థూక్ష్మంగా వివరించిన వారిలో R.S.Boggs గారి విభజన పేర్కొనదగినది. Boggs తన విభజనలో కొన్ని గణాలను పేర్కొని, ప్రతిగణంలో కొన్ని వర్గాలు చేశారు. ఈ విభజనలను ఆర్వీయస్.సుందరంగారు 'ఆంధ్రుల జానపద విజ్ఞానం' గ్రంథంలో క్రింది విధంగా పేర్కొన్నారు.

A. సామాన్య జానపద విజ్ఞానం

B. గద్య కథనం

C. కథాగేయం, గేయం, నృత్యం, ఆట, సంగీతం, గద్యం

E. నాటకం

F. ఆచారం

G. భూగోళం

H. భాష

I. కళ

J. ఆహారం

K. నమ్మకం

I.వాక్కు

M.సామెత

N.పొడుపు కథ

జానపద విజ్ఞానాన్ని స్థూలంగా వివరించిన వారిలో M.డార్సన్ గారి విభజన పేర్కొనదగినదని నాయని కృష్ణకుమారిగారు తన *'తెలుగు జానపద విజ్ఞానం సమజం -సంస్కృతి- సాహిత్యం'* గ్రంథంలో పేర్కొన్నారు. ఈ విభజనను క్రింది విధంగా చూడవచ్చు.

**i మౌఖిక జానపద విజ్ఞానం**

గేయాలు, కథాగేయాలు, జానపద గాథలు, ఐతిహ్యాలు, కథలు, సామెతలు, పొడుపుకథలు, నుడికారాలు, తిట్లు, ఒట్లు, మొదలైనవన్నీ ఈ కోవలోకి చెందినవిగా చెప్పవచ్చు.

**ii.సాంఘిక జానపద విజ్ఞనం**

పుట్టుక, మరణం, వివాహం, ఆచారాలు, కుటుంబం, పండగలు, వినోదాలు, ఆటలు, వైద్యం, మతం, నమ్మకాలు మొదలైనవి ఈ విభాగంలో చేర్చవచ్చు.

**iii.వస్తు సంస్కృతి**

చిత్రకళ, శిల్పం, వాస్తుకళ, వృత్తులకు సంబంధించిన పరికరాలు, దుస్తులు, ఆభరణాలు, ఆహార సామాగ్రి, శిలా విగ్రహాలు, మొదలైనవన్నీ ఇందులోకి వస్తాయి.

**iv. జానపద కళలు**


సంగీతం, నృత్యం, తోలుబొమ్మలాటలు, పగటి వేషాలు, యక్షగానాలు, కోలాటం వంటి అభినయాలకు సంబంధించినవన్నీ ఇందులోకి వస్తాయి.

## 1.3. జానపద సాహిత్యం

సాహిత్యం లిఖిత రూపంలోనూ, మౌఖికంగానూ ఉంటుంది. శిష్టసాహిత్యం లిఖిత రూపంలో ఉండి కవి, కాలాదులు ఉంటాయి. జానపద సాహిత్యం మౌఖిక రూపంలో ఉండి కవికాలాదులుండవు. గేయాలుకానీ, కథలుగానీ, పొడుపు కథలుగానీ జననానుడిలో ఉండి అచ్చుయంత్రం వచ్చిన తరువాత మౌఖిక సాహిత్యం గ్రంథరూపం దాల్చింది.

జానపద సాహిత్యాన్ని మనకు ప్రథమంగా పరిచయం చేసినవారిగా బ్రౌన్ మరియు బోయల్ దొరలనే చెప్పుకోవాలి. బ్రౌన్ తెలుగులో మొదటిగా వీరగాథలను సేకరించి, బొబ్బిలిదొర, కాకమ్మ కథ, కుమార రాముని కథలను సేకరించి జానపద సాహిత్యానికి తన వంతు కృషిని అందించారు. అలాగే బోయల్‌గారు తనవంతు కృషిగా సర్వాయి పాపన్న కథను సేకరించారు. వీరిని ఆదర్శంగా తీసుకొని తరువాత అనేక మంది జానపద సాహిత్యానికి తమ వంతు కృషి చేశారు. వారిలో నేదునూరి గంగాధరంగారి *'జనపద గేయవాఙ్మయ వ్యాసావళి'*, బిరుదురాజు రామరాజుగారి *'తెలుగు జానపద గేయ సాహిత్యము'*, నాయని కృష్ణకుమారిగారి *'తెలుగు జానపద గేయగాథలు'*, జి.యస్. మోహన్‌గారి *'జానపద విజ్ఞాన వ్యాసావళి', అనంతపురం మండల స్త్రీలపాటలు, 'తెలుగు జానపద విజ్ఞాన సూచి'*, రావి ప్రేమలతగారి *'జానపద పురాగాథలు'*, తంగిరాల వెంకట సుబ్బారావుగారి *'కాటమరాజుకథలు'*, ఎల్లోరాగారి *'జానపద సాహిత్యం'*, ఆర్.వి.యస్. సుందరంగారి *'జానపద సాహిత్యం'*, కృష్ణశ్రీగారి *' స్త్రీల రామాయణపు పాటలు', 'స్త్రీలపౌరాణికపు పాటలు'* ఇలా అనేక మంది తమ వంతు కృషిగా జానపద సాహిత్యానికి ఎంతో సేవచేశారు.[4]

నాయని కృష్ణకుమారిగారు *'తెలుగు జానపద విజ్ఞానం సమాజం -సంస్కృతి -సాహిత్యం'* అను గ్రంథంలో జానపద సాహిత్యాన్ని 3 భాగలుగా విభజించి ఒక్కో విభజనలో మరికొన్ని ఉపవిభజనలు చేశారు. ప్రస్తుత అధ్యయనాన్ని దృష్టిలో ఉంచుకొని నాయని కృష్ణకుమారిగారు జానపద అధ్యయనంలో గేయశాఖలో చేసిన కథాసహిత విభజనలను మాత్రమే వివరిస్తున్నాను.


గేయశాఖ
కథా రహితం
కథా సహితం
శ్రామికులు పాడేవి
స్త్రీలు పాడేవి
వృత్తి గాయకులు పాడేవి
వ్రత కథలు
పౌరాణిక కథలు
వీర అద్భుత గేయాలు
మత గాథలు
చారిత్రక గాథలు
స్త్రీ సంబంధి గాథలు
పురాణ కథలు
గ్రామ దేవత కథలు
స్పష్ట చారిత్రక గాథలు
అస్పష్ట చారిత్రక గాథలు

ప్రస్తుత పరిశోధనాంశాన్ని దృష్టిలో ఉంచుకుని నాయని కృష్ణకుమారిగారి జానపద సాహిత్య విభజనలో కథాసహిత గేయాలను మాత్రమే ప్రస్తావిస్తున్నాను.

జానపద కథా గేయాలను వీరగాథలనీ, చారిత్రక గేయాలనీ, వివిధ రకాల పేర్లతో పిలవడం జరుగుతుంది. కథా గేయం అంటే ఒక కథను చెప్పే సమయంలో దానిని గానయోగ్యంగా (గేయం) చెప్పడాన్ని 'కథాగేయం'గా పేర్కొంటాము. కథాగేయాల పుట్టుకను చెప్పడం కష్టమే. కానీ 'శిష్టసాహిత్యంలో జానపద విజ్ఞాన ధోరణులు' గ్రంథంలోఆర్.వి.యస్. సుందరంగారు జానపద కథాగేయాలను ఈ విధంగా నిర్వచించారు. ''వాగ్రూపమైన సంప్రదాయం కలిగి, తరతరాలుగా అనేక పాఠాంతరాలతో ప్రచారం పొంది, సామూహిక వికాసం కలిగిన కథా గేయాలే జానపద కథా గేయాలు''.అన్నారు.

కథాగేయాల లక్షణాలను 'ఆంధ్రుల జానపద విజ్ఞానం'లో ఆర్.వి.యస్. సుందరంగారు ఈ విధంగా పేర్కొన్నారు.

1. కథాఖ్యానమై ఉంటుంది.
2. పాట రూపంలో ఉంటుంది.
3. జానపదీయమై ఉంటుంది.
4. ముఖ్యమైన సంఘటనల మీద కథా గేయం కేంద్రీకృతమై ఉంటుంది.
5. వ్యక్త్యతీతమై ఉంటుంది.

## 1.4. జానపద గేయం

గేయాన్నే 'పాట' అని కూడా అంటారు. అసలు పాట ఎప్పుడు పుట్టిందో పేర్కొనడం సాధ్యం కాదు. కానీ మానవుడు తన దైనందిన జీవితంలో అనేక రకాలైన పనులను చేస్తున్న సమయంలో తన అలసటను పోగొట్టుకోవడానికి లయాన్విత మాటలను పలుకుచూ తన పనులను చేసేవాడు, వీటినే మనం గేయాలనవచ్చు. దీనిని బట్టి పనితోపాటే పాట పుట్టిందని చెప్పవచ్చు. జనపదములందు రూపొంది, ప్రచారమున ఉన్న గేయాలను జానపదగేయాలనవచ్చు. ఈ జానపద గేయాలను 'పల్లెపాటలు' అనికూడా అంటారు. ఎందుకనగా జనపదం పల్లె అనే అర్థంలో వినియోగంలో ఉంది కనుక దీనికి ఆ పేరు వచ్చింది.

ఆర్ .వి.యస్. సుందరం తన 'ఆంధ్రుల జానపద విజ్ఞానం'లో జానపద గేయాన్ని నిర్వచిస్తూ 'గేయ రూపంలో భావ ప్రధానంగా వెలువడే ఆశురచన జానపదగేయ' మన్నారు. వీటికి కవి-కాలాదులుండవు. ఆశువుగా రాసిన పాటలు మౌఖికంగా ఒకరి ద్వారా మరొకరికి చేరి గానయోగ్యమవుతాయి. నిరక్షరాస్యులు పాడుకునే పాటలే జానపద గేయాలన్నారు.

జానపద గేయాలను పండితులు వివిధ రకాల పేర్లతో పిలిచేవారు. ''ఖండవల్లి లక్ష్మీరంజనంగారు 'ప్రజా వాఙ్మయమనీ', శ్రీ తల్లా వఝ్జల శివశంకరశాస్త్రి, శ్రీ అడిదము రామారావు ప్రభృతులు 'పదవాఙ్మయమనీ', శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు 'అనాదృత వాఙ్మయమనీ', శ్రీవావిలాల సోమయాజులుగారు 'గేయరచనలనీ', శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు 'మధురకవితలనీ', శ్రీ శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు 'దేశిసారస్వతమనీ' పిలువగా శ్రీ పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు శ్రీ ఉన్నవ లక్ష్మినారాయణగారు శ్రీ టేకుమళ్ళ కామేశ్వరరావుగారు శ్రీహరి ఆదిశేషువుగారు, శ్రీ నేదునూరి గంగాధరంగారు శ్రీ తూమాటి దొణప్పగారు 'జానపదగేయాలని' పిలిచిరి''[5]

వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి తన *'జానపదగేయ సహిత్య ప్రభ'* గ్రంథమందు జానపద గేయాన్ని గురించి ఇలా వివరించారు. జానపద గేయం స్వభావాన్ని బట్టి శుద్దం, శిష్టం అని రెండు విధాలు. జానపదుల భాషలో జానపదుల నిసర్గ రమణీయ భావాలతో జానపదులకు ఆనందం కలిగేటట్టు రచించబడిన సాహిత్యం శుద్ధ జానపదగేయ సాహిత్యం. ఇందులో జానపదుల జీవితం, భాష, ప్రతిఫలిస్తూ ఉంటుంది. పల్లెపదాలు, సరాగాలు, త్రివేణి వంటి గ్రంథాలలోని ఈ రకమైన గేయాలు శుద్ధ విభాగానికి చెందినవిగా పరిగణించవచ్చు. శిష్టసాహిత్యానికి చెందిన రామాయణ, భారత, భాగవతాదులకు చెంది అత్యంత సన్నిహితంగా ఉంటూ పండితులకు ఎక్కువ ప్రమోదాన్ని కలిగించేవిగా ఉన్నాయి. అటువంటి రచనలు శిష్ట జానపదగేయ సాహిత్యమనడం సమంజసం. ఇందులో కొన్ని పాటలు శ్రీకారంతో దేవతాస్తుతి పూర్వకంగా ఆరంభించబడ్డాయి. పౌరాణిక పాటలలో పెక్కు మంగళహారతుల పాటలు ఈ కోవకే చెందుతాయి.

తెలుగులో దేశి సారస్వతమంతా జానపద గేయాలని అనేక మంది పరిశోధకుల అభిప్రాయం. రగడలు, ద్విపదలు, మధ్యాక్కరలు, తరువోజలు ఇలా అనేక దేశి రచనలు జానపద గేయాలుగా చెప్పబడ్డాయి. కనుక దేశిసారస్వతాన్ని జానపద గేయ సాహిత్యంగా చెప్పవచ్చు. ఎల్లోరా 'జానపద సాహిత్యం' అను గ్రంథంలో దేశి

రచనల గురించి ఈ విధంగా పేర్కొన్నారు. “ దేశి రచనలు రెండు విధములు. ఒకటి పాట. రెండు పదములు. పదములు -తుమ్మెద, ప్రభాత (మేలుకొలుపులు) వెన్నెల (చందమామ)కోవెల, చిలుక, కిరాళి, గొబ్బి, నివాళి(హారతులు మంగళములు) మువ్వగోపాల హరిహరీ పదాలుగా చెప్పవచ్చును. ఇక పాటలు - లాలి, జోల, ఏల, సువ్వి, ఉయ్యాల, జాజరి, ఐరేని, అప్పగింతలు, శ్రావణ శుక్రవారాలు, అక్కల, శోభనం, ధవళములు, చద్దులు, సుద్దులు, చిందులు, కీర్తనలు, సంవాదాలుగా చెప్పవచ్చు”.

## 1.5.జానపద గేయ లక్షణాలు

జానపద గేయాలకంటూ ప్రత్యేకించి కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. జి.అరుణగారు ‘*తెలుగు-హిందీ పౌరాణిక గేయ పరిశీలన*’ అను సిద్ధాంత గ్రంథంలో జానపద గేయ లక్షణాలను క్రింది విధంగా వివరించారు. అవి

1. అజ్ఞాత కర్తృకం

జానపద గేయాలకు కర్త అంటూ ఎవరూ ఉండరు.

2. అవిదిత కాలం

జానపద గేయాలకు రచనా కాలమంటూ ఉండదు.

3. మౌఖిక ప్రచారం

మౌఖిక ప్రచారంద్వారా ప్రారంభమై నేడు లిఖిత రూపం దాల్చాయి.

4. గానయోగ్యాలు

పద్యం కన్నా వీలుగా సామాన్యులకు గానయోగ్యమైనవి.

5. పునరావృతం

జానపదాల్లో చెప్పిన అంశం మరల పునరావృత మవుతుంది.

6. ఆశుకవిత్వం

జానపద గేయాలు ఆశువుగా చెప్పబడినవి మాత్రమే.

7. రసభరితాలు

జానపదుల గేయాలలో నవరసాలు మిళితమై ఉంటాయి.

8. పురుషార్థ బోధకాలు

ధర్మార్థకామ మోక్షాలను తెలియ జేస్తాయి.

9. స్త్రీ ప్రాధాన్యాన్ని చాటేవి

జానపద గేయాలలో స్త్రీ ప్రాధాన్య గేయాలే అధికం.

10. వ్యవహారిక భాషాసంపన్నాలు

జానపద గేయాలు సామాన్యజనులకు అర్థమయ్యే భాషతో కూడుకున్నవి.

11. కావ్య ప్రయోజనలను వివరించేవి

కావ్యంలా ఆనందోపదేశాలను మరియు మానవ నైతిక విలువలు తెలుపుతున్నాయి.

12. సంస్కృతి నిలయాలు

ఏకపత్నీవ్రతం, నోములు, ధర్మ, నీతి రక్షణ మొదలైన సంస్కృతి అంశాల నిలయాలు

13. సాంఘిక స్థితిగతులకు దర్పణం

ఆనాటి ప్రజల జీవనం, భాష, వస్త్రధారణ, కళలు వంటి అంశాలను తెలుపుతాయి.

14. భక్తి భరితాలు

జానపద గేయాలు ప్రధానంగా భక్తిని చాటి ముక్తికి మార్గాన్ని తెలుపుతాయి.

## 1.6. జానపద గేయం- పాశ్చాత్యుల కృషి

జానపద గేయాలను సేకరించిన వారిలో మొదట పాశ్చాత్యులనే చెప్పుకోవాలి. వీరిలో ముఖ్యులు జె.యస్. బోయల్. సి.పి. బ్రౌన్ మొదలైనవారిని ముఖ్యులుగా పేర్కొనవచ్చు.

కథాగేయాల సేకరణ పాశ్చాత్య దేశాలలో 17వ శతాబ్ది పూర్వార్థంలోనే ప్రారంభమై, అధ్యయనం 18వ శతాబ్ది నుంచే జరగసాగింది. పెర్సి 1765లో ప్రచురించిన *'రెలిక్స్ ఆఫ్ ఏన్షియంట్'* ఇంగ్లీష్ పొయెట్రీ గొప్ప సంకలనం. ఇంగ్లండులో కాల్పనిక కవిత్వోద్యమ ప్రాదుర్భావానికి ఈ సంకలనం చాలా వరకు దోహదం చేసింది. ఇంగ్లండు, జర్మనీ, స్కాండినేవియా మొదలైన దేశాల కథాగేయాలు ప్రచురితాలై విద్వాంసులను ఆకర్షించాయి. సర్ వాల్టర్ , స్కాట్ ప్రచురించిన 'మిన్ట్రెల్సి ఆఫ్ ది స్కాటిష్ బార్డర్' జానపద కవిత్వ అధ్యయనంలో కొత్త దారులను చూపింది. యూరప్ లోని అనేక దేశాలలో 19వ శతాబ్దం నుంచి కథాగేయాల సేకరణ ప్రారంభమైంది. ఈ విషయంలో ఫ్రాన్సిస్ జేమ్స్ చైల్డ్ అనే అమెరికా విద్వాంసుడు చేసిన సేవ గమనార్హం. *'ఇంగ్లీష్ అండ్ స్కాటిష్ బ్యాలెడ్స్'* అనే పేరుతో 8 సంపుటాలలో ఆయన ప్రచురించిన కథాగేయాల వల్ల ఈ క్షేత్రానికి చిరస్మరణీయమైన కానుక లభించింది. ఇతనిదే మరొక బృహద్గ్రంథం *'ది ఇంగ్లీష్ అండ్ స్కాట్టిష్ పాపులర్ బ్యాలెడ్స్'* 5 సంపుటాలలో ఉంది. ఎంతో మంది ఈ రంగంలో కృషి చేసి అనేక మందికి మార్గ దర్శకులయ్యారు.[6]

భారతదేశంలో ఉద్యోగార్థమై వచ్చిన సి.పి.బ్రౌన్ 1842లో జానపద మౌఖిక సాహిత్యాన్ని సమీకరించి బొబ్బిలికథ, కుమార రాముడికథ, కాకమ్మకథ, పల్నాటి వీరచరిత్రలను ముద్రణరూపంలో భద్రపరిచి జానపద సాహిత్యానికి తనవంతు కృషిని చేసి ఎందరికో మార్గదర్శకులయ్యారు.

అముద్రిత గ్రంథం *'తెలుగులో తొలితరం పరిశోధకులు'* లో బ్రౌన్ బాటలోనే చార్లెస్. ఇ. గోవర్ 1871లో '*Folk Songs of South India*' అనే గ్రంథాన్ని ప్రకటించి, ఇందులో తమిళ, కన్నడ, మళయాళ, కొడగు భాషలలో గేయాలను, తెలుగుకు సంబంధించి వేమన పద్యాలను పేర్కొన్నారని తెలుస్తుంది.

జె.ఏ బోయల్ తెలుగు జానపద గేయాలను సేకరించిన వారిలో మొదటివాడిగా పేర్కొనవచ్చు. 1874లో బోయల్ రాయలసీమలో రాజోద్యోగిగా నియమితుడైన బోయల్ రాత్రిపూట గ్రామాలలో సంచరిస్తున్నప్పుడు గ్రామ ప్రజలు పాడుకునే పాటలు విని ఆనందిందేవాడు. ఆ కాలంలో చార్లెస్. ఇ. గోవర్ 1871లో '*Folk Songs of South India*' అనే గ్రంథాన్ని ప్రకటించాడు. ఇందులో తెలుగు గేయాలు లేకపోవడాన్ని గమనించిన బోయల్ తెలుగు భాష గొప్పదనాన్ని గుర్తించి తెలుగు జానపద గేయాలను సేకరించి ప్రకటించెను.[7]

ఈ విధంగా అంగ్లేయులు  భారతీయుల జానపద గేయాలను వెలుగులోకి తీసుకువచ్చి ముందుతరాల వారికి మార్గదర్శకులుగా నిలిచారు.

## 1.7. జానపద గేయం - భారతీయుల కృషి

పాశ్చ్యాత్యుల జానపదగేయాల సేకరణ, భారతీయులు ఈ విభాగంలో చేయాల్సిన కృషిని వివరించాయి. ఈ విధంగా భారతీయులు జానపదగేయ సేకరణలో తమ వంతు కృషిని చేశారు. వీరిలో రవీంద్రనాధ్ ఠాగూర్, కృష్ణదేవ ఉపాధ్యాయ, రామనరేష్ త్రిపాఠి,  సానే గురూజీ, దేవేంద్ర సత్యర్థి, రామనరసింహ మొదలైనవారు ప్రముఖులు. వీరు భారతదేశంలో వివిధ భాషలలో ఉన్న పల్లె పాటలను సేకరించి అనేక సంకలనాలుగా వెలువరించారు.

ఇల్లిందల సరస్వతీదేవిగారి 'జాతిరత్నాలు' అను గ్రంథ పీఠికలో జానపద గేయాల గురించి, ఈ గేయాలకు పాశ్చాత్యుల ప్రభావంతో భారతీయులు చేసిన కృషిని క్రింది విధంగా వివరించారు.

'శ్రీదేవేంద్ర సత్యార్థి' హిందూస్థానము నందలి అన్ని ప్రాంతములు తిరిగి జానపద గేయాలు వాటి విశేషములను ప్రకటించి, 'రూరల్ ఇండియా' అను ఇంగ్లీషు మాస పత్రికలో 'భరతదేశపు పల్లెపాటలే జతీయవాఙ్మయము' అను వ్యాసమును రచించెను.

'చంద్రకుమారదేవ్' బెంగాలీ గేయాలను సేకరించి ప్రకటించెను, దీన్ని రోమారోలాసోదరి ఫ్రెంచ్  భాషలోకి అనువదించిరి.

కె.యం. మున్షీ  గుజరాతీ పాటలను సేకరించి ప్రకటించెను. ఈ గ్రంథానికి మహాత్మాగాంధీ పీఠిక వ్రాయడం విశేషం.

రామనరేశ్ త్రిపాఠి '*గ్రామగీతములు*' అను గేయ సంకలనాన్ని మరియు 'కవితా కౌముది' అను అయిదు సంకలనాలను హిందీలో ప్రకటించెను.

'రామ శరణుదాసు' మరియు  'సంత్ రాం' ఉర్దూ భాషలో జానపద గేయములను సేకరించి '*పంజాబ్ కీ గీత్*' అను గ్రంథంగా ప్రకటించిరి.

'కృష్ణచోర్ ఘోరే' మరాఠీ పల్లె పదాలను సేకరించి '*సాహిత్యాచే మూలధన్*' అను పేరుతో ప్రకటించిరి.

ఇలా జానపద గేయముల గురించి భారతదేశపు భాషలన్నింటిలో పరిశోధన గావించి అనేక మంది మహానుభావులు తమవంతు పాత్రను నిర్వహించారు.

## 1.8. జానపద గేయాలకు తెలుగువారి కృషి

జానపద సాహిత్యానికి కృషి చేసిన వారిలో ప్రథములు శ్రీ నేదునూరి గంగాధరంగారు. జానపద సాహిత్య కృషికే జీవితాన్ని అంకితం చేసి జానపద సాహిత్యానికి పితామహునిగా కీర్తింపబడుతున్నారు.

'మున్నేరు' గ్రంథంలో నేదునూరి జానపద సాహిత్యానికి చేసిన కృషిని ఈ విధంగా పేర్కొన్నారు. రాజమండ్రికి మూడు కిలోమీటర్ల సమిపాన ఉన్న కొంతమూరులో 1904 జూలై 4వ తేదీన వెంకటేశ్వర్లు, గంగమ్మ పుణ్యదంపతులకు గంగాధరంగారు జన్మించారు. తల్లిదండ్రులను చిన్నతనంలోనే కోల్పోయిన గంగాధరం పెద్దగా చదువుకోకపోయినా మానవల్లి రామకృష్ణకవిగారి దగ్గర పరిశోధనకు సంబంధించి అనేక విషయాలను నేర్చుకున్నారు. ఒక పేద బడిపంతులుగా జీవితాన్ని కొనసాగించారు. జానపదగేయ సేకరణకు భార్య మెడలోని తాళిని కూడా అమ్మాల్సి వచ్చింది. అనేక జానపద గేయాలను సేకరించి భావితరాలవారికి మార్గదర్శకులయ్యారు. 'పల్లెపాటలే ఆయన ఆయనే పల్లె పాటలు' అనేంతగా ఆయన జానపద గేయ సాహిత్యంలో చొచ్చుకుపోయారు. గంగాధరంగారు 1970, మార్చి 11 వతేదీన రాజమండ్రిలో తనువు చాలించారు.

'తెలుగులో పరిశోధన' (రజితోత్సవ సంచిక)లో కొలకలూరి ఇనాక్ గారు 'తెలుగులో పరిశోధన జానపద సాహిత్యం' అనే వ్యాసంలో నేదునూరి వారి రచనలను క్రింది విధంగా పేర్కొన్నారు.

1. 1749 - మేలుకొలుపు పాటలు
2. 1951 - మంగళహారతులు
3. 1955 - సెలయేరు
4. 1956 - వ్యవసాయ సామెతలు
5. 1960 - పసిడి పలుకులు
6. 1960 - స్త్రీల వ్రత కథలు

7. 1960 - జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి

8. 1964 - ఆటపాటలు

9. 1966 - మిన్నేరు

10. 1973 - మున్నేరు

ఇలా ఇన్ని సంకలనాలను వ్యాసాలను గంగాధరంగారు సేకరించి ప్రకటించి జానపద సాహిత్యానికి తన వంతు కృషినిచేసి అనేక మందికి మార్గదర్శకులయ్యారు.

'కృష్ణశ్రీ' అనేది శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారి కలంపేరు. ప్రభుత్వ విద్యాశాఖలో అనేక పదవులను నిర్వహించారు. వీరి వృత్తి సైన్సు అయినప్పటికీ తెలుగు సాహిత్యంలో జానపదగేయాల సేకరణకు, ప్రచురణకు ఎంతగానో సహాయాన్ని అందించారు.

1953 - పల్లెపదాలు

1955 - స్త్రీల రామయణపు పాటలు

1963 - స్త్రీల పౌరాణిక పాటలు

బిరుదురాజు రామరాజుగారి గురించి *'తెలుగులో పరిశోధన'* (రజితోత్సవ సంచిక)లో ఇనాక్ గారు *'తెలుగులో పరిశోధన జానపద సాహిత్యం'* అనే వ్యాసంలో బిరుదురాజు రామరాజుగారి తెలుగు, ఆంగ్ల భాషలలో చేసిన రచనలను వివరించారు. బిరుదురాజు రామరాజుగారు 1952-53 మధ్య *'తెలుగు జానపదగేయ సాహిత్యం'* అనే Ph.D గ్రంథాన్ని ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారి మార్గ దర్శకత్వంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంనందు చేశారు.

1955 - తెలుగు జానపదగేయ సాహిత్యం

1960 - తెలంగాణా పిల్లల పాటలు

1960 - తెలంగాణా పల్లెపాటలు

1964 - Mohrram Folk Songs in Telugu

1964 - Mysticism in Telugu folk Songs

1975 - Folk Tales of Andhra Pradesh

1978 - folklore of Andhra Pradesh

బి. రామరాజుగారు తెలుగు జానపద గేయ సాహిత్యంపై ప్రథమంగా పరిశోధన చేసి '*తెలుగు జానపద గేయ సాహిత్యము*' అను పరిశోధనా గ్రథమును వెలువరింవారు. రామరాజుగారు తన గ్రంథంలో జానపద గేయాలను పౌరాణిక, చారిత్రక, మత సంబంధ, పారమార్థిక, స్త్రీ, శ్రామిక, పిల్లల, శృంగార, అద్భుతరస, కరుణరస, హాస్యపు గేయాలనీ విభజించి పరిశోధన గావించారు.

ఎల్లోర అనేది గొడవర్తి భాస్కరరావుగారి కలం పేరు. ఎల్లోరా అను కలం పేరుతో వీరు జానపద సాహిత్యానికి తన వంతు కృషిని అందించారు.

1955-57 - జానపద గేయాలు రెండు సంపుటాలు

1960 - మన ప్రాచీన కళలు పుట్టు పూర్వోత్తరాలు

1960 - సరాగాలు

1960 - మధుర కవితలు

నాయని కృష్ణకుమారిగారు 1970లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి '*తెలుగు జానపద గేయ గాథలు*' అను పరిశోధనా గ్రంథంను వెలువరించారు. ఈ పరిశోధనా గ్రంథంలో బిరుదురాజు రామరాజు, తూమాటి దొణప్పల గేయగాథలను తన గ్రంథంలో మనకు అందించారు.

టేకుమళ్ళ కామేశ్వరరావుగారు జానపద గేయాలను విమర్శనాత్మకంగా పరిశీలించి 'పాతపాటల' శీర్షికతో చాలా వ్యాసాలు రాశారు. ఇలా 1953-55 ల మధ్య గృహలక్ష్మి, సౌభాగ్య, భారతి, కిన్నెర పత్రికలో వచ్చాయి. ఇవి పండుగలు, ఆచారాలు, మొదలైన వాటిని తెలుపుతాయి.

ఆర్.వి.యస్.సుందరంగారు 1973లో మైసూరు విశ్వ విద్యాలయం నుండి 'తెలుగు-కన్నడ జానపద *గేయాలు*' అనే పరిశోధనా గ్రంథాన్ని సమర్పించి డాక్టరేటును పొందారు. ఇందులో సుందరంగారు జానపద గేయాల స్వరూపాన్ని గేయ లక్షణాలను, వాటి స్వభావాన్ని వివరించారు. అలాగే జానపదుల గేయాలలో 'పనిపాటలు' చాలా ప్రాచీనతను సంతరించుకున్నాయని, వీటిలో కర్షక, కార్మిక, రోకటి పాటలే అధికమని పేర్కొన్నారు. తెలుగు జానపద గేయాలలో అధిక భాగం ద్విపదలు, రగడలు వంటి ప్రక్రియలలోనే రచించబడ్డాయన్నారు.

జానపదుల వైద్యం, మతం, నృత్యం, సంగీతం, నాటకం వంటి అంశాలను మొదట తెలుగులో ప్రథమంగా ప్రస్తావించింది జి.ఎస్.మోహన్‌గారే.

1. జానపద విజ్ఞాన వ్యాసావళి -1981

2.తెలుగు జానపద విజ్ఞన సూచి - 1982

3. స్త్రీల పాటలు - 1979 (సిద్ధాంత గ్రంథం)

4. తెలుగు కన్నడ సామెతలు సమానార్థాకాలు

## 1.9.జానపద గేయాలకు ఇతరులు చేసిన కృషి

1.నంది చలపతిరావు 1899,1903 లో స్త్రీల పాటలను ప్రచురించారు.

2.మంగు వెంకటనాథరావు 1905లో స్త్రీల పాటలను ముద్రించారు.

3. మంత్రి ప్రెగడ భుజంగరావు 1899లో 'స్త్రీలపాటలు' ను వెలువరించారు.

4.1898లో జె.వెంకట రమణయ్య జానపద పాటలను ముద్రించారు.

5.1898లో జె.రామలక్ష్మయ్య జానపద పాటలను ముద్రించారు.

6.ఎం.ఎన్. వెంకటయ్య 1905లో '*Some Telugu Folk Songs*'

1906లో'*Some Telugu Nursery Songs and Catches*' ను సేకరించారు.

7.1909 లో '*చిల్లర పాటలు*' అనే గేయ సంకలనం వెలువడింది.

8.1904లో స్త్రీ జనానంద నవీన కళ్యాణ పాటలు

9. గూడకృష్ణయ్య 1910 లో '*స్త్రీల వేడుకపాటలు*' ను వెలువరింవారు.

10. వి. కన్నయ్య దాసు 1911 లో '*స్త్రీ జన వినోదిని పెండ్లి పాటలు*'.

11.1913లో తెలకపల్లి నరసమాంబ స్త్రీల పూజ పాటలు వెలువరించారు.

12.ఘాలి సుబ్బారావు 1915 లో స్త్రీల వేడుక పాటలను వెలువరించారు.

13.ఎన్. గోపాలకృష్ణ1919లో 'స్త్రీ జనానందకర కళ్యాణ పాటలు'


14. శ్రీ హరి ఆదిశేషువు 1954 లో '*జానపద గేయ జ్మయ పరిచయం*'ను [8]

ఇలా అనేక మంది ప్రముఖుల కృషిని ఆదర్శంగా తీసుకొని తరువాత అనేక మంది మౌఖికంగా ఉన్న అనేక జానపద గేయాలను సేకరించి ప్రచురించి జానపద సాహిత్యానికి తమవంతు కృషిచేశారు, చేస్తున్నారు.

ప్రతి మనిషికి భగవంతునిపై నమ్మకమే పురాగాథలు ఏర్పడడానికి కారణమని చెప్పవచ్చు. పురాణాలు అనగానే సంస్కృతంలో అష్టాదశ పురాణాలు, ఉప పురాణాలు. తెలుగులో రామాయణం, మహాభారతం, భాగవతం వంటివి గుర్తుకొస్తాయి. వీటినే మనం పురాణాలు అంటున్నాం.

పాశ్చాత్యులు వారి 'Myth'(పురాగాథలు) లలో ఉన్న అంశాలు, లక్షణాలను మన పురాణాలలో ఉన్న అంశాలను, లక్షణాలను పరిశీలించి ఇవి రెండూ ఒకటేనని తేల్చారు. పాశ్చాత్యులు మన పురాణాలను పురాగాథలుగా పేర్కొన్నారు. జానపదుల పురాణాలను పురాగాథలుగా చెప్పవచ్చును.

'పురాగాథలు' గ్రంథంలో రావి ప్రేమలతగారు పురాగాథలంటే ఏమిటో వివరించి, అందులో వివిధ శాఖలను తెలియజేశారు. 'పురా' అనే శబ్దానికి ప్రాచీన, పూర్వపు మొదలైన అర్థాలున్నాయి. అనగా ప్రాచీన గాథలు లేక పురాతన గాథలే పురాగాథలనవచ్చు. ఈ గాథలు సృష్టికి, దేవతలకు సంబంధించినవై ఉంటాయి. ప్రఖ్యాత శాస్త్రవేత్త 'ఫ్రాంజ్ బోజ్' "ప్రపంచ సృష్టిని గురించి ఆలోచించిన ఆలోచనా ఫలితములే పురాగాథ"లని పేర్కొన్నారు. ఈ పురాగాథలు సాంస్కృతిక ఆచారాల గురించి తెలుపునని వివరించారు. అలాగే ఆచార్య నాయని కృష్ణకుమారిగారు తన సిద్ధాంత గ్రంథంలో Mythనకు సమానార్థకంగా ఈ పురాగాథలను పేర్కొన్నారు.



పురాణాలు జానపదులను బాగా ఆకర్షించాయి. జానపదులు రామాయణం, భారతం, భాగవతం వంటి వాటికే అధిక ప్రాధన్యమిచ్చి వాటిలోని పాత్రలు తమ జీవితంలోనివిగా భావించి నిత్యం గేయాలలో, కథలలో, దృశ్య రూపంగా ఇలా ఎన్నో విధాలుగా పురాణ గాథలను తమ జీవితంలో భాగంగా చేసుకున్నారు. జానపదులు. ఈ పురాణ పాత్రలను ఎంతగా ఆకలింపు చేసుకున్నారంటే సమాజంలో వ్యక్తులను వీడు రాముడు, వీడు రావణుడు, వీడు ధర్మరాజు, వీడు శకుని, వీడు కృష్ణుడు, ఈమె సత్య, వీడు నారదుడు, వీడు హరిశ్చంద్రుడు అంటూ పురాణాల పాత్రల లక్షణాలను వారి సమాజంలోని వ్యక్తుల లక్షణాలకు ఆపాదించి వారిని పురాణ పురుషుల పాత్రలతో పిలవడం జరుగుతుంది. జానపద సాహిత్యంలో పురాణాలకు సంబంధించిన సాహిత్యం అధికంగానే ఉంది. వీరి బుర్రకథలలో, తోలుబొమ్మలాటలలో, కథలలో, గేయాలలో ఇలా అనేక రూపాలలో పురాణ సాహిత్యం నిక్షిప్తమైనది. జానపదులు పురాణ కథలను గేయాలుగా మలిచి పాడుకునేవారు. ఒక్కో గేయంలో ఒక్కో సంఘటనను అద్భుత కల్పనలతో తమదైన రీతిలో చెప్పేవారు. [9]

జానపద సాహిత్యంలో పురాగాథలు కథా ప్రధానమై గద్యరూపంలో, గేయరూపంలో ఉంటాయి. జానపదుల దృష్టిలో ఈ పురాగాథలు 'గతకాలపు సత్యము'. ఇతరులకు చెప్పడం ద్వారా, ఇతరులు చెప్పిన దాన్ని వినడం ద్వారా తమకు పుణ్యం వస్తుందని జానపదుల నమ్మకం. ఈ పురాగాథల్లోని పాత్రలు దేవతలు, దేవతా స్వభావులు.

పురాణాలు గేయ రూపంలో ఉంటే అవి పౌరాణిక గేయాలు. పురాణాలు అంటే మనకు రామాయణ, భారత, భాగవతాలు గుర్తుకువస్తాయి. పురాణాలను కనుక ప్రక్రియా పరంగా తీసుకున్నప్పుడు ఈ రామాయణ, భారత, భాగవతాలతో పాటు శైవ, వైష్ణవాలు కూడా వస్తాయి. ఈ పురాణాలు ఎన్ని ఉన్నా అగ్రస్థానం మాత్రం రామాయణానిదే.

కృష్ణశ్రీగారి *'స్త్రీల రామాయణపు పాటలు'* సంపుటంలోని ఉపోద్ఘాతంలో స్త్రీల సారస్వత కాలం గురించి ఈ విధంగా పేర్కొన్నారు. రంగనాథ రామాయణ గాథను స్త్రీలు వల్లించి తమ పాటలుగా చేసుకున్నారు. స్త్రీలకు ప్రత్యేక పూజలు చేసుకొనే అవకాశము కల్పించిన వీరశైవముతో స్త్రీలలో నోముల కథలు స్త్రీల పాటలుగా అవతరించి, తరువాత రామాయణ, భారత, భాగవత కథలు స్త్రీల పాటలుగా రూపొందుటకు కారణమయ్యాయి. వస్తు రూపమున మనకు నేటికీ లభ్యమవుతున్న మొదటి స్త్రీలపాట తిమ్మక్క సుభద్రాకళ్యాణమే. ఈ అంశాలను బట్టి

స్త్రీలసారస్వతము 15వ శతాబ్దములోనే ప్రారంభమైనదని చెప్పవచ్చు.

జానపదుల పౌరాణికాలలో వారి పాత్రలలోని ఆదర్శాలు పాత్రల స్వభావాలు వారిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. వీరు వీటిని ఆదర్శంగా తీసుకొని తమ జీవితానికి అన్వయించుకునేవారు. జానపదులు తమ కాలంలో తాము పాటించే ఆచార వ్యవహారాలను, అలవాట్లను, కట్టుబాట్లను తమ రచనల్లో పాత్రలకు అన్వయించి చెప్పేవారు. వీరి జానపద గేయాలలో మనకు అధిక వర్ణనలు కనిపించవు. అలాగే వీరి భాష సరళము, వ్యావహారికము కావున వీరి గేయాలలో మహాప్రాణాలకు బదులు అల్పప్రాణాలు కనిపిస్తాయి.

జానపదుల పౌరాణిక గేయాలను క్రింది విధంగా విభజించుకొని పరిశీలించవచ్చు.

1. రామాయణం - జానపద గేయాలు
2. మహాభారతం - జానపద గేయాలు
3. భాగవతం - జానపద గేయాలు
4. ఇతర పురాణ గేయాలు

## 1. రామాయణం - జానపద గేయాలు

భారతీయుల తొలి కథా గీతంగా 'రామకథ'ను పేర్కొనవచ్చు. వాల్మీకిచే రచించబడి లవకుశుల ద్వారా గానం చేయబడి జననానుడిలో బహుళ ప్రచారమును పొందినది. రామాయణ కథా కాలము 500 B.C.కి ముందు కాలమని పాశ్చాత్యులు అభిప్రాయపడగా మనం మాత్రం 3000 B.C నుండి 500 B.C వరకు గల కాలంలో జరిగిన కథయని అభిప్రాయపడుతున్నాం.[10]

రామాయణ కథ, పాత్రలు మనల్ని ఎంతగా ప్రభావితం చేశాయంటే. భారతదేశంలో రామాయణం ఎన్ని భాషలలో వెలువడినా, తెలుగులో వచ్చినన్ని రామాయణాలు మరే భాషలో రాలేదంటే దానికి కారణం తెలుగువారి జీవన విధానంలో ఈ రామాయణ పాత్రలు ఎంతగా ఇమిడిపోయాయో చెప్పవచ్చు.

వాల్మీకి రామాయణాన్ని సంస్కృతంలో రచించుట వలన పండితులకు మాత్రమే ఈ రామాయణం పరిమితమైంది. సామాన్యులయిన స్త్రీలకు, పిల్లలకు మెదలైనవారికి రామాయణం గురించి పూర్తిగా తెలియక

పోవడంతో రామాయణగాథ ప్రజలందరికీ చేరువవ్వాలనే ఉద్దేశ్యంతో 1250 ప్రాంతంలో గోనబుద్ధారెడ్డి తెలుగులో రామాయణాన్ని రచించి ప్రజలందరి మన్ననలను అందుకున్నాడు. ఇతని తరువాత ఎన్ని రామాయణాలు వచ్చినా గోనబుద్ధారెడ్డి రంగనాథ రామాయణమే ప్రముఖస్థానం పొందింది.

జానపదులు రామాయణ గాథలను తమకు అనువైన భాషకు, భావాలకు దగ్గరగా గేయాల రూపంలో మలచుకొని అనేక సందర్భాలలో గానం చేసేవారు. జానపదులు రామాయణంలోని పాత్రలను రాజులుగా, దేవతలుగా చిత్రించలేదు. రాముడిని రామయ్య తండ్రిగా, సీతను సీతమ్మగా, లక్ష్మణుడిని లక్ష్మన్నగా భావించారు. రాముడు, సీత, లక్ష్మణుడు, భరతుడు వంటి పాత్రలన్నీ పడ్డ కష్టాలను జానపదులు తమ జీవితంలో ఏదో సందర్భంలో ఎదుర్కొన్నవిగా భావించేవారు.

### a. గోనబుద్ధారెడ్డి '*రంగనాథ రామాయణం*'

సంస్కృతంలోని వాల్మీకి రామాయణాన్ని అనువాదం చేసే వారందరూ స్వతంత్ర అనువాదానికి ప్రాముఖ్యతనిచ్చి అనువాదాన్ని సాగించారు. ఆనాడు జన నానుడిలో ఉన్న అనేక కథలను ఈ రామాయణంలో చేర్చి రామాయణాన్ని రచించారు. ఈ కోవలోవే రంగనాథ, భాస్కర రామాయణాలు.

రామాయణాలలో 'గోనబుద్ధారెడ్డి' రచించిన '*రగనాథరామాయణం*' జానపదులను బాగా ఆకట్టుకుంది. రంగనాథ రామాయణమే జానపదుల వాడుకలో ఉన్న రామాయణంగా చెప్పవచ్చు. దానికి కారణం బుద్ధారెడ్డి జానపదులు వాడే సామాన్య భాషను ఉపయోగించి రామాయణాన్ని రచించడమే. వాల్మీకీ రామాయణంలో లేని అనేక ఘట్టాలు రంగనాథ రామాయణంలో ఉన్నాయి. రంగనాథ రామాయణంలోని ఘట్టాలు వాల్మీకి రామయణంలో లేవంటే నమ్మలేనంతగా గోనబుద్ధారెడ్డి తన రామాయణంలో అనేక అద్భుత కల్పనలు చేశాడు.

గోనబుద్ధారెడ్డి రంగనాథుడను పేరుతో ఈ రంగనాథ రామాయణమును రచించాడంటారు. ఈ రంగనాథ రామాయణం గురించి అనేక అపోహలు ఉన్నాయి. క్రీశ.1240 ప్రాంతం ముందు ఈ రంగనాథ రామాయణ రచన సాగిందని పింగళి లక్ష్మీకాంతంగారి అభిప్రాయం. అలాగే ప్రముఖ పరిశోధకులు మల్లంపల్లి సోమశేఖరశర్మ రంగనాథ

రామాయణ కృతి కర్త గోనబుద్ధ భూపతి క్రీ.శ.1360 - 1380 ప్రాంతం వాడని రంగనాథ రామాయణం 14 శతాబ్ది చివరినాటిదని '*రంగనాథ రామాయణం*' పీఠికలో చెప్పారు.

## b.భాస్కర రామాయణం

భాస్కర రామాయణం బహుళ కర్తృకము. అరణ్య కాండను భాస్కరుడు, యుద్ధ కాండలో కొంత భాగాన్ని హుళక్కి భాస్కరుడు, బాల, కిష్కింద, సుందర కాండలను మల్లికార్జున భట్టు, అయోధ్యా కాండను కుమార రుద్ర దేవుడు యుద్ధ కాండ ఉత్తర భాగాన్ని అయ్యలార్యుడు ఇలా ఇంత మంది కలిసి ఈ రామాయణాన్ని రచించారు. భాస్కరుడు, హుళక్కి భాస్కరుడు ఇరువురూ ఒకరే. భాస్కరుని కుమారుడు మల్లికార్జున భట్టు అని, శిష్యుడు కుమార రుద్ర దేవుడని, మిత్రుడు అయ్యలార్యుడని తెలుస్తుంది. వీరిలో మూల పురుషుడయిన హుళక్కి భాస్కరుడు పేరుమీదగానే ఈ రామాయణము భాస్కర రామాయణంగా ప్రసిద్ధిగాంచినది. ఈ రామాయణం జానపదులను బాగా ఆకర్షించింది. దీనికి కారణం సరళమైన భాష, జానపదుల జీవన సరళికి దగ్గరగా ఉన్న అనేక కల్పనలే కావచ్చు. భాస్కర రామాయణములో భాస్కరుడు రాముని విష్ణువుగా, లక్ష్మణుని ఆదిశేషువుగా, భరత, శత్రుఘ్నులను విష్ణువు శంఖచక్రములుగా, సీతను యోగమాయగా వర్ణించి జానపదులకు దగ్గరయ్యాడు.[11]

## c.రామాయణంలో జానపదుల కల్పనలు

ఆనాటికే జానపదులలో ప్రచారంలో ఉన్న బాలనాగమ్మ కథలోని కొన్ని సంఘటనల ఆధారంగా రంగనాథ రామాయణంలో అలాంటి ఘట్టాలను సృష్టించి జానపదులను మనసులను ఆకట్టుకున్నాడు గోనబుద్ధారెడ్డి. వాల్మీకి రామాయంలో లేని లక్ష్మణరేఖ, ఊర్మిళాదేవి నిద్ర వంటి అనేక ఘట్టాలను రంగనాథ రామాయణంలో సృష్టించాడు.

జానపదుల బాలనాగమ్మ కథలో బాలనాగమ్మ భర్త యుద్ధానికి వెళుతూ తాను వచ్చేవరకు ఇల్లు విడచి రావద్దని ఇంటి బయట కొన్ని రేఖలు గీసి వెళతాడు. కానీ మాయలపకీరు భిక్షువు రూపంలో వచ్చి బాలనాగమ్మతో భిక్షను గీతదాటి వేస్తేగాని స్వీకరించనని కోరి, ఆమెను గీత దాటించి అపహరించుకుపోతాడు. దీనిని ఆధారంగా చేసుకొని రంగనాథ రామాయణంలో సీతారాముల వనవాసంలో రాముడు సీతకోరిన బంగారు లేడికై వెళ్ళిన సందర్భంలో రామునికి ఆపద జరిగిందనే తలంపుతో లక్ష్మణుడు అన్న వద్దకు వెళుతూ సీతాదేవికి ఎలాంటి ప్రమాదం

జరగకూదదని ఆమెను ఎట్టి పరిస్థితుల్లో ఆశ్రమం దాటి రావద్దని ఆశ్రమం బయట కొన్ని రేఖలను గీసి అన్న వద్దకు బయలుదేరుతాడు. కానీ రావణుడు భిక్షువుగా వచ్చి సీతను భిక్షను గీత దాటి వేయమని కోరి ఆమెను గీత దాటించి అపహరించుకుపోతాడు.[12]

పగడాల రామకృష్ణారెడ్డి తన *'గోదావరి సీమ జానపద కళలు క్రీడలు వేడుకలు'* గ్రంథంలోజానపదులు అహల్య శాపం విషయంలో చేసిన చిన్న మార్పును పేర్కొన్నారు. వాల్మీకి రామాయణంలో అహల్య గౌతముడి వృత్తాంతంలో గౌతముడు ఉదయాన్నే నదీ స్నానానికి వెళ్లగానే ఇంద్రుడు గౌతముని వేషంలో అహల్యను అనుభవిస్తాడు. విషయాన్ని తెలుసుకున్న గౌతముడు అహల్యను రాయి కమ్మని శపిస్తాడు. ఈ కథలో అహల్య రాయిగా ఉండడం శాపమెలా అవుతుందనే భావనతో జానపదులు గౌతముడు అహల్యను ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఇలా కష్టాలు పడుతూ ఉండమని శపిస్తాడు. జానపదుల దృష్టిలో ఇదే శాపం అనిపించుకుంటుంది.

భాస్కర రామాయణంలో సీత జననము ఋష్య శృంగుని జననమును పోలి ఉంది. సీత జనకునికి భూమి యందు జన్మించినట్లున్నది. రాముడు వాలిని వధించినప్పుడు అతని భార్య 'తార' రాముడు రావణుని సంహరించి సీతను పొందినను అనతి కాలంలోనే ఆమె భూగర్భమందు లీనమై రామునికి శాశ్వతముగా దూరమగునని శాపమిచ్చినట్లు భాస్కర రామాయణములో ఉంది.[13]

రామరావణ యుద్ధంలో రాముడు రావణుని తల, చేతులూ ఎన్ని సార్లు ఖండించినా అవి మరళా పుట్టుకొస్తూనే ఉంటాయి. ఈ సమయంలో రావణుని సోదరుడు రామునితో రావణుని నాభిలో అమృతభాండం ఉందని అది నాశనమయితే తప్ప రావణుడు మరణించడన్న రహస్యాన్ని చెప్పి రావణుడి చావుకు కారణమవుతాడు. ఈ అంశాన్ని బుద్ధారెడ్డి అప్పటికే జానపదులలో ప్రచారంలో ఉన్న బాలనాగమ్మ కథలో పకీరు ప్రాణం చిలుకలో ఉందన్న అంశాన్ని తీసుకొని బుద్ధారెడ్డి రావణుని ప్రాణాన్ని అతని నాభిలో ఉంచి అద్భుత కల్పన చేశాడు. ఇలాంటి కల్పనలకే జానపదులు బాగా ఆకర్షితులయ్యారు.[14]

జానపదులు రామాయణ కథను తీసుకొని శారద రామాయణం, ధర్మపురి రామాయణం, మోక్ష గుండ రామాయణం, గుత్తైన దేవీ రామాయణం, ఆధ్యాత్మికరామాయణం. సంక్షేప రామాయణం, చిట్టి రామాయణం,

కూచికొండ రామాయణం మొదలయిన రామాయణ గాథలను రూపొందించారు. అలాగే రామాయణంలో కొన్ని ఘట్టాలను తీసుకొని వర్ణనలతో రూపొందించారు.

ఇలా జానపదులు తమ కల్పనా చాతుర్యంతో మూలంలో లేని అనేక కల్పనలు చేశారు. ఈ కల్పనలు ఎలా ఉన్నాయంటే అసలు ఈ కల్పిత గాథలన్నీ మూలంలో లేవంటే నమ్మలేనంతగా జనుల హృదయాలలో నాటుకున్నాయి.

## 2. మహాభారతం - జానపద గేయాలు

మహాభారతాన్ని వ్యాసుడు సంస్కృతంలో రచించాడు. మన తెలుగులో ఆంధ్రమహాభారతం పేర నన్నయ, తిక్కన, ఎఱ్ఱనలు ఈ రచనను పూర్తిచేశారు. జానపదులు భారతాన్ని కథగా, కథాగేయంగా మలిచారు. ప్రపంచంలో మహాభారత గ్రంథం కంటే పెద్ద గ్రంథం వేరొకటి లేదంటారు. కానీ జానపదుల పాటలు మాత్రం చాలా తక్కువగా లభ్యమవుతున్నాయి. లభ్యమయినంత వరకూ ఈ పాటలు ఆణిముత్యాలు. గేయ సాహిత్యంలో రామాయణానికి అగ్రస్థానంలో ఉన్నా జానపదుల నాటకాలలో అధిక భాగం భారతానికి సంబంధించిన కథలే ఉంటాయి. దృశ్యరూపంలో ఈ భారతం ప్రథమ పాత్రను పోషించింది.

జానపదులకు భారతంలో పాండవుల మధ్య ఉన్న ప్రేమానుబంధం పాండవుల ధర్మ ప్రవర్తనను ఆదర్శప్రాయమైనది. జానపదులలో కొన్ని కులాల వారికి 'ద్రౌపది' ఆరాధ్య దేవతగా మారినది. జానపదుల నాటకాలు, యక్షగానాల వంటి ప్రక్రియలలో భారత గాథలు ఇమిడిపోయాయి. జానపదులు వారి నిత్య జీవితంలో ఏదో ఒక సందర్భంలో భారత గాథలకు సంబంధించిన గేయాలు పాడుకోవడం జరిగేది. భారత కథలను దృశ్యరూపంగా మలిచి అనేక నాటకాలను ప్రదర్శించేవారు.

''మొదట జానపదరూపంలో వెలువడినదిగా తలచబడుతున్నప్పటికీ రామాయణం ఆకర్షించినంతగా జానపదుల్ని భారతం ఆకర్షించలేదు. దానికి కారణం ఇది అనేక ధర్మ సూక్ష్మాలతో కూడిన గ్రంథం కావడమే కావచ్చు. దీనికి సంస్కృత భాష నుండి తెలుగులోకి అనువదించడమే శతాబ్దాలకొద్దీ సాగిన మహాయజ్ఞం కాగా ఇక జానపదుల రసనాగ్రాలకెక్కడం కష్టమే కదా! సంస్కృత మహా భారతంలో భారతంలోని శ్లోకాలను రోజుకొకటైనా చదవాలని మహాభారత శ్రవణం చేత శుభాలు కలుగుతాయని చెప్పబడింది. కవిత్రయ భారతంలో 'ఇమ్మహా భారతంబు భావించి

వినుచుండు వారికి' ఎవరి కోరిక కనుసారంగా వారికి ఫలం దక్కుతుందని చెప్పబడింది. అయినప్పటికి భారతం చదవకూడదని అలా చదివితే శాంతులు, సమారాధనలు, సంతర్పణలు చేయలని జానపదులలో ఒక నమ్మకం ప్రచారంలో ఉంది. భారతాన్ని తెనిగించిన నన్నయ కూడ దానిని అర్థాంతరంగా వదిలేయడానికి కారణంగా అనేక గాథలు ప్రచారంలో ఉన్నాయి. ఈ విధమైన అపోహల కారణంగానే జానపదులు భారత గాథకి దూరంగా నిలిచిపోయి ఉండవచ్చు. అయితే ఉత్తర హిందూ దేశంలో ఈ భారతం 18 పర్వాలు 'పాండవాని' అనే పేరుతో జనపద వీర గాథా చక్రంగా ప్రచారంలో ఉంది. తెలుగు దేశంలో పాటలుగా రూపుదిద్దుకున్న కొద్ది గాథలు కూడా స్త్రీలకి సంబంధించినవే. ఈ భారతగేయాలలో కూడ జానపదులు తమ కల్పనా చాతుర్యానికి మెరుగులు దిద్దారు. భారత గేయాలను వ్రేళ్ళపై లెక్కించవచ్చు."[15]

## a.భారతంలో జానపదుల కల్పనలు

పాండవులు అరణ్యవాస సమయంలో అరణ్యంలో ఒక మామిడి చెట్టుకు ఉన్న ఒకే ఒక పండును కోసుకు తినుటకు అర్జునుడు తన విల్లంబుతో మామిడి పండును కొడతాడు. ఆ పండు ఒక ముని ఆహారమని, రోజుకొక పండు మాత్రమే కాస్తుందని, కృష్ణుని ద్వారా తెలుసుకున్న పాండవులు ఆ పండును తిరిగి యధా స్థానంలో ఉంచే ఉపాయం చెప్పమనగా, కృష్ణుడు ఎవరి మనసులలో ఏఏ కోరికలు ఉన్నాయో దాచకుండా చెప్పినట్లయితే ఆ పండుతిరిగి యధా స్థానంలో ఉంటుందని పరిహారం చెప్తాడు. పాండవులు అందరూ తమ కోరికలను చెప్తారు. ద్రౌపది కూడా తన మనసులోని కోరిక చెబుతుంది. కర్ణుని ఆరవ భర్తగా పొందడమే ఆమె కోరిక. ఈ కోరికని ద్రౌపది కృష్ణునికి రహస్యంగా చెబుతుంది. ఈ విధమైన వర్ణనను జానపదులు కల్పించారంటే నమ్మలేనంతగా కల్పనలు చేశారు. [16]

శశిరేఖా పరిణయానికి సంబంధించిన అనేక గేయాలు జానపదుల భారతంలో ఉన్నాయి కానీ వ్యాసుని, నన్నయ భారతాలలోగానీ లేవు. ఈ గాథను జానపదులు ఎక్కడి నుండి గ్రహించారో చెప్పడం కష్టమే. అలాగే నర్తనశాలలో భీముడు తెల్లచీర కట్టుకుని వెళ్ళాడని భారతంలో ఉంది. కానీ జానపదులు భీముడు ఆడ వేషంలో వెళ్ళి కీచకుని హతమార్చినట్లు వర్ణించారు.

జానపదులు 'సుభద్రసారె'కు సంబంధించిన అనేక కల్పిత గేయాలను సృష్టించారు. సుభద్ర సారె తీసుకు రాలేదని అర్జునుడు ఆమెను సాధించుటతో సుభద్ర పుట్టింటికి పోయి సారెతో తిరిగి వచ్చి అర్జునినితో సంతోషంగా ఉన్నట్లు జానపదులు కల్పించారు

కౌరవ సభలో ద్రౌపదిని అవమానించినందుకు దుర్యోధనుణ్ణి వధిస్తానని భీముడు ప్రతిజ్ఞ చేయడం మనకు తెలుసు. కానీ జానపదులు వారి భాతరంలో ద్రౌపది తనను అవమానించినందుకు దుర్యోధనుని వధిస్తానని తానే ప్రతిజ్ఞ చేయడాన్ని జానపదులు అద్భుత కల్పనగా చెప్పవచ్చు. " తన తొడలు మెక్కుమన్న రారాజు। తొడలు చీరించక తల ముడవననెనూ। తన శిఖ పట్టినా దుశ్శాసనుని। చేతులు తోరణాలు గుచ్చకా తలముడువననేనూ". జానపదులు తాము పరాశక్తిగా భావించిన ద్రౌపది పరాక్రమాన్ని చూపుటకే ద్రౌపదిచే ప్రతిజ్ఞ చేయించారు. తనను అవమానించిన రారాజును, దుశ్శాసనుని అంతమొదించిన తరువాతే తల ముడుస్తానని తగిన పరాక్రమంతో ద్రౌపది తన ఆత్మగౌరవాన్ని చాటుకుంది.[17]

ఈ విధంగా జానపదులు మూలంలో ఉన్న అంశాలను అనుసరిస్తూనే వారి జీవితాలను, ఆచార వ్యవహారాలను, ఇరత పురాణములలో ఉన్న అంశాలను తీసుకుని కల్పనలు చేశారని చెప్పవచ్చు.

## 3.భాగవతం - జానపద గేయాలు

మహాభారతాన్ని రచించిన వ్యాసునికి ఆత్మ సంతృప్తి కలుగక దీనికి కారణం ఆలోచించగా వ్యాసుడు తనకు, విష్ణువుపైగల భక్తి భావనను గ్రంథ రూపం దాల్చక పోవడమే ఈ అసంతృప్తికి కారణంగా తలచి 'భాగవతం' రచించాడు. సంస్కృతంలోని ఈ భాగవతాన్ని తెలుగులో పోతనామాత్యుడు మనకు అందించాడు.

భాగవతం పద్దెనిమిది పురాణాల్లో ఒకటి. అయితే అది విష్ణుభాగవతమా, దేవీభాగవతమా అని పండితుల్లో పెద్ద గందరగోళముంది. ఏది ఏమైనా సామాన్య జనులు మాత్రం శ్రీకృష్ణుని లీలలు మాత్రం తమ పాటలలో రసవత్తరంగా పాడుకుని ఆనందిస్తున్నారు. అసహజమూ, కృత్రిమమూ అయిన గ్రాంథిక కావ్య భాషలో కంటే సజీవమైన సరళమైన ఈ జానపద గేయాలు ఎంతో రసవత్తరమైనవి.

## a. భాగవతంలో జానపదుల కల్పనలు

మర్ల సుబ్బలక్ష్మి తన సిద్ధాంత గ్రంథం *'తెలుగు జానపద సాహిత్యం పౌరాణిక గేయ గాథలు'* లో జానపదుల భాగవతంలో ఉన్న అనేక కల్పిత గాథలను క్రింది విధంగా పేర్కొన్నారు.

సత్యభామ 'పుణ్యకవ్రతం' చేసినట్లు, 'శ్రీ కృష్ణ తులాభారం' జరిగినట్లు పురాణాలలో లేదు. కానీ జానపదులు తమ కల్పనలతో ఈ ఘట్టాలను తీర్చి దిద్దారు. పుణ్యక వ్రతాన్ని పార్వతిదేవి చేసినట్లుగా పౌరాణికులు చెప్పడం వల్ల జానపదులు ఈ వ్రతాన్ని సత్యభామకు అన్వయించి చెప్పడం వీరి అద్భుత కల్పనకు చక్కని నిదర్శనం.

చెంచీత కథ జానపదుల కల్పితాలలో మరొకటి. కృష్ణుడి భార్యలందరూ తమ ఐశ్వర్యానికి, అందచందాలకు, సౌభాగ్యానికి ఎవరూ సాటిలేరనే అహంకారముతో ప్రవర్తిస్తుంటే వారి అహంకారాన్ని అణచివేయుటకు 'చెంచీత' అనే అందమైన స్త్రీ పాత్రను సృష్టించి రాణుల అహంకారాన్ని అణచుటకు ఆమెను వివాహం చేసుకొని భార్యల ఎదుటికి తెస్తాడు.

'రుక్మిణిదేవి వేవిళ్ళు' కథా గేయాన్ని జానపదులు అద్భుత కల్పనలతో తీర్చిదిద్దారు. రుక్మిణి గర్భవతి అయినప్పటి నుండి ఆమె శరీర లక్షణాలను, ఆమె మనసును, జానపదులు అద్భుతంగా తీర్చిదిద్దారు. రుక్మిణి గర్భవతిగా ఉన్నప్పుడు ఆమెను చూడబోయేవారు సూడిదలు తీసుకెళ్ళడం, రుక్మిణి ప్రసవం మొదలైన విషయాలను జానపదులు అద్భుతంగా వర్ణించారు. అలాగే 'రుక్మిణిదేవి సీమంతం' కూడా జానపదుల కల్పనే.

## 4. ఇతర పురాణ గేయాలు

పురాణానికి సంబంధించిన వాటిలో రామాయణం, భారతం, భాగవతం పాటలనే కాకుండా వైష్ణవుల, శైవుల పాటలను కూడా పేర్కొనవచ్చును. శ్రీరంగ మాహత్మ్యం, దశావతారముల పాట, సవతుల కయ్యము, శ్రీలక్ష్మీదేవి సొగసులాట మొదలైన పాటలన్నీ వైష్ణవానికి సంబంధించిన పాటలుగా చెప్పవచ్చు. పార్వతీ కళ్యాణము, గంగా వివాహము, త్రిపురాసుర సంవాదము, చిరుతొండనంబికథ మొదలైన పాటలన్నీ శైవానికి సంబంధించినవి .

పౌరాణికుల పాటలుగా స్త్రీల వ్రతాలకు, నోములకు సంబంధించిన పాటలను కూడా పేర్కొనడం జరిగింది. స్త్రీల వ్రతానికి, నోములకు సంబంధించిన కథలకు మూలం స్కాందపురాణం. శ్రావణ మంగళవారం, శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం మొదలైన ఈ శాఖకు చెందినవిగా చెప్పవచ్చు.

## 3.1. మనోవిజ్ఞాన శాస్త్రం (లేక) మనస్తత్త్వశాస్త్రం

మనోవిజ్ఞానశాస్త్రమనగా మనిషికి - జంతువుకు సంబంధించిన శాస్త్రమనవచ్చు. ఆనాడు అనేకమంది శాస్త్రజ్ఞులు తమ ప్రయోగాలకు చిన్నచిన్న జంతువులను ఎంచుకుని వాటి ప్రవర్తనను బట్టి మనిషి ప్రవర్తనను అంచనావేయడం జరుగుతుంది. ఈ మనోవిజ్ఞాన శాస్త్రం 19వ శతాబ్దానికి ముందు తత్త్వశాస్త్రంలో భాగంగా ఉండేది. మనోవిజ్ఞాన శాస్త్రాన్ని తత్త్వశాస్త్రం నుండి వేరుచేసి ప్రత్యేక శాస్త్రంగా రూపొందించాలని 1875వ సంవత్సరంలో జర్మనీకి చెందిన 'ఊంట్' అనే శాస్త్రవేత్త చేసిన కృషి ఫలితంగా తర్వాత అనేక దేశాలలో వివిధ మనోవిజ్ఞానశాస్త్ర అధ్యయన కేంద్రాలు వెలసి అది ఒక శాస్త్రంగా రూపుదిద్దుకుంది.

'Psychology' అనే మాటకు అనువాదంగా తెలుగులో 'మనోవిజ్ఞానశాస్త్రం' అంటున్నాము. ఈ Psychology అనే పదము Psyche, Logos అనే రెండు గ్రీకు పదాల నుండి ఉద్భవించింది. Psyche అంటే ఆత్మ అనీ, Logos అంటే శాస్త్రమనే అర్థాలుండుట ద్వారా Psychology అంటే ఆత్మకు సంబంధించిన శాస్త్రంగా పేర్కొనడం జరిగింది. మారుతున్న కాలంలో 'ఆత్మ' 'మనసు'గా పేర్కొనబడడం ద్వారా Psychology అంటే ఆత్మను అధ్యయనం చేసే శాస్త్రంగా కాకుండా వ్యక్తుల మనసును అధ్యయనం చేసే శాస్త్రమే మనస్తత్త్వశాస్త్రమని పేర్కొన్నారు. మనోవిజ్ఞాన శాస్త్రం నేడు 13 విభాగాలుగా అధ్యయనం చేయబడుతుంది. అవి

1. ప్రయోగాత్మక మనోవిజ్ఞాన శాస్త్రం (Experemental Psychokogy)

2.జంతు మనోవిజ్ఞాన శాస్త్రం (Animal Psychology)

3. సాంఘిక మనోవిజ్ఞాన శాస్త్రం (Social Psychology)

4. అపసామాన్య మనోవిజ్ఞాన శాస్త్రం (Abnormal Psychology )

5. పరా మనోవిజ్ఞాన శాస్త్రం (Para Psychology)

6. మనోమితి శాస్త్రం (Psychometry)

7. శిశుధర్మ మనోవిజ్ఞాన శాస్త్రం (Child Psychology)

8. శరీరధర్మ మనోవిజ్ఞాన శాస్త్రం (Psysiological Psychology)

9. అనుప్రయుక్త మనోవిజ్ఞాన శాస్త్రం (Applied Psychology)

10. విద్యామనోవిజ్ఞాన శాస్త్రం (Educational Psychology)

11. ఔద్యోగిక మనోవిజ్ఞాన శాస్త్రం (Vocational Psychology)

12. చికిత్సా మనోవిజ్ఞాన శాస్త్రం (clinical Psychology)

13. పారిశ్రామిక మనోవిజ్ఞాన శాస్త్రం (Industrial Psychology)

ఈ 13 విభాగాలను అధ్యయనం చేయడానికి 7 విభాగాలున్నాయి. అవి

1. సంరచనాత్మక వాదం (Structuralism)

2. గెస్టాల్ట్ మనోవిజ్ఞానం (Gestalt Psychology)

3.కార్యకరణవాదం (Functionalism)

4. ప్రవర్తన వాదం (Behaviourism)

5. మనోవిశ్లేషణం (Psycho Analysis)

6. ప్రయోజనతా వాదాం (Purposivism)

7. సంవర్గవాదం (Asociationlism)

ఇలా మనోవిజ్ఞాన శాస్త్రాన్ని అనేక విభజనలు, ఉపవిభజనలు చేసుకొని అధ్యయనం చేస్తున్నారు. [18]

మనోవిజ్ఞానశాస్త్ర శాఖలెన్ని ఉన్నా వాటన్నింటి గురించి పూర్తిగా తెలుసుకోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ప్రస్తుత అధ్యయనం సాహిత్యానికి సంబంధించినది కాబట్టి ఈ శాఖలలో మానవుని ప్రవర్తనకు సంబంధించిన శాఖలను మాత్రమే అధ్యయనం చేయాల్సి ఉంది. ఇందులో మానవుని ప్రవర్తనకు సంబంధించిన విషయాలను 'అపసామాన్య మనోవిజ్ఞాన శాస్త్రం' తెలియజేస్తుంది కావున మనం దీనిని మాత్రమే అధ్యయనం చేయవలసి ఉంది.

## 3.2.అపసామాన్య మనోవిజ్ఞాన శాస్త్రం

మానవశాస్త్రం పురాణాలు, కథలు, నవలలు, గేయాలను వంటి అనేక ప్రాచీన, ఆధునిక ప్రక్రియలన్నింటినీ మనోవిశ్లేషణ దృష్టితో అధ్యయనం చేయవచ్చు. మానవ శాస్త్రవేత్తలు అనుసరించే అనేక సిద్ధాంతాలను మనము వీటి పరిశీలనకూ అనువర్తింప చేసుకోవచ్చు. ముఖ్యంగా మనస్తత్వశాస్త్ర సహాయంతో ఆధునికులు ఆయా రచనలలో పాత్రల స్వభావాలను అర్థం చేసుకోవచ్చు. మనోవిశ్లేషణ సహాయంతో ఈ రచనలు రూపొందడానికి గల కారణాలను అన్వేషించవచ్చు. రచనలలో పాత్రల ద్వారా వ్యక్తమయ్యే భావాలు, నమ్మకాలు, ప్రవృత్తులను అర్థంచేసుకోడానికి అపసామాన్య మనస్తత్వశాస్త్రం (Obnormal Psychology) వంటివి సహాయం చేస్తాయి. కనుక ప్రస్తుత అధ్యయనాన్ని దృష్టిలో పెట్టుకొని అపసామాన్య మనోవిజ్ఞన శాస్త్రాన్ని మాత్రమే వివరించడం జరిగింది.

అపసామాన్య మనోవిజ్ఞాన శాస్త్రంలో ఎంత మంది ఎన్ని సిద్ధాంతాలను ప్రతిపాదించినా సిగ్మండ్ ఫ్రాయిడ్ , ఆల్ఫ్రెడ్ ఆడ్లర్ , కార్ల్ గుస్టావ్ యూంగ్ అనే ముగ్గురి వ్యక్తుల ప్రతిపాదనా సిద్ధాంతాలను ఆధారంగా చేసుకొనే తరువాత అనేక సిద్ధాంతాలు వచ్చాయి. అపసామాన్య మనోవిజ్ఞాన శాస్త్రవేత్తల సిద్ధాంతాలను ఇక్కడ వివరించడం జరిగింది.

### 3.2.1. కామేచ్ఛ సిద్ధాంతం

మనసత్త్వశాస్త్రానికి ఆద్యునిగా అపసామాన్య మనోవిజ్ఞాన శాస్త్రంలో మొదటి వాడిగా 'సిగ్మండ్ ఫ్రాయిడ్ ' ను చెప్పవచ్చు. డార్విన్ పరిణామ సిద్ధాంతం, మార్క్స్ గతితార్కిక భౌతిక సిద్ధాంతాలే ఫ్రాయిడ్ సిద్ధాంతాలకు మూలం. ఫ్రాయిడ్ ఎంతోమందికి వారి మానసిక సమస్యలను తీర్చి వారి జీవితాలలో వెలుగు నింపారు. ఇతని సిద్ధాంతాలను ఆధారంగా చేసుకొని తరువాత అనేక మంది తమ సిద్ధాంతాలను ప్రతిపాదించారు.

ఫ్రాయిడ్ తాను కనుగొన్న సిద్ధాంతాలను ప్రధమంగా 1900వ సంవత్సరంలో 'The Intoepretation of Dreams' అనే గ్రంథంలో పేర్కొన్నారు. ప్రాయిడ్ మానసిక రుగ్మతలన్నింటికీ లైంగిక పరమైన కోరికలే కారణమంటాడు. వ్యక్తి కామేచ్ఛకు సంబంధించినవి కావడం వల్ల ఇతని సిద్ధాంతాలను కామేచ్ఛ సిద్ధాంతంగా అనేక మంది విమర్శకులు పేర్కొన్నారు.

### 3.2.2. మానసిక ప్రక్రియలు

**i.సుప్తచేతన (Unconsiousess)**

మనసులో సుప్తచేతన అనేది అంధకారంతో నిండి, అన్నింటి కంటే చివర ఉంటుంది. సమాజంలో కొన్ని కట్టుబాట్లు, అలవాట్లు, పద్ధతులు ఉంటాయి. వీటిని ఎవరు మితిమీరినా సమాజం అందుకు అంగీకరించదు. వీటిలో లైంగికపరమైన సమస్యలు ప్రధానమైనవి. సమాజం అంగీకరించదు కాబట్టి మనం వాటిని అణాచివేయాలని చూస్తాం. కానీ మనం నిద్రించే సమయంలో సెన్సారింగ్ యంత్రాంగం నిద్రపోతుంది. దీంతో అణచివేయబడిన కోరికలు కలల రూపంలో వస్తాయి. అయితే ఈ కలలు మనకు ఉన్న కోరికను స్పష్టంగా తెలియజెప్పవు. దీన్ని మనము Dream of symbalism అంటాము. ఇలా కలలో సభ్యసమాజం అంగీకరించదని ఎన్నో కోర్కెలను అణచివేసుకుంటారు. దీని ద్వారా వ్యక్తులు జాగృతవ్యవస్థ (చేతన)లో విచిత్రంగా ప్రవర్తిస్తుంటారు. అదే 'హిస్టీరియా' వంటి మానసికరుగ్మతకు దారితీస్తుంది.[19]

ఫ్రాయిడ్ తన సిద్ధాంతాలలో తాను నిరూపించిన సుప్తచేతన సిద్ధాంతం గురించి ఇలా అంటారు. ఇది తాను కొత్తగా రూపొందించినదేమీ కాదని తనకంటే ముందు ఎందరో దీనిని చెప్పారని అనేక రచనల్లో వివరించారని కానీ తాను దీన్ని సిద్ధాంత పరంగా నిరూపించానని చెప్పాడు. ఫ్రాయిడ్ మానవుల సుప్తచేతనలో ఎలాంటి ఆలోచనలు ఉన్నాయో తెలుసుకునేందుకు ఒక వ్యక్తిని ప్రశాంతంగా, హాయిగా నిద్రపోయే సౌకర్యాన్ని కల్పించి ఆ సమయంలో అతనికి వచ్చే కలలను ఉన్నది ఉన్నటుగా చెప్పమని ఆ కలలను బట్టి ఆ వ్యక్తుల మానసిక రుగ్మతలను తీర్చేవాడు

**ii.చేతన(Conscious state)**

మానవుని మనసులో ఉన్న పొరలలో మొదటిది. ఇది అన్నింటి కంటే పైన ఉంటుంది. దీనినే మనము జాగ్రదవస్థగా చెప్పవచ్చు. మనిషి మెలకువగా ఉండి మనసును ఏదో ఒక విషయం మీద లగ్నం చేసి దాని గురించి ఆలోచించి అనుభవాన్ని పొందుతాడు. దీన్నే మనం చేతన అంటున్నాం. ఈ చేతనలోని అలోచనలు తరువాత ఉప చేతనలోకి వెళ్ళి తరువాత అచేతనలోకి వెళ్ళును. ఈ ప్రక్రియ మనం మెలకువగా ఉన్నంతసేపూ ఉంటుంది.[20]

జిడ్డు కృష్ణమూర్తిగారు తన 'చేతన 'గ్రంథంలో చేతన వంటి అంశాల గురించి క్రింది విధంగా పేర్కొన్నారు. " 'నేను' అన్నది చేతనామయమని, చేతనలోని అంశాలే చేతనయని అంటారు. మనిషి ఆర్జించిన జ్ఞానము,

సూక్ష్మ మైన కుటిలమైన ఆలోచనలు, బహిర్గతంకాని ఆలోచనలు, సాంప్రదాయాలు, నమ్మకాలు, బాధ ఆందోళనలు, సుఖం కోసం మనిషి నిరంతరంగా సలిపే పోరాటమూ ఆస్తి అంతస్థుల అహంభావమూ, తనకున్న జ్ఞాన సంపద వలన గల్గిన ఆధిక్యతా, నిగూఢమైన వాంఛలూ, విరుద్ధమైన కోరికలూ, ఆశలు, ఆశయాలు వేదనల వంటి వెన్నో చేతనలోని అంశాలేనని అంటే మనిషి ఉనికి మొత్తాన్ని 'చేతన'అనవచ్చనీ సూచిస్తారు.

బహిర్గతమయ్యే చేతనత్వంగాక బయటపడని లోతైన అంతర్గత చేతన గూడ'నేను'కు కేంద్రమేనంటారు. మనిషి తన జీవిత కాలములో సంతరిచుకున్న కోరికలు, భయాలు, ప్రేరణలు, ఒత్తిడులు, హృదయాంతరాలైన విషయాలేగాక జాతి పరంగా సంక్రమించిన సంప్రదాయ బద్ధమైన అనుభవాలు, జాతివిద్వేషాలు, జాతి పరమైన ప్రేరణలు అంతర్గత చేతనలో ఉంటాయి. భూతకాలపు అనుభవాలు భవిష్యత్తు గురించిన ఆశలు చేతనలోనివే. భూతకాలపు అనుభవాలను సంపూర్ణంగా అనుభవింపక పోయినా, వాటిలోనే మునిగిపోయినా వాటిని కాదని ఈ అసంపూర్ణ అనుభవాలను అనుభవించేసి ముగించాలని తపనపడినా, చివరికి కలల రూపంలో రావటం జరిగినా అవన్నీ చేతనలోని భాగమే. చేతన స్థితిలోనున్న మనసు దేనిలోనైనా నిమగ్నమయినప్పుడు తనకు అంతర్గత చేతనతోనున్న సంబంధాన్ని గుర్తించలేదు." [21]

### iii. ఉపచేతన (Subconsiosness)

ఉపచేతన అంటే మనసులో ఉండే పొరలలో మధ్యలో, చేతన తరువాత ఉంటుంది. ఇది కలల ప్రపంచం. ప్రతి మానవుడిలో ఎన్నో కోరికలు ఉంటాయి. కొన్ని కోరికలను తీర్చుకుంటాడు. కొని కోరికలు తీర్చుకోలేడు. ఇలాంటి సుప్తచేతనలో అణచివేయబడిన కోరికలు, భావాలు వ్యక్తులు ఏకాంతంగాగానీ, నిద్దురలోగానీ ఉన్నప్పుడు ఉపచేతనలో అణచివేయబడిన కోరికలు కలల రూపంలో బయటపడతాయి.

పైన పేర్కొన్న వాటితో సంతృప్తి చెందని ఫ్రాయిడ్ రెండవ దశలో మానవుని మనసులోని పొరలను మరల 3 విధాలుగా విభజించాడు. మనిషి అంతరంగంలో తార్కిక, తార్కికాతీత - నైతిక, నైతికాతీత శక్తుల మధ్య సంఘర్షణను వివరిస్తూ ఫ్రాయిడ్ దానిని Id, Ego, Super Ego. అని పేర్కొన్నాడు. సైకో ఎనాలసిస్ ప్రకారం ప్రతి మానవుడిలో ఉండే మూడు భాగాలే ఇవి.

**iv.Id (అంతశ్చేతన/అచిత్తు)**

Id అనేది మానసిక పరమైన కోరికలన్నింటికీ మూలమైనది. దీనికి మంచి చెడుల జ్ఞానం ఉండదు. అన్ని కోరికలు దీని నుండే పుడతాయి. వ్యక్తి తాను చూసింది, కోరుకున్నది తనకే కావాలని ఈ కోరిక నైతికపరంగా, భౌతిక పరంగా, జీవిత వాస్తవికతకు వ్యతిరేకంగా ఉన్న తన కోరికను తీర్చుకోవాలనేది id లో అధికంగా ఉంటుంది. Id లక్షణాలను గురించి జేమ్స్.ఇ.కాల్.మెన్ "The id is Completely selfish concerned only with the immediate gratification of instinctual needs without reference to reality or moral conciderations" [22]

Id అనేది జర్మనీకి చెందిన భాషాపదం. సృష్టిలో మానవులకు సహజంగా, ప్రకృతిరీత్యా కలిగే కోరికలు Id లో దాగి ఉంటాయి. వ్యక్తులలో ఉండే అచేతనా భాగం. వ్యక్తికి ఆహారం ద్వారా, సహజాతాల ద్వారా చేరిన శక్తి అచిత్తులో చేరి మానవుని దైహిక, మానసిక కార్యకలాపాలకు మూలమవుతుంది. మనకు ఎన్నో సహజాతాలు ఉన్నప్పటికీ ఫ్రాయిడ్ మనకు రెండు రకాల సహజాతాలను పేర్కొనడం జరిగింది. సహజాతాలన్నీ శారీరక జీవకణ సముదాయము నుండి ఉద్భవిస్తాయి. 1. సర్జక లేక జీవన సహజాతాలు 2. మరణ సహజాతాలు

ఈ సహజాతాలు వ్యక్తికి ఆకలి, దాహం, లైంగికావసరాల వాంటి వాటిపై ప్రేరణకలిగించి వాటిని పొందేటట్లు చేస్తాయి. వాటిని పొందకపోతే వ్యక్తి మరణిస్తాడు కాబట్టి వ్యక్తి వాటిని అత్యవసరంగా పొందే ప్రయత్నం చేస్తాడు. సహజాతాలలో జీవన సహజాతాలు రెండు విధాలు. అవి

**a. అహం సహజాతాలు**

ఆకలి దప్పులకు సంబంధించినవి. వాటి విషయంలో వ్యక్తికి ప్రేరణ కలిగించి వ్యక్తి మనుగడకు, ప్రాణరక్షణకు దోహదం చేస్తాయి. ఈ వస్తువులను పొందుటలో వాస్తవిక పరిస్థితులను అనుసరిస్తూ, బాహ్య పరిసరాలను అనుసరించి రాజీపడుతూ వాటిని తెలివితేటలతో పొందే ప్రయత్నం చేస్తాడు.

**b.లైంగిక సహజాతాలు**

ఇవి కామేచ్ఛకు సంబంధించినవి. వ్యక్తిలో తీవ్ర ప్రేరణకు, ఉద్వేగానికి, ఉద్రేకానికి ఈ సహజాతాలే కారణం. ఈ సహజాతాల తృప్తికి గమ్య వస్తువుతో పనిలేకుండా వేరేదానిని ప్రతిష్టాపితం చేసుకోవచ్చు. అనగా ఒక వ్యక్తిలోని

లైంగిక సహజాతాలు కళల ద్వారా, కలల ద్వారా ఇతర వినోద కార్యకలాపాలవల్ల తృప్తి పడుతుంటాయి. [23]

**v.Ego(చేతన/అహం)**

అహం అనేది వ్యక్తి ప్రవర్తనను సూచించేదిగా ఉంటుంది. సమాజంలో నలుగురిలో వ్యక్తి ప్రవర్తన ఒక రకంగా ఉంటుంది. అదే వ్యక్తి ఏకాంతంగా ఉన్నప్పుడు అతని ప్రవర్తన మరొక రకంగా ఉంటుంది. ఈ అహం అనేది వ్యక్తుల సాంఘిక ప్రవర్తనలోని Id కోరికలను అణచి వ్యక్తి సమాజంలో ఏవిధంగా మెలగాలో పరిసరాలకు తగినట్లుగా అహం ప్రవర్తింపచేస్తుంది. అహం మనిషిని మంచి చెడుల మధ్య ప్రవర్తింపచేస్తుంది.[24]

**vi. Super Ego(అంతరాత్మ)**

super Egoను మనం వ్యక్తుల అంతరాత్మగా పేర్కొనవచ్చు. Id చేసే ప్రేరకాలను తృప్తి పరచడానికి, Ego చేసే అకార్యలను తప్పని నిందించి Super Ego వ్యక్తిలోని విలువలను కాపాడుతుంది. దీనిని నైతిక శక్తి అనికూడా అంటారు[25]

## 3.2.3. హిస్టీరియా

మానసిక రుగ్మతలలో హిస్టీరియా ఒకటి. జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనలేక పారిపోవడానికి చేసే ప్రయత్నం.(చెముడు, మూర్ఛ, అంధత్వం, పక్షవాతం వంటివి) హిస్టీరియాగా పొందే మానసిక రుగ్మతగా చెప్పవచ్చు. ఈ వ్యాధి ఉన్నట్లు ఈ వ్యాధి ఉన్న వాళ్ళకు తెలియదు. స్వార్థం, అనూహ్య భావోద్రేకం, అపరిమిత ఆత్మాభిమానం, ఇతరులు తనను పట్టించుకోవాలని, గుర్తించాలని, ఎదుటివారికి శృంగారోద్రేకం కలిగేటట్లు చేయడం వీరి లక్షణాలు. నాటకీయతతో ఇతరులను ఆకట్టుకోవాలని చూస్తారు. పంతం నెగ్గించుకోవడానికి కొన్నిసార్లు ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తూ ఉంటారు. హిస్టీరియాలోని లక్షణాలు అదుపులో ఉన్నప్పుడు అది 'హిస్టీరియా' వంటి మానసిక రుగ్మతగా పరిణమించే అవకాశం లేదు. కానీ 'హిస్టీరికల్ మూర్తిమత్వం'గా ఉంటుంది. హిస్టీరికల్ మూర్తిమత్వం కొద్దిమందిలో మాత్రమే ఉంటుంది. అటువంటి వారిలో స్త్రీలే అధికం. [26]

### 3.2.4. స్థిరీభవనం (Fixation)

ప్రతి వ్యక్తి మూర్తిమత్వం (Personality) బాల్యంలోనే రూపొందుతుంది. అదే విస్తరించి తరువాత వ్యక్తి ప్రవర్తనలో జోక్యం చేసుకుంటుందని చెప్పాడు. ప్రతి వ్యక్తికి శారీరక పెరుగుదలతో పాటు మానసిక పెరుగుదల కూడా ఉంటుందని ఈ మానసిక పెరుగుదల అనేది శైశవ, బాల్య, కౌమార, యౌవన దశలలో జరుగుతుందని ఫ్రాయిడ్ అంటాడు. మానసిక పెరుగుదల అనేది కొంతమందిలో కొన్ని దశలలో ఆగిపోతుంది. ఇలా మానసిక పెరుగుదల ఆగిపోయే పరిస్థితిని మనం 'స్థిరీభవనం' అంటాం. ఈ స్థిరీభవనం అనేది ఎక్కువగా శైశవ దశలో జరుగుతుంది. ఈ స్థిరీభవనమే వ్యక్తులు వివిధ ప్రవర్తనలను కలిగి ఉండటానికి కారణాలని ఫ్రాయిడ్ వివరిస్తాడు.[27]

### 3.2.5. తదాత్మీకరణం (Identification)

కొంతమంది వ్యక్తులు తమను తాము చాలా గొప్పగా చిత్రించుకోవడం జరుగుతుంది. వీరు తమ అభిరుచులను కలిగిన వ్యక్తులతో మాత్రమే స్నేహం చేయడం, సామాజిక కట్టుబాట్లకు లొంగడం వంటివి చేస్తారు ఇవన్నీ తదాత్మీకరణ కిందకు వస్తాయి. వీటన్నింటిద్వారా వ్యక్తి తనకు ఉండే భయాన్ని పోగొట్టుకుంటాడు. బాల్యంలో ఆడపిల్ల అయితే తల్లిలా ఇంట్లో పనిచేయడం, మగపిల్లాడు అయితే ఇంట్లో తండ్రిలా నడచుకోవడాన్ని బట్టి తదాత్మీకరణ అనేది బాల్యం నుండి ప్రారంభమవుతుందని చెప్పవచ్చు. ఇలాంటి వారు కాలక్రమంలో తమ స్నేహితుల వలన అనేక విషయాలను తెలుసుకొని తమ అభిలాషలను తీర్చుకుంటారు.[28]

### 3.2.6. వ్యత్యయీకరణం

ఒక వస్తువు పైకి పంపిన మానసిక శక్తిని మరో వస్తువుపైకి మరల్చడం వ్యత్యయీకరణం.

ఉదా : అత్తమీద కోపం దుత్తమీద చూపుట

భార్య మీద కోపం పిల్లల మీద చూపుట

వ్యక్తులు ఇలా చేయడానికి కారణాలను వెదికితే మనకు కొన్ని కారణాలు కనిపిస్తాయి. వ్యక్తులు అసహనానికి, తీవ్ర వత్తిడులకు, ఉద్రిక్తలకు గురైన సందర్భంలో దానిని తగ్గించుకొనుటకు తమకు లోబడిన వ్యక్తుల మీద, వస్తువుల

మీద కోపాన్ని ప్రదర్శించడం జరుగుతుంది. కొన్ని సందర్భాలలో మనకు లోబడని వ్యక్తుల మీద కూడా ఇలాంటి వారు తమ కోపాన్ని ప్రదర్శించడం మనము గమనించవచ్చు.[29]

### 3.2.7. ఆత్మన్యూనతా భావం(Inferiority Complex)

ఫ్రాయిడ్ శిష్యుడు ఆడ్లర్ ఫ్రాయిడ్ ప్రతిపాదించిన 'Infantile sexuality' సిద్ధాంతాన్ని (కామేచ్ఛ సిద్ధాంతం)పూర్తిగా అంగీకరించక, ఫ్రాయిడ్ నుండి వేరుగా వచ్చి 'Individual psychology' అనే నూతనాంశాన్ని ప్రతిపాదించాడు. ఆడ్లర్ మానవులందరూ ఒకే విధమైన మానసిక స్థితిని కలిగి ఉండరని, ఒక్కొక్కరు ఒక్కో మనస్తత్వాన్ని కలిగి ఉంటారన్నారు. మానవులు వారి బాల్య జీవితంలో, పెరిగిన వాతావరణంలో తేడాల వలన వివిధ వ్యక్తిత్వాలను కలిగి ఉంటారన్నాడు. ఇలాంటి అంశాల ఆధారంగా ఆడ్లర్ వ్యక్తుల మధ్య ఉండే మనస్తత్వాలను పరిశీలించి వివరించడం జరిగింది. ఆడ్లర్ తన సిద్ధాంతంలో మానవునిలో లైంగిక కారకాలకన్నా సాంఘిక కారణాలకే ప్రాధాన్యం ఇచ్చాడు. అనువంశికత, పరిసరాలు వీటికంటే సృజనాత్మకత ఆత్మకూడా మనిషి మానసిక జీవితాన్ని ప్రభావితం చేస్తుందన్నాడు.

సాధారణంగా అనేకమంది తాము ఇతరులకన్నా చాలా తక్కువ వాళ్లమనే భావనకు గురవుతూ ఉంటారు. దీనిని ఆడ్లర్ ఆత్మన్యూనతా భావం అని అంటాడు. ప్రతి వ్యక్తిలో అనేక సమస్యలు ఉంటాయి. వాటిని ఆడ్లర్ మూడు రకలుగా విడదీశాడు. అవి

1. వృత్తికి సంబంధించినవి
2. సాంఘిక పరమైనవి
3. లైంగిక పరమైనవి.

ఈ మూడు రకాల ప్రశ్నలకు వ్యక్తులు ఎలా బదులు పలుకుతారో తెలుసుకుంటే వ్యక్తుల జీవితానికి ఉన్న అర్థమేమిటో తెలుస్తుందంటాడు. ఆడ్లర్ ప్రకారం శైవదశ నుండి ప్రతి వ్యక్తిలో ఆధిక్యత కోసం పోరాటం ప్రారంభమవుతుంది. ఎలాగంటే పుట్టిన బిడ్డ తన తల్లి దండ్రులు లేదా చుట్టూ ఉన్నవారి పైనే ఆధారపడాలని వారు చెప్పినట్టు నడచుకోవాలని భావించి ఒకరకమైన ఆత్మన్యూనతా భావానికి లోనవుతాడు. ఆడ్లర్ సిద్ధాంతాలలో Style

of Lifeకు ఒక ప్రముఖ స్థానం ఉంది. వ్యక్తి తనలో ఉన్న శక్తి, సామర్థ్యాలను ఎలా వ్యక్తీకరించాలని అనుకున్నాడో దానిని Style of Life అంటారు. Style of Life ను ప్రధానంగా తీర్చి దిద్దేది తల్లిదండ్రుల పెంపకం. పిల్లలలో ఆత్మన్యూనతాభావం యొక్క ప్రభావం అధికంగా ఉంటుంది.

ప్రతి వ్యక్తికీ సమస్యలు వస్తుంటాయి. అలాంటి సమయాలలో ఆత్మన్యూనతా భావంగలవారు తమను తాము తక్కువగా అంచనా వేసుకొని ఆ సమస్యలను తాము ఎదుర్కోలేక, మనోధైర్యాన్ని కోల్పోయి ఆత్మన్యూనతా భావానికి లోనవుతారు. ఇంకొందరైతే ఆత్మహత్యలు కూడా చేసుకుంటారు. తల్లి చేసే అతిగారాబాల వలనే పిల్లలో 'ఈడిపస్ క్లాంప్లెక్స్' ఏర్పడుతుంది. తల్లిదండ్రుల గారాబాలవల్ల, మరియు వారు తల్లిదండ్రుల నిర్లక్ష్యానికి గురైన సమయంలో వారికి ప్రేమాభిమానాలపట్ల అవగాహన ఉండదు. ఇలాంటివన్నీ ఆత్మన్యూనత లక్షణాలుగా చెప్పవచ్చు.

ఆత్మన్యూనతా భావం అనేది అధికంగా అంగవైకల్యం గలవారిలో అధికంగా ఉంటుంది. వీరు తమ అంగవైకల్యం గురించి బాధపడుతూ ఉంటారు. తాము అందరికన్నా తక్కువ వారమనే ఆత్మన్యూనతా భావం ఉంటుంది. వీరు దీన్ని అధిగమించి తమ ఆధిక్యతను నిలుపుకోవాలి. ఉదాహరణకు ఎంతోమంది గుడ్డివారు తమ అంగవైకల్యాన్ని చూసి బాధ పడకుండా తాము ఇతరుల కంటే ఎందులోనూ తీసిపోమని ఉన్నత విద్యను అభ్యసించేవారు ఎంతోమంది ఉన్నారు. దీని ద్వారా వారు తమ అంగవైకల్యాన్ని మరచిపోయి తమ ఆధిక్యతను ప్రదర్శించుకుంటున్నారు. దీన్ని Compensation Activity అంటారు. అంటే అంగవైకల్యం ఉన్నవారు తమ అంగవైకల్యాన్ని చూసి కృంగిపోకుండా తాము ఇతరులకు ఏమాత్రమూ తీసిపోమని ఆధిక్యాన్ని నిరూపించడన్నమాట. ఆధిక్యత కోసం ప్రాకులాడే వ్యక్తి తనలోని ఆత్మన్యూనతను గ్రహించి దానిని సరిదిద్దుకుని నిజమైన ఆధిక్యతగా మలచుకున్నప్పుడే అతనికి సమగ్రమైన వ్యక్తిత్వం వస్తుంది. ఆడ్లర్ ఆత్మన్యూనతా ప్రభావాలను మూడు రకలుగా విభజించాడు. అవి

1.Dengeneration

2.Neurosis

3.Genius

పగటి కలల్లో మాత్రమే తేలిపోయే వ్యక్తిని Dengenerate గా పేర్కొనవచ్చును. సర్వసాధారణంగా ఆత్మన్యూనతా భావాన్ని అధికమించడానికి వ్యర్థ ప్రయత్నాలు చేసినవారు న్యూరోటిక్ గా మారుతారు. ఆశలు

అడిఆశలు అయి, తాము కోరుకున్న ఆధిక్యతను పొందలేక మానసిక రుగ్మతకు లోనవుతారు. ఇక Genius విషయంలో ఆధిక్యత అధిగమించబడుతుంది. ఆడ్లర్ నూతన సిద్ధాంతాలను ప్రతిపాదించి ముందు తరాల వారికి మార్గదర్శులయ్యారు. [30]

### 3.2.8. సృజనాత్మక ఆత్మ

వ్యక్తి తన నమ్మకాలతో, వైఖరులతో, నిర్ణయాలతో ఏర్పరచుకున్న 'అంతరాత్మ ఆత్మ' యే సృజనాత్మక ఆత్మ. అనేక మంది కొన్ని విషయాలలో ఈ పనిని నా అంతరాత్మ చేయవద్దన్నదని లేక చేయమన్నదనే మాటలను వింటాము. ఇదే మన సృజనాత్మక ఆత్మ. ఇది వ్యక్తి జీవితానికి అర్థాన్ని కల్పిస్తుంది. ఆడ్లర్ ఈ అంశాన్ని నూతనంగా ప్రతిపాదించాడు.[31]

### 3.2.9. ఆధిక్యతాభావం

సహజంగా వ్యక్తులందరూ ఏ ప్రయోజనాన్ని ఆశించి పనులను చేపడతారో దాన్ని పరిపూర్ణంగా సాధించే వరకు ప్రయత్నిస్తూనే ఉంటారు. దీనికి ఉదాహరణగా చిన్నపిల్లలను పేర్కొనవచ్చు. పిల్లలు నడక నేర్చే సమయంలో కింద పడడం లేవడం మరళా పడడం లేవడం చూస్తూ ఉంటారు. ఇక్కడ పిల్లలు నడిచే ప్రయోజనాన్ని ఆశించి ఆ పనిని సాధించే వరకు ప్రత్నిస్తూనే ఉంటారు. ఇలాంటి ప్రయత్నాలే వ్యక్తుల జీవితంలో అనువర్తిస్తాయి.[32]

### 3.2.10. వ్యక్తి జీవితం

యూంగ్ ఫ్రాయిడ్ అనుచరులలో ఒకరు. ఇతను స్విట్జర్లాండ్ లోని 'Jurich' కు చెందిన శాస్త్రవేత్త. ఫ్రాయిడ్ ను ఆదర్శంగా తీసుకొని ఇతను మనస్తత్వ శాస్త్రంలో అధ్యయనం చేయడం ప్రారంభించాడు. ఇతని సిద్ధాంతాలు కూడా ఎంతో ప్రాచుర్యాన్ని పొందాయి. మనస్తత్వ శాస్త్రంలో ఫ్రాయిడ్, ఆడ్లర్ తర్వాత చెప్పుకోదగినవారిలో యూంగ్ ఒకరు.

1912లో యూంగ్ ఫ్రాయిడ్ సిద్ధాంతాలను విమర్శిస్తూ '*The Psychology of the Conscious*' అనే పుస్తకాన్ని అందించారు. యూంగ్ ప్రతిపాదించిన సిద్ధాంతాన్ని 'విశ్లేషణత్మక మనోవిజ్ఞానం' (Analytical

Psychology) అంటారు. ఫ్రాయిడ్ కలలను వ్యక్తుల గతజీవనానికి అనువర్తింపచేసి వివరిస్తాడు. కానీ యూంగ్ కలలను గత జీవితానికే ఎందుకు అనువర్తింప చేయలి? వాటిని వర్తమానానికి ఎందుకు అనువర్తింపచేయరాదని తలచి ఫ్రాయిడ్ కు వ్యతిరేకంగా కలలను వర్తమానం, భవిష్యత్తుకు సూచకలుగా వర్ణిస్తాడు. ఒక వ్యక్తి తను చేస్తున్న పనిమీదగానీ తను ఉంటున్న పరిసరాలమీదగానీ ఉత్సాహాన్ని కోల్పోతే ఆ విషయాలమీద నుండి లిబిడో తప్పుకుందన్న మాట. అలాగే ఆ విషయాల పట్ల ఉత్సాహాన్ని కనబరుస్తూ ఉంటే లిబిడో ఆ విషయాల పట్ల కేంద్రీకృతమై ఉన్నదన్న మాట. దీన్ని బట్టి ఒక విషయం మనసును ఆకర్షించినా లేదా వికర్షించినా దానికి కారణం లిబిడోనే అంటారు. లిబిడోను కేవలం శృంగార పరమయిన దానిగానే కాకుండా శక్తివంతమయిన కేంద్రంగా చెప్పి అటు ఫ్రాయిడ్ ఇటు ఆడ్లర్ సిద్ధాంతాలను సమన్వయ పరిచారు. యూంగ్ మనుషులను రెండు రకలుగా విభజిస్తాడు. అవి Introvert, Extrovert అంటాడు. Extrover విషయంలో లిబిడో బహిర్ముఖంగా ఉంటుంది. వీరు ఇతరులతో సులువుగా కలిసిపోతారు, సామాజిక కార్యకలాపాలలో కలిసిపోతారు, ప్రతి విషయంలోనూ వీరు వాస్తవికతను కలిగి ఉంటారు. వీరికి ఉదాహరణగా మనము వ్యాపారస్తులను, రాజకీయ నాయకులను, నటులను మొదలైన వారిని చెప్పవచ్చు. Introvertలో లిబిడో అంతర్ముఖంగా ఉంటుంది. ఆలోచనలకు ఇచ్చే ప్రాధాన్యత కార్యాచరణకు ఇవ్వరు. ఒంటరిగా ఉండడాన్నే వీరు ఇష్టపడతారు. భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ ఎప్పుడూ పగటి కలల్లో తేలిపోతూ ఉంటారు. త్వరగా ఒక విషయంలో నిర్ణయానికి రాలేరు. శాస్త్రవేత్తలు, కవులు, తత్త్వ వేత్తలను వీరికి ఉదాహరణగా చెప్పవచ్చు.

యూంగ్ పైన పేర్కొన్న Introvert, Extrovert లలో వ్యక్తులు కొన్ని సందర్భాలలో Introvert దశ నుండి Extrovert దశలోకి మారే అవకాశాలు ఉన్నాయి. అలాగే Extrovert దశ నుండి Introvert దశలోకి మారే అవకాశం ఉందని అంటారు యూంగ్. మనిషి కొంతకాలంగా ఒంటరి జీవితాన్ని గడుపుతున్నప్పుడు కొంతకాలానికి అతని మనస్తత్త్వంలో మార్పు వచ్చి నలుగురితో కలిసిపోతాడు. అలాగే నలుగురితో కలిసిపోయే వ్యక్తులు కాలక్రమంలో తమ మనస్తత్వాల మార్పు వల్ల ఒంటరిగా మారుతుంటారు. యూంగ్ ప్రతి మనిషిలో 2 రకాల ప్రవర్తనలు ఉంటాయంటాడు. వ్యక్తి తాను ఒంటరిగా ఉన్నప్పుడు అతని మనసులోని ఆలోచనలకు, భావాలకు అణుగుణంగా నడుచుకోవడం ఒకటైతే, నలుగురితో ఉన్నప్పుడు సమాజ కట్టుబాట్లకు, అవసరాలకు అణుగుణంగా

నడుచుకోవడం మరొకటి. వ్యక్తిని పూర్తిగా అర్థం చేసుకోవాలంటే అతను ఒంటరిగా ఉన్నపుడు ఉండే ప్రవర్తనను అధ్యయనం చేయాలి. అలా కాక అతను నలుగురితో ఉన్నప్పుడు ఉండే ప్రవర్తనను బట్టి అతనిని అంచనావేయలేం.[33]

యూంగ్ మన భారతీయ సంస్కృతి, పురాణేతిహాసాల గురించి బాగా అధ్యయనం చేసి ఒక విషయాన్ని చెప్పాడు. మన పురాణాలలో బ్రహ్మ 'శతరూప' అనే స్త్రీని సృష్టిస్తాడు. ఈమెలో సగం స్త్రీ లక్షణాలు, సగం పురుష లక్షణాలు ఉండటం వల్ల, బ్రహ్మ మానసం నుండి సృష్టించబడుటవల్ల బ్రహ్మ శతరూపలోని పురుష లక్షణాలకు ఆకర్షితుడై ఆమెను వివాహమాడతాడు. దీనిని బట్టి ప్రతి మనిషిలో సగం స్త్రీ లక్షణాలు, సగం పురుష లక్షణాలు ఉంటాయని వాటివల్లే స్త్రీ పురుషులు ఒకరికొకరు ఆకర్షితులవుతారని యూంగ్ అంటాడు.[34]

### 3.2.11. వ్యక్తి వికాసం - దశలు

Neurosis, Personality, Femnine Psychology అంశాల గురించి వివిధ కోణాల్లో పరిశోధనలు చేసి అనేక విషయలను మనకు అందించిన గొప్ప వ్యక్తిగా 'కారెన్ హార్నీ' ని పేర్కొనవచ్చు. ఈమె 'American Institute of Psychoanalysis' కి Dean గా పనిచేశారు. అలాగే 'American Journal of Psychoanalysis' వంటి Journal ను స్థాపించి మనస్తత్వాలకు సంబంధించిన అనేక వ్యాసాలను అందించారు.

ఈమె ఒక్క అమెరికాలోనేకాకుండా Newyork వంటి దేశంలో కూడా Medical Collegeలో Psychology ప్రొఫెసర్ గా పనిచేశారు. ఆమె మరణించే వరకూ ఇదే వృత్తిలో కొనసాగారు. ఈమె ఫ్రాయిడ్ చెప్పిన బాల్యానుభవాలకు ప్రాధన్యం ఇచ్చారు. కారెన్ హార్నీ పరిసరాల ప్రభావం వలన, సాంస్కృతిక ప్రభావాల వలన, బాల్య జీవితానుభవం వలన వ్యక్తి వికాసంలో మార్పు వస్తుందని వ్యక్తి వికాసంలో ఈమె 3 అంశాలను పేర్కొన్నారు.

అవి. I.వ్యక్తులకు దగ్గరగా జరగడం (Moving Toward People)

II.వ్యక్తులకు దూరంగా జరగడం (Moving Away from people)

III. వ్యక్తులకు వ్యతిరేకంగా జరగడం (Moving Against People)

ఈ మూడు అవస్థల మధ్య సమన్వయం వల్ల మామూలు మనుషుల మూర్తిమత్వం ఏర్పడుతుంది. ఈ మూడింటిలో ఏదో ఒకటి అధికమయితే మనిషిలో అపసామాన్య ప్రవర్తన ప్రారంభమవుతుందని ఈమె అన్నారు.

హార్నీ అనేక వ్యాసాలలో స్త్రీ, వివాహహం, కుటుంబం వంటి అంశాలకు సంబంధించిన వాటినే ప్రస్తావించారు. 'The Problem of Masochism' అనే వ్యాసంలో స్త్రీ సంఘంలోని ఆచార వ్యవహారాలకు, కట్టుబాట్లకు, సంప్రదాయాలకు కట్టుబడి, తన రక్షణకోసం, గుర్తింపుకోసం ఇతర విషయాల కొరకై పురుషునికి లోబడి ఉండాలన్నదే అందరి అభిమతమని, స్త్రీ అందానికి, ఆకర్షణకు, పిల్లల ఉత్పత్తికే అన్న విధంగా ఉంటుందని ఈమె తన వ్యాసాలలో వర్ణంచారు. హార్నీ ప్రకారం స్త్రీ తన పిల్లలు, కుటుంబం ద్వారానే సంప్రదాయక విలువలను పొందుతుందనే విషయాలను' The Distrust Between the Sexes ' అనే వ్యాసంలో చర్చించారు.

కారెన్ హార్నీ ప్రతి వ్యక్తిలో ఏవో మానసిక పరమైన సమస్యలు ఉంటూనే ఉంటాయి. కొందరు వాటిని తెలుసుకొని సరిదిద్దుకుంటూ తమ జీవితాన్ని సాగిస్తుంటారు. కానీ కొందరు మానసికంగా కృంగిపోతుంటారు. మానవుని ప్రవర్తనలో మార్పుకు 'అనువంశికత'ను కారణంగా పేర్కొనవచ్చు. మానవుని బాల్యానుభవాలు, తీరని ఆశలు, పెంపకంలో లోపాలు, సాంఘిక, సాంస్కృతిక కారణాలను 'అనువంశికత'గా చెప్పవచ్చు. ఈ కారణాల వలన మానవుని ప్రవర్తనలో మార్పు కనిపిస్తుంది. వారు ఇతరులతో సరదాగా, సంతోషంగా ఉండలేరు. వీరు 'Neorosis' అనే వ్యాధికి గురయ్యే అవకాశం ఉందని, ఇది అంత ప్రమాదమయినదేమీ కాదని కౌన్సిలింగ్ ద్వారా ఈ వ్యాధిని నయంచేయవచ్చని ఈమె అనేక పరిశోధనల్లో వివరించి మనస్తత్త్వ శాస్త్ర వికాసానికి తనవంతు పాత్రని నిర్వహించారు. [35]

అమెరికన్ psycho Biographist ఎరిక్ ఎరిక్సన్. పుట్టినప్పటి నుంచి మరణించేవరకూ మనిషి వివిధ దశల్లో అనేక మానసిక సంఘర్షణలకు గురవుతుంటారని ఆ సంఘర్షణలను ఎనిమిది రకాలుగ విడదీశాడు. అవి

1. అతి బాల్య దశ - రెండో సంవత్సరం వచ్చేంత వరకూ (నమ్మకం - అపనమ్మకాల మధ్య సంఘర్షణ)
2. బాల్య దశ - రెండు మూడు సంవత్సరాల మధ్య దశ (స్వతంత్రత - సందేహాల మధ్య సంఘర్షణ)
3. నాలుగు - ఐదు సంవత్సరాల మధ్య దశ (చొరవ - అపరాధ భావాల మధ్య సంఘర్షణ)
4. ఆరు - పదకొండు సంవత్సరాల మధ్య దశ (పరిశ్రమ, ఆత్మన్యూనతల మధ్య సంఘర్షణ)
5. పన్నెండు - పద్దెనిమిది సంవత్సరాల మధ్య దశ (తాదాత్మ్యత, అయోమయ ధోరణుల మధ్య సంఘర్షణ)

6. యౌవన దశ (ఆత్మీయత ఏకాంతాల మధ్య సంఘర్షణ)

7. నడి వయస్సు దశ (తరతరాల అంతరం, సబ్ధతల మధ్య సంఘర్షణ)

8. వార్ధక్య దశ (నిజాయితీ, నిస్పృహల మధ్య సంఘర్షణ) [36]

ఫ్రాయిడ్ సిద్ధాంతాలను ఆధారంగా చేసుకొని ఎరిక్ బర్న్ మానవునిలో 3 దశలు ఉంటాయని పేర్కొన్నాడు. అవి

**i.Child Ego State (చైల్డ్ ఇగో స్టేట్)**

ఈ స్థితిలో ఉన్న వ్యక్తుల ప్రవర్తన, ఆలోచనలు అన్ని పసితనాన్ని పోలి ఉండును. ఉదాహరణకు సంతోషం వస్తే పొంగిపోవడం, బాధ కలిగితే కృంగిపోవడం లాంటివి. ఈ దశలో ఉన్న వ్యక్తులు తమను అందరూ మెచ్చుకోవాలని, తాము అందరిలో ప్రత్యేక గుర్తింపు పొందాలని కోరుకుంటారు. తాము ఏదైనా కావాలని కోరుకోవడం కోరుకున్నదాన్ని సాధించడానికి ఎలాంటిపనులయినా చేస్తారు. కొన్ని సమయాలలో వీరు చిన్న పిల్లలవలె చీటికీ మాటికీ ఇతరుల నిందిస్తుంటారు. తమకు వ్యతిరేకంగా ఎలాంటి పనులు జరిగినా, తమను ఎవరైనా విమర్శించినా వీరు సహించక కక్షతో, కోపంతో ఆక్రోశించడం లాంటి మనస్తత్వాన్ని ఈ దశలో ఉన్న వ్యక్తులలో చూడగలుగుతాం.

**ii.Adult Ego State (అడల్ట్ ఇగో స్టేట్)**

ఈ దశలో ఉన్న వ్యక్తుల ఆలోచనలు హేతుబద్ధంగా ఉంటాయి. వీరి నిర్ణయాలు విచక్షణతో కూడినవై ఉంటాయి.

**iii.Parent Ego State (పేరెంట్ ఇగో స్టేట్)**

ఈ దశలో వ్యక్తి వయసుకు మించిన అధికార ధోరణిని ప్రదర్శిస్తాడు. అందరిపైనా పెత్తనం చెలాయిస్తూ ఉండటం వీరి లక్షణం. [37]

## 3.2.12. ఆత్మభావన

కార్ల్ రోజర్స్ అమెరికా ప్రఖ్యాత మనస్తత్వ శాస్త్రవేత్తలలో ప్రముఖుడు. University of Chicago (1945- 1957) లో Psychology ప్రొఫెసర్ గా పనిచేశారు. ఆ సమయంలో వీరు అక్కడ ఒక Psychotheraphy

కౌన్సిలింగ్ Center ను ప్రారంభించి అనేక మంది మానసిక రోగుల రుగ్మతలను తగ్గించేవారు. రోజర్స్ 1956 వ సంవత్సరంలో 'American Academy of Psychotherapists'కు ప్రథమ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. Wisconsin, Madison నందు 1957 నుండి 1963 వరకు Psychology ని పాఠ్యాంశంగా బోధించేవారు.

కార్ల్ రోజర్స్ కొత్తగా 'self concept(ఆత్మభావన)'అనే అంశాన్ని ప్రతిపాదించారు. తన గురించి, ప్రపంచం గురించి తాను ఏర్పరచుకున్న భావనల సమాహారమే 'ఆత్మభావన'. వ్యక్తుల భావాలకు అసలు అనుభవాలకు మధ్య విపరీతమైన భేదం ఉన్నప్పుడు వ్యక్తి అపసామాన్య ప్రవర్తనకు లోనవుతాడని ఇతని అభిప్రాయం. ఈ స్థితి నుండి వ్యక్తి బయట పడాలంటే అతనికి సంబంధించిన వ్యక్తులు అతనికి సంపూర్ణ అంగీకారం, సానుభూతి, దయ, గౌరవం అందివ్వాలని, దాని ద్వారా అతడు తనను తాను ఉన్నట్టుగా అంగీకరించగలుగుతాడని చెప్పాడు. [38]

### 3.2.13. అస్తిత్వవాదం

జీన్‌పాల్ సార్త్రే, ఫ్రోమ్, మాస్లో, ఆల్‌పోర్ట్, రోజర్స్ మొదలైనవారు కలసి ఈ అస్తిత్వవాద సిద్ధాంతాన్ని రూపొందించారు. ఇలా వీరు రూపొందించిన ఈ సిద్ధాంతాన్ని ప్రచారంలోకి తీసుకువచ్చింది మాత్రం కీర్కెగార్డు, యాస్పర్స్, హైడెగ్గర్ , నీచే, కాము మొదలైనవారు.

వ్యక్తుల జీవితాలు వారు తీసుకునే నిర్ణయాల మీద ఆధారపడి ఉంటుంది. వ్యక్తులు స్వేచ్ఛ వలన ధైర్యాన్ని, ఉత్సాహాన్ని, సామర్థ్యాన్ని పొందుతారు. జీన్‌పాల్‌సార్త్రేగారు అస్తిత్వాన్ని 3 రకములుగా విభజించారు. అవి

**i. Being for it Self**

మానవులు తమ కొరకు తాము జీవించే స్వార్థపూరితమైన జీవితం.

**ii. Being in it Self**

మానవులు తమలో తాము జీవించడం. దీనివల్ల మానవుడు సమాజంలో సాధించగలిగింది ఏమీ ఉండదు. వీరి వల్ల సమాజానికి ఎలాంటి లాభనష్టాలు ఉండవు.

**iii. Being for Others**

మానవులు తమకోసంకాక ఇతరుల కోసం జీవించడం. ఇందులో వ్యక్తుల జీవితపు విలువలు నిర్ధారితమవుతాయి. [39]

ఇలా పైన పేర్కొన్న వాళ్లంతా అపసామాన్యమనో విజ్ఞాన శాస్త్రాన్ని వివిధ కోణాల నుండి అభివృద్ధి పరిచారు. వీరే కాక J. Philippe Rushton, Robert Sternberg, Erickson, Aaronson, E, P.Gray, ఇలా అనేక మంది మనో విజ్ఞాన శాస్త్రాన్ని అభివృద్ధి పరిచారు. ఎందరు ఎన్ని సిద్ధాంతాలను రూపొందించినా అవి అన్నీ ఫ్రాయిడ్ , ఆడ్లర్ , యూంగ్ సిద్ధాంతాలను అనుసరించి పేర్కొన్నవే.

## 3.3. భారతీయుల సిద్ధాంతాలు

పాశ్చాత్యులు సంఘంలోని మానవునికి అతను అనుసరించే మతానికి వేరుగా ప్రాధన్యతను ఇచ్చారు. వీరి సిద్ధాంతాలు కూడా ఇలానే రూపొందాయి. కానీ భారతీయులు సంఘంలోని మానవునికి అతను అనుసరించే ధర్మానికి ఒకే ప్రాధాన్యతను ఇచ్చారు. భారతీయులు ఎన్ని సిద్ధాంతాలు, విషయాలు చెప్పినా అవి ధర్మానికి సంబంధించినవై ఉంటాయి. మోక్షమార్గానికి అరిషడ్వర్గాలు, అంతఃకరణములు మొదలయిన వాటి గురించి వివరించారు. వీటిని మనం మానవుని మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగించవచ్చు.

ప్రకృతికిగానీ, జీవికిగానీ, బుద్ధికిగానీ, అహంకారానికిగానీ 3 గుణములు ఉంటాయి. అవి

1. సత్వగుణం : ప్రీతి, సుఖం, ప్రకాశత్వం, జ్ఞానం మొదలయినవి కలుగజేయును.
2. రజో గుణం : అప్రియము, దుఃఖము,చలనం, కామం, కోరికలు కలుగజేయును.
3. తమోగుణం : విస్మయం, అలసత్వం, మాంద్యం, అజ్ఞానం వంటివి కలుగజేయును. [40]

## 3.4. అంతఃకరణం

''వేదాలు ఉపనిషత్తుల కాలంలో అంతఃకరణ ప్రాధాన్యం చెప్పబడింది. 'సతాంహి సందేహపదేషు వస్తుషు ప్రమాణ మంతఃకరణ ప్రవృత్తయః' అంటాడు కవికుల గురువు, మహాకవి కాళిదాసు! ఇతడు వాల్మీకి మహర్షికి శిష్యుడు కాబట్టే అలా అనగలిగాడు. మనస్సు, బుద్ధి, అహంకారం, చిత్తం - ఈ నాల్గింటి సమాహార స్వరూపమే అంతఃకరణం ఇవి ఉత్తరోత్తర ఉత్కర్షగల్గినవి. మనసు మొదటి మెట్టు అయితే చిత్తం (హృదయం) నాల్గవ మెట్టు. లోకానికి మిక్కిలి సన్నిహితంగా ఉండేది మనస్సయితే సర్వజీవులలోని సమత్వాన్ని. సమానత్వాన్ని తత్త్వతః దర్శించేది చిత్తం. ఇలా దర్శింపగల్గిన వారినే సహృదయులంటారు. కలుషితం కానటువంటి ప్రసన్నమైన మనసుగలవారే సహృదయులు!''[41]

అంతఃకరణము 4 విధములు అవి

1.మనస్సు 2.బుద్ధి 3.అహంకారం 4.చిత్తం

### 3.4.1. మనస్సు

"మన్యతే బుద్ధ్యతేznనేనేతి ; మనః" అని మనసుకు వ్యుత్పత్తి చెప్పబడింది. అనగా దేనిచే విషయం తెలుసుకొనబడుతుందో అదే మనస్సని అర్థం. అలాగే నిర్వచనాన్ని గనుక పరిశీలించినట్లయితే సంకల్ప వికల్పాత్మికమగు అంతఃకరణ వృత్తినే మనస్సని చెప్పబడింది. అనగా ఏదైనా ఒక విషయాన్ని తలచి, తలచిన విషయాన్ని అవునా?కాదా? అని సందేహించునది మనస్సు.[42]

మనస్సుకున్న ఎనిమిది గుణములను మనం క్రింది శ్లోకంలో చూడవచ్చు. మోక్షమార్గానికి ఈ ఎనిమిదే ప్రధానమని గౌతమ ధర్మ సూత్రములందు పేర్కొనబడెను.

"దయా క్షమాznనసూయా చ శౌచాznనాయాసమంగళం,

అకార్పణ్య మస్పృహత్వం సర్వ సాధారణాని చ. "[43]

**i.దయ**

మిత్రులుకానీ, శత్రువులుకానీ ఇలా ఎవరయినా ఆపదలో చిక్కుకున్నప్పుడు వారిని ఆపద నుండి రక్షించుటను దయగా చెప్పవచ్చు.

**ii.క్షమ**

శరీర సంబంధ దుఃఖములు కలిగిన సందర్భంలో ఎవరినీ తిట్టక, కొట్టక సహించి ఉండుటనే క్షమగా పేర్కొనవచ్చు.

**iii. అనసూయ**

గుణవంతులలోని గుణములను చెడగొట్టు ప్రయత్నము చేయక, వారిలో ఉన్న స్వల్ప గుణములనయినా మెచ్చుకొనుచూ పరదోషములందు ప్రీతి లేకుండుటను అనసూయగా చెప్పవచ్చు.

**iv.శౌచము**

స్వధర్మమున నిలకడను కలిగి ఉండుటే శౌచము.

**v .అనాయాసము**

ఎటువంటి కర్మ రమణీయముగా నున్న శరీరమును పీడిస్తుందో, అలాంటి కర్మను చేయకపోవడమే.

**vi.మంగళము**

నలుగురూమెచ్చి కొనియాడే పనులు చేసి, దూష్యములయిన పనులను చేయకుండుటే మంగళము.

**vii.అకార్పణ్యము**

మనకున్నదానిలో కొద్ది భాగమయినా ఇతరులకు ఇచ్చి, అలా మనం మనకున్న దానిలో కొంత ఇతరులకు ఇచ్చినందుకు వగువక పోవడమే అకార్పణ్యము.

**viii.అస్పృహత్వము**

ఇతరుల సొమ్ముకు ఆశించక మనకున్న దానితోనే సంతృప్తి చెందడమే అస్పృహత్వము. [44]

మనసును గూర్చి జిడ్డు కృష్ణమూర్తిగారు తన 'చేతన' గ్రంథంలో ఇలా అంటారు. మన శరీరంలో 'మెదడు' అనేది అనుభవాలను ముద్రించుకొని, ఈ అనుభవాలను భద్ర పరుస్తూ 'మనస్సు' అనబడుతుందని, మనసు దాని ఆలోచనలలోనూ, ఇతరులు చెప్పే వాటిని వినడంలోనూ, వినేవాటిని పర్య వేక్షించుటలో ఉంటుంది గానీ మనసు అనేది ఎప్పుడూ ఖాళీగా ఉండదు. ఒక వేళ ఉందే అనుకొన్నామనుకోండి ఈ మనసు ఆ సమయంలో పగటి కలలు కంటుంది. మానసిక శాంతికి ఎవరైనా ఏమైనా ఒక పద్ధతిని సూచించితే ఆ పద్ధతిని అనుసరించి అభ్యాసం చేస్తుంది. ఏ వ్యాపకమూ లేనప్పుడు మనసుకు ఒంటరి తనము ఆవహిస్తుంది. ఈ ఒంటరి తనమును పోగొట్టుకొనేందుకు మనము ఎప్పుడూ ఏదో ఒక వ్యాపకమును కలిగి ఉండాలని జిడ్డు కృష్ణమూర్తిగారు అంటారు.

శ్లో: మనో హి ద్వివిధం ప్రోక్తం శుద్ధం చాZశుద్ధమేవచ

అశుద్ధం కామసంకల్పం శుద్ధం కామవివర్జితం. [45]

పై శ్లోకమునందు మనస్సు శుద్ధం, అశుద్ధం అని రెండు రకముగా చెప్పబడింది. అశుద్ధమనగా మనసు కామసంకల్పములతో నిండి ఉంటుండి. కామసంకల్పములు లేని మనసు శుద్ధమనబడుతుంది. ఈ సంకల్పములను అదుపులో ఉంచుకున్నచో కామాన్ని జయించవచ్చు.

### 3.4.2. బుద్ధి

సంకల్ప వికల్పములతో ఆందోళన చెందుతున్న మనస్సును ఒక ఖచ్చితమైన నిర్ణయానికి తీసుకువచ్చే అంతఃకరణవృత్తియే బుద్ధి.

శ్లో : శుశ్రూ షా శ్రవణం చైవ గ్రహణం ధారణం తథా

ఊహాపోహోzర్థ విజ్ఞానం తత్వజ్ఞానం చ ధీ గుణాః ఇతి హేమచంద్రః

ఈ శ్లోకములో బుద్ధికి సంబంధించిన 7 గుణములను పేర్కొనడం జరిగింది. అవి

1. ఆసక్తి
2. శ్రద్ధాపూర్వకంగా వినుట
3. బుద్ధి పూర్వకముగ గ్రహించుట
4. గ్రహించిన విషయమును మరల గుర్తుకు తెచ్చుకొనుట
5. ఊహాపోహ (తర్క జ్ఞానము)
6. అర్థ విషయక జ్ఞానము
7. తత్త్వ జ్ఞానము

శ్లో : శోకః క్రోధశ్చ లోభశ్చ కామో మోహః పరస్వతా

ఈర్ష్యా మానో విచికిత్సా కృపాసూయా జుగుప్సతా

ద్వాదశైతే బుద్ధి నాశ హేతవో మానసా మలాః

ఈ శ్లోకములో 12 దోషములు చెప్పబడినవి. అవి

1. శోకః (దుఃఖం)
2. క్రోధః (తీవ్రకోపము)
3. లోభః (అత్యాశ)
4. కామః (స్త్రీ విషయికానురాగము)
5. మోహః (భ్రాంతి)

6. పరస్వతా (ప్రాణాత్యయము లేక పారతంత్ర్యము)

7. ఈర్ష్యా (ఈసు/మచ్చరము)

8. మానః (అభిమానము)

9. విచికిత్సా (సందేహము)

10.కృప (కనికరము)

11. అసూయ (ఓర్వలేని తనము)

12. జుగుప్సతా (ఏవగింపు) [46]

"బుద్ధి రెండు రకాలు. ఒకటి 'వ్యవసాయాత్మికాబుద్ధి' లేక 'శుద్ధ బుద్ధి'; రెండోది వాసనాబుద్ధి. ఇంద్రియాలు, మనస్సు ప్రేరణలకు గురియైఉన్నట్లయితే అది వాసనా బుద్ధి. ఇంద్రియాల నుండి దూరంగా'ఇన్సులేటు' చేయగలిగితే, అది శుద్ధ బుద్ధి. ఈ శుద్ధ బుద్ధి వలన ఇంద్రియాతీత విషయాలను తెల్సుకోగలమట. అనేక సాధనలు ప్రక్రియల వలన వాసనా బుద్ధిని శుద్ధ బుద్ధిగా మార్చుకోగలమట"[47]

### 3.4.3.అహంకారము

మనసును, బుద్ధిని ఈ రెండింటినీ అహంకారం కప్పివేస్తూ స్వార్థ బుద్ధితో తనలోని అరిషడ్వర్గాల ద్వారా మనిషిని ఏదో ఒక మార్గంలోకి మళ్ళించి గమ్య స్థానం చేరకుండా చేస్తుంది. అరిషడ్వర్గాలను జయించడం అంత సులువయిన పనికాదు. కానీ మానవుడు తన వయసు పెరిగే కొద్దీ అహంకారాన్ని కొంత తగ్గించుకొంటూ ఉండటం మనిషి చేయవలసిన పని.[48]

### 3.4.3.1. అరిషడ్వార్గాలు

i. కామం ii. క్రోధం iii. లోభం

iv. మోహం v. మదం vi. మాత్సర్యం

## i. కామం (కోరిక)

మానవునిలో తనకు నచ్చిన వస్తువులు కావలయునను సంకల్పము వలన కామము పుడుతుంది. మనం చేసే ప్రతిపనికీ కామచేష్టితమే కారణమని మనువు చెప్పాడు. ధర్మమునకు విరుద్ధముకాని కామసంకల్పములు జగత్కళ్యాణానికి కారణమగును.

"వాంఛా సజ్జనసంగతౌ పరగుణే ప్రీతిర్గురౌ నమ్రతా

విద్యాయాం వ్యసనం స్వయోషితి రతిర్లో కాపవాదాద్భయమ్.

భర్తృహరిసుభాషితం.

సజ్జన సాంగత్యమునందభిలాషయు, పరులగుణము నందు ప్రీతియు, వేదాంతాది విద్యల నభ్యసించుటయందు దృఢాభిలాషము, అనగా ఆసక్తియు, నవియన్నియు ధర్మసమ్మతములయిన కామములు కాబట్టి ఇట్టి నిర్మలగుణములుగల మహనీయులు పూజ్యులని భర్తృహరి యోగీంద్రుడు వచించెను." [49]

భూమిపై మానవునికి ధనధాన్యములు, వస్తువాహనాలు, కాంతాకనకములు ఇలా సకల సంపదలెన్ని ఉన్నా వీటన్నింటినీ అనుభవించినా మానవునిలో ఉన్న కామము వలన మానవుడు అసంతృప్తిగానే ఉంటాడు. ఈ కామమును విడిచినపుడే మనిషికి మనశ్శాంతి దొరుకుతుంది. మనస్సు శుద్ధం, అశుద్ధం అని రెండు విధములు. కామ సంకల్పములతో కూడుకున్నది అశుద్ధం, కామ సంకల్పములు లేని మనస్సు శుద్ధం. కాంతాకనక మందున్న కామమోహము మనిషిని బాధించునట్లుగా మరే ఇతర విషయమందున్న కామాభిలాష అతనిని బాధించవు.[50]

కామము మనిషిలోని బుద్ధిని నశింపజేసి. మానవుని దు:ఖమునకు కారణమవుతుంది. ఈ కామమును జయించవలెనంటే కామమునకు కారణమయిన మనిషిలో కలిగే సంకల్పములను జయించవలెను. మానవుడు తనకు లభించిన వాటితో తృప్తిని చెందినపుడు ఇది కావాలి అది కావాలి అనే సంకల్పములు చేయడు. ధర్మబద్ధమయిన కామమే శ్రేయస్కరము.

### ii. క్రోధం

అరిషడ్వార్గాలలో రెండవది క్రోధం. ఈ క్రోధము మూడు అవస్థలలో ఉండును అవి

1. కోమలావస్థ యందు కోపము (Angry)
2. మధ్యమావస్థ యందు రోషము (Rage)
3. ఉత్కటావస్థయందు క్రోధము (Wrath)

శ్లో : ఉత్తమే క్షణ కోపం స్యాన్మధ్యమే ఘటికాద్వయం.

అధమే తు అహోరాత్రం నీచేతు మరణాంతకమ్

ఈ శ్లోకంలో ఉత్తములకు కలుగు కోపము క్షణకాలము, మధ్యములకు కలుగు కోపము రెండు ఘడియలు, అధములకు ఒకరోజు, నీచులకు మరణాంతం వరకు ఉండునని భావము. [51]

క్రోధం 2 రకలుగా ఉండును.

**a.**ఆత్మకర్తృకం

మానవుడు తన మిత్రులు, సోదరులు, ఆత్మీయులు మొదలైనవారు తనకు వ్యతిరేకంగా విలువగల వస్తువులను పగులగొట్టుట, తన శత్రువులతో కలిసి ఉండటం వంటి పనులు చేసినచో వారి మీద కలిగే కోపమే ఆత్మ కర్తృత్వం.

**b.**అన్యకర్తృకం

సేవకులు తన యజమాని యెడల అపరాధము చేసినా, వ్యతిరేకంగా ప్రవర్తించినా వారి మీద యజమానికి కలిగే కోపమే అన్యకర్తృత్వం.

క్రోధమును భరించుటకు పరాక్రమవంతులు, ధీరులగు క్షత్రియులు వంటివారే సమర్ధులు గానీ సామాన్య మానవులు ఈ క్రోధమును భరించలేరు. స్త్రీలకు లజ్జ వలె పురుషులకు శాంతము భూషణము. అలాగని అన్నివేళలా శాంతము పనికిరాదు. తనకు, తన వారికి అవమానము, హాని జరిగే సమయంలో తగిన పరాక్రమము చూపి తమ ఆత్మగౌరవమును నిలుపుకోవాలి. [52]

జిడ్డు కృష్ణమూర్తిగారు తన 'చేతన' గ్రంథంలో కోపాన్ని గురించి వివరిస్తూ కోపం 2 విధాలుగా ఉంటుందంటారు. బాహ్య సన్నివేశాల వలన వచ్చే కోపం భౌతిక పరమైన కోపం ఈ కోపం ఎక్కువసేపు ఉండదు. క్షణకాలం మాత్రమే ఉంటుంది. మరో రకమైన కోపం ఆ కోపానికి కారణమయినదాన్ని ఎదుర్కోవాలనే ఆలోచనతో వస్తుంది. ఎదుటివారిని దెబ్బతీయాలని అనుకున్నప్పుడు, అనుకున్నది జరగనప్పుడు ఈ కోపం బయట పడి తనను తాను సమర్థించుకుంటుంది. ఈ కోపం మనిషి నాశననికి దారి తీయవచ్చు.

## iii. లోభం

అరిషడ్వర్గాలలో 3 వది లోభం. అత్యాశే లోభమని తత్త్వజ్ఞుల వివరణ. అధిక ధన సంపదలున్నా ఆ సంపదలు ఇంకా వృద్ధి చెందాలనే కోరిక, ధనమును మంచి పనులకు వినియోంచక పోవడం, ఇలాంటి గుణములతో నిండి ఉండుటే లోభం. ఈ లక్షణములు గల వ్యక్తులను మనము 'లోభి'గా పేర్కొంటాము. ఈ లోభులు తాము సాంపాదించిన సొమ్మును ఇతరులకు సహాయం చేయక, ఆ ధనమును తాము అనుభవించక ఉన్న ధనంతో తృప్తి పడక ఇంకా ధనమును సంపాదించాలని, ఆ మార్గం అధర్మమయినా ఆ మార్గంలోనే ధనార్జన చేస్తారు.[53]

" లోభాత్క్రోధః ప్రభవతి లోభాత్కామః ప్రజాయతే,

లోభాన్మోహశ్చ నాశశ్చ లోభః పాపస్య కారణమ్"[54]

కామం, క్రోధం, మోహం వంటివి లోభము వలన కలుగుచున్నవి. అన్ని పాపములకు ఈ లోభమే కారణమగుచున్నది.

ధనవంతులు తమ దగ్గరున్న ధనంతో పేద వారికి, దిక్కులేనివారికి తగిన సాయం చేయక, లోభత్వాన్ని ప్రదర్శించడం వారిని నరక ప్రాయులను చేస్తుంది. అజ్ఞానం వలన లోభము. లోభము వలన అజ్ఞాము కలిగి సకల పాపములకు ఈ లోభమే కారణమవుతుంది. ఈ లోభము జయించవలెనంటే ధాతృత్వం ఒక్కటే మార్గము.[55]

## iv. మోహం

అరిషడ్వార్గాలలో 4 వది మోహం. "ఎండమావులందు నిజముగ నీళ్ళు లేకున్నను, ఉండినట్లు మృగములకు భ్రాంతికలిగినట్లు, పుత్రకళత్ర గృహక్షేత్రవిత్తాదులయందు పారమార్థికసుఖము లేకున్నను, ఉండినట్లు భ్రాంతి కలిగి వానియం దాసక్తమగుట మోహ మన(బడును. శలభము దీపము(జూచి ఉపభోగార్హమని ఫలభ్రాంతిచే దానంబడి నశించునట్లు, దుఃఖపరిణతములును అనాత్మీయములునగు కాంతాకనక భూషణాంబర గృహక్షేత్ర పుత్రకళత్రాదులు నిరతిశయసుఖదంబులను భ్రాంతిబుద్ధిచే నట సక్తమై నశించుట మోహ మనంబడు. వాస్తవముగా లేనిది ఉన్నట్లు తోచుట, భ్రాంతి, మాయ, మిథ్యయని వ్యవహరింపబడును." [56]

## v. మదం

అరిషడ్వర్గాలలో 5వది మదము. మదము అనగా గర్వము. ఇది రూప, యౌవ్వన, లావణ్య, కుల, ధన, విద్యా, విభవైశ్వర్యములచే కలుగును. ఉత్తములను ఆశ్రయించునది మానమని, నీచులనాశ్రయించునది గర్వమని చెప్పవచ్చు. గర్వ రూపమగు మదము కుల మదము, ధన మదము, రూప మదము, యౌవన మదము,. శృంగార మదము, కామ మదము, లావణ్య మదము, శౌర్య మదము, అధికార మదము, మూఢ మదము, విద్యామదము ఇలా అనేక రూపములలో గర్వ రూపమగు మదము ప్రదర్శితమవును.

మదములలో ధన మదము బుద్ధినినాశనము చేసినట్లుగా మరేదీ మనపై ఇంత ప్రభావం చూపించదు. అధిక ధనమును కలిగి ఉండటం వలన స్త్రీ వ్యామోహము, జూదము, మద్యము వంటి దుర్వ్యసనలకు లోనగును. వంశపారపర్యముగా ఐశ్వర్యము కలవాడిని ధన మదము ఇంతగా బాధించదు గానీ చెడి బ్రతికిన వాడికి అనగా నడమంత్రపు సిరి గలవాడిని ఇలాంటి వ్యసనములు అధికముగా బాధించును. [57]

## vi. మాత్సర్యం

అరిషడ్వర్గములలో చివరది మాత్సర్యం. మాత్సర్యం, ఈర్ష్య, అసూయ ఇవి మూడు ఇంచుమించు ఒకే జాతికి సంబంధించినవిగా పేర్కొనవచ్చు.

**a.**మాత్సర్యం

స్వ ప్రయోజనము లేకున్నను ఇతరుల అభిమతమును నివారించదదలచుట. అనగా ఇతరులు తనకంటే ఎక్కువ విద్య, ఐశ్వర్యము, అందము, పరాక్రమము వంటివి కలిగినచో వారిని చూసి ఓర్వలేని చిత్తప్రవృత్తే మాత్సర్యం.

**b.** ఈర్ష్య

ఈర్ష్య అనగా నాకు వచ్చిన కష్టములు ఇతరులకు రావలయునను చిత్తవృత్తి కలిగియుండటం. పర శ్రేయస్సును సహించలేకుండుట.

**c.** అసూయ

తనకు కలిగిన సుఖములు ఇతరులకు కలుగరాదను చిత్తప్రవృత్తి అసూయ. ఇతరుల ధనమును, రూపమును, బల పరాక్రమమును, వంశ ప్రతిష్టను, సత్కార గౌరములను చూసి అసూయ కలుగును. ఇది ఒక వ్యాధిలాంటిది. [58]

### 3.4.4. చిత్తం

"వాసన(Desire,Inclination) చిత్తము యొక్క స్వరూపము. చిత్త శబ్దము వాసనయు బర్యాయపదము. చిత్త పరిస్పందము జీవు(డన(బడు.వేయేల? చిత్తమే (అంత:కరణ విశిష్టు(డే) జీవుడని యోగవాసిష్ఠము నందును, శ్రు. "కామ మయ ఏవాయం పురుష:" సంకల్పస్వరూపు(డు(ఇచ్ఛామయు(డు) జీవు(డని బృహదారణ్యకోపనిషత్తు నందును( గలదు. "యో యచ్ఛ్రద్ధస్స ఏవ స:" శ్రద్ధామయు(డు జీవు(డని గీతాశాస్త్రమునందును(గలదు. మఱియు, జీవుని బాహ్యాభ్యంతర ప్రవృత్తికి అంత:కరణము సాధనము. మనస్సు, బుద్ధి, అహంకారము, చిత్తమను నంత:కరణచతుష్టయమునందు మనో వ్యాపారమే ముందు వివరింప(బడును గనుక, బుద్ధి చిత్తాహంకారములును ఉపలక్షణముగా గ్రహింపవలయును." [59]

చిత్తము 'మానము'చే ఉన్నతత్వమును చెందును. మానమనగా ఇరతులచే పూజింపబడునది. ధనము బాంధవ్యము (ఆభిజాత్యము,కులము), వయస్సు, అధికారము (జీవన వృత్తి), విద్యాధిక్యత అను ఈ ఐదు మాన స్థానములుగా లోకమున పూజించబడును. ధనముకన్నా కులము, కులము కన్నా వయస్సు, వయసు కన్నా

అధికారము, అధికరముకన్నా విద్యాధిక్యత(జ్ఞానము) ఇలా ఇవి ఒకదానికన్నా ఒకటి శ్రేష్ఠమయినందున గౌరవింపబడుచున్నవి.[60]

## 3.5. ప్రవర్తనా లక్షణములు

మనస్తత్త్వ శాస్త్రవేత్తలు ప్రవర్తనా లక్షణములను 3 విధములుగా పేర్కొనిరి అవి

### 3.5.1. రాగము

ఒక విషయమును చూసినప్పుడు దానియందు ఆకర్షించబడి ప్రీతి కలిగియుండుట రాగము. రాగము ఆకర్షణ ధర్మము కలది. రాగము వలన మిత్రత్వము కలుగును. ఇతరులు మనకన్నా గొప్ప గుణములు, ఔదార్యము వంటివి కలిగిన వారి యందు మనకు కలుగు ప్రీతియే(రాగము) గౌరవము, భక్తి అనబడును.

### 3.5.2. ద్వేషము

ఒక విషయమును చూసినప్పుడు దానియందు ఆకర్షించబడక అప్రీతిని కలిగి ఉండటమే ద్వేషము. ద్వేషము వికర్షణాధర్మము కలది. ద్వేషము వలన శత్రుత్వము కలుగును.

### 3.5.3. మోహము

లేనిది ఉన్నట్లు భ్రాంతి చెందుట మోహము, భ్రాంతి, మాయ అనబడును.

రాగద్వేషములు విషయము నాశ్రయించి ఉత్తమ సమాన మధ్యములచే వేరువేరు పదములుగా వ్యవహరింపబడును. అవి

i.ఇతరులు మనకన్నా గొప్ప గుణములు, ఔదార్యము వంటివి కలిగిన వారి యందు మనకు కలుగు ప్రీత్రియే(రాగము) గౌరవము, భక్తి అనబడును.

ii.ఇతరులు మనతో సమాన గుణములు కలిగియున్నయెడల వారి యందు కలుగు ప్రీతియే(రాగము) మైత్రి, స్నేహముగా చెప్పవచ్చు.

iii.ఇతరులు తనకన్నా తక్కువగుణములున్న వారియెడల కలుగు ప్రీతియే(రాగము) వాత్సల్యము, కనికరముగా పేర్కొనవచ్చు.

పై అంశాలు  మానవులు తమకన్నా గొప్పవారిని గౌరవముతో, దీనులను కనికరముతో, తమతో సమానులను మిత్రభావముతో  చూడాలని తెలియజేయుచున్నవి. [61]

సంస్కృతంలో వాల్మీకి రచనను అనుసరించి అనేక మంది కవులు రామాయణాన్ని రచించారు, ఇంకా రచిస్తూనే ఉన్నారంటే ఆ గాథా మాధుర్యమెలాంటిదో తెలుసుకోవచ్చు.

ఈ యుగములో బహుభార్యాతత్వం, ఏకపత్నీవ్రతం రెండూ అమలులో ఉన్నాయి. దశరథుని బహుభార్యాత్వానికి ఉదాహరణగా, రాముని ఏకపత్నీ వ్రతానికి ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఒక కుటుంబంలోని వ్యక్తుల స్వార్థ బుద్ధే ఆ కుటుంబ నాశనానికి దారి తీస్తుందనడానికి దశరథుని ముద్దుల భార్య కైకను ఉదహరణగా చెప్పవచ్చు. పరిచారిక మంథర మాటల వలన తన కుమారుడే రాజ్యాధికారం పొందాలనే కోరికతో తనకు గతంలో దశరథుడు ఇస్తానన్న వరముల ద్వారా రాముని 14 సంవత్సరాలు వనవాసానికి పంపిస్తుంది కైక.

కైక రాముడు మాత్రమే అడవులకు వెళ్ళాలని కోరింది. కానీ భార్య సీత, తమ్ముడు లక్ష్మణుడు కూడా రామునితో పాటు అడవులకు వెళ్ళాలని కోరలేదు. కానీ వీరు రామునితో అడవులకు వెళతారు. దీనికి సరైన వివరణ వాల్మీకి తన రామాయణంలో వివరించేలేదు. కానీ జానపదులు మాత్రం దీన్ని చక్కగా వివరించారు.

సీతాదేవి మహాసాధ్వి. పతి అడుగుజాడల్లో నడవడం ఆమె కర్తవ్యం. అలాగే లక్ష్మణుడు తన తల్లిదండ్రులను అన్నావదినల్లో చూసుకుంటున్నాడు. లక్ష్మణుడికి అన్న అంటే విపరీతమైన ప్రేమాభిమానాలు. అందుకే రామునితో పాటు సీత, లక్ష్మణులు అడవికి వెళ్ళారు. వీరితోపాటు రాముని కన్నతల్లి కౌసల్యకూడా రామునితో వనవాసానికి బయలుదేరుతుంటే రాముడు వారించి వెనుకకు పంపుతాడు. ఈ విధమైన జానపదుల వివరణ అద్భుతం.

## 4.1.సీత

### i. కోపం / అలుక

మానవులలో క్రోధం మూడు అవస్థలలో ఉంటుంది. కోమలావస్థయందు 'కోపము'గా ఉండును. బాహ్య సన్నివేశాల వలన వచ్చే భౌతికపరమైన కోపం ఎక్కువసేపు ఉండదు. రాముడు విసిరిన బంతితో మూర్ఛిల్లిన సీత రాముని మీద కోపంతో అతనిమీద అలిగి రామ మందిరాన్ని వీడి తాను ఏకాంతంగా ఒంటి స్తంభపు మేడలో ఉంటుంది. మగవారి కంటే ఆడవారిలోనే అలిగే మనస్తత్త్వం అధికం. ఇలాంటి మనస్తత్త్వం చిన్నపిల్లల్లో చూస్తాం. వారు తల్లిదండ్రులు తిట్టినా, కొట్టినా అలుక ప్రారంభిస్తారు. ఈ అలుక అన్నం మీదా, వ్యక్తుల మీదా చూపిస్తారు. దీంతో అన్నం తినక పోవడం, తమ అలుకకు కారణమైన వారితో మాట్లాడకపోవడం లాంటి పనులను చేస్తారు. రామునిపై కోపంతో ఉన్న సమయంలో తన దగ్గరకు వచ్చిన చిలుకతో బుర్ర బద్దలు కొడతానని రాముని మీద కోపాన్ని చిలుక మీద చూపిస్తుంది సీత.

### ii. వ్యత్యయీకరణం

వ్యక్తులు అసహనానికి, ఒత్తిడులకు, ఉద్రిక్తలకు గురైన సందర్భంలో దానిని తగ్గించుకొనుటకు తమకు లోబడిన వ్యక్తుల మీద, వస్తువుల మీద కోపాన్ని ప్రదర్శించడం జరుగుతుంది. రామునిపై కోపంతో ఉన్న సమయంలో తన దగ్గరకు వచ్చిన చిలుకతో బుర్ర బద్దలు కొడతానని రాముని మీద కోపాన్ని చిలుక మీద చూపిస్తుంది సీత. ఒక వస్తువు పైకి పంపిన మానసిక శక్తి మరో వస్తువుపైకి మరల్చడం వ్యత్యయీకరణం.

### iii. కోరిక

మనకు నచ్చిన వస్తువులు కావాలనే సంకల్పముతో కోరిక పుడుతుంది. సీత అరణ్యవాస సమయంలో పర్ణశాలలో చూసిన బంగారు లేడి తనకు కావాలని రాముని కోరుతుంది. బంగారు లేడి చిక్కకపోతే దాని చర్మాన్నయినా తీసుకురమ్మని చెబుతుంది. దీన్ని బట్టి ఆమెకు ఆ లేడిపై గల కోరిక వ్యక్తమవుతుంది. తన కోరిక తీరడమే పరమావధిగా ఇక్కడ కనిపిస్తుంది.

## iv. స్వార్థం

ప్రతి మనిషిలో ఉండే స్వార్థ బుద్ధే సీతలోనూ ఉంది. కాబట్టే సీత స్వార్థ బుద్ధితో లోకంలో ఇంతవరకూ ఎవరూ చూడని బంగారు లేడిని చూసి ఆ బంగారు లేడి తనకు మాత్రమే దక్కాలని భావించింది. ఇలాంటి బంగారు లేడి ఇకెవరికీ దక్కరాదనే ఉద్దేశ్యంతోనే కాబోలు శ్రీరామునితో లేడి దొరకకపోతే దాని చర్మాన్నయినా తీసుకురమ్మని పలుకుతుంది.

రామాయణ కథ మొత్తం సీత చుట్టూ తిరుగుతూ, సీత లేకపోతే రామాయణమే లేదన్నట్లు ఉంటుంది కావున రామాయణాన్ని 'సీతాచరిత్ర'గా పేర్కొనవచ్చును బ్రహ్మవైవర్త పురాణంలో సీత చరిత్ర గురించి వివరించబడింది.

కుశధ్వజ మాలావతుల కుమార్తె వేదవతి. ఈమె బాల్యం నుండి విష్ణువును ఆరాధిస్తూ అతనినే భర్తగా పొందాలనుకొంటుంది. కానీ మనం అనుకున్నవి ఏవి ఖశ్చితంగా జరిగాయి చెప్పండి. ఇదీ అలాగే జరిగింది విష్ణువును వివాహం చేసుకోవాలనుకున్న వేదవతిని ఒక రాక్షసుడు వివాహం చేసుకోవాలని భావిస్తాడు. ఇది ఇష్టం లేని ఆమె తల్లిదండ్రులను హతమార్చుతాడు. ఒంటరిదైన వేదవతి రాక్షసుడి బారి నుండి తప్పించుకొని ఒక ఆశ్రమానికి చేరి అక్కడ విష్ణువుకై తపస్సు చేస్తూ ఆకాశమార్గాన విహరిస్తున్న రావణుని కంట పడుతుంది. రావణుడు ఆమె సౌందర్యానికి ముగ్ధుడై ఆమెను బలాత్కరించబోతాడు. రావణుని స్పర్శచే మలినమయిన వేదవతి అగ్నికి ఆహుతైపోతుంది.

కొంత కాలానికి వేదవతి పద్మంలో ఒక పాపగా లంకానగరాంలో జన్మిస్తుంది. ఈమె వల్ల లంకానగరం నాశనం అవుతుందని తెలుసుకొన్న రావణుని భార్య మండోదరి ఆమెను మిధిలానగర సమీపంలో భూస్థాపితం చేయిస్తుంది. కొంతకాలానికి జనకుడు సంతానం కొరకై చేపట్టిన యాగంలో భాగంగా నాగలితో భూమిని దున్నే సమయంలో భూస్థాపితమయిన వేదవతి జనకుని కంటపడి జానకీదేవిగా అవతరిస్తుంది. భూమిలో పుట్టింది కావున భూదేవి పుత్రికగా చెబుతారు. జానకీదేవి బాల్యంలో ఆటలాడుతున్న సమయంలో జనకుని ఇంట ఈశ్వరుని వరప్రసాదమైన శివధనస్సుని అవలీలగా చేపడుతుంది. ఇది చూసిన జనక మహారాజు ఆ విల్లును ఎక్కు పెట్టిన వారికే తన కుమార్తెను

ఇచ్చి వివాహం చేస్తానని స్వయంవరాన్ని ఏర్పాటు చేస్తాడు. ఈ స్వయంవరంలో రాముడు జానకిని అర్థాంగిగా స్వీకరిస్తాడు.

ఈ విధంగా వేదవతి అనేక జన్మలెత్తి తాను కోరుకున్న విష్ణువునే(రాముని) భర్తగా పొందింది.

జానపదులు సీతను 'సీతమ్మ'గా కొలిచారు. రామాయణ గాథలో ఉన్న పాత్రలన్నింటిలో జానపదులను ఆకర్షించిన పాత్ర సీత. భర్త, అత్తమామలు, తోడికోడళ్ళు, బావమరుదులు ఇంకా ఇతరులతో ఎలా మెలగాలో ఈ పాత్ర ద్వారా జానపదులు చాటి చెప్పారు. వాల్మీకి తీర్చిదిద్దిన సీత పాత్రను కొన్ని కల్పనలతో జానపదులు అద్భుతంగా వారి జీవితాలకు దగ్గరగా తీర్చిదిద్దారు. సీత సమర్త, సీతాదేవి కళ్యాణము, సీతమ్మ వారి అలక, సీతాదేవి వేవిళ్ళు వంటి అనేక గేయాలను పరిశీలించినట్లయితే వీరు చేసిన అద్భుత కల్పనలు కనిపిస్తాయి. ఈ గేయముల భావాలు, కథా గమనములన్నీ సామాన్యుల జీవితాలలో నిత్యం జరిగే సంఘటనలే. జానపదులు సీతను ఈ విధంగా తీర్చిదిద్దుటకు కారణం సీతను దేవతగా కాక సీతను సామాన్య గృహిణిగా భావించి ఆమె పాత్రను తమ జీవితాలకు దగ్గరగా తీర్చిదిద్దుకున్నారు. సీతకు సంబంధించిన కొన్ని గేయములను పరిశీలించినట్లయితే ఆమె మనస్తత్వమును తెలుసుకోవచ్చు.

రాముడు సీతపై కోపాన్ని ప్రదర్శించడంతో సీత రామునిపై అలిగి ఒంటి స్తంభపు మేడలో ఒంటరిగా ఉంటుంది.

"ఎట్టనితనకనుల హెచ్చుకోపమ్ము । పూని తన చేనున్న పువ్వుల్లబంతి ।

విసరె సీతమ్మపై విసవిసలు పడుచు । కొమరాలు సీతమ్మ కొమరెక్కగాను ।

ముద్దరాలు సీతమ్మ మూర్చలువోయె । అపుడు రఘురాముండు అందరినిబిలచె। "

మూర్ఛనుండి తేరుకున్న సీత

"మూర్ఛలు తెలిసెను ముద్దరాలు సీత । తన కోపము పట్టలేక తాలేచిపోయి ।

ఒంటి స్తంభము మీది ఒక మేడలోను । పసిడితరిమైన కోళ్ళ పట్టెమంచమున ।" [62]

ఈ గేయంలో సీత రామునిపై అలకను ప్రదర్శిస్తుంది. సహజంగా మగవారి కంటే అలుక ఆడవారికే అధికం. మనసు కలత చెందిన అలుక సహజం. ఇలాంటి అలిగే మనస్తత్వం మనం తరచూ చిన్నపిల్లల్లో చూస్తాం. వారు

తల్లిదండ్రులు తిట్టినా, కొట్టినా అలుక ప్రారంభిస్తారు. ఈ అలుక అన్నం మీదా, వ్యక్తుల మీదా చూపిస్తారు. దీంతో అన్నం తినక పోవడం, తమ అలుకకు కారణమైన వారితో మాట్లాడకపోవడం చేస్తారు. ఇక్కడ సీత అలాగే చేసింది. రాముడు విసిరిన బంతితో మూర్ఛిల్లిన సీత అతనిపై అలిగి రామ మందిరాన్ని వీడి తాను ఏకాంతంగా ఒంటి స్తంభపు మేడలో ఉంటుంది. చేతలలో సీత ప్రవర్తన రామునిపై కొంత అయిష్టతను చూపించినా మనసులో మాత్రం అమెకు శ్రీరామునిపై అమిత ప్రేమ ఉంటుంది. రాముని వద్దకు వెళ్ళాలని ఉన్నా ఆ కోరికను అణచుకొని రామునిపై కోపాన్ని నటిస్తుంది. ఇలాంటి అలకలు ఎక్కువకాలం ఉండవు. ఇలాంటి అలుకలు ఉన్నప్పుడే ఆ బంధం మరింత గట్టి పడుతుంది. అది భార్యా భర్తల మధ్య కావచ్చు, లేదా మిత్రుల మధ్య కావచ్చు.

అలుకతో ఉన్న సీత వద్దకు ఆమె పెంపుడు చిలుక వచ్చిన సమయంలో సీత ప్రవర్తనను క్రిందిగేయంలో చూడవచ్చు.

''పడతిదగ్గరకేగి పాదములవ్రాలె। మ్రొక్కుపుచ్చుకొనదు మొగమెత్తాదాయె।
అదియేమిసీతమ్మ యిదియేమివిధము। కౌసల్యకోడలవు ఘనముగల తల్లి।
భూదేవిబిడ్డ విదబుద్ధినీకు। అనిపలుకుచిలుకతో అనెను సీతమ్మ।
వదరకేవోచిలుక వద్దులెమ్మనకు। తల బగలగొట్టేను తన్ని చంపేను।
పరుగనబోయవే పరగనాచిలుక। పంచటరుగులమీద పడియుండివేచి। ''[63]

అసలే కోపంతో ఉన్న సీత తన దగ్గరకు వచ్చిన చిలుకతో బుర్ర బద్దలు కొడతానని రాముని మీద కోపాన్ని చిలుక మీద చూపిస్తుంది. సహజంగా కోపంతో ఉన్న వ్యక్తులు తమ కోపానికి కారణమైన వ్యక్తులు ఎదుట లేనప్పుడు తమ కోపాన్ని ఆ సమయంలో తమ ఎదుటనున్న వారిపై లేదా అందుబాటులో ఉన్న వస్తువులపై, తమ కన్నా తక్కువ వారిపై చూపిస్తూ ఉంటారు. ఇక్కడ సీత రామునిపై ఉన్న కోపంతో చిలుకపై కోపాన్ని ప్రదర్శిస్తుంది. దాంతో చిలుక అక్కడ నుండి వెళుతుంది. దీనికి తెలుగులో ఒక మంచి సామెత ఉంది 'అత్త మీద కోపం దుత్త మీద చూపించడం'.

సీతలో మనకు వ్యత్యయాకరణ లక్షణాలు కనిపిస్తాయి. ఒక వస్తువు పైకి పంపిన మానసిక శక్తి మరో వస్తువు పైకి మరల్చడం వ్యత్యయాకరణం. మనం అసహనానికి, వత్తిడులకు, ఉద్రిక్తలకు గురైన సందర్భంలో దానిని

తగ్గించుకొనుటకు తమకు లోబడిన వ్యక్తుల మీద, వస్తువుల మీద కోపాన్ని ప్రదర్శించడం జరుగుతుంది. సీత పెంపుడు చిలుక సీత అలుక సంగతి తెలియక ఆ సమయంలో అమె దగ్గరకు వెళ్ళి సీత కోపానికి గురవుతుంది.

సీత కోపానికి గురై తిరిగి వచ్చిన చిలుక లక్ష్మణుని మాటల మేరకు మరళా సీత దగ్గరకు వెళ్ళి ఇలా చెబుతుంది.

''రఘురామువంట్లోను లఘువు తప్పింది
అనగానే సీతమ్మ అతివేగలేచి। ఓ రామచిలుకరో శ్రీరామచిలుక।
పలుకవేవివరమ్ము పల్మారుచిలుక। చిలుక పలుకకయుండె చిత్తరువులాగు।
ఆపై నిభూసుత అంగలార్చుచును। చిలుకరో ఓచిలుక మారామచిలుక।
యెర్రనిముక్కునకు వేయిస్తువెండి। చక్కని రెక్కలకు పయిడిపొదిగిస్తూ।'' [64]

చిలుక సీతతో నీవిక్కడ ఉండటంవల్ల 'రఘురాము వంట్లోను లఘువు తప్పింది' అంటుంది. ఈ విషయం వినగానే సీతకు మనసు నిలువదు. ఎంత అలక ఉన్నా రామునికి వంట్లో బాగాలేదని తెలిసిన వెంటనే బయలుదేరి వెళ్ళాలనిపించడం సీతకు రామునిపై గల సహజ ప్రేమను వ్యక్తపరుస్తుంది. సీత రాముని వివరాలు చెప్పమని చిలుకను అడగగా చిలుక చెప్పకపోవడంతో సీత చిలుక ముక్కుకు వెండి వేయిస్తానని, రెక్కలకు పయిడి పొదిగిస్తానని ఆశపెట్టి రాముని వివరములు తెలుసుకోవాలనుకుంటుంది. తానుపెట్టే ఆశలకు చిలుక తాను అడిగే వివరములకు సమాధానం చెప్పునని సీత అనుకుంటుంది.

మనం ఎవరి వద్దనయినా మనకు కావలసిన సమాచారం కోసం వారికి ధనమో, వస్తువో ఇలా వారి కేది కావాలో తెలుసుకుని వాటిని ఇచ్చి లేదా మన దగ్గరున్నవాటిని కానుకగాయిచ్చి మనకు కావలసిన సమాచారం తెలుసుకుంటాం. ఇక్కడ సీతకూడా అదే చేసింది. ఒక విధంగా దీన్ని మనం లంచమని చెప్పవచ్చు. ఈ విధంగా జానపదులు మూల రామాయణంలో లేని చిలుకరాయబారంను సృష్టించి అద్భుతంగా మలిచారు.

సీత రాముని వనవాస సమయంలో బంగారులేడిని కోరిన విధమును క్రింది గేయంలో చూడవచ్చు.

"రామనోహర రామచంద్రా నాదు కోర్కెలు తీర్చుమా

నాదు కోర్కెలు దీర్చుమా

నాదు కోర్కెలు దీర్చుమా బంగారులేడిని జూడుమా ||రామ||

అదిగో చూడుము ప్రాణనాథా ఎదురుగా లేడున్నదీ

ఎదురుగా లేడున్నదీ

పర్ణశాల సుట్టు తిరిగీ గంతు లేయుచున్నదీ ||రామ||

చెవులు శృంగారంబులు దాని కొమ్ములే విలనంబులు

దాని కొమ్ములే విలనంబులు

ప్రాణముతో లేడిని పట్టి తే మనోహరా - పట్టి తే మనోహరా ||రామ||

చిక్కకున్న దాని చర్మం తీసితే మనోహరా ||రామ|| "[65]

ఈ గేయంలో సీత తాను పర్ణశాలలో చూసిన బంగారు లేడి తనకు కావాలని రాముని కోరుతుంది. బంగారు లేడి చిక్కకపోతే దాని చర్మాన్నయినా తీసుకురమ్మని చెబుతుంది. దీన్ని బట్టి ఆమెకు ఆ లేడిపై గల కోరిక వ్యక్తమవుతుంది. తన కోరిక తీరడమే పరమావధిగా ఇక్కడ కనిపిస్తుంది. లోకంలో బంగారులేడి ఎక్కడా ఉండదు, అలాంటి లేడిని ఎవరూ చూసి ఉండరు. కనుకనే సీత ఆ బంగారు లేడిని పొందాలని భావించింది. ప్రతి మనిషిలో ఉండే స్వార్థ బుద్ధే సీతలోనూ ఉంది. కాబట్టే సీత స్వార్థ బుద్ధితో ఇలాంటి బంగారు లేడి ఇంకెవరికీ దక్కరాదనే ఉద్దేశ్యంతోనే కాబోలు శ్రీరామునితో లేడి దొరకకపోతే దాని చర్మాన్నయినా తీసుకురమ్మని పలుకుతుంది.

జిడ్డు కృష్ణమూర్తిగారు తన 'చేతన' గ్రంథంలో కోరికలను గూర్చి మానవుడు తాను చూసిన అందాలతో ఇంద్రియ జ్ఞానం పొంది, ఆ అందాలు తనకు లేవని తలచి ఆ అందాన్ని కావాలని కోరుకుంటాడు. ఈ గేయంలో సీత కూడా ఇలాగే ప్రవర్తించింది. తాను చూసిన అందమైన లేడిని తాను పొందాలని కోరుకుంది. ఈ కోరికే రావణుడు సీతాపహరణ గావించునట్లుగా చేసి, సీతకు పతీ వియోగాన్ని కలిగించింది.

బంగారులేడి విషయంలో సీత శ్రీరాముని పౌరుషమును రెచ్చగొట్టుటకు క్రింది విధముగా పలుకును

" నీచేతి అంబులు నా చేతికిస్తే - రామా

ఇప్పుడే పోయి మెకము తెచ్చేను"[66]

తాను కోరిన బంగారు లేడిని తీసుకువచ్చుటకు రాముడు సందేహించుటతో సీత రామునితో నీ చేతి విల్లంబులు నా చేతికిస్తే నేను వెళ్ళి ఆ బంగారు లేడిని తెచ్చెదనని పలుకుట రాముని పరాక్రమమును రెచ్చగొట్టటమే. ఈ విధంగా చేస్తే రాముడు బంగారు లేడికై ప్రయత్నిస్తాడని సీత నమ్మకం. అదే జరిగింది కూడా.

శ్రీరాముడు బంగారులేడిని వెంబడిస్తూ అది కనుమరుగవుతున్న సందర్భంలో దానిపై విల్లంబు సంధించుటతో ఆ బంగారు లేడి హా లక్ష్మణ, సీతా అని విలపిస్తుంది. దాంతో సీత ఆ పిలుపువిని తన రామునికి ఏదో ఆపద సంభవించిందని తలచి మరిది లక్ష్మణుని వెళ్ళి చూచిరమ్మని క్రింది గేయంద్వారా తన బాధను వ్యక్త పరుస్తుంది.

"సీత : మరిదీ యటుజనుమీ - మీయన్న కపాయము ఏదో జరిగెను ॥మ॥

లక్ష్మ : అటులనబోకమ్మా మాయన్న కపాయము ఎన్నడు జరుగదమ్మా ॥అ॥

సీ : హాలక్ష్మణ, సీతాయని వినబడే, అక్కట నాథుని కిక్కటు లొదవె ॥మ॥

ల :మాయమాటలమ్మా, నీవుమరిచి ఉండవమ్మా, తొందరేలనమ్మా; మనము భయమందనేలనమ్మా ॥అ॥

సీ : క్రూరుడ లక్ష్మణ ఘోరపుటడవిలో మీరి సతిగను కోరగనుంటివి ॥మ॥

ల : పాపము తల్లిరో ఈ పలుకులిటులన శ్రీపతి జూడగ శీఘ్రమె పోయెద ॥అ॥

సీ : జాగికయేలను యేగుము మరదీ శ్రీపతిని జూడగ శీఘ్రమె వెళ్ళుము ।మ॥ "[67]

ఈ గేయంలో సీత తన మరిది లక్ష్మణునితో శ్రీరామునికి ఏదో ఆపద వాటిల్లినదని వెళ్ళి చూసి రమ్మని చెబుతుంది. కానీ లక్ష్మణుడు ఇదంతా రాక్షసమాయ అని గ్రహించి కొంతసేపు వేచిచూడమని సీతతో విన్నవిస్తాడు. కానీ సీత ఇవేవీ లెక్కచేయక రాముడేలిన సీతను ఏలుకుందామని అనుకుంటున్నావా అను అపవాదును లక్ష్మణునిపై మోపుతుంది. ఆ నిందను భరించలేక లక్ష్మణుడు ఆశ్రమ కుటీరం ముందు మూడు రేఖలను గీసి తాను వచ్చేవరకూ ఆ గీతలను దాటి రావద్దని అన్న వద్దకు బయలుదేరుతాడు.

సీతకు లక్ష్మణుడేంటో తెలిసికూడా అతనిపై ఇంతటి అపవాదు వేయడానికి కారణం ఏమంటే శ్రీరామునకు ఏదో ఆపద సంభవించిన సమయంలో ఇదంతా మాయాజాలమని గ్రహించిన లక్ష్మణుడు అన్న దగ్గరకు వెళ్ళడానికి నిరాకరించడంతో సీత రాముని వద్దకు పంపుటకే ఇంతటి ఘోరమైన అపవాదును వేయాల్సివస్తుంది. అంతేగానీ వేరే ఇతర ఉద్దేశ్యమేమీ లేదని ఈ గేయం చివరలో 'జాగికయేలను యేగుము మరిదీ' అని లక్ష్మణుని మరిదిగా భావించి కర్తవ్యాన్ని బోధించడాన్ని బట్టి మనం గ్రహించవచ్చు.

మనము కొన్ని సందర్భాలలో ఎదుటివారిని కార్యోన్ముఖులుగా చేయుటకై వారిని పరుషంగా మాట్లాడటం, దూషించడం వంటివి చేస్తుంటాము. ఇలా చేయడం ద్వారా వారు ఎదుటివారు చెప్పే పనిని నింద, దూషణల నుండి తప్పించుకొనుటకైనా చేస్తారనే భావన. సీత లక్ష్మణునిపై వేసిన నిందకూడా అలాంటిదే. లక్ష్మణుడు తనను వీడి అన్నవద్దకు వెళ్ళుటకే ఇలాంటి పరుష మాటలు మాట్లాడవలసి వచ్చింది. లక్ష్మణుడు అన్నవద్దకు బయలుదేరిన వెంటనే రావణుడు సీతను అపహరించుకుపోతాడు.

సీత రాముని గురించి విలపిస్తూ ఆలపించిన గేయం

"ఇంకను రాముల కనుల జూసేనా నేను ఈ వనము నుండి వెడలేనా
ఆకట రాములు నన్ను ఆదమర చేనేమోమొ - వకరింట వుండుట ఏలకలిగెనాకు
పాపిష్టి మృగమేల వచ్చెనో - దాన్ని పట్టుక తెమ్మంటి భర్తను
ఆవేల మృగ మెంట సామి పోయుండగ అపుడింత తెలియక ఆపాదపాలైతి
నా ముద్దు మరిది లక్ష్మణుతో నేను సయ్యాస పడితి సద్గురుతో
పురుషుని దేహము పోరుచుండగ నేను చూచి చూచి కనులు మూతలై పోయెను
నన్ను పెండ్లాడిన రాములు - ఏల- నా జాడ తెలియకున్నాడు
ఎన్నాళ్ళు కౌగింటి ఎడబాసి వుందును చూచి చూచి కనులు మూతలై పోయేను" [68]

సీతాన్వేషణ సమయమున ఆంజనేయుడు సీతను గుర్తించడానికి ఆమె సౌందర్యమే సాధనం. ఆమె సౌందర్యమును గుర్చి రాముడు ఆంజనేయునితో ఈ విధంగా చెప్పుచున్నాడు.

"తలలంటు ఆడకే ఆడినట్లుండు

నీలంపు తలకుంచ గలిగుండుగాని

పచ్చి పసుపలదకే అలదినట్లుండు

బంగారమొగచాయ కలదెమాకాంత

పెట్టకను కాటుక పెట్టినట్లుండు

దిద్దక తిలకమ్ము దిద్దినట్లుండు

చేయక శృంగారము చేసినట్లుండు

అలదక పరిమళము లలదినట్లుండు

వేయక తాంబూలము వేసినట్లుండు

పగడంపు ఒకచాయ కలిగుండు కాంతా

మసిపాత గట్టిన మాణిక్యము వలెను

నిగురుపై గప్పిన నిప్పు లాగునను

మేఘములోనున్నసూర్యుని వలెను

మెరుగుజెడి యున్నట్టి అద్దము వలెను

పరమ సతి ప్రభావమెల్ల జెడియుండు

రాహుబట్టిన చంద్రమండలమురీతి " [69]

ఈ గేయంలో సీత అందచందాల గురించి, పాతివ్రత్యం గురించి చెప్పబడింది. సీత అంగాంగ వర్ణన చేయక, జానపదులు అమె అంతఃసౌందర్యం వర్ణించిన తీరు అద్భుతము. రాముడు గేయం చివరలో సీత గురించి 'పరమసతి' అని చెప్పడాన్ని బట్టి రామునికి సీత పాతివ్రత్యం గురించి తెలిసి ఆమె పాతివ్రత్యాన్ని చెప్పుటకు ఈ గేయాన్ని ఆధారంగా చేసుకొన్నాడని అనిపిస్తుంది.

'కుశలవులకుచ్చ' అను గేయంలో సీత రావణుని జనకునిగా, 'సీతచెఱ' అను గేయంలో అన్నగా భావిస్తుంది. భారతీయుల సంప్రదాయం ప్రకారం పురుషుని తండ్రిగా, స్త్రీని తల్లిగా భావించాలి. దీనికి వ్యతిరేకంగా ఎవరు నడుచుకున్నా వారి నాశనము తప్పదని రావణుని పాత్రనిబట్టి తెలుస్తుది. పరకాంతా వ్యామోహుడైన రావణుడు రాముని చేతిలో మరణించుటే ఇందుకు చక్కని ఉదాహరణ.

సీతను రావణుడు అపహరించు సమయమున సీత రావణుని క్రింది విధంగ హెచ్చరిస్తుంది.

"భూమిపైనున్న భూపుత్రిజూచి । గడ్డపెల్లాగించి రథముపైబెట్టి ।

పగతీరె నని తలచి గగనమునకకెగిరి । యేగుచుండగ మూర్ఛ దెలిసిజానకి ।

సీరాము సతినయ్య సీత నాపేరు । అమరంగ దశరథుని కనుగు కోడల్ని।

కూర్మితో జనకునీ ముద్దు కూతురినీ । లక్ష్మణుని వదిననూ లక్ష్మి దేవంద్రు ।" [70]

ఈ గేయంలో రావణుడు సీత నిలుచున్న భూమితో సహా పెకళించి తీసుకుపోతాడు. ఇక్కడ మనకు సీత ప్రాతివత్య మహిమ కనబడుతుంది. దుర్బుద్దితో ఉన్న రావణుడు సీతను కనీసం స్పృశించే సాహసంకూడా చేయలేక పోయాడు. ఇక్కడ మరోవిషయం చెప్పవలసి వస్తుంది. సీతను రావణుడు తన లంకానగరమునకు తీసుకెళుతున్న సందర్భంలో తాను రాముని పత్నిననీ, దశరథుని కోడలిననీ, లక్ష్మణుని వదిననీ, జనకుని కుమార్తెననీ అనేక విధలుగా తన గురించి చెబుతుంది. ఈ విధంగా తన పరిచయాన్ని చెయ్యడాన్ని బట్టి మహా పరాక్రములైన తన వారికి ఈ విషయం తెలిసినచో రావణునికి ఆపదని చెప్పడం. అలాగే తాను ఎవరో తెలియకనే రావణుడు ఇట్టి దురాగతానికి ఒడిగట్టాడనీ, తన వారి పరాక్రమములు తెలిసికొనినచో అతను ఆమెను విడుచుననే భావన సీతలో ఉందని ఈ గేయంలో ఆమె తనవారి గొప్పదనాన్ని చాటిచెప్పిన విధానం వల్ల తెలుస్తుంది. సీత ఎన్ని చెప్పినా లాభం లేకపోయింది. రావణుడు సీతను తన లంకానగరానికి తీసుకువెళ్ళి తనను వివాహమాడడానికి అంగీకరించక పోవడంతో సీతను అశోక వనంలో బంధీ చేస్తాడు.

శ్రీరాముడు రావణుని సంహరించి అతని సోదరుడు విభీషణుని పట్టం గట్టి, విభీషణునితో సీతను తీసుకురమ్మనగా విభీషణుడు రామునితో సీతను మునుపటి రూపంతో తీసుకురానా లేదా ఇప్పటి రూపంతో

తీసుకురానా అని ప్రస్తుతం సీత రూపాన్ని గురించి వివరించగా రాముడు మునుపటి రూపంతోనే తీసుకురమ్మనడంతో విభీషణుడు అంతఃపురమున పరిచారికలతో సీతకు మంగళ స్నానలు చేయించి, ఆభరణములతో అలంకరించి రాముని వద్దకు  తీసుకెళ్ళే సమయంలో సీత

"నిలువుటద్దముజూచి అతివ చింతించె । రారాజు తన్నింక నమ్మడని పల్కె

నాకు ఆభరాలు యేల యిచ్చితిరీ । దేవర నమ్మించ వచ్చునోలేదో" [71]

అని అంటూనే రథముపై బయలుదేరి రాముని వద్దకు చేరి పాదముపై బడినంత రాముడు సీతతో పరుషమయిన మాటలను మాట్లాడగా సీత  మాటలకు మూర్చపోవడంతో రాముడు సీతను విడచి అక్కడి నుండి రథముపై బయలు దేరుతుండగా, స్పృహలోకి వచ్చిన సీత రాముని నిలుపుటకు

"పోకు పోకు రామ పుణ్యశ్రీరామ

ముగ్గురన్నదమ్ముల ఆనసుమ్మనెను

అందరి ఆనకు నిలువకారథము

యెగిరిపోతూవుండె నంతరిక్షముకు

పోకు పోకు రామ పుణ్యశ్రీరామ

భూదేవి పుత్రికను జనక కన్యకును

నాయాన  అనిపల్కె సీతమహాదేవి

పరమ పతివ్రత సీతపై యాన బెట్ట

పంకజనాభులరథము కదలాదు" [72]

ఈ విధంగా సీత శ్రీరాముని రథమును నిలిపినది.  తరువాత అనేక వాగ్వివాదాల తరువాత రాముడు సీతను అగ్ని ప్రవేశం చేయమనగా సీత  అందుకు అంగీకరించి అగ్ని ప్రవేశంచేసిన సీత అగ్నిని జయిస్తుంది. కానీ రాముడు అదంతా ఆడవారి మాయ యనగా అగ్నిహోత్రుడు రౌద్రరూపం ధరించగా భూదేవి, దశరథుడు వచ్చి సీతను స్వీకరింపమని, లేకపోతే మనకు నాశనం తప్పదని వివరించి సీతారాములను ఏకం చేసిరి.

సీతారాములు 14 సంవత్సరాలు ముగించుకొని అయోధ్యకు తిరిగివచ్చిన తరువాత సీత రామునితో ఊర్మిళ గురించి ప్రస్తావిస్తూ

"దేవదేవేంద్ర వినుమా । విన్నపము తెలిపేను చిత్తగింపు।
ధరణీశు డవతరించ। ఒక చిన్న మనవి కద్దనిపలికెను।
ముందు మనమడవులకును। పోగానుముద్దు మరదివెంటనూ।
పయనమైరాగ జూచి తన చెలియ । పయనమాయెను ఊర్మిళా।
వద్దు నీవుండమనుచు సౌమిత్రి। మనల సేవింపవచ్చే।
నాడుమొదలు శయ్యపై కనుమూసి। నాతి పవళించుచున్నది।
యికనైనయానతిచ్చీ తమ్ముని। యిందుముఖి కడకంపుడి।
ప్రాణపత్ని యీలాగున కూర్మితో। పలుకంగ వినిరాముడు।
తలపోసి చూడ నెంతే తనమదికి। తగు విచారము బుట్టెను।
ఆశ్చర్యపడి రాముడు గ్రక్కున। అన్న లక్ష్మణ రమ్మనె।
రమ్మి లక్ష్మణ గ్రక్కున యుచితమా। రమణినెడబాసి యుంట।
తడవాయెయికనైనను ప్రియురాలి। దగ్గరకు నీవు బోయి।
సరస సల్లాపములచే దుఃఖోపశ్రమలెల్ల మాన్పవయ్యా। " [73]

ఈ గేయంలో సీత రామునితో ఊర్మిళ గురించి విన్నవిస్తుంది. ఊర్మిళ లక్ష్మణుడు మనతో అడవులకు వచ్చు సమయంలో తానూ లక్ష్మణునితో రావడానికి సిద్ధపడగా లక్ష్మణుని మాటకు కట్టుబడి అంతఃపురముననే నేటి వరకూ ఘాడ నిద్రలో నున్నది. ఇకనైన తమ్ముని ఊర్మిళ వద్దకు పంపమనగా శ్రీరాముడు లక్ష్మణుని ఊర్మిళ వద్దకు వెళ్లమని చెప్పెను.

సీత ఈ విధంగా పలుకుటకు కారణాలను గమనించిన, లంకలో సీత రాముని వీడి అనుభవించిన విరహాబాధను తెలుసుకొన్నదై ఊర్మిళ కూడ అలాంటి బాధనే అనుభవించుచున్నదని తలచి రామునితో ఈ విధంగా పలికెను.

శ్రీరామ పట్టాభిషేక సమయంలో లక్ష్మణుడు పక్కున నవ్వడంతో అక్కడ ఉన్న వారందరు తమలో తాము తమను చూసే లక్ష్మణుడు నవ్వాడని అనుకుంటారు. 'స్త్రీల రామాయణపు పాటలు' లో 'లక్ష్మణదేవర నవ్వు' అను గేయంలో సీత ఇలా అనుకుంటుంది.

"కారడవిలో దశకంఠుని చేత
పట్టుబడ్డట్టి సతి తొడల మీద
పెట్టుకొనియున్నాడు సృష్టీశ్వరుడనుచు"

పై కారణం చేతనే లక్ష్మణుడు నవ్వాడని సీత అనుకుంటుంది.

మానవుని జీవితంలో కష్టసుఖములు సహజము. సుఖాలకు పొంగి, కష్టాలకు కృంగిపోవడం మానవుని సహజ మనస్తత్వం. ఇలాంటి మనస్తత్వం పురుషులలో కంటే స్త్రీలలో అధికంగా ఉంటుంది. ఈ మనస్తత్వం సీతలో కూడా మనకు కనిపిస్తుంది. తమ కష్టములకు కారణమైన కైకను నిందించడాన్ని క్రింది గేయంలో గమనించవచ్చు.

"ఇట్టి రాళ్ళలోను శిలలలోను
యెట్లు నడువంగ బంపెనే మీకైకమ్మ
తాను నడచిన తెలియుగాని కష్టములు
హంసతూలిక శయ్యనందు బరుండి
ఏ నాడు పతి యన్న కానిమాటలను బట్టి
మనల నడవి పట్టమని చెప్పి
పిల్లల తల్లికి ప్రేమ యిట్లుంట
నేలోకమున లేదు యీ లోకమందె " [74]

పై విధంగా సీత తమ వనవాసానికి కారణమయిన కైకను నిందిస్తుంది. లోకంలో సహజంగా అత్తాకోడళ్ళ మధ్య సంవాదాలుంటాయి. సీతకు కైక కూడా అత్త అగుటచే సామరస్యము తక్కువగుట వలన అత్తను కోడలు నిందించునట్లు సీత కైకను నిందించుట గమనించవచ్చు.

రాముని దక్కించుకోవాలనే ఉద్దేశ్యంతో శూర్పణఖ యతివేషంలో సీతను కలిసి రావణుని రూపురేఖలను చిత్రపటంగా వేయమనగా సీత ఈ క్రింది విధంగా పలుకును.

" పదినెలలు చెరనుంటినిగాని । పాపకర్ముని కన్నులచూడ ।

జనకునిగా భావిస్తినినేను । అంగుష్ఠమొక్కటి యెరుగుదును। " [75]

సీత మాటలను బట్టి పదినెలలు చెఱనున్నా తను రావణుని జనకునిగానే భావించానంటుంది. రావణుని రూపాన్ని గురించి తనకు ఏమాత్రం తెలియదంటుంది. కేవలం అతని వేలు మాత్రమే తెలియునని అంటుంది.

రావణుడు సీతను బలవంతంగా లంకకు తీసుకువచ్చాడు. సీతను రాముని నుండి దూరం చేసి ఆమెకు పతివియోగాన్ని కలిగించిన పాపాత్ముడు రావణుడు. అలాంటి వాడి చేష్టలే కాకుండా అతని మొహం చూసినా పాపమని తలచినట్లుంది సీత. అందుకే అంతకాలం లంకలో ఉన్నా రావణునిరూపాన్ని కూడా చూడలేదు.

యతివేషంలో ఉన్న శూర్పణఖకు రావణుని వేలును వేసివ్వడంతో మిగలిన రూపాన్ని శూర్పణఖ పూరించి ఆ బొమ్మకు బ్రహ్మచే ప్రాణం పోయించుకుని ఆపటమును తిరిగి సీతకే అందజేస్తుంది. అప్పటి నుండి అ బొమ్మ రావే లంకకు పోదాము అంటూ సీతను ఇబ్బందిపాలు చేస్తుంది. ఇలాంటి సమయంలో వేటనుండి రాముడు రాజ్యానికి తిరిగివచ్చి రావణుని పటాన్ని చూసి సీతను అనుమానించి సీతను వధించమని లక్ష్మణునితో చెప్తాడు. కానీ లక్ష్మణుడు సీతను అడవులలో వదలివేసెను. [76]

లక్ష్మణుడు సీతను అడవులకు తీసుకెళ్ళి ఆమెను వధించే సమయంలో సీత మరిదితో ఈ క్రింది విధంగా పలుకుతుంది.

"ఎన్ని జన్మములు ఎత్తియైనాను ।కూరిమిజనకుల గూతురినౌదు।

ఏడుజన్మములు ఎత్తియైనాను । కూరిమిదశరథుల కోడలినౌదు ।

కోటిజన్మములు యెత్తియైనను । కౌసల్యకైకకు కోడలినౌదు ।

కడలేనిజన్మములుయెత్తియైనాను । సూమిత్రకోడలినయ్యెదనేను।

పదివేలాజన్మములనయినా । భరతశతృఘ్నుల వదినెఅవుదు।

లక్షవేలజన్మములనయినా। లక్ష్మణునకు వదినెనౌతానపుడు।

సహస్రజన్మములయెత్తియైనాను । శాంతకు మరదలినయ్యేద నేను।

గోటివేల జన్మములనైనా । గోవిందునిభార్యనుయపుడు। " [77]

పై గేయంలో సీత తాను ఎన్ని జన్మలకయినా జనకునికి కుమార్తెగా దశరథుడు, కౌసల్య, సుమిత్ర, కైకలకు కోడలిగా లక్ష్మణ, భరత, శత్రుఘ్నులకు వదినగా శాంతకు మరదలిగా గోవిందునికి భార్యగానే పుడతానని లక్ష్మణునితో అంటుంది. సీతను 14 సంవత్సరాలు అడవికి పంపినకైకకు కోడలిగా పుట్టాలని అనుకోవడం అగ్నిప్రవేశం చేయించి, నేడు తనకు మరణదండన విధించిన రామునికే మరల భార్యగా పుట్టాలనుకోవడాన్నిబట్టి సీత అనుభవించిన కష్టాలన్నీ కైక వలనగానీ, రాముని వలనగానీ తనకు కలుగలేదనీ అవన్నీ విధిరాతేనని అనుకున్నది కాబోలు.

సీతలో తనవారిపట్ల ఎలాంటి కోపమూ లేదనటానికి అమె ఇలా కోరడమే నిదర్శనం. సహజంగా ఎవరైనా ఇలాంటి కష్టాలు అనుభవించాక మరే జన్మలోనూ అలాంటి వారికి బిడ్డగానో, భార్యగానో, కోడలిగానో పుట్టరాదనుకుంటారు. కానీ సీత అలా అనుకోకుండా మరల రామునికే భార్యనవ్వాలనుకోవడంలోఆమె ఉదాత్తత కనిపిస్తుంది.

సీతను అడవులలో వదిలి వెళ్ళాక, వాల్మీకి ఆశ్రమంలో లవకుశులకు జన్మనిస్తుంది. రాముని అశ్వమేధయాగ నిమిత్తం లవకుశులతో యుద్ధం చేయు సందర్భంలో సీత లవకుశులను తమ కుమారులుగా పరిచయంచేసి వారిని రామునికి అప్పగించి తాను భూదేవి ఒడిలో లీనమైపోతుంది.

## 4.2.ఊర్మిళ

### i. సుప్తచేతన

మనం నిద్రించే సమయంలో సెన్సారింగ్ యంత్రాంగం నిద్రపోతుంది. దీంతో అణచివేయబడిన కోరికలు కలల రూపంలో వస్తాయి. అయితే ఈ కలలు మనకు ఉన్న కోరికను స్పష్టంగా తెలియజెప్పవు. దీన్ని మనము Dream of symbalism అంటాము. ఇలా కలలో సభ్యసమాజం అంగీకరించని కోర్కెలను అణచివేసుకుంటారు. దీని ద్వారా వ్యక్తులు జాగృతవ్యవస్థ(చేతన)లో విచిత్రంగా ప్రవర్తిస్తుంటారు. ఊర్మిళ కూడా ఇదే విధంగా లక్ష్మణుడు వచ్చినప్పుడు నిద్రనుండి మేల్కొని విచిత్రంగా ప్రవర్తిస్తుంది.

**ii.మూర్తిమత్వం**

వ్యక్తుల మూర్తిమత్వం వారి బాల్యంలోనే రూపొందుతుంది. వ్యక్తుల చిన్ననాటి అనుభవాలు, పద్ధతులు, మనస్తత్త్వం వారి జీవితంలో ప్రభావాన్ని చూపుతాయనుటకు ఊర్మిళ పాత్రే నిదర్శనం. ఊర్మిళ సుకుమార స్వభావి, మితభాషి. ఊర్మిళ ఎక్కువగా ఏకాంతాన్ని కోరుకునేది. ఎవరితోను మాట్లాడేది కాదు. తన మనసుతోనే తాను అధికంగా మాట్లాడుకునేది. తన మనసే తన నేస్తం. ఇలాంటి స్వభావం వల్లే అమె ఎలాంటి త్యాగాన్నయినా, చేయగలిగి, ఎంతటి కష్టాన్నయినా భరించగలుగుతుంది. బాల్యంలో ఊర్మిళలో రూపొందిన స్వభావమే లక్ష్మణుని రామునితో అడవులకు పంపుటకు అంగీకరించేలా చేసింది.

భర్తల పేరు ప్రతిష్ఠల వెనుక భార్యల త్యాగాలు ఉన్నాయనుటకు ఊర్మిళ ఒక ఉదాహరణ. కానీ మనం ఊర్మిళను మరచి లక్ష్మణుడి గురించే అలోచిస్తాం. పెళ్ళైన కొద్ది రోజులలోనే భర్తను వీడి 14 సంవత్సరాలు ఉండటమనేది ఊర్మిళకే సాధ్యమైంది. ఊర్మిళ లక్ష్మణుని రామునితో పంపించకుంటే కథ మరోలా ఉండేది.

జనక మహారాజు లక్ష్మీదేవిని కుమార్తెగా పొందాలని యాగం చేయగా ఆ యాగ ఫలితంగా సీత(లక్ష్మీదేవి) భూగర్భమున జనకుని కుమార్తెగా వెలసినది. అప్పటి నుండి జనకుడు సీతకు ఇచ్చినంత ప్రాధన్యం తన (ఊర్మిళ, మాళవి, శ్రుతకీర్తి) కుమార్తెలలో ఎవ్వరికీ ఇవ్వలేదు. అన్ని విషయాలలో సీతకే అగ్రస్థానం. ఇలాంటి వాతావరణం మధ్య ఊర్మిళ తన తండ్రిపై సీతపై ఎటువంటి ద్వేషాన్ని పెంచుకోక తండ్రిపై గౌరవాన్ని కలిగి, సీతపై ప్రేమాభిమానాన్ని పెంచుకుంది. ఊర్మిళ సహజంగా సుకుమార స్వభావి, మితభాషి. ఊర్మిళకు ఎక్కువగా ఏకాంతం అంటేనే ఇష్టం. ఊర్మిళ ఎక్కువగా ఎవరితోను మాట్లాడేది కాదు. తన మనసుతోనే తాను అధికంగా మాట్లాడుకునేది. తన మనసే తన నేస్తం. ఇటువంటి స్వభావం వల్లే అమె ఎలాంటి త్యాగాన్నయినా చేయగలిగి, ఎంతటి కష్టాన్నయినా భరించ

గలుగుతుంది.[78]

ఊర్మిళ, మాళవి, శ్రుతకీర్తి లక్ష్మణ, భరత, శత్రుఘ్నులను వివాహమాడారు. సీతారాములతో వనవాసానికి వెళ్ళిన లక్ష్మణుని నిద్రను తీసుకొని తన నిద్రతో భర్త నిద్రతో ఊర్మిళ లక్ష్మణుడు వనవాసాన్ని పూర్తి చేసుకొని తిరిగి వచ్చేవరకు నిద్రిస్తూనే ఉంది. ఈ అంశాన్ని తీసుకొని జానపదులు 'ఊర్మిళాదేవి నిద్ర' అని అనేక గేయాలు రచించారు.

ఊర్మిళ లక్ష్మణుడి అరణ్యవాస సమయము నుండి జాగ్రదావస్థలో నున్నది కావున ఆమెకు బహ్యా ప్రపంచం గురించి ఏదీ తెలియదు. ఈ సమయంలోనే అరణ్య వాసాన్ని ముగించుకొని సీతారాములు, లక్ష్మణుడు రాజ్యానికి తిరిగివస్తారు. లక్ష్మణుడు శ్రీరాముని ఆజ్ఞమేరకు ఊర్మిళ అంతఃపురానికి బయలుదేరి, అక్కడ ఊర్మిళ నిద్రావస్థను గమనించి ఆమెను బాహ్య ప్రపంలోనికి తీసుకురావడానికి ఆమె తనువుపైనున్న పచ్చడమును తీసివేయుటతో ఊర్మిళ తపస్సు భంగమైన మునిలా లేచినది. కానీ ఆమె నిద్రమత్తు ఇంకా తొలగలేక పోవుటతో వచ్చినది లక్ష్మణుడని తెలియక

" అయ్య మీరెవ్వరయ్యా - మీరింత - యాగడమ్మున కొస్తిరీ
దారిగొందులు వెదకుచూ - మీరింత - తప్పుసేయగ వస్తిరీ
ఎవ్వరూ లేని వేళా- మీరిపుడు -ఏకాంతమున వస్తిరీ
మా తండ్రి జనకరాజూ, వింటేను -మర్యాద మరి దక్కదూ
మాయక్క బావ విన్నా - మీకపుడు - ప్రాణముల హానివచ్చూ
మాయక్క మరిది విన్నా - మిమ్మిపుడు - మనగనీయరు జగతిలో
హెచ్చైన వంశానికీ- అపకీర్తి -వచ్చె నేనేమిసేతూ
కీర్తిగల యింటబుట్టీ - అపకీర్తి - కీడయ్యె - నేమిసేతూ "[79]

నిద్రావస్థలో ఉన్న ఊర్మిళకు బాహ్య ప్రపంచంతో ఎలాంటి సంబంధము లేదు. బయటి విషయాలు ఆమెకు ఏమీ తెలియదు. లక్ష్మణుడి 14 సంవత్సరముల అరణ్యావాసం వరకూ నిద్ర మత్తులోనే ఉంది. కాబట్టి ఊర్మిలకు వచ్చినది లక్ష్మణుడని తెలియక ఈ విధంగా పలికినది. తన అంతఃపురములోకి ఎవరో పరపురుషుడు వచ్చాడనీ తలచి తన వారి గురించి, వారి పరాక్రమము గురించి చెప్పి తన గతికి బాధ పడుతుంది. ఈ గేయంలో 'మాయక్క మరిది

విన్నా - మిమ్మిపుడు - మనగనీయరు జగతిలో' అను మాటల్లో మాయక్క మరిది అన్న సీత మరిది లక్ష్మణుడే. ఉర్మిళ ఇలా పలుకుటకు గల కారణాన్ని గమనించిన ఆనాడు జానపద స్త్రీలు తమ భర్తను పేరు పెట్టి పిలిచేవారు కాదు. ఎదుటి వారితో వారికున్న సంబంధాన్ని బట్టి మీ తమ్ముడనో, మీ అన్న అనో పిలిచేవరు. ఉర్మిళకు సంతానము కూడా లేదని ఈ మాటల వలన తెలుస్తుంది. కుమారులుగాని, కుమార్తెలుగానీ ఉన్నట్లయితే వారి పేర్లు చెప్పి వాళ్ళ నాన్నగారు అని చెప్పి ఉండేది. తనకు సంబంధించి ఉన్నది తన సోదరి సీత. అందుకే సీత మరిది అని పలికినది.

లక్ష్మణుడు తన ఉనికిని చాటుటకు ఊర్మిళతో

"శ్రీరాముతమ్ముండనే అతడనగ । సృష్టిలో నొకరుగలరా ।
జనకులల్లునిగానటే భూమిలో । జనకులనగానెవ్వరు ।
శతపత్రములో బుట్టినా చేడెరో । సీతకు మరదిగాన ।
సీతయనగానెవ్వరూ సృష్టిలో । సృష్టిశనేనుయెరుగా ।
భూమి నూర్మిళవందురే । నీపేరు బొంకకు యీపట్లను
దశరథుల నెడబాసియు । అక్కడజానకీ చెరబోయెను ।
రావణునిసంహరించీ ఆసీత । దేవితోడుకు వస్తిమి ।
చేకొన్న యిందు వదనాలోకాప । కీర్తికేలోనాదు ।
సీత మరదిని గానటే చేడెరో । దయయుంచి మేలుకొనవే । " [80]

పై గేయంలో లక్ష్మణుడు తన ఉనికిని చాటుటకు తాను శ్రీరాముని తమ్ముడననగా ఊర్మిళ సృష్టిలో రాముని తమ్ముడనువారు కలరాయని అంటుంది. లక్ష్మణుడు జనకునికి అల్లుడను అని చెప్పినా ఊర్మిళ జనకులనగానెవ్వరని అంటుంది. లక్ష్మణుడు సీతకు మరదిని అనగా ఊర్మిళ సీత యనగా నెవ్వరని అంటుంది. ఈ విధంగా ఉర్మిళ తన కెవరూ తెలియనట్లు ప్రవర్తించడానికి కారణం 14 సంవత్సరాల నుండీ ఆమె నిద్రిస్తూ ఉండడమే కారణం.

ఊర్మిళలో మనకు ఫ్రాయిడ్ సిద్ధాంతాలు కనిపిస్తాయి. ఫ్రాయిడ్ మనిషి మనసులో సుప్తచేతన అనేది అంధకారంతో నిండి అన్నింటికంటే చివర ఉంటుందంటాడు. సమాజానికంటూ కొన్ని కట్టుబాట్లు, అలవాట్లు, పద్ధతులు

ఉంటాయి. వీటిని ఎవరు మితిమీరినా సమాజం అందుకు అంగీకరించదు. మనం నిద్రించే సమయంలో సెన్సారింగ్ యంత్రాంగం నిద్రపోతుంది. దీంతో అణచివేయబడిన కోరికలు కలల రూపంలో వస్తాయి. అయితే ఈ కలలు మనకు ఉన్న కోరికను స్పష్టంగా తెలియజెప్పవు. దీన్ని మనము Dream of symbalism అంటాము. ఇలా కలలో సభ్యసమాజం అంగీకరించని కోర్కెలను అణచివేసుకుంటారు. దీని ద్వారా వ్యక్తులు జాగ్రదవస్థ (చేతన)లో విచిత్రంగా ప్రవర్తిస్తుంటారు. ఊర్మిళ కూడా ఇదే విధంగా లక్ష్మణుడు వచ్చినప్పుడు నిద్రనుండి మేల్కొని విచిత్రగా ప్రవర్తిస్తుంది.

పై గేయంలో రావణుడు సీతను అపహరించుకుపోయాడని లక్ష్మణుడు ఊర్మిళకు చెప్పగానే ఊర్మిళ తనవారి పరాక్రమముల గురించి క్రింది విధంగా పేర్కొంటుంది.

"సింహవిక్రములు మీరూ - ఉండగా - సీతెట్లు చెరబోయెనూ?
రాజ్యాధిపతులు మీరూ - ఉండగా - రమయెట్లు చెరబోయెనూ?
రామలక్ష్మణులు మీరూ - ఉండగా - రమణెట్లు చెరబోయెనూ? " [81]

ఈ గేయాన్ని బట్టి ఊర్మిళ మనసులో తమవారిపట్ల తనకున్న గొప్పహృదయము తెలుస్తుంది. పరాక్రమవంతులు రామలక్ష్మణులుండగా సీతను రావణుడెలా అపహరించెనంటుంది. ఊర్మిళకు రామలక్ష్మణుల శక్తి సామర్థ్యాలేంటో తెలుసు కాబట్టే ఇలా అంటుంది. రావణుడు సీతను అపహరించునప్పుడు మీరేమి చేసున్నారనే భావనకూడా కనిపిస్తుంది. మీ శక్తి సామర్థ్యాలు చూపి సీతాపహరణను నిలుపలేకపోయరా అనే ఆవేదన ఊర్మిళలో కనిపిస్తుంది.

ఇలా లక్ష్మణు సీతాపహరణ గురించి, రావణ సంహారం గురించి, సీతను అయోధ్యకు తీసుకురావడం వంటి ఘట్టాలెన్ని చెప్పినా ఊర్మిళ లక్ష్మణుని గుర్తించక పోవడంతో చివరకు లక్ష్మణుడు

"నిన్ను బాసినది మొదలూ ప్రాణసఖి । నిద్రహారము లెరుగనే ।
నీవులేకయున్నను ఓసఖి । ప్రాణములు నిలుపలేనే ।
అనుచుకన్నుల జలములుకారంగ । లక్ష్మణుడుతాబలికెను ।
కత్తివరదీసి యపుడులక్ష్మణుడు । తావేసు కొందుననెను ।

అనుచు వాదము సేయకా । ఊర్మిళ దద్దిల్లిపడిలేచెను ।

ప్రాణేశుడగుట దెలసికోమలికి । ప్రాణములు తేజరిల్లే ।

పతిపాదపద్మములకు అపుడూ । పంకజాక్షిమొక్కెను ।

పాదములపయినియున్న । తన సతిని కరమునాలేవనెత్తి ।

గ్రుచ్చి కౌగిట చేర్చుకుకాంతకు । కళ్ళ జలములు దుడిచెను । "[82]

ఈ గేయంలో లక్ష్మణుడు ఊర్మిళతో నిన్ను వదలివెళ్ళింది మొదలు నిద్రాహారాలెరుగనని, నీవు లేనిదే ప్రాణాలు నిలుపలేనని కన్నీరొలుకుతూ పలికెను. లక్ష్మణుడు కత్తిని తీసి ప్రాణ త్యాగమునకు సిద్ధపడటంతో లక్ష్మణుని మాటలనుబట్టి లోకంలో 14 సంవత్సరాలు నిద్రాహారాలు లేక అన్నావదినలకు సేవలందించింది లక్ష్మణుడొక్కడే కావున వచ్చినది లక్ష్మణుడేనన్న విషయాన్ని గుర్తించి ఊర్మిళ ఉలిక్కిపడిలేచి లక్ష్మణుని చూసి అతని పాద పద్మములకు నమస్కరించి కౌగిట చేరెను. మరోవిధంగా పరిశీలించిన లక్ష్మణుడు ఖడ్గమును తీసి ప్రాణ త్యాగానికి సిద్ధపడడంతో పతిపై ఉండే సహజానురాగంతో తన పతికేమైనా అవుతుందేమోనన్న భయంతో, ప్రేమతో లక్ష్మణుని ప్రయత్నాన్ని నిలుపుటకు తాను నిద్దురమత్తు నుండి తేరుకొని లక్ష్మణుని గుర్తించి పాదాలచెంత చేరింది.

శూర్పణఖ మాయచే రాముడు సీతవద్ద రావణుని చిత్రపటమును చూసి ఆమెను అనుమానించి సీతకు మరణశిక్ష విధించమని లక్ష్మణుని పిలవడంతో

"నిద్రించుచున్న లక్ష్మణుడు లేచె । యెదపై యూర్మిళ నప్పుడుదీసి ।

పరుపుపైనుంచెను లక్ష్మణుడు । అంతలోన నూర్మిళ దిగ్గునలేచి ।

లక్ష్మణునిపాదపద్మములబడెను। సీతకు నేరములేదుజూడుడి।

సీతనుగావుమశీఘ్రమ్మనను। సీతయేమినేరమ్ములుయేమే।

కాచుటయేమిటిచెప్పవునాతొ।అలనాడుమీరంపినఅసుర।

ఒనరుగరావణపటమువ్రాసె।రావేపోదాములంకకు అనుచు।

సీతనుబట్టుక ఆపదబెట్టె। రాముడాజ్ఞకుజగములు వణకును।

రాఘవులపై ఆనవుంతము। కేశవులపైఆనవుంచితే ।

హంసతూలికా తల్పము నుండె। చూచిరిగాబోలు రాఘవులును।

చంపదలచిరతి సాహసముననను । సీతను చంపనుఅంటేగాని ।

పాదములు విడువను ప్రాణేశ్వరుడ । రాముడినిలప బ్రహ్మకువశమ।

కారణమేలాగున కాదలచిందో । అప్పటికదియెట్లయ్యెనొకాని।

ఇప్పుడు పాదములు విడువవెయనెను । ” [83]

ఈ గేయన్ని బట్టి ఊర్మిళకు అక్కమీదున్న ప్రేమ వ్యక్తమవుతుంది. అలనాడు మీరు పంపిన యతి సీత సాయంతో రావణుని పటమును చిత్రించించి సీతకు ఇచ్చిందని సీతకూ ఆ పటమునకు ఎలాంటి సబంధమూలేదనీ లక్ష్మణునికి జరిగిన విషయాన్ని చెప్పి సీత నిర్దోషని లక్ష్మణుని పాదములపైబడి, రాముని ఆజ్ఞకు లోబడి సీతను చంపనని మాటిస్తే లక్ష్మణుని పాదాలు వీడుతానంటుంది. కానీ లక్ష్మణుడు రాముని నిలుప ఎవరితరం కాదనీ జరిగేది జరుగుతుంది ముందు నా పాదాలు వదలమనగా అప్పటికి ఊర్మిళ భర్త పాదాలను వదులుతుంది.

ఊర్మిళకు లక్ష్మణుడు రాముడేమిచెప్పినా మారుమాట్లాడకుండా ఆ పనిని చేస్తాడనే నమ్మకం అమెలో బలంగా ఉంది. ఒక వేళ రాముడు సీతకు మరణశిక్షను విధిస్తే లక్ష్మణుడు రాముని మాటకు ఎదురుచెప్పక శిక్షను అమలు చేస్తాడనే భయంతో ఉంటుంది. అలాగే ఊర్మిళ రాముడు సీతపై వేసిన నింద నిజంకాదనీ, అదంతా యతి వలన జరిగిన కార్యమని తెలుసు కాబట్టి నిర్దోషిని రక్షించాలనే భావన అమెలో కనిపిస్తుంది. సీత అరణ్యవాసం సమయంలో, రావణుని లంకలో ఎన్నో కష్టాలను అనుభవించి ఎంతో కాలం కాలేదు. మరల రాముడు మోపిన నిందవలన మరల కష్టాలపాలవుతుందనే ఆవేదన ఊర్మిళలో కనబడుతుంది. అందుకే లక్ష్మణుడు సీతను చంపనని మాట ఇస్తేనే పాదాలు వదులుతానని అంటుంది. సోదరిపై ఉర్మిళకున్న ప్రేమ ఎలాంటిదో ఇక్కడ వ్యక్తమవుతుంది.

## 4.3. కైక

### i.అసూయ

ఇతరుల ధనమును, బల పరాక్రమాలను, సత్కార గౌరవములను చూసి అవన్నీ తనకు లేవని, అవి తనకు

కావాలనే కోరికతో అసూయ మొదలవుతుంది. కైకలోని అసూయ వల్ల రాముడు పట్టాభిషిక్తుడవుటను ఓర్వలేనిదై తన కుమారుడు భరతునికి పట్టం కట్టాలనే కోరికతో రాముని అడవులకు పంపి భరతునికి పట్టం కట్టాలనుకుంటుంది.

**ii.చైల్డ్ ఇగో స్టేట్**

చైల్డ్ ఇగో స్టేట్ లోని వ్యక్తుల ఆలోచనలు పసితనాన్ని పోలి ఉంటాయి. తమను అందరూ మెచ్చుకోవాలని, తాము ప్రత్యేక గుర్తింపు పొందాలని కోరుకుంటారు. ఇలాంటి మనస్తత్వం ఉన్న వారు తాము ఏదయినా కోరుకుంటే దానిని సాధించడానికి ఎలాంటి పనులయినా చేస్తారు. ఈ లక్షణాల వల్లే దశరథుడు శాంతను దత్తత తీసుకునే విషయమై సతీ సమేతంగా బయలు దేరాలనుకున్న సందర్భంలో కైక కౌసల్య, సుమిత్రలతో రావడానికి ఇష్టపడదు. వారు మేము కాలినడకన వస్తాము నీవు రథముపై రమ్మని కైకను కోరడంతో అప్పుడు బయలుదేరుతుంది. ఇలా తాను అందరిలో ప్రత్యేకంగా ఉండాలని అనుకుంది కైక.

**iii. 3.Id**

మంచీ చెడుల జ్ఞానం లేని కోరికలన్నింటికీ Id మూలం. ఈ లక్షణాల వల్ల వ్యక్తులు తాము చూసింది కోరుకున్నది తనకే దక్కాలని కోరుకుంటారు. వీరి కోరికలు నైతికంగా, వాస్తవికతకు వ్యతిరేకంగా ఉన్నా తన కోరిక తీరాలనుకుంటారు. ఈ లక్షణాల వల్లే రాజ్యానికి వారసుడు ప్రథమ పుత్రుడని తెలిసినా తన కుమారుడు భరతుడే రాజ్యానికి పట్టాభిషిక్తుడవ్వాలని కోరుకుంది కైక.

**iv.హిస్టీరికల్ మూర్తిమత్వం**

స్వార్థం, భావోద్రేకం, అపరిమిత ఆత్మాభిమానం, ఇతరులు తనను పట్టించుకోవాలని, గుర్తించాలని అనుకోవడం, ఇతరులను ఆకట్టుకోవడానికి కొన్ని సార్లు నాటకీయతను ప్రదర్శించడం, తాము పట్టిన పంతాన్ని నెగ్గించుకోవడానికి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించి పనులను సాధించుకోవడం హిస్టిరియా లక్షణలు. ఈ లక్షణాల వలన కైక తన కుమారుడు భరతునికి పట్టం కట్టక పోతే తాను ఆత్మహత్య చేసుకుంటానని దశరథుని బెదిరిస్తుంది.

ఒక కుటుంబంలో వ్యక్తుల స్వార్థానికి ఆ కుటుంబం ఎలా నాశనమవుతుందో చెప్పడానికి కైక పాత్రను ఉదాహరణగా తీసుకోవచ్చును. దశరథుని ముగ్గురు భార్యలలో 3వ భార్య కైకేయి.

దశరథుడు అంగనరేశుని కుమార్తెను దత్తత తీసుకొనుటకై భార్యలు ముగ్గురితో బయలు దేరాలనుకుంటాడు. కానీ కైక వారితో కలిసి రావడానికి ఇష్టపడదు. సుమిత్ర వెళ్ళి కైకతో క్రింది విధంగా పలుకుతుంది.

'రాజుతో కూడాను గోవిందా

రథము మీరెక్కండి గోవిందరామ

కాలినడకను మేము గోవిందా

కదలివస్తామమ్మ గోవిందరామ "[84]

సుమిత్ర మేమంతా కాలినడకన వస్తాము, నీవుమాత్రం రథంమీద రమ్మనిచెప్పిన వెంటనే కైక అందుకు బదులుగా

'కాలినడకను వస్తె గోవిందరామ

గడియలో వత్తునని గోవిందా

కైక ప్రయాణమాయె గోవిందరామ "[85]

కౌసల్య, సుమిత్రలతో కలిసి రథముపై వెళ్ళడనికి ఇష్టపడని కైక, సుమిత్ర తాము కలినడకన వస్తాము, నీవు మాత్రం దశరథునితో రథముపై రమ్మనడంతో అందుకు అంగీకరించి ప్రయాణమవుతుంది.

ఇక్కడ కైక కౌసల్య, సుమిత్రలతో కలిసి రాకపోవడానికి కారణాన్ని పరిశీలించినట్లయితే ఎరిక్ బర్న్ మనవునిలో పేర్కొన్న 3 దశలలో Child Ego State (చైల్డ్ ఇగో స్టేట్)లక్షణాలు కనిపిస్తున్నాయి. ఈ స్థితిలో ఉన్న వ్యక్తుల ప్రవర్తన, ఆలోచనలు పసితనాన్ని పోలి ఉండును. అనగా సంతోషానికి పొంగడం, బాధలకు కృంగిపోవడం వంటివి. ఈ దశలోని వ్యక్తులు వారిని అందరూ మెచ్చుకోవాలని, తాము అందరిలో ప్రత్యేక గుర్తింపు పొందాలని కోరుకుంటారు. తాము ఏదైనా కావాలని కోరుకోవడం, కోరుకున్నదాన్ని సాధించడానికి ఎలాంటి పనులయినా చేస్తారు. కొన్ని సమయాలలో వీరు చిన్న పిల్లలవలె చీటికీ మాటికీ ఇతరులను నిందిస్తుంటారు. తమకు వ్యతిరేకంగా ఎలాంటి పనులు జరిగినా, తమను ఎవరైనా విమర్శించినా వీరు సహించక కక్షతో, కోపంతో ఆక్రోశించడం లాంటి మనస్తత్వాన్ని ఈ దశలో ఉన్న వ్యక్తులలో చూడ గలుగుతాం.

కైక దశరథుని భార్యలందరిలో తాను ప్రత్యేకంగా ఉండాలనుకుంది అందుకే తాను శాంత కోసం వెళ్ళేటప్పుడు అందరితో కలిసి రథముమీద రానని అంటుంది. కానీ సుమిత్ర తామంతా కాలినడకన వస్తాము, నీవు మాత్రం రథము మీద రమ్మని చెప్పేనంతనే కైక అందుకు అంగీకరించి తాను వారితో రావడానికి అంగీకరిస్తుంది.

మార్గం మధ్యలో రథ చక్రం విరగడంతో రథ చక్రాన్ని ఎత్తగల శక్తి ఒక్క కైకకు మాత్రమే ఉందని గ్రహించి అందరూ అర్థించగా కైక రథాన్ని ఎత్తుటకు దశరథుని వద్ద కాగితంపై కొన్ని ప్రమాణాలను చేయించుకుంటుంది.

''భమిడికలము దెచ్చె గోవిందారామ
బంగారు పట్టామీద గోవిందా
శ్రీకారముపెట్టిగోవిందారామ
రామువనవాసము గోవిందా
భరతుపట్టంకట్ట గోవిందా రామ
పదునాళుగేండ్లనిరాసె గోవిందా '' [86]

ఇక్కడ కైక తన కుమారుడు భరతునికి పట్టంకట్టి కౌసల్య కుమారుడు రాముని పదునాళుగేండ్లు వనవాసం పంపించే విధంగా దశరథుని వద్ద నుండి వ్రాత పూర్వకంగా ప్రమాణాలను చేయించుకుంటుంది.

జానపదులు మనకు కైక పరాక్రమాన్నే కాకుండా ఆమె ముందు చూపును కూడా చూపించారు. దశరథునికి పుత్రులు కలుగక ముందే కైక భవిష్యత్తులో దశరథునికి కలిగే పుత్రులు వారి పేర్లు మీదనే దశరథునిచేత ప్రమాణాలను చేయించుకుంది. దశరథుడు శాంతను తీసుకురావడానికి బయలుదేరే సమయంలో ఆ కార్యం ఎలా అయినా అవ్వాలనే ఉద్దేశ్యంతో ఉంటాడు కాబట్టి కైక తాను ఏదైనా ఒత్తిడిని తెస్తే మెత్తబడతాడని తలచి తన మనసులోని కోరికను తెలిపింది. కైక అనుకున్నదే జరిగింది దశరథుడు కైకకు కోరిన ప్రకారం వాగ్దానం చేస్తాడు.

దశరథుని చేత ప్రమాణాలను చేయించుకున్న కైక రథచక్రాన్ని నిలుపుతుంది. తర్వాత అంతా శాంత దగ్గరకు వెళ్ళి ఆమె తండ్రిని ఒప్పించి శాంతను కైక ప్రసక్తి లేకుండా దత్తత తీసుకుంటారు.

దశరథుడు శ్రీరాముని పట్టాభిషేకం చేయదలచిన సందర్భంలో మందర కైకతో భరతుని పట్టాభిషిక్తుడను చేయించమంటుంది. ఆ మాటలకు కైక

"దాసిమాటలువినియు తరలాయతాక్షి । మతిమాలిన మాటలే మందరా నీవి ।

రాజ్యానికధికారి జ్యేష్ఠపుత్రుండు । శాస్త్రిపద్ధతిగాను రాజ్యంబు అంత ।

దశరథసుతునకు కట్టంగవచ్చు । అనుజునినన్ను నూ అతడెపోషించు ।

అరువక పొమ్మని అతివ తాబల్కె। " [87]

ఈ గేయంలో మందర మాటలకు కైక ముందు మందరను నిందిస్తుంది. శాస్త్రిం ప్రకారం రాజ్యానికి అధికారి జేష్ఠపుత్రుడేకదా! రాముని పట్టంకట్టిన తనకెలాంటి అభ్యంతర ము లేదని రాముడు తమ్ములకు తగినప్రాధాన్యాన్ని ఇచ్చి గౌరవిస్తాడని అంటుంది. ఈ మాటలనుబట్టి కైకలో తనకు శ్రీరామునిమీద ఉన్న ప్రేమ, నమ్మకం రామునికి తమ్ములపై ప్రేమానురాగాలున్నవనే భావన ఆమెలో వ్యక్తమవుతాయి. కైకలో మనకు ధర్మాధర్మముల గురించిన జ్ఞానం కనిపిస్తుంది. అందుకే రాజ్యానికి పెద్దకుమారునికే పట్టం కట్టమంటుంది.

కానీ మందర ఆనాడు దశరథుడు కైకకు ఇచ్చిన రెండు వరముల గురించి జ్ఞాపకం చేసింది. ఈ మాటలకు కైక శ్రీరాముని పిలచి క్రింది విధంగా పలికింది.

"తనయ నాపల్కులు తథ్యముగవినుమి । తండ్రి సత్యమునీవు జరుపవలెసుమ్మి।

వరములు రెండిచ్చె పశుధీశుడపుడు । భరతునకుపట్నంబు కట్టనొకవరము ।

మిమ్ము నడవికిబంప నొకవరముయిచ్చె । పద్ధాలుగూయేళ్ళు ఆ ప్రతినజరిపి।

రాజ్యంబుయేలుమీ రాజకూమార । " [88]

కైక శ్రీరాముని పిలచి రామా నీవు తండ్రి మాటను నిలబెట్టమంటుంది. దశరథుడు తనకు గతంలో రెండు వరములు ఇచ్చాడనీ, వాటిలో ఒకటి భరతునికి పట్టంకట్టుట. రెండవది రాముని వనవాసమని తెలుపుతుంది. కావున నీవు పద్నాలుగేళ్ళు వనవాసంచేసి తరువాత రాజ్యాన్ని స్వీకరించమంటుంది. కైక మొదట మందర మాటలకు కోపగించుకున్నా తన కుమారుడు భరతుడు రాజ్యానికి పట్టాభిషిక్తుడగుట కైకకు ఆనందాన్ని కలిగించేది కావునే కైక

రాముని పిలచి తనకు దశరథుడు ఇచ్చిన వరముల గురించి చెప్పి వాటిని నెరవేర్చమంటుంది. కైకకు కుమారుని మీదున్న ప్రేమే ఆమెచే ఇలాచేయించింది.

కైకలో మనకు ప్రాయిడ్ పేర్కొన్న Id లక్షణాకు కనిపిస్తాయి. మంచి చెడుల జ్ఞానంలేని మానసిక పరమైన కోరికలన్నింటికీ ఇదే మూలం. అన్ని కోరికలు దీని నుండే పుడతాయి. వ్యక్తులు తాము చూసింది, కోరుకున్నది వారికే దక్కాలని అనుకుంటారు. ఈ కోరిక నైతికంగా, భౌతికంగా, వాస్తవికతకు వ్యతిరేకంగా ఉన్నా తన కోరికను తీర్చుకోవాలనేది Idలో అధికంగా ఉంటుంది. Id లక్షణాలను జేమ్స్.ఇ.కాల్.మెన్‌గారు 'The id is Completely selfish concerned only with the immediate gratification of instinctual needs without reference to reality or moral conciderations' గా పేర్కొన్నారు. అంటే ఈ లక్షణాలలో స్వార్థపూరిత లక్షణాలు ఉన్నాయని తెలుస్తుంది ఈ స్వార్థపూరిత లక్షణాలద్వారా కైక రాజ్యానికి పెద్దకుమారుడే పట్టాభిషిక్తుడవ్వాలని తెలిసినా తన కుమారునికి పట్టం కట్టాలనే కోరికతో తన కోరికను తీర్చుకోవాలనే ఉద్దేశ్యంతోనే రాముని పిలచి దశరథుని వరముల గురించి చెబుతుంది.

దశరథుడు రామునిద్వారా విషయాన్ని తెలుసుకొని కైక మందిరానికి వచ్చి నిలదీయగా కైక క్రింది విధంగా పలుకుతుంది.

"కన్ను లెర్రగజేసి కాంతునితోబల్కె । అలనాడు వరములూ ఆరణ్యమంటు ।
యిచ్చితివిగా రెండు యిందీవరేశ । ఆడితప్పగదగునె అధికులకుయెందు ।
పలికిబొంకుదురయ్య పార్థివోత్తములు । మారుబల్కకనీవు మహరాజయిపుడు ।
రామునడవికిబంపు పద్దాలుగేండ్లు । భరతునకు పట్టంబు కట్టి పార్థివుడా ।
లేకున్న సుతుజంపి నేజత్తుననెను ।" [89]

ఈ గేయంలో దశరథుడు కైకకు గతంలో రెండు వరములు ఇచ్చాడని ఆ వరములలో మొదటిది భరతుని పట్టాభిషేకం, రెండవది శ్రీరామ వనవాసం. ఈ రెండు వరములను నేడు నెరవేర్చమని కైక దశరథునితో పలుకును. ఆడినమాటను తప్పటం న్యాయం కాదు. రామునికి తండ్రిగా కాకుండా ఒక మహారాజుగా ఆలోచించి ఇచ్చిన మాటకు కట్టుబడి రాముని వనవాసానికి పంపి భరతునికి పట్టం కట్టమంటుంది. ఇలా చేయకుంటే కైక తన కుమారుడు భరతుని

చంపి తానూ చనిపోతానని బెదిరిస్తుంది.

కైక దశరథునితో తాను ఆత్మహత్య చేసుకుంటానని చెప్పడానికి ఆమెలోని'హిస్టీరికల్ మూర్తిమత్వం' కారణం. స్వార్థం, భావోద్రేకం, అపరిమిత ఆత్మాభిమానం, ఇతరులు తనను పట్టించుకోవాలని, గుర్తించాలని, ఎదుటివారికి శృంగారోద్రేకం కలిగేటట్లు చేయడం, నాటకీయతతో ఇతరులను ఆకట్టుకోవాలని చూడటం, పంతం నెగ్గించుకోవడానికి కొన్నిసార్లు ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడం హిస్టీరియాలోని లక్షణాలు. ఈ లక్షణలు అదుపులో ఉన్నప్పుడు అది హిస్టిరియా వంటి మానసిక రుగ్మతగా పరిణమించే అవకాశం లేదు. కానీ 'హిస్టీరికల్ మూర్తిమత్వం'గా ఉంటుంది. 'హిస్టీరికల్ మూర్తిమత్వం' కొద్దిమందిలోమాత్రమే ఉంటుంది. అటువంటి వారిలో స్త్రీలే అధికం.

ఈ విధంగా కైక తన నాటకీయతతో దశరథుడు తనకు ఇచ్చిన వరములద్వారా రాముని వనవాసానికి కారణమవుతుంది.

## 4.4.శూర్పణఖ

**i.Id :**

Id వలన వ్యక్తులు తాము చూసింది, కోరుకున్నది తమకు కావాలనే కోరికతో నైతికంగా వాస్తవికతకు వ్యతిరేకంగా ఉన్నా తమ కోరికను తీర్చుకోవాలనే కోరిక వీరిలో బలంగా ఉంటుంది. దీని వలన శూర్పణఖ అడవిలో తాను చూసిన రామునిపై కోరిక జనించి అతను వివాహితుడని తెలిసినా అతనిని ఎలాగైనా పొందాలనుకుంటుంది.

### ii. హింస :

ఇతరులను బాధించడమే కాక వ్యక్తుల సంబంధాలను విడదీయుటకు చేసే ప్రయత్నం, స్వార్థంతో తమకు తానుగా ఏర్పరచుకున్న నీతి వంటివి హింసకు సంబంధించినవే. ఈ హింసాత్మక లక్షణాలతో శూర్పణఖ రాముని పొందాలనే స్వార్థంతో సీతారాములను విడదీయుటకు రావణుని వద్ద సీత అందచందాల గురించి చెప్పి సీతను రాముని నుండి దూరం చేస్తుంది.

### iii. అసూయ:

ఇతరులకున్న వాటితో మనకున్న వాటిని పోల్చి చూసుకున్నప్పుడు మనలో అసూయ కలుగుతుంది. ఎంత అసూయపడితే అంత కావాలనుకుంటాం. ఈ అసూయతోనే భర్తను కోల్పోయిన శూర్పణఖ వనవాస సమయంలో సీతారాముల అన్యోన్యతను, రాముని అందాన్ని చూసి తనకు లభించని సౌభాగ్యం సీతకు కలుగడం పట్ల అసూయతో రాముని పొందాలనుకుంటుంది.

### iv. హిస్టీరికల్ మూర్తిమత్వం:

వ్యక్తులలోని స్వార్థం, ఆత్మాభిమానం, ఎదుటివారికి శృంగార భావోద్రేకాన్ని కలిగించడం, నాటకీయతతో ఇతరులను ఆకట్టుకోవాలని చూడటం మొదలైన హిస్టీరియా లక్షణాల వలన శూర్పణఖ రాముని ఆకట్టుకోవడానికి అనేక విధాల ప్రయత్నించి విఫలమవుతుంది. రాముడు తనకు మాత్రమే దక్కాలనే స్వార్థం శూర్పణఖను వదలి వెళ్ళక, వనవాసానంతరం రాముడు పట్టాభిషిక్తుడైన తర్వాత శూర్పణఖ యతి వేషంలో వచ్చి సీతారాములను విడదీస్తుంది.

రామాయణ కథా మలుపుకు ప్రధాన కారణం శూర్పణఖ. ఈమె లంకాదీశుడు రావణుని తల్లి దండ్రులు

కైకసీ విశ్రవసువుల చివరి కూతురనీ, విశ్రవసువు మరో భార్య కూతురనే వాదనలూ ఉన్నాయి.

శూర్పణఖ భర్త ఒకానొక సందర్భంలో అనుకోని పరిస్థిలో రావణుని ఖడ్గానికి బలివుతాడు. రావణుడు తన చేతులతో తన చెల్లెలి పసుపు కుంకుమలు చెరిపినందుకు చింతించి, శూర్పణఖను క్షమాపన కోరి, ఆమె జీవితాన్ని దండకారణ్యంలో ప్రశాంతంగా గడపమని పంపిస్తాడు.

వనవాసానికి వచ్చిన లక్ష్మణుడు పొదలను ఖడ్గంతో నరుకుతూ సుభ్రం చేస్తుండగా ఆ పొదలలో ఉన్న శూర్పణఖ కుమారుడు 'జంబు' మరణిస్తాడు. ఈ విషయం తెలుసుకున్న శూర్పణఖ వారిని సంహరించుటకు బయలుదేరి అక్కడ రామలక్ష్మణుల అందచందాలను చూసి మోహంలో పడి తన కుమరుని చంపిన వారిపై ప్రతీకారవాంఛను మరచిపోతుంది. రామలక్ష్మణులతో తనను స్వీకరించమంటుంది. కానీ వారు దానికి నిరాకరించడంతో రాముని సీత నుండి దూరం చేసిన గాని వారు తనకు దక్కరని తలచి, సీతను చంపుటకు ప్రయత్నించి లక్ష్మణుని చేతిలో తన ముక్కూ, చెవులను కోల్పోయి పరాభవానికి గురవుతుంది.

జరిగిన పరాభవానికి తన అన్న దగ్గరకు వెళ్లి సీత అందచందాల గురుంచి వివరించి అలాంటి సౌందర్యవతి లంకలో ఉండగగినదని చెప్పి రావణునితో సీతాపహరణ చేయించి చివరికి రాముని చేతిలో రావణుని అతని వంశనానికి కారణమవుతుంది.

లక్ష్మణుడు శూర్పణఖకు ముక్కూచెవులే ఎందుకు కోయాలి? అన్న ప్రశ్నకు మనిషిలో మనం చూడగానే మనల్ని ఆకర్షించేవి వారి ముఖం, అందులోని కళ్ళూ, ముక్కూ, చెవులు, పెదవులే కదండీ. శూర్పనఖకు తాను అందగత్తెనన్న అహం కూడా ఉంది. దాంతో శూర్పనఖకు బుద్ధి చెప్పాలని ఆమెను అంద విహీనురాలిని చేయాలని లక్ష్మణుడు ఆమె ముక్కూ చెవులు కోస్తాడు. ఇదే కాకుండా ఆనాడు వ్యభిచరించే స్త్రీకి ముక్కూ, చెవులు కోయడమన్నది ఆచారంగా ఉండేది. ఇక్కడ లక్ష్మణుడు శూర్పణఖకు వేసిన ఈ శిక్షను బట్టి మనకు ఆ కాలంనాటి స్థితిగతులు తెలుస్తున్నాయి.

ఈ అవమానంతో శూర్పనఖ తన అన్న రావణుని దగ్గరకెళ్ళి క్రింది గేయం ద్వారా తన ఆవేదనను ఇలా వ్యక్త

పరుస్తుంది.

"అన్న రావణ ఆలకింపుము విన్నవించెద నాయకా

విన్నవించెద నాయకా

చిత్రకూట అడావిలోన జరిగినా సంగతీ నాయదీ ||చిత్ర||

జరిగీనా సంగతీ నాయదీ ||అన్న||

దశరథా పుత్రులంటా రామలక్ష్మణులిద్దరూ..రామలక్ష్మణులిద్దరూ

కామకేళికి కలయ రమ్మని కష్టపెట్టిరి మనుజులు ||కామ||

కష్టపెట్టిరి మనుజులు ||అన్న||

ఒప్పుగా నేను విన్నవించితి గొప్పవారను కొంటినీ - గొప్పవారను కొంటినీ

గొప్పవారు కాదు బలమునా నను బట్టిరీ బలమునా నను బట్టిరీ

బలమునా నను బట్టిరీ ఇక భంగములు గావించిరీ ||బల||

భంగములు గావించిరీ ||అన్న||

సీత యున్నది ఆమె రూపము ||సీత||

సెప్ప శక్యమొ గానిదీ ||సెప్ప||

ఆమెను వర్ణింపడానికి బ్రహ్మతరములు గానిదీ బ్రహ్మతరములుగానిది

ఎటులనైనా సీత నిప్పుడు ||ఎటు||

వేగమే శరదీయుము ||అన్న|| "[90]

దశరథుని కుమారులైన రామలక్ష్మణులు తనను కామకేళికి రమ్మన్నారని, కాదనడంతో తనకు ముక్కూ, చెవులు కోశారని చెబుతుంది శూర్పణఖ. ఇలా జరిగిన విషయం దాచి అన్నకు అబద్ధం చెబుతుంది. దీనికి కారణాలను పరిశీలించినట్లయితే రామలక్ష్మణులని పొందాలన్న ఆశలు అడిఆశలు అయినాయి కావున తన ఆధిక్యతను ప్రదర్శించలేకపోయింది. దాంతో మానసిక రుగ్మతకు లోనయి తనను ఈ విధంగా అవమానించిన వారిమీద ప్రతీకారం

తీర్చుకోవాలనే ఆమె ఇగోతత్వం వలన అన్న దగ్గర రాముని పత్ని సీతాదేవి అందచందాలను గురించి పొగిడి ఆమెను తీసుకువచ్చి లంకలో ఉంచి ఏలుకోమని అన్నకు చెవుతుంది. శూర్పణఖ మగవారి ఆధిక్యతను ఒప్పుకోలేనిదికూడా. ఇటువంటి మనస్తత్వం గలవారు అవకాశం కోసం వేచి తనను అవమాన పరిచినవారిని నాశనం చేయాలని చూస్తారు. ఇక్కడ శూర్పణఖా అదే చేసింది. శూర్పణఖ పాత్రను మన జానపదులు భారతంలో 'శకుని' పాత్రతో పోల్చుతారు.

శూర్పణఖ తాను ఏమిచేస్తున్నదో దాని వలన వచ్చే ఫలితమేమిటో కూడా తెలియని స్థితిలో తాను చేయదలచుకున్న వాటిని చేస్తూ వచ్చింది. చివరకు రావణుని నాశనానికి కారణమైనది. శూర్పణఖ భర్త రావణుని చేతిలో మరణించినందుకు అన్నను కూడా శత్రువుగా తలచినట్టుంది. అందుకేనేమో తన కుమారుని చంపి, తనను అవమాన పరచిన రామలక్ష్మణుపైకి తన అన్నను పంపింది.

జిడ్డు కృష్ణమూర్తిగారు తన చేతన గ్రంథంలో అసూయ గురించి ఇలా అంటారు. ఇతరులకున్న వాటితో తనకున్నవాటిని పోల్చి చూసుకున్నప్పుడు అసంతృప్తితో అసూయ కలుగును. మనిషి ఈ అసూయతోనే తనకు ఎన్నో సొంతమవ్వాలనుకుంటాడు. మనిషి ఎంత అసూయ పడితే అంత కావాలనుకుంటాడు. అన్నీ తనే పొందాలనుకోవడానికి అసూయకు సంబంధం ఉంటుంది.

శూర్పణఖలో మనకు హింసాత్మకమైన లక్షణాలు కనిపించును. హింస గురించి జిడ్డు కృష్ణమూర్తిగారు చేతన గ్రంథంలో ఇతరులను బాధించడంకాక వారిని విడగొట్టడం కూడా హింసే అవుతుందంటారు. తన స్వార్థంకోసం ప్రత్యేకంగా వారు ఏర్పరచుకున్న నీతి కూడా హింసే అవుతుంది. ఈ లక్షణాల వలనే శూర్పణఖ సీతారాములను విడగొట్టి రాముని తాను దక్కించుకోవాలనుకుంటుంది.

రావణుని మరణాంతరము సీతారాములు రాజ్యమేలుతున్న సమయంలో ఒకనాడు శూర్పణఖ సీతారాములు ఇరువురూ కలిసి జీవించడం ఇష్టంలేక రాముని ఏవిధంగా నయినా దక్కించుకోవాలనే ఉద్దేశ్యంతో శూర్పణఖ తనలో తాను క్రింది విధంగా అనుకొనును.

''దుఃఖించెను తనచిత్తములోను

మగవానిగానైతి పగలు సధించగను

ఆడదానినై యజ్ఞనినైతి

ఏమిసేతునని యేడ్వగదొడగె

రాముసీత కెడబాపుదు ననుచు

యతి వేషము దప్పకతాదాల్చె" [91]

పై గేయంలో శూర్పణఖ తాను ఆడదానినై పుట్టినందుకు చింతిస్తూ, మగవాడిగానైనా పుట్టుంటే తన పగను తీరుకునేదానినని మనసులో అనుకుంటుంది. మగవాడిగా పుట్టుంటే శూర్పణఖకు రామునిపై కోరికెలాపుడుతుంది. శూర్పణఖ తాను మగవాడిగా పుట్టడమంటే వారి ధైర్యసాహసాలు, శక్తియుక్తులవంటివి తనకులేవనే బాధే ఆమెచే ఇలా పలికించాయి. పగ తీర్చుకొనుటలో మగవాడి శక్తియుక్తులు తనలోలేవనే శూర్పణఖ ఇలా అంటుంది. తన పగను తీర్చుకునుటకు సీతను రాముని వేరుచేసి రాముని దక్కించుకొనుటకు శూర్పణఖ యతి వేషమును దాల్చును.

యతి వేషంతో శూర్పణఖ రామరాజ్యానికిపోయి రాణులచే సేవలంది. సీతతో రావణుని చిత్రాన్ని గీయమంటుంది.

" రావణపటమువ్రాసి యిచ్చితే ।బ్రతుకుదునే నీలోకములోను"

అనినంతనే సీత

"పదినెలలు చెరనుంటిగాని ।పాపకర్మునికన్నుల చూడ ।

జనకునిగాభావిస్తినేను అంగుష్ఠమొక్కటి యెరుగుదును।

అంతమాత్రమె వ్రయమేమనెను ।అంగుష్ఠముజానకిత్రావ్రాసెను । "

సీత వ్రాసిన దానికి యతి

"ఆమీదటయతి అంతావ్రాసె । కాళ్లువ్రేళ్లు పిరుదులు పిక్కలు ।

ఆభాగములన్నియువ్రాసె। నీరూపునలుపుతెలుపె ।

పన్నెలు పేరులు పేరలందుకొని । చిక్కగదాని వజ్రములు చెక్కించెనుదాన్ని ।

వైడూర్యము పొదిగించెనుదాన్ని । వ్రాసెనుపటమురమ్యముతొ ।

పరుగున వెళ్ళెను పటము పట్టుకొని । చనుదెంచెను బ్రహ్మసన్నిధికపుడు ।

అన్నచచ్చి ఆరునెలలాయెను నాటినుండి అన్ననుతాగానను

అన్నమారుగా చూచుకొందును । పటమునకాయువుపోయుమనియెను ।"

పటముకునాయుస్సు బ్రహ్మపోసెను। పరగున వచ్చెనుపటము పట్టుకొని।

నీపఠము నీనెత్తినిపొడుచుకో। ఆకాశవీధులపోయేను అసుర ।

పటమొచ్చి ముందరనిలుచుండి। రావెపోదము లంకకుననుచు।

సీతనుబట్టుక ఆపదబట్టెను । జానకిపట్టుకనీడ్వగదొణగె । " [92]

పై గేయంలో శూర్పణఖ యతి వేషంలో వెళ్ళి సీతచే రావణుని బొటనవేలును మాత్రమే బొమ్మగా వేయించుకొని మిగిలిన శరీర భాగాలను తా వేసి బొమ్మకు వజ్రవైఢూర్యమ్ములతో పొదిగి బొమ్మను తీసుకొని బ్రహ్మవద్దకెళ్ళి తన అన్న మరణించిన దుఃఖాన్ని తానింకామరువలేదని కనీసం ఈ పటముకయినా ప్రాణం పోయుమని ఈ బొమ్మలో అన్నను చూసుకొందునని చెప్పి తన అన్నపటమునకు ప్రాణం పోయించుకుని సీత మందిరానికి చేర్చుతుంది. పటములోని రావణుడు సీతతో రావేపోదాము లంకకు అంటూ సీతకు ఆపద కలిగించును.

శూర్పణఖ తాను సీతను రాముడి నుండి దూరంచేసి రాముని దక్కించుకోవాలనే ఉద్దేశ్యంతో ఇలా బొమ్మకు ప్రాణం పోయించి సీత వద్దవదలి సీతను కష్టాలపాలు చేస్తుంది. రాముడు తనకు దక్కాలనే స్వార్థంతో తన పంతం నెగ్గించుకోవడానికి శూర్పణఖ యతిగా మారి సీతారాములను విడదీయాలని ప్రయత్నం చేస్తుంది. ఈమెలో 'హిస్టీరికల్ మూర్తిమత్వ' లక్షణాలు ఉన్నాయని అమె ప్రవర్తన ద్వారా తెలుస్తుంది.

## 4.5.మండోదరి

### i. Dream of Symbalism :

మండోదరిలో ఫ్రాయిడ్ సిద్ధాంతాలలోని Dream of Symbalism కనిపించును. దీని ప్రకారం అణచివేయబడిన కోరికలు, భయాలు లాంటివి కలల రూపంలో వస్తుంటాయి. ఈ కలలు మన కోరికలను స్పష్టంగా తెలియజేయవు. రావణునిపై రాముడు వానర సైన్యంతో దండెత్తి వచ్చినప్పుడు మండోదరి గత రాత్రి తనకు కలలో చేతిగాజులు పగిలి పోయాని, కాలి మెట్లు విరిగి పోయాయని, నుదుటి కుంకుమ చెరిగి పోయిందని తనకు వచ్చిన పాడుకల గురించి వివరిస్తుంది. మండోదరి తనకు వచ్చిన కల ద్వారా తన సౌభాగ్యానికి అంటే రావణునికి ఏదైనా ఆపద కలుగునేమోననే భయంతో రాముని సీతను రామునికిచ్చి వారిని శరణువేడమని రావణునికి హితవులు చెప్పి తన భర్తను కాపాడాలనుకుంటుంది.

### ii. భయం :

మండోదరికి కలలో ఐదవ తనానికి ప్రతీకలైన గాజులు పగలడం, మెట్టెలు విరగడం వంటి అపశకునములతో పాటు వానర సైన్యం లంకపై దండెత్తి వచ్చినట్లు వచ్చిన కల ద్వారా తన భర్తకు, వంశానికి ఏదైనా ఆపద కలుగునేమోననే భయంతో భర్తను, వంశాన్ని, సామ్రాజ్యాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో రాముని సీతను రామునికిచ్చి శరణు వేడమని రావణునికి హితవు చెబుతుంది.

మండోదరి రావణుని అర్ధాంగిగా అధర్మ పక్షాన ఉన్నా ఆమె ఎప్పుడూ ధర్మపక్షమే. అధర్మబద్ధుడైన భర్తవల్ల మహాపతివ్రతయిన మండోదరి అనేక అవమానాలకు గురయింది. రావణుని స్త్రీ లోలత్వం కారణంగా మండోదరి భర్తను, రాజ్యాన్ని, కుమారులను అందరినీ పోగొట్టుకుంది.

రాముడు లంకపై దండెత్తి వచ్చినప్పుడు మండోదరి రాముని సైన్యాన్ని, గొప్పదనాన్ని చూసి మన లంకకు చేటువచ్చెనని క్రింది గేయంలో పలికెను.

‘‘రామణా భిమనా రామౌధూలు కమ్మినాయ్

రాంబాల మేడ బోయెరా రామణా || రామా ||

అబ్బ - గుభాలుమనే గుండట్ల జల్లుమనే

దండు వచ్చె మన లంకకు రామణా || రామా ||

మూడు మూర్ల తోకవాడు మంటి తిరమానివాడు

ఎల్లి వచ్చె మన లంకకు రావణా || రామా ||

అర్లు బార్ల తోకవాడు - ఎండీ తిరమనివాడు

ఎల్లి వచ్చె మన లంకకూ రావణా || రామా || "[93]

ఈ గేయంలో మండోదరి రాముని సైన్యాన్ని చూసి గుండె గుభేలుమన్నదని, సీత కొరకైవచ్చి లంకాదహనం గావించిన హనుమంతుడు మరళా వచ్చెనని, ఒక్క హనుమంతుడే లంకను దహించి వెళ్ళాడే మరి ఇప్పుడు వానర సైన్యం మొత్తం లంకపై దాడి చేసినచో తమకు పరాజయం తప్పదని తలచి రావణుని హెచ్చరిస్తుంది.

ఈ గేయంలో మండోదరిలో తమ వంశం, రాజ్యం ఏమవుతాయోనన్న భయం కనబడుతుంది. జిడ్డు కృష్ణమూర్తిగారు భయం గురించి 'చేతన' గ్రంథంలో ఇలా అంటారు. జరిగిన దానికి జరుగుతున్నదానికి అంటే ఉన్నదానికీ కావాలనుకున్న దానికీ మధ్యనున్న సంఘర్షణ వలన మనలో భయం అనేది ఏర్పడుతుందంటారు. మరణమంటే భయపడని వారుండరు. ఈ మరణమే మనిషిలో భయాన్ని కలుగజేసి దాని నుండి బయటపడాలనే అలోచన భయాన్ని మరింతగా పెంచి భద్రతను కోరుకునేటట్లు చేస్తుంది.

గతంలో హనుమంతుడు వచ్చి లంకాదహనం గావించాడు. మరళా ఇప్పుడు రామునితో వచ్చి మరెలాంటి విధ్వంసం సృష్టిస్తాడోనన్న భయం మండోదరిని వెంటాడుతుంది. మండోదరి తన భర్త రావణుడు, పుత్రులు, సామ్రాజ్యం ఇవన్నీ రామరావణ యుద్ధంలో కోల్పోవలసి వస్తుందనే భయంతో అందులోనుండి బయట పడాలనే ఉద్దేశ్యంతో రావణుని హెచ్చరిస్తుంది.

మండోదరి రాత్రి వచ్చిన కలను గురించి ఈ గేయంలో రావణునితో ఇలా చెబుతుంది.

"చేతిలోని నల్లగాజులు చెదిరీ రెండొప్పలాయె

చేటు మారికల గంటిరా రావణా ||రావణ||

కాలిలోటి కంచుమెట్లు చెదిరీ రెండొప్పలాయె

చేటు మారకలా గంటిరో రావణా ||రావణ||

నొష్టనున్న కుంకం బొట్టు ముగమంత చెదిరిపోయె

చేటు మారికలా గంటిరో రావణా ||రావణ||

వోరి సీత నోరికిచ్చి వోరి కొక్క శరణు చేసి

మేప్పుగా లంకనేలుకో రావణా ||రావణ|| "[94]

పై గేయంలో రావణునిపై రాముడు వానర సైన్యంతో దండెత్తి వచ్చినపుడు మండోదరి తనకు గతరాత్రి వచ్చిన కల గురించి చెబుతుంది. తనకు కలలో చేతి గాజులు పగిలిపోయాయని, కాలిమెట్లు విరిగిపోయాయని, నుదుటనున్న కుంకుమ చెరిగిపోయిందని చెబుతుంది. రాముని సీతని రామునికి అప్పగించి శరణువేడి రాజ్యాన్ని పాలించుకోమని రావణునికి హితవు చెబుతుంది.

ఫ్రాయిడ్ సూత్రాల ప్రకారం అణచివేయబడిన కోరికలు, భయాలు మొదలైనవి కలల రూపంలో వస్తాయి. ఈ విధమయిన కలలు మనకున్న కోరికలను స్పష్టంగా తెలియజెప్పవు. దీన్ని మనము Dream of symbalism అంటాము. ఇలాంటి లక్షణాలే మండోదరిలోనూ కనిపించును. మండోదరికి కూడా అమెకు వచ్చిన కల ఆమె భయాన్ని స్పష్టంగా తెలియజేయక చేతిలోని గాజులు పగిలిపోవడం లాంటి అపశకునముల ద్వారా జరుగబోయే ప్రమాదాన్ని ముందుగా హెచ్చరించును.

మండోదరికి కలలో వచ్చిన గాజులు, మెట్లు, కుంకుమ వంటివి ఆడవారి అయిదవతనానికి ప్రతీకలు. గాజులు పగలటం, మెట్టెలు విరగడం, కుంకుమ చెరగడం వంటివాటివలన తన భర్తకు ఏదైనా ప్రమాదము జరుగునేమోననే భయంతోనూ, లంకకు వచ్చిన వానరసైన్యాన్ని చూసి లంకకు ముప్పువాటిల్లుననే భావనతో వారి సీతను వారికిచ్చి శరణు వేడమంటుంది.

మండోదరి ఈ విధంగా పలుకుటకు ప్రధాన కారణం రావణుడు చేసిన పొరబాటును భార్యగా మండోదరి

సరిదిద్దాలనే ఉద్దేశ్యంతో, రావణుడు చేసిన పొరబాటువల్ల మొత్తం రాక్షస రాజ్యానికే ముప్పు వాటిల్లుతుందనే భావనతో భర్తను, వంశాన్ని, రాజ్యాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో రాముని సీతను వారికిచ్చి శరణువేడి మెప్పుగా లంకను పాలించుకోమంటుంది. ఒక భార్యగా తన భర్త యోగక్షేమాన్ని గూర్చి అతను చేసే పొరబాట్లను సరిదిద్ది మంచి మార్గంలో పెట్టాలనే రాత్రి తనకు కలలో వచ్చిన పాడు కలను గూర్చి చెప్పి రాముని సీతను రామునికిచ్చి శరణు వేడమంటుంది.

రాముడి చేతిలో మరణించిన తన భర్తను చూడడానికి రణభూమికెళ్ళిన మండోదరి ఆవేదనను మనం క్రింది గేయంలో చూడవచ్చు.

"రాక్షసస్త్రీలతో రణభూమికేతెంచి రావణునిపైబొరలుచూ
ప్రాణేశనినుబాసి యేరీతి తాళుదు ప్రాణములు నిలువవనెనూ
వద్దికతోనేను నీవద్దనే నులుచుండి బుద్ధిగా చెప్పలేదా
వద్దుగాపలికితివి వద్దనుచుతమ్ముని గద్దెపైదన్నలేదా
కటకటాయిటువంటి కారణీకములొట యెరుగలేనైతినిపుడూ
నీపరాక్రమములు నీదుభుజబలములు నేడెందుబోయెననియెర్
కట్టడైయుండెనో రాముచేతనుగూల కటకటాయేమిసేతూ
గోడుగోడునయేడ్వ ఘోషములుమెండాయె ఘోరరణమెల్లనిండెర్" [95]

ఈ గేయంలో మండోదరి రణభూమికెళ్ళి రావణునిపైబడి నీవులేని నేను బ్రతుకలేనని విలపుస్తూ రాముని సీతనువారికిచ్చి ప్రాణములు నిలుపుకోమని హితవు చెప్పినా వినక ప్రాణాలు పోగొట్టుకొంటివికదా. నీ బలపరాక్రమములన్నీ నేడు ఏమైనాయనియంటూ రాముని చేతిలో మరణించుటకే కాబోలు నీ పరాక్రమమంతా కట్టడై ఉన్నవని, అందుకే తన హితవులేమీ చెవులకెక్కలేదనే భావాన్ని ప్రకటిస్తూ శోకిస్తుంది.

మండోదరిలో మనకు రావణుడిపై ఉన్న ప్రేమ, అమె దూరదృష్టి, భర్తను రక్షించుకోవాలనే తపన వంటివి

కనబడును. అందుకే రాముని సీతను వారికిచ్చి శరణువేడిన హాయిగా లంకనేలుకోమని చెబితే వింటిరా అని రణభూమిలో రావణునిపైబడి విలపిస్తుంది. ఇతరుల భార్యలను తీసుకురావడమే తప్పు అందులోనూ రాముని భార్య సీత వంటి మహాసాధ్విని తీసుకురావడం మృత్యువుతో చెలగాటమని గ్రహించిన మండోదరి రావణునికి ఎన్నో హితవులు చెప్పింది. మండోదరికి శ్రీరాముని దైవత్వం, బలపరాక్రమముల గురించి తెలియును కాబట్టి తన భర్తను హెచ్చరించి యుద్ధాన్ని నిలపాలనే ప్రయత్నం చేసింది.

## 4.6. సులోచన

### i. ధర్మా ధర్మముల విచక్షణ

రావణుడు సీతాపహరణ గావించిన దగ్గర నుండి రాముడితో యుద్ధం చేయడం వరకు ఇంద్రజిత్తు తండ్రి చేయు అధర్మ కార్యాలను వ్యతిరేకించకపోగా రామరావణ యుద్ధంలో తండ్రికి సాయపడినందుకుగాను తన భర్తకు కలిగిన మరణము సముచితమేనని తలచి, రామునికి నమస్కరించి తన భర్త లేనిదే తనకు జీవితం లేదని కావున తన భర్తను బ్రతికించమని సులోచన రాముని వేడుకుంటుంది.

### ii. అమ్మ ప్రేమ

తల్లిగా బిడ్డల పై ఉన్న అనురాగంతో సులోచన ఇంద్రజిత్తు మరణాంతరము పతితో సహగమనం చేయదలచి తన పిల్లలు ఒంటరివారై, దిక్కులేని వారై పోతారని తలచి పిల్లలను దగ్గరకు తీసుకొని వారికి మంచి నీతులు, బుద్ధులు చెప్పి వారిని పాతాళంలో వారి తాతగారి దగ్గరకు పొమ్మని హితవు చెబుతుంది.

సులోచన ఇంద్రజిత్తు భార్య రావణుని కోడలు. ఈమె వృంత్తాంతము అవాల్మీకము. ఈమె పాతాళాధిపతి ఆదిశేషుని కుమార్తె. రామలక్ష్మణుల చేతిలో హతుడైన తన భర్త శరీరమును తెచ్చుకొని సహగమనాన్ని చేసిన పతివ్రత. కథాగమనము కొరకు, రసపుష్టి కొరకు ఇలాంటి పాత్రలను రంగనాథరామాయణకర్త సంస్కృతంనుండి, జనశ్రుతుల నుండి గ్రహించి తన రామాయణంలో చేర్చుకున్నాడు. సులోచన తన భర్త ఇంద్రజిత్తు రామరావణ యుద్ధంలో రావణ మరణాంతరము రాముని ఎదుట నిలుచుని ఈ విధంగా స్తుతిస్తుంది.

“ అందంద తూలుచు నసురుసురనుచు - మందయానంబున మగువ రాఘువుని
గదిసి సాగిలి నమస్కారంబు సేసె - ముదిత హస్తంబులు ముకుళించి నుదుట
రవికులాంబుధి సోమ రామాభిరామ - ప్రవిమల గుణధామ పరరాజ భీమ” [96]

ఈ గేయంలో సులోచన విషాదవదనంతో రాముని ఎదుట నిలబడి అతడికి నమస్కరించి అతనిని స్తుతిస్తుంది. లోకంలో ఎవరయినా తనవారిని చంపినవారిపై పగ తీర్చుకోవాలని చూసారుగానీ వారిని స్తుతించడం ఎక్కడా

కనిపించదు. కానీ ఇక్కడ సులోచన రాముని స్తుతించడాన్ని బట్టి రాముని గొప్పతనాన్ని, అతని దైవత్వాన్ని గ్రహించినట్లుగా చెప్పవచ్చు. రాముని చేతిలో తన భర్త మరణించినచో అతనికి మోక్షము లభించి ఉండునని భావించినది కాబోలు. కావునే అమె రామునికి నమస్కరించినది.

పై గేయంలో సులోచన రాముని స్తుతించుటకు మరోకారణాన్ని పరిశీలిస్తే, రావణుడు సీతను అపహరించుకొచ్చాడు. ఇలా వేరొకరి భార్యను తీసుకురావడం న్యాయ విరుద్ధం. రాముడు తన భార్యను దక్కించుకొనుటకు రావణునితో పోరాడి తన భార్యను తాను దక్కించుకోవాలనుకోవడం న్యాయసమ్మతమే కదా! ఇలాంటి సమయంలో ఇంద్రజిత్తు తండ్రికి అండగానిలచి పోరాడి ప్రాణాలు పోగొట్టుకోవడం అతని కర్మ ఫలమే కానీ రాముని తప్పిదమేమీలేదని తలచినదైనా కావచ్చు సులోచన. అందుకే ఆమె రామునికికాక అతనిలోని ధర్మరక్షణకు నమస్కరించిందనవచ్చు.

సులోచన రాముని ఈ విధంగా స్తుతించి తన భర్త ప్రాణములిమ్మని క్రింది గేయంలో రామునితో విన్నవించుకుంటుంది.

"మరుగు సొచ్చితికాన మన్నించునట్టి - బిరుదు నీ బిరుదు రూపింప నా విభుని

మరల ప్రాణములిచ్చి మన్నించునాకు - పురుష భిక్షము వెట్టి భువినన్ను నిలుపు" [97]

ఈ గేయంలో తన భర్తను తిరిగి తనకు ప్రసాదించమంటుంది. తన భర్త లేనిచో తనకు జీవితం లేదని తాను బ్రతికుండాలంటే తన భర్త ప్రాణములిమ్మని రామునితో అంటుంది. కానీ రాముడు బ్రహ్మ విధిరాతను మార్చక వేరే వరమును కోరుకొమ్మనగా తన పతి కళేబరమునయినా ఇప్పించమని కోరెను.

"పరగ నా పతి కళేబరము తెప్పించు - పురమున కతి వేగ బోవంగవలయు" [98]

సులోచన పతివ్రతవయితే మరణించిన తన భర్తతో మాట్లాడుమని సుగ్రీవుడు కోరగా సులోచన కదనరంగం చేరి తన భర్తను తడిమిచూసి ఇలా అనెను.

"పతియె దైవంబని భావంబులోన - సతతంబు వ్రతముగా సలుపుదునేని

చెలగి నా విభునకు జీవంబు వచ్చి - యెలమి నాతో మాటలాడుగాకనుచు "

అనినంతనే

"తనదు ఋణానుబంధము గూడియున్న - నెనసి యుందురు నరులింతులగూడి

వెలయగ యొగ వియోగముల్ బ్రహ్మ - వెలయంగఁగల్పించె వెలది జీవులకు" [99]

పై గేయాలలో సులోచన తన పాతి వ్రత్యమును చూపుటకు కదనరంగానికి వెళ్ళి పతినే దైవగా భావించి జీవించినట్లయితే నా పతికి జీవము వచ్చుననుటతో మేఘనాథుడు సజీవుడై సులోచనకు విధి విధానమును, లోక జ్ఞానమును బోధించి కనులు మూయును.

రాముడు సులోచనకు ఇంద్రజిత్తు కళేబరమును ప్రసాదించగా ఆమె రామునికి నమస్కరించి అంతఃపురమునకు పోయి తన కుమారులను దగ్గరకు తీసుకొని, వారిని ముద్దులాడి, నీతులు, హితవులు చెప్పి కుమారుల పట్ల వాత్సల్యమును క్రింది గేయంలో ప్రకటించును.

" సుతులార మీ ముద్దు చూడంగ నాకు - హితవు మీఱగ దైవమీయకపోయె

మహిమీద నుండ ధర్మము కాదు తనకు - సహగమనంబు నిశ్చయముగాఁగూర్తు

నిక్కడ నుండుట యిది బుద్ధిగాదు - తక్కక పొండు పాతాళంబునకు

స్థిర బుద్ధి మీరాదిశేషుని యింట - వెరవకుండుడటంచు వేగంబె పంపి " [100]

ఈ గేయంలో సులోచన తల్లిగా తన బిడ్డల యెడల ఉన్న అనురాగాన్ని మనం చూడవచ్చు. బాల్యంలో పిల్లల ముద్దూముచ్చట చూడాలని ప్రతి తల్లిదండ్రులకూ ఉంటుంది. కానీ ఇంద్రజిత్తు మరణాంతరము సులోచన పతితో సహగమనం చేయదలచి తన పిల్లలు ఒంటరివార్రై, దిక్కులేని వారై పోతారని తలచి తల్లిగా పిల్లలను దగ్గరకు తీసుకొని వారికి మంచి నీతులు, బుద్ధులు చెప్పి పిల్లలను పాతాళంలో వారి తాతగారి దగ్గరకు పొమ్మని హితవు చెబుతుంది.

## 4.7. భూదేవి

### i.అమ్మ మనసు

భూదేవి సీత అప్పగింతల సమయంలో సీతకు వంటింటి పనులేవీ రావని నేర్పుగా చెప్పి చేయించుకోమని కౌసల్యకు చెబుతుంది. భూదేవి కౌసల్యతో తాము సీతను తమ ఇంట్లో పెరుగన్నం పెట్టి పెంచుకున్నామనీ కనీసం మీ ఇంట సద్దన్నమయినా పెట్టి బిడ్డ ఆకలి తీర్చమని అంటుంది. ఇక్కడ భూదేవికి తనబిడ్డ ఆకలి తీరడమే ముఖ్యం కానీ అది పెరుగన్నమా, సద్దన్నమా అనేది కాదు. లక్ష్మణుడు సీతను అడవికి తీసుకువచ్చి అన్నగారి ఆజ్ఞ ప్రకారం మరణశిక్ష వేయుటకు ఖడ్గమును సీతపైనుంచగా భూదేవి ప్రత్యక్షమై తన కుమార్తెకు జరిగే ఘోరాన్ని అడ్డుకుంటుంది. ఒక తల్లిగా బిడ్డను రక్షించుకోవడం తల్లి భాద్యత.

జానపదులు భూదేవి పాత్రకు అంతగా ప్రాధాన్యం ఇవ్వలేదు గానీ సీత అప్పంగింతల సమయంలో ఒక తల్లిగా ఆమె చేసే అప్పంగింతలను ఎంతో సహజంగా జానపదుల మనస్తత్వాలకు దగ్గరగా చిత్రించుకున్నారు. లక్ష్మణుడు రాముని ఆజ్ఞతో గర్భవతిగా ఉన్న సీతను అడవులకు తీసుకు వెళ్ళి వధించబోయే సందర్భంలో ఒక తల్లిగా తన బిడ్డను రక్షిచుకోవడంలోనూ, లవకుశులతో రాముని యుద్ధానతరం సీతను తనతో పాటు తీసుకు వెళ్ళడం వంటి సందర్భాలలో మాత్రమే జానపదులు భూదేవి పాత్రను చిత్రించారు.

భూదేవి సీతను అప్పగింతలు చేసే సమయంలో కౌసల్యతో సీత గురించి క్రింది విధంగా వివరిస్తుంది.

"వదినరో నాపుత్రి ఇది వప్పగింత
పదిలంబుగా దీని బాగా చూడమ్మ
పాలు కాచగ లేదు బాల మా వదినరో
నెయ్యి కాచగ నేరదు నెలత సుమి మదినా
నేర్పుగా చెప్పు సీత మీదమ్మా "

అని చెబుతూ

"బుద్ధులెరుగదు మంకు బుద్ధులే గాని
బుద్ధి వచ్చిన దాక దిద్దుకో వదినా "[101]

అని భూదేవి కౌసల్యకు సీతను అప్పగించును.

ఈ విధంగా భూదేవి సీత అప్పగింతలు చేస్తుంది. సహజంగా లోకంలో ఆడపిల్లల తల్లులందరూ పెళ్ళి తరువాత చేసే అప్పగింతలలో తమ కూతురి స్వభావం ఎలాంటిదయినా సమర్ధిస్తూనే ఉంటారు. కానీ భూదేవి సీత అప్పగింతల సమయంలో సీతకు పాలు, నెయ్యి వంటివికూడా కాయడం రాదని నేర్పుగా చెప్పి చేయించుకోమని కౌసల్యకు చెబుతుంది.

భూదేవి సీతకు అత్తవారింట ఎలా ఉండాలో క్రింది గేయంలో వివరిస్తుంది.

"పొద్దోయి పొరుగిళ్ళ బోకమ్మ
సందలడి చాకిళ్ళ కెళ్ళబోకమ్మ
వీధిలో తలకురులు విప్పబోకమ్మ
పదుగురిలో పన్నెత్తి నవ్వబోకమ్మ
మందిలో కన్నెత్తి చూడబోకమ్మ "

అని చెబుతూ

"బావమరుదలు ఉంటే బంతాడవద్దని
వారనే మాటలకు తిరిగి అనవద్దని
తోటి యారాండ్లతో తోడుగా ఉండుమని "[102]

భూదేవి సీతకు బుద్ధులు చెబుతుంది.

ఈ గేయంలో భూదేవి సీతకు అనేక సాంఘికకట్టు బాట్ల గురించి చెబుతుంది. చిన్నతనం నుండీ అల్లారుముద్దుగా పెరిగిన సీత నేటినుండి అత్తవారింట జీవితం కొనసాగించాలి కనుక అక్కడ ఎవరితో ఎలా మెలగాలో చెబుతుంది.

క్రింది గేయంలో భూదేవి అత్తవారింట పొద్దున్నేలేచి అన్నం అడుగవద్దని సీతకు చెబుతూ ఉదయాన్నే కాస్త సద్దన్నమయినా పెట్టి కూతురు కడుపు నింపుమని కౌసల్యను కోరును.

''పొద్దున్నే లేచేవు సద్దన్న పడుగేవు

సద్దన్న మడిగితే ఎవ్వరు పెడుతరు బిడ్డ

పెరుగు వన్నం బెట్టి పెంచూకున్నానమ్మ

సద్దివన్నంబెట్టి సాదుకో కౌసల్య ''[103]

ఈ గేయంలో భూదేవి సీతతో అత్తవారింట ఉదయన్నే పెరుగన్నమడిగితే ఎవరు పెడతారంటూ, కౌసల్యతో తాము సీతను తమ ఇంట్లో పెరుగన్నం పెట్టి పెంచుకున్నామనీ కనీసం మీ ఇంట సద్దన్నమయినా పెట్టి బిడ్డ ఆకలి తీర్చమని అంటుంది. భూదేవి సీతకు పెరుగన్నం పెట్టి పెంచుకున్నామని అయితే సీత ఇప్పుడు అత్తరింటికి వెళుతుంది కావున అక్కడ తల్లిలా చూసుకునే వాళ్ళు ఎవరూ ఉండరనీ కావున అక్కడ పరిస్థితులను బట్టి మెలగమని వారు పెట్టింది తిని సర్ధుకోమంటుంది. అలాగే కౌసల్యతో భూదేవి తమ బిడ్డకు పెరుగన్నం పెట్టకపోయినా పర్వలేదుగానీ సద్దన్నమయినా పెట్టి కడుపునింపుమని అంటుంది. ఇక్కడ భూదేవికి తనబిడ్డ ఆకలి తీరడమే ముఖ్యం కానీ అది పెరుగన్నమా, సద్దన్నమా అనేది కాదు.

రాముడు లక్ష్మణునితో సీతను అడవులకు తీసుకెళ్ళి ప్రాణాలు తీయమని చెప్పిన తరువాత లక్ష్మణుడు సీతను అడవులకు తీసుకెళ్ళి ప్రాణాలు తీయుటకు ఖడ్గము తీయగా ఆ సమయంలో భూదేవి ప్రత్యక్షమై తన కుమార్తెను రక్షించుకోవడం క్రింది గేయంలో చూడవచ్చు.

''రామదశరథరఘుకులరామ। రామశ్రీ అయోధ్యరామా ।

భామనడవులకంప నేమినేరముచేసె। భూమిలో మాసీతరామా।

యెన్ని నోములునోచి । ఎన్ని తపములుజేసి నిన్నుపతిగాగోరెనో రామా।

ఎన్నడు నిన్నును యెడబాసినదిగాదు। ఎట్లుతాళునుసీతరామా।

పక్షమింతయులేక అభిమానవతిమీద। శతపక్షములు బలికితివిరామా।

చిన్ననాటానించిచెలియలి। గుణములు చిత్తాన తెలియవారామా।

ఎన్నగా మావంటివారియందరికెల్ల।వంచనలునడుపునురామా।

ముక్కంటివిలువిరువమునులు।దేవతలు బొగడముగుద।

సీతనుయిచ్చితిరామా। మీతండ్రిచెప్పగామీరుఆడవుల।

నడవమీవెంటవచ్చెతా రామా। సీత మీతోటట్లు అడవిఫలములుతిని।

సుఖమెన్న డెరుగదురామా। ఇచ్చిందిమొదలు కొనియాలాగునేకాని।

సుఖముయించుకలేదురామా।రచ్చలురాలురవ్వలకునోచెనో।

రమణి యీమా సీతరామా। మత్స్యగంధి సీత మాకు భారములేదు।

మాటవాసేగానిరామా। వంచనింతయులేక నభిమానవతిమీద।

వంచననేగదజేస్తిరామా। పతులుమెచ్చా యగ్నిదేవతలు కొనియాడ।

గుణము నాడెరుగవారామా। ” [104]

ఈ గేయంలో లక్ష్మణుడు సీతను అడవికి తీసుకువచ్చి అన్నగారి ఆజ్ఞ ప్రకారం మరణశిక్ష వేయుటకు ఖడ్గమును సీతపైనుంచగా భూదేవి ప్రత్యక్షమై తన కుమార్తెకు జరిగే ఘోరాన్ని అడ్డుకుని రామా సీతను అడవులకు పంపించచడానికి ఆమె చేసిన నేరమేమని, చిన్ననాటి నుండి నిన్నే భర్తగా పొందుటకు ఎన్నో వ్రతములు చేసినది అలాంటి సీత గుణములు నీకు తెలియనివా రామా. ఎన్నడూ నిన్నువదలి ఉండలేదే మా సీత అని అంటుంది. శివధనుస్సు విరచి దేవతల ఆశీర్వాదముతో మీ వివాహం జరిగెనుకదా. మీ తండ్రి మాటలకు కట్టుబడి నీవు అడవులకు వెళితే నీతోపాటు అడవులకు కూడ వచ్చి అక్కడ అనేక కష్టాలు పడింది నీ కొరకే కదా. అగ్నిప్రవేశం చేసి అగ్నిదేవునిచే కొనియాడపడలేదా అని, అలాంటి సీతను అడవులపాలు చేయడం నీకు తగునా. సీత నీకు బరువేమోగానీ నాకు బరువేమీ కాదని తన మనసులోని అవేదనను భూదేవి వ్యక్తపరుస్తుంది. ఒక తల్లిగా భూదేవిలో ఈ ఆవేదన సహజమే. బిడ్డకు ఆపద జరుగుతుంటే ఏ తల్లి మాత్రం ఊరికే ఉంటుంది.

'*తెలుగు జానపద సాహిత్యం పౌరాణిక గేయ గాథలు*' గ్రంథంలో మర్ల సుబ్బలక్ష్మిగారు జానపదుల భారతాన్ని గూర్చి ఇలా వివరించారు. సంస్కృత వ్యాసుని భారతాన్ని తెలుగు వారికి అందించాలనే ఉద్దేశ్యంతో రాజరాజ నరేంద్రుడు నన్నయచే భారతారంభము గావించాడు. ఈ భారతాన్ని వివిధ కాలాల్లో నన్నయ, తిక్కన, ఎఱ్ఱనలు కలిసి పూరించారు. కవిత్రయం మహాభారతం చదివినా, విన్నా వారికి శుభములు కలుగుననిరి. కానీ జానపదులు ఈ భారతాన్ని చదివితే శాంతులు, సమారాధనలు, సంతర్పణలు చేయాలనే నమ్మకం జానపదులలో ఉంది. భారతాన్ని రచించిన నన్నయ కూడా దాన్ని అర్ధాంతరంగా వదిలివేయడానికి అనేక అపోహలను జానపదులు కల్పించి భారతానికి దూరంగా నిలచారని చెప్పవచ్చు. ఉత్తర హిందూ దేశంలో ఈ భరతం 18 పర్వాలు 'పాండవాని' అనే పేరుతో జానపద వీరగాథాచక్రంగా ప్రచారంలో ఉంది. ఈ భారతంపై తెలుగుదేశంలో రూపుదిద్దుకున్న గేయాలు చాలా వరకు స్త్రీలకు సంబంధించినవే కావడం విశేషం. జానపదులు భారత కథలో కూడా తమ కల్పనా చాతుర్యంతో అనేక కల్పనలు చేసి గేయాలను పాడుకునేవారు. భారత గేయలు వేళ్ళపై లెక్కించేవిగా ఉన్నాయి. దృశ్యకళా రూపంలో మాత్రం జానపదులు రామాయణానికి కన్నా భారతానికే అధిక ప్రాధన్యము నిచ్చారు.

## 5. 1. ద్రౌపది

### i. ఆత్మభావన

ధర్మరాజు జూదంలో ద్రౌపదిని ఓడినందుకు దుశ్శాసనుడు ద్రౌపదిని కౌరవ సభలో వివస్త్రను చేసే సందర్భంలో ద్రౌపదిలో 'కార్ల్ రోజర్స్' ప్రతిపాదించిన 'ఆత్మభావన' సిద్ధాంతం కనిపించును. వ్యక్తులు తమ గురించి, ప్రపంచం గురించి తమలో ఏర్పరచుకున్న భావనల సమాహారమే ఆత్మభావన. వ్యక్తులు తమలో ఏర్పరచుకున్న భావాలకు, ప్రస్తుతం అనుభవాలకు మధ్య భేదం ఉన్నప్పుడు వారు అపసామాన్య ప్రవర్తనకు లోనవుతారు. ఈ సమయంలో వీరికి తగిన సానుభూతి, దయ , గౌరవం అందిస్తే ఈ స్థితి నుండి బయటపడతారు. ఇలాంటి పరిస్థితే ద్రౌపదికి ఎదురైంది. కోరి పాండురాజు కోడలినైనందుకు తనకు ఎలాంటి గౌరవ మర్యాదలు దక్కలేదని పైగా తనకు కౌరవ సభలో జరుతున్న అవమానానికి ఎలాంటి రక్షణ లభించక పోవడంతో ద్రౌపది అపసామాన్య ప్రవర్తనకు గురవుతుంది. ఈ సమయంలో ద్రౌపదికి ఆమె సోదరుడు కృష్ణుడి దగ్గర నుండి రక్షణ లభించడంతో ద్రౌపది అపసామాన్య స్థితి నుండి బయటపడుతుంది.

### ii. వాక్చాతుర్యం

స్త్రీలకు సహజ వరం వాక్చాతుర్యం. కీచకుడు సైరంధ్రిగా నున్న ద్రౌపదిని మోహించిన సమయంలో సైరంధ్రి తాను దాసినని, వేశ్యను కానని కీచకుడు తానెవరో తెలియకే తనను మోహిస్తున్నాడనుకుని సైరంధ్రి తాను ఒంటరిని కానని తన పతులు తననెప్పుడూ రక్షిస్తుంటారని తనను సోదరిగా భావించి తనపై మోహన్ని విడువుమని కీచకునికి హితవు చెబుతుంది.

### iii. క్రోధం

ద్రౌపదిని దుశ్శాసనుడు కౌరవ సభలో అవమానించే సమయంలో ఆమెలో అరిషడ్వర్గాలలోని క్రోధాన్ని చూడవచ్చు. తనకు జరుగుతున్న అవమానానికి ప్రతీకగా దుశ్శాసనుని అంతమొందించిన తరువాతే తన తలను ముడుస్తానని ప్రతిజ్ఞ చేసి తన ఆత్మగౌరవాన్ని నిలుపుకుంది.

**iv. .కృతజ్ఞతాభావం**

లోకంలో ఏ స్త్రీ తన భర్తను వేరొకరితో పంచుకోవడానికి ఇష్టపడదు. ద్రౌపది తన భర్త అర్జునుని, శ్రీకృష్ణుని సోదరి సుభద్రతో కలిసి పంచుకోవడానికి ఇష్టపడుతుంది. కృష్ణుడు సుభద్రను చూసినట్లే ద్రౌపతిని కూడ తన సోదరిగానే చూసేవాడు కనుక ద్రౌపదికి కృష్ణునిపై సోదరానురాగం ఏర్పడింది. దుర్యోధనుడు నిండు సభలో ద్రౌపతిని వివస్త్రను చేస్తున్న సందర్భంలో కృష్ణుడు ఆమె మానాన్ని రక్షిస్తాడు. తన మానాన్ని కాపాడిన తన సోదరునికి కృతజ్ఞతా భావంతో ఉండాలి కావుననే కృష్ణుని సోదరి సుభద్రను అర్జునితో కలిసి పంచుకోవడానికి ఇష్టపడింది. మరెవరైనా అయితే భర్తను పంచుకోవడానికి ఇష్టపడేది కాదు.

**v. కామం**

సజ్జన సాంగత్యమందు అభిలాష, పరుల గుణములందు ప్రీతి మొదలైన వాటిచే మనం ఇతరుల సాంగత్యమును కోరుట సహజము. ఈ విధంగానే ద్రౌపది కర్ణుని కోరుకుందనవచ్చు. కర్ణుడు కుంతి కుమారుడే కావున తనను అర్జునుడు స్వయంవరంలో గెలిచినప్పుడు కుంతి పుత్రులందరూ తనను పత్నిగా స్వీకరించిరి. ఈ విధంగా కర్ణునికీ తనను పత్నిగా స్వీకరించే హక్కుగలదని తలచి ద్రౌపది కర్ణుని భర్తగా కోరుకుంది.

మాతృస్వామిక వ్యవస్థలో తప్ప పురుషాధిక్య సమాజంలో స్త్రీకి స్వేచ్ఛ లభించినట్లు ఎక్కడాలేదు. రామాయణంలో సీత, ద్రౌపది వంటి వారిని పితృస్వామిక వ్యవస్థలో పురుషాధిక్యతకు కట్టుబడి జీవించిన వారిగా చెప్పవచ్చు. భారతంలో ద్రౌపది మనో భావాలకు, కోరికలకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వలేదు. అర్జునుడు స్వయంవరంలో తనను గెలిచి తన సోదరులతో ద్రౌపదిని పంచుకున్నప్పుడే ఆమె వ్యక్తిత్వం కోల్పోయింది. ధర్మరాజు జూదంలో ద్రౌపదిని ఓడడం ద్వారా కౌరవ సభలో ఆమెకు జరిగిన పరాభవం లాంటివెన్నో ఆమె ఒక స్త్రీగా ఎంత పతనమయ్యిందో చెప్పవచ్చు.[105]

జానపదులు ద్రౌపదిని శక్తి స్వరూపిణిగా, కాళికాదేవి ప్రతిరూపంగా ఆదిశక్తి అవతారంగా గ్రామదేవతగా కొలుస్తారు. జానపదుల దృష్టిలో రేణుకాదేవి, సీతాదేవి, కాళికాదేవి ద్రౌపది అవతారాలుగా భావించి గ్రామాలలో

ద్రౌపదిని ప్రతిష్టించి ఆమె పేరున తిరునాళ్ళను జరుపుకుంటారు. దుర్యోధనుని సంహరించుటకు అవతరించిన మహాశక్తిగా భావిస్తారు. కొన్ని గ్రామాలలో ద్రౌపదికి గుడులుకూడా ఉన్నాయి. ద్రౌపదిని పూజించే జానపదులలో బాగా ప్రచారంలో ఉన్న గేయంగా కింది గేయాన్ని చెప్పవచ్చు.

''మొదటి యుగమ్మున రేణుకవైతి
కృతయుగమ్మున సీతవైతి
ద్వాపరమ్మ ఐదుగురికి రాణివైతి
మంగళం మహంకాళిదేవి
ఓం చండీ భగవతి
అంగజానీ రాణీ మహాదేవీ
ముగ్గురు మూర్తుల మూలము నీవె
ఓ విశ్వజననీ
తెగువ కలిగిన మృత్యువైతివి
ముందు కన్నియవై జన్మించావు
అన్ని పూజలు గొన్న వెతల్లి
కోటి సూర్యుల ధిక్కరించినవె తల్లి
శ్రీ శ్యామలాంబవై
మహిషాసురుల తిద్రుంచితివె
మంగళం మహంకాళికాదేవి '' [106]

ధర్మరాజు జూదంలో ద్రౌపదిని ఓడినందున దుశ్శాసనుడు ద్రౌపదిని కౌరవ సభలో దుర్యోధనుడి ఆజ్ఞమేరకు ద్రౌపదిని వివస్త్రను చేసే సందర్భంలో పతులతోసహా ఎవరూ ఆమెను రక్షించే ప్రయత్నం చేయకపోవడంతో చివరకు అన్నయ్య కృష్ణుడే దిక్కని తలచి తనను కాపాడమని కృష్ణుని క్రింది విధంగా ప్రార్థిస్తుంది.

“నీలవరన పాలశమన నిన్ను నమ్మినానురా

నన్ను సభకు తీసి అవమానింప బోతున్నారురా

అచ్యుతా నను బ్రోవరా యిక దిక్కు ఎవ్వరున్నారురా

దిక్కు నీవే దీన బాంధవ గ్రక్కుననన్ను బ్రోవరా

కంస మర్దన వంశపాలన కలికి కృష్ణా బ్రోవరా

రాతి నాతిగ జేసియిల ప్రఖ్యాతి గాంచిన దాతవు

కోరి పాండురాజు యింటికి కోడాలు నైనందుకు

వార కాంతల దీటు సేయగ సభలో బ్రతుకెందుకు

ఆడస్త్రీలను అంటరాదని వేడుకొనిచున్నానురా

పాతకుడు దుశ్శాసనుడు నాపైట బట్టుకున్నాడురా

పతుల ఎదుట కట్టుచీరలు విడచుట నీకు ధర్మమా

వాసుదేవ వరకుమార వలువలు దయచేయరా

భీష్మ ద్రోణ కృపులు నారదమౌను లెచట నున్నారురా

రాని వాసపు స్త్రీని యిపుడు రాజసభకెటుపోదురా ” [107]

ఈ గేయంలో ద్రౌపది తనను కాపాడుటకు కౌరవ సభలో భీష్మ ద్రోణులుగానీ పాండవులుగానీ ఎవరూ సాహసించక పోవడంతో తన అన్నయ్యే దిక్కని తలచి కృష్ణుని ప్రార్థించి వస్త్రాపహరణ సమయంలో రక్షణ పొందింది.

ద్రౌపది ‘కోరి పాండురాజు యింటికి కోడాలు నైనందుకు వార కాంతల దీటు సేయగ సభలో బ్రతుకెందుకు’ అని పలుకనుబట్టి తాను కోరి పాండురాజు కోడలినైందుకు పాండురాజు కోడలిగా తనకు ఎలాంటి గౌరవమూ, విలువ లేవనీ వారకాంతలవలె తనకు జరిగే అవమానాన్ని భరించి బ్రతుకలేనని తనను రక్షించమని కృష్ణుని వేడుకుంటుంది. ఈ మాటల ద్వారా మనకు ద్రౌపదిలో కార్ల్ రోజర్స్ self concept(ఆత్మభావన) సిద్ధాంత లక్షణాలు కనిపించును.

ఈ సిద్ధాంతం ప్రకారం వ్యక్తులు తమ గురించి, ప్రపంచం గురించి తమలో ఏర్పరచుకున్న భావనల సమాహారమే 'ఆత్మభావన'. వ్యక్తులు తమలో ఏర్పరుచుకున్న భావాలకు ప్రస్తుత అనుభవాలకు మధ్య భేదం ఉన్నప్పుడు వారు అపసామాన్య ప్రవర్తనకు లోనవుతారు. వ్యక్తులు ఈ స్థితి నుండి బయటపడాలంటే వారికి సంబంధించిన వారి అంగీకారం, సానుభూతి, దయ, గౌరవం అందిస్తే ఈ స్థితినుండి బయటపడవచ్చు. ఈ గేయంలో ద్రౌపదిది ఇదే పరిస్థితి. కోరి పాండురాజు కోడలునైనందుకు తనకు పాండురాజు కోడలిగా ఎలాంటి గౌరవ మర్యాదలూ దక్కలేదని, ప్రస్తుత సభలో రక్షణకూడా లభించలేదనే భావనతో ఆమె అపసామాన్య ప్రవర్తనకు లోనయ్యే సందర్భంలో ఆమెకు అన్నయ్య కృష్ణుని దగ్గర నుండి రక్షణ లభించడంతో అపసామాన్యస్థితి నుండి బయటపడుతుంది.

'పతుల ఎదుట కట్టుచీరలు విడచుట నీకు ధర్మమా వాసుదేవ వరకుమార వలువలు దయచేయరా' అను మాటలనుబట్టి సహజంగా ఏ స్త్రీకైనా ప్రాణం కంటే గొప్పది ఆమె మానం. స్త్రీ ప్రాణాన్నయినా వదులుకుంటుందిగానీ తన మానహానిని సహించదు. ఇలాంటి సందర్భమే ద్రౌపదికి ఎదురయ్యింది. తన మానాన్ని కాపాడుటకు ఎవరూ సాహసించక పోవడంతో తన అన్నయ్య కృష్ణుని వేడుకొని పతుల ముందు నన్ను వివస్త్రను చేయుట నీకు తగునా? ఇది ధర్మమా? తన మానాన్ని కాపాడ వలువలు దయచేయుమని కృష్ణుని ప్రార్థిస్తుంది.

సహజంగా స్త్రీ పుట్టినప్పటి నుండి తన మాన ప్రాణాలకు రక్షవహించేది తల్లిదండ్రులు, సోదరులు. వివాహానాంతరం భర్త పూర్తి భాద్యత వహించును. కానీ నేడు కౌరవ సభలో భర్తలే తన మానాన్ని కాపాడలేని స్థితిలో ఉన్నారు కావున సోదర సమానుడు కృష్ణుడే దిక్కని తలచింది. 'కంస మర్ధన వంశపాలన కలికి కృష్ణా బ్రోవరా రాతి నాతిగ జేసి యిల ప్రఖ్యాతి గాంచిన దాతవు' ఈ మాటలను బట్టి కంసుని సంహరించి ధర్మస్థాపన చేసినావు, అహల్యకు శాప విముక్తి గాంచినావు. నాకునూ వస్త్రములిచ్చి నా మాన, ప్రాణములు కాపాడలేవా అనే భావంతోనే ద్రౌపది కృష్ణుని వేడుకుంటుంది.

'రాని వాసపు స్త్రీని యిపుడు రాజసభకెటుపోదురా' అనే ద్రౌపది పలుకులలో తనకు జరిగే అవమాన భారంతో తాను రాజ్యనికెలా వెళ్ళనని ప్రాణత్యాగం తప్ప వేరే మార్గం లేదని స్త్రీకున్న విలువలను చెప్పకనే చెప్పి కృష్ణుని వేడుకొని రక్షణ పొందుతుంది.

ద్రౌపదిని కౌరవ సభలో అవమానించిన దుర్యోధనుని వధిస్తానని భీముడు ప్రతిజ్ఞ చేస్తాడు. కానీ జానపదుల భారతంలో తనను అవమానించిన దుర్యోధనుని వధిస్తానని ద్రౌపది ప్రతిజ్ఞ చేయడం క్రింది గేయంలో గమనించవచ్చు.

"తన తొడలు ఝుక్కమన్న రారాజు

తొడలు చీరించక తల ముడవననెనూ

తన శిఖ పట్టినా దుశ్శాసనుని

చేతులు తోరణాలు గుచ్చకాతలముడువననేనూ "[108]

ఈ గేయంలో జానపదులు ద్రౌపదిని పరాశక్తిగా భావించి ఆమె పరాక్రమాన్ని తెలియ జేయుటకే భీమునికి బదులుగా ద్రౌపదిచే ప్రతిజ్ఞ చేయించారు. అరిషడ్వార్గాలలో రెండవది, ఉత్కటావస్థయందున్న క్రోధమును ద్రౌపదిలో చూడవచ్చు. తనకు అవమానము జరిగిన సమయంలో ఈ అవమానానికి కారణమయిన రారాజును, దుశ్శాసనుని అంతమొదించిన తరువాతే తను తల ముడుస్తానని తగిన పరాక్రమము చూపి ఆత్మగౌరవాన్ని నిలుపుకుంది ద్రౌపది.

12 సంవత్సరాల అరణ్యావాసం పూర్తిచేసుకొని అజ్ఞాతవాసం విరాటరాజు దగ్గర గడపాలని నిర్ణయించున్నారు పాండవులు. ఒక్కొక్కరు ఒక్కో మారు వేషాన్ని ధరించి విరాటరాజు కొలువులో చేరారు. ద్రౌపది సైరంధ్రిగా మహారాణి సుష్ణాదేవి అంతఃపురంలో చేరుతుంది. ఒకనాడు అక్క సుష్ణాదేవిని చూడవచ్చిన ఆమె సోదరుడు కీచకుడు ద్రౌపదిని చూసి ఆమెని మోహించి ద్రౌపదికి తెలియకుండా తన అక్కతో ఆమెను ఏదో ఒక నెపముతో తన మందిరానికి పంపమంటాడు. మదిర పేరుతో సుష్ణాదేవి ద్రౌపదిని కీచకుని మందిరానికి పంపుతుంది. అక్కడ కీచకుడు ద్రౌపదిని బలాత్కరించ బోవుటతో తనను విడువమని లేనిచో గంధర్వులయిన తన భర్తలు కీచకుని సంహరించునని హితవు చెప్పుటను మనం క్రింది గేయంలో గమనించవచ్చు.

"అంట రాకుమురా కీచక యోరి తుంటరితన మేలా

అంటరాకుమురా కీచకా నేనొంటిదానను కాను భువిలో

పంచపతులున్నారు వారికి నిజముగానిను త్రుంచి వేతురూ

మాయా జూదమునా గంధర్వులు వోడి రాజ్యమునూ

మాయా జూదమునోడి రాజ్యములోడియు దాయాదులకును

పదిలముగ పదిరెండు యేండ్లు అరణ్యావాసము గడిపి వస్తిమి

కల్లు పోయుమురా కీచక యోరి అల్లరేలనురా నాతో

కల్లు పోయిము అల్లరేల కాంత సుదేష్ణమ్మ పంపెను

కల్లు తెమ్మని నన్ను పంపెను కలహమేలరా కన్న తండ్రి

దాపునున్నారో గంధర్వులు చూచుచున్నారో దేవా

దాపునున్నారు చూచుచున్నారు ధర్మ పాచ్చా భస్దలసచు

వప్పుగనుయక తను విన్న యిప్పుడేను త్రుంచివేతురు

వేశ్యానాధురా కీచక యోరిదాసిదానను దేవా

వేశ్యగానురా దాసిదానను వద్దుర నామీద మొహవల

చిత్రముగ గంధర్వులేవురు చిత్రవధగా వింపకిడవరూ

అక్క చెల్లెలుననుచునమ్మ వప్పుగా నీవు చూచుకోర

తప్పక శ్రీహరి నిను యిప్పుడే రక్షించుగాక

ధరణిలో కలవాయుసేషాద్రి వాసుడు కాసి రక్షింపుము కౌసల్యవరపుత్ర "[109]

ఈ గేయంలో సైరంధ్రి తను ఒంటరిదానను కాదని తనకు అయిదుగురు పతులున్నారని వారు గంధర్వులని వారు తనను ఎప్పుడూ రక్షిస్తూ ఉంటారని కావున తనను విడువమని, తాను దాసినని తనను అక్కగా చెల్లిగా భావించి తనపై మోహాన్ని విడువమని కీచకునికి హితవు చెబుతుంది.

స్త్రీలకు వాక్చాతుర్యం సహజ వరం. కోపం, ఈర్ష్య, ఉద్రేకం, పగ వంటివి మానవులలో కలిగిన, అవతలి వ్యక్తులబట్టి, ఆ వ్యక్తులు చేసిన పనులను బట్టి ఆ సమయంలో కలిగిన కోపాన్ని బట్టి మనం వారిని తిట్టుట, కొట్టుట వంటివి చేస్తాము.ద్రౌపది తన బుజ్జగింపు మాటలతో తన పతుల గురించి వారి పరాక్రమాల గురించి వివరించును. తాను వేశ్యను కానని, దాసినని, కీచకుడు తెలియక తనను మోహించుచున్నాడని హితవు చెబుతుంది.

అరణ్యవాస సమయంలో పాండవులు ఖాండవ మహాముని ఆశ్రమంలో ఉన్నప్పుడు సమీపంలో ఉన్న మామిడి చెట్టుపై ఉన్న పండును అర్జునుడు తన గాండీవంతో కొడతాడు. ఆ పండు ఒక మాహాముని ఆహారమని రోజుకు ఒకటే కాస్తుందని ఈ విషయం ఆమునికి తెలిసినచో శాపానికి గురవుదురని కృష్ణుడు చెప్పుటతో పరిష్కార మార్గం చుపమనగా కృష్ణుడు పాండవులందరూ తమ మనసులలోని కోరికలను దాచకుండా చెప్పినచో ఆ పండు తిరిగి యధాస్థితికి చేరుననెను. ఈ గాథ జానపదుల కల్పన మాత్రమే. వీరు అనేక గేయాలలో ఈ గాథను 'పండుపాట'గా పాడుకునేవారు. [110]

పండుపాట గేయంలో ద్రౌపది మనసులోని కోరికను కృష్ణునితో చెబుతుంది.

"అయిదుగురు పతులూ తనకూ వుండగ - మిగులగ పతినీ ఆరోవాడీ
మీద మనసూ గలిగుండుటకూ - తెగలొని పల్కెను గగనం పొంగెను
దుందుభులటు మ్రోయగ పండంటెన్ " [111]

ద్రౌపది ఈ విధంగా పలుకుటను బట్టి ద్రౌపదికి కర్ణుని మీద మనసుందని అతనిని ఆరో భర్తగా స్వీకరించేందుకు తనకు ఎలాంటి అభ్యంతరము లేదని తెలుస్తుంది. దీనికి కారణాన్ని పరిశీలించితే కర్ణుడు కుంతి కుమారుడు. పాండవులకు సోదరుడు కావున అతనిని భర్తగా పొందుట ఎలాంటి నేరమూ కాదని అర్జునుడు తనను స్వయంవరంలో తీసుకురాగా అన్నదమ్ములు అయిదుగురూ తనను స్వీకరించారు. కర్ణుడు కూడా వారి సోదరుడే కాబట్టి ఇలాంటి కోరిక కోరిందనవచ్చు.

సహజంగా లోకంలో ఏ స్త్రీ తన భర్తను వేరొక స్త్రీతో పంచుకోవడానికి ఇష్టపడదు. కానీ ద్రౌపది అర్జునుని సుభద్రతో పంచుకోవడానికి ఇష్టపడుతుంది.

"యేమివస్తులయిన యీవచ్చుగాని ।ప్రాణేశునిచ్చి తాబ్రతుకంగరాదు
ధన ధాన్యమే మయిన యీయవచ్చుగాని। ప్రాణేశునిచ్చి తాబ్రతుకంగరాదు
అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకులు । ఆజ్ఞకు వెరచి నేనపుడూరకుంటి
మానము గాచేటి మాధవుండతడు । మానసంరక్షకుడు మదిని యేమనునో " [112]

లోకంలో ఏ స్త్రీ తన భర్తను వేరొకరితో పంచుకోవడానికి ఇష్టపడదు. ధనాన్ని ధాన్యాన్ని ఇచ్చి బ్రతుకవచ్చుగానీ పతిని వేరొకరితో కలిసి పంచుకోవడం కన్నా మరణించుట మేలని ప్రతి స్త్రీ అనుకుంటుంది. కానీ ద్రౌపది తన భర్త అర్జునుని, శ్రీకృష్ణుని సోదరి సుభద్రతో కలిసి పంచుకోవడానికి ఇష్టపడుతుంది. దీనికి కారణం పరిశీలించినట్లయితే దుర్యోధనుడు నిండు సభలో ద్రౌపతిని వివస్త్రను చేస్తున్న సందర్భంలో కృష్ణుడు ఆమె మానాన్ని రక్షిస్తాడు. స్త్రీకి తన మానంకన్నా లోకంలో దేనికీ ప్రాధాన్యత ఇవ్వదు. అలాగే తన మానన్నికాపాడిన వారికి జీవితాంతం కృతజ్ఞతా భావంతో ఉంటుంది.

సుభద్ర శ్రీకృష్ణుని సోదరి. కృష్ణుడు సుభద్రను చూసినట్లే ద్రౌపతిని కూడ తన సోదరిగానే చూసేవాడు కనుక ద్రౌపదికి కృష్ణునిపై సోదరానురాగం ఏర్పడింది. తన మానాన్ని కాపాడిన తన సోదరునికి కృతజ్ఞతా భావంతో ఉండాలి కావుననే కృష్ణుని సోదరి సుభద్రను అర్జునితో కలిసి పంచుకోవడానికి ఇష్టపడింది. మరెవరైనా అయితే భర్తను పంచుకోవడానికి ఇష్టపడేది కాదు.

## 5. 2. సుభద్ర

### i.Dream of symbalism

సుభద్రార్జునులు ఒకరికొకరు ప్రేమించుకున్నారు. వారి పెళ్ళికి పెద్దలు సమస్యగా మారడంతో తమకు పెళ్ళి జరుగదేమోననే భయం, యవ్వనంలో సహజంగా ఉండే పెళ్ళి గురించిన ఆశలు మొదలైన బాహ్యంగా సుభద్రలో అణచివేయబడినా ఆమె నిద్దురలో అవి కలల రూపంలో బహిర్గతమయ్యాయి. ఈ కలలు మనకు ఉన్న కోరికను స్పష్టంగా తెలియజెప్పవు.

### ii.Child Ego State

సుభద్రలో ఎరిక్ బర్న్ సిద్ధాంతాలలోని చైల్డ్ ఇగో స్టేట్ (Child Ego State) లక్షణాలు కనిపించును. చిన్నపిల్లలు తమకు ఏదైనా ఆనందం, బాధ కలిగితే వాటిని తమ తల్లిదండ్రులతో పంచుకుంటారు. సుభద్రకు యతి ప్రవర్తన బాధ కలిగించడంతో తన అన్నయ్య కృష్ణునికి చెప్పుకుంటుంది. ఇలా ఆనందం వస్తే పొంగిపోవడం, బాధ వస్తే కృంగిపోవడం Child Ego State లక్షణాలుగా చెప్పవచ్చు.

### iii. కోపం

యతి ప్రవర్తన సుభద్రకు బాధను, కోపాన్ని కలిగించి తన అన్నయ్య కృష్ణుని వద్ద చెప్పుకునేలా చేస్తుంది. సహజంగా బాహ్య సన్నివేశాల వల్ల వచ్చే కోపం ఎక్కువ సేపు ఉండదు. కృష్ణుని ద్వారా యతి వేషధారి అర్జునుడని తెలుసుకొని తన కోపాన్ని వదలి మరల అర్జునుని వద్దకు వెళుతుంది సుభద్ర.

### iv. చిలిపితనం

యతికి సేవలు చేస్తున్న సందర్భంలో సుభద్రలో ముగ్ధ కనబడుతుంది. అర్జునుడే యతి అన్న విషయాన్ని తెలుసుకున్న సుభద్ర యతి వద్దకు వెళ్ళి అయ్యా మీరే దేశాలు చూశారు. ఇంద్రప్రస్థం వెళ్ళారా అక్కడ కుంతీ కుమారులను చూశారా వారి యోగక్షేమాలేమి, అర్జునుడు తీర్థయాత్రలకు వెళ్ళాడట అతని సంగతులేమయినా తెలుసా మీకు అని సుభద్ర యతిని అమాయకంగా అడుగుతుంది. ఇంతకాలం తనను ఆటపట్టించిన యతివేషధారి

అర్జునుని కొంతసేపయినా ఆటపట్టించాలనే సుభద్ర అర్జునునితో ఈ విధంగా ప్రవర్తిస్తుంది. సుభద్ర యతివేషధారి అర్జునితో తనంతటతానే అర్జునుడినని సుభద్రతో చెప్పుటకే ఈ విధంగా ప్రవర్తించి నిజాన్ని రాబట్టాలనుకుంటుంది. ఈ సంఘటన సుభద్రలోని చిలిపితనాన్ని తెలియజేస్తుంది.

**V. కోపం**

తనకు, తన వారికి అవమానము, హాని జరిగే సమయంలో తగిన పరాక్రమము చూపి తమ ఆత్మగౌరవమును నిలుపుకోవాలి కనుక అర్జునుడు సుభద్ర పుట్టింటి వారు అల్లుడిగా తనకు ఇవ్వాల్సిన ఎలాంటి సారెను ఇవ్వలేదని నిందిస్తున్న సందర్భంలో సుభద్ర మా వారు పేదవారు అందుకే సారెలేమీ ఇవ్వలేదు. తననుగాక పెద్దింటి అమ్మాయిని పెళ్ళి చేసుకుంటే మీరు కోరుకున్న సారెలు లభించేవని వ్యంగాస్త్రాలతో అర్జునిపై కోపాన్ని చూపి తన పుట్టింటి గౌరవాన్ని కపాడుకుంది. బాహ్య సన్నివేశాల వలన వచ్చే కోపం భౌతిక పరమైన కోపం ఈ కోపం ఎక్కువసేపు ఉండదు. క్షణకాలం మాత్రమే ఉంటుంది. మరో రకమైన కోపం ఆ కోపానికి కారణమయినదాన్ని ఎదుర్కోవాలనే ఆలోచనతో వస్తుంది. ఈ కోపం వల్ల సుభద్ర చిన్నన్నయ్య కృష్ణుని వద్దకు వెళ్ళి అర్జునుడు కోరుకున్న సారెను తీసుకువచ్చి ఇస్తుంది.

సుభద్ర దేవకి వసుదేవుల కుమార్తె. బలరామ శ్రీకృష్ణుల గారాల చెల్లెలు. జానపదులు సుభద్ర కృష్ణుల మధ్య అన్నా చెల్లెళ్ళ అనుబంధాన్ని, సుభద్రార్జునుల మధ్య భార్యాభర్తల అనుబంధాలను తన జీవితాలకు దగ్గరగా చిత్రించుకున్నారు.

ఒక నాడు సుభద్ర ఒక కల కంటుంది. తనకు వచ్చిన కలను తన వదినగారితో ఈ విధంగా చెబుతుంది. వదిన సుభద్ర కలను విని ఆ కలను విడమరిచి చెప్పడం మనం 'సుభద్ర కల' అను క్రింది గేయంలో చూడవచ్చు.

''దేవిన్నీ దేవర కలగంటి నేను - అదినారాయణుని కలగంటినేను

నిత్య మల్లెతోట కలగంటి నేను - నిండిన్న ముత్యాలు కలగంటినేను

పట్టె మంచము పరుపు కలగంటినేను - పళ్ళెరాల పచ్చిపసుపు కలగంటినేను

నట్టింట అద్దమ్ము కలగంటినేను - రావిరేకలవార్ని కలగంటినేను

మద్దికాయల వార్ని కలగంటినేను - పచ్చంగ వేసిన పందిటి కింద

పండిన్న రేకులు కలగంటినేను - ఇంగువ బెల్లమ్ము వెలజీలకర్ర

ఇంతీ నాయింటికి తేను కలగంటి - అరగ ముగ్గిన మామిడి పండ్లు

అతివా నా యింటికి తేనూ కలగంటి

వాకిట వజ్రమ్ము కలగంటినేను - వరుస భోజనాలు కలగంటినేను

కూర్చిన్న ముత్యాలు కలగంటినేను - కూర్చనీ ముత్యాలు కలగంటినేను "[113]

మానవులలో ఉన్న తీరని కోరికలు, భావాలు వారు ఏకాంతంగాగానీ, నిద్దురలోగానీ ఉన్నప్పుడు కలల రూపంలో బహిర్గతమవుతాయని సుభద్రకు వచ్చిన కల తెలియజేస్తుంది. సుభద్రార్జునులు ఒకరికొకరు ప్రేమించుకున్నారు. కానీ వారి పెళ్ళికి పెద్దలే సమస్యగా మారడంతో తమకు పెళ్ళి జరుగదేమోననే భయం, యవ్వనంలో సహజంగా ఉండే పెళ్ళి గురించిన ఆశలు మొదలైన బాహ్యంగా సుభద్రలో అణచివేయబడినా ఆమె నిద్దురలో అవి కలల రూపంలో బహిర్గతమయ్యాయి.

ఫ్రాయిడ్ సిద్ధాంతాలలోని సుప్తచేతనను సుభద్రలో చూడవచ్చు. మనసులోని పొరలలో అన్నింటికంటే చివర సుప్తచేతన అంధకారమయంగా ఉంటుంది. మానవ సమాజంలో మనం ఏర్పరచుకున్న కట్టుబాట్లు, అలవాట్లు, పద్ధతులను ఎవరు వ్యతిరేకించినా, మితిమీరినా సమాజం అంగీకరించదు. అలాంటి వాటిలో లైంగికపరమయిన సమస్యలు ప్రధానమయినవి. ఇలాంటి కోరికలను మనం అణచివేయాలని ప్రయత్నించినా మనం నిద్రించే సమయంలో సెన్సారింగ్ యంత్రాంగం నిద్రపోతుంది కాబట్టి అణచివేయబడిన కోరికలు కలల రూపంలో వస్తాయి. అయితే ఈ కలలు మనకు ఉన్న కోరికను స్పష్టంగా తెలియజెప్పవు. దీన్ని మనము Dream of symbalism అంటాము.

సుభద్రకు వచ్చిన కల కూడా ఇలాంటిదే. సుభద్ర కోరికలను స్పష్టంగా తెలుపక ఆదినారాయణుడు, మల్లెతోట వంటి రూపాలలో దర్శనమిచ్చును. సుభద్రకు వచ్చిన కలను వదినతో చెప్పడంతో వదినగారు ఆ కలను గురించి వివరించడం కింది గేయంలో చూడవచ్చు.

“దేవిన్నీ దేవర నీ తల్లిదండ్రీ - ఆదినారాయణులూ నీ యత్తమామ

నిత్య మల్లెతోట నీవు పుట్టినిల్లు - నిండిన్న ముత్యాలు నీ కడుపుసుమ్మి

పట్టె మంచము పరుపు నీ ప్రాణ విభుడు - పళ్ళెరాల పచ్చి పసుపు అయిదవతనము

నట్టింటీ అద్దము నీ లక్ష్మి సుమ్మి - రావి రేకలవారు రాచమరదళ్ళు

మద్దీకాయల వార్నీ ముద్దు తమ్ములు - పచ్చంగవేసిన పందీరి కింద

పండిన రేకులు తోడబుట్టినవారూ - ఇంగూవ బెల్లమ్మూ వెలజీలకర్ర

ఇంతీ నీ యింటికి కంతదెచ్చేరు - ఆరగముగ్గిన మామిడిపండ్లు

అతివా నీ యింటికీ సారె తెచ్చేరు - వాకిటా వజ్రమ్ము కూతురు సుమ్మి

వరుస భోజనాలు వియ్యాలవారు - కూర్చిన్న ముత్యాలు కూతుళ్ళు సుమ్మి

కూర్చని ముత్యాలు కొడుకూ కోడళ్ళు ”[114]

అర్జునుడు సుభద్ర కొరకు యతి వేషంలో బలరాముని నగరికి చేరి సుభద్రకు తానెవరో తెలియకుండానే ఆమెచే సేవలుపొందుతాడు. యతి వేషంలో ఉన్న అర్జునుడు సుభద్రపట్ల శృంగారపూరితమైన మనసుతో చేసే పనులకు సుభద్ర కృష్ణునివద్దకు వెళ్ళి క్రింది విధంగా యతిపై అభియోగాలను మోపుతుంది.

“యెక్కడి యతివరుడు యితడు వోయన్న

జూడ సహ్యాతగాదు సోగగాడింక

ఆడేటి మాట లిట్లని పలుకరాదు

భిక్షజేసి తన్ను పిలిచిన క్షణమె

వీక్షించి పొత్తులో కిపుడె రమ్మనును

సరసమాడగవచ్చు సారెకు తనతో

సురభి వయ్యారంపు చూపులే జూచు”[115]

సుభద్రలో ఎరిక్ బర్న్ సిద్ధాంతాలలోని చైల్డ్ ఇగో స్టేట్ (Child Ego State) లక్షణాలు కనిపించును. వీరిది చిన్నపిల్లల మనస్తత్వం. ఆనందం వస్తే పొంగిపోవడం, బాధ వస్తే క్రుంగిపోవడం వంటి అనేక లక్షణాలు వీరిలో ఉంటాయి. యతి ప్రవర్తన సుభద్ర మనసుకు బాధ కలిగించి తన బాధను కృష్ణునితో చెప్పుకునేలా చేసింది ఈ లక్షణమే. చిన్నపిల్లలు తమకు ఏదైనా ఆనందం, బాధ కలిగితే వాటిని తమ తల్లిదండ్రులతో పంచుకుంటారు. సుభద్రకూడా తనకు కలిగిన బాధను తన అన్న కృష్ణునితో చెప్పుకొని బాధ పడుతుంది.

సుభద్ర తనపట్ల యతి ప్రవర్తన ఏమీ బాగోలేదని కృష్ణునితో చెప్పుకుని బాధపడుతుంది. యతి ప్రవర్తన సుభద్రలో కోపమును కలుగజేసి అతని స్వరూపమును గురించి అన్నవద్ద చెప్పుకునేలా చేసింది. జిడ్డు కృష్ణమూర్తిగారి ప్రకారం బాహ్య సన్నివేశాల వలన వచ్చే కోపం భౌతిక పరమైన కోపం. ఈ కోపం ఎక్కువసేపు ఉండక క్షణకాలం మాత్రమే ఉంటుంది. సుభద్రలోని ఈ లక్షణాల వలనే కృష్ణుని ద్వారా యతియే అర్జునుడని తెలుసుకొని తనలోని కోపాన్ని వదలి మరల యతి సేవకై వెళుతుంది.

కృష్ణుని ద్వారా యతి వేషధారి అర్జునుడేనని తెలుసుకున్న సుభద్ర అర్జునిని ఆటపట్టించడాన్ని జానపదులు క్రింది గేయంలో అద్భుతంగా పేర్కొన్నారు.

''అయ్యమీరేదేశ మరసిజూచితిరి
యెయ్యెడ మీనామ మెచటవుందూరు - పరగ యింద్రప్రస్త పట్టణంబనగ
పరగసంపదలచే పరగంగవలయు - ధీరమానసులు కుంతీసుతులు యేగూరు
అరయకుశలులూ అయియున్నవారా - కోరిమేనత్త కొడుకులైదుగురు
వారికీకుశలమా వరమునీచంద్ర - ఆ రాజవరులలో అర్జునుండెలమి
ధారుణితీర్థములు దరిశింపనేగె - అనిముందునే వింటి అతడుతామగడి
చనుదెంచుటెరుగుదుర సంయమీనాధా '' [116]

పై గేయంలో యతివేషధారి అర్జునుడేనని తెలుసుకున్న సుభద్ర ఇప్పటి వరకు అర్జునుడు తానెవరో తెలియకుండా సుభద్రను ఆటపట్టించాడు కావున సుభద్రకూడా యతియే అర్జునుడని తెలిసినా తెలియనట్టే ఉండి

ఆటపట్టించాలని యతి వద్దకు వెళ్ళి  అయ్యా మీరే దేశాలు చూశారు. ఇంద్రప్రస్థం వెళ్ళారా అక్కడ కుంతీ కుమారులను చూశారా వారి యోగక్షేమాలేమి, అర్జునుడు తీర్థయాత్రలకు వెళ్ళాడట అతని సంగతులేమయినా తెలుసామీకు అని సుభద్ర యతిని అమాయకంగా అడుగుతుంది.

సుభద్ర తన బావను కొంతసేపు ఆటపట్టించాలనే ఉద్దేశ్యంతోనే తనకు యతివేషంలో ఉన్న అర్జుని గురించి తెలిసినా తెలియనట్లే కుంతి గురించి అర్జునుని గురించి అతని సోదరుల గురించి క్షేమ  సమాచారన్ని అడిగి తెలుసుకుంటుంది. సుభద్ర యతివవేషధారి అయిన  అర్జునితో  తనంతటతానే అర్జునుడినని సుభద్రతో చెప్పుటకే ఈ విధంగా ప్రవర్తించి నిజాన్ని రాబట్టాలనుకుంటుంది. ఈ సంఘటన సుభద్రలోని చిలిపితనాన్ని తెలియజేస్తుంది. మొదట యతి ఎవరో తెలియని సుభద్రలో ముగ్ధ కనబడుతుంది. కానీ  యతి అర్జునుడేనని తెలుసుకొన్నాక ఆమె ప్రవర్తనలో మార్పు కనబడుతుంది.

యతివేషధారి అయిన అర్జునుడు సుభద్రకు నిజమును తెలిపి, కృష్ణుని ఆశీస్సులతో సుభద్రను వివాహమాడతాడు.

ఒకనాడు అర్జునుడు సుభద్రతో మీ పుట్టింటివారు తనకు ఎలాంటి సారెలుగానీ పండగలకు అల్లుడికి జరపాల్సినవేమీ జరుపుట లేదనీ నిందించుటను జానపదులు ఎంతో అద్భుతంగా చిత్రించారు.

''కుంచముతో కుండెడు కొలిచి ఇచ్చిరిగా - కొలత పెళ్ళిరాలు పెట్టి మీవారు
నూనెతో మానెండు కొలిచి ఇచ్చిరిగా - మారుకట్టు చీరలు మనకు మీవారు
తవ్వతో తవ్వెండు కొలిచి ఇచ్చిరిగా - తలంటు గిన్నెలు పెట్టి మీవారు
పున్నమ్మునాడైన బూరెలొండుకుని - పుణ్యుడా రమ్మని పిల్చిరె మీవారు
కనుమునాడైనాను గారెలొండుకుని  -  కాముడా రమ్మని పిల్చిరె మీవారు '' [117]

ఆడపిల్లకు పెళ్ళి సమయంలో పుట్టింటివారు 'సారె' పేరుతో ఆమెకు కావలసిన సామాగ్రినంతా పంపించడం మన సంప్రదాయం, ఆనవాయితీ. సుభద్రకు ఇలాంటి తంతు జరుగలేదు. దీనికి కారణం అర్జునునికి సుభద్రకు జరిగిన వివాహం ప్రేమ  వాహం కావడమే. పెద్దలు కుదిర్చిన  వివాహమయితే పుట్టింటివారు సుభద్రను సారెతో అత్తవారింటికి

పంపించేవారు. పెళ్ళయిన కొంతకాలానికి అర్జునుని మదిలో ఇతరులకు జరిగే సారె తంతు, అత్తమామలు అల్లుడికి చేసే మర్యాదలు వంటి తనకు జరుగలేదనే బాధతో ఈ బాధను తన భార్యపై చూపి తన వారు తనకు ఎలాంటి సారెలూ ఇవ్వలేదని ఇప్పుడు సారెను తెమ్మంటూ సుభద్రను పుట్టింటికి పంపే కథ జానపదుల గేయాలలో కనిపించును. అర్జునుని మాటలకు సహించలేని సుభద్ర అర్జునితో ఈ విధంగా అంటుంది.

"మా వాళ్ళు పేదవాళ్ళు మా కేమి గలదు - పెట్టగల పెద్దింట పెళ్ళాడితేను
అచ్చటలు ముచ్చటలు అన్నియును జరుగు "[118]

సుభద్ర పుట్టింటి వారు అర్జునునికి ఎలాంటి సారెలను పంపించక పోవడం వలన సుభద్ర పుట్టింటి వారిని నిందించడం సహించలేని సుభద్ర తన వాళ్ళు పేదవాళ్ళనీ అందుకే సారెలు ఏమీ ఇవ్వలేదని, తనను కాకుండా పెద్దింటి అమ్మాయిని పెళ్ళి చేసుకున్నట్లయితే అర్జునుడు కోరే సారెలు వచ్చేవని సుభద్ర అంటుంది. సుభద్రలో తన పుట్టింటివారిని పట్ల అర్జునికి ఉన్న చులకనభావం వలన సుభద్ర తనవారి ఆత్మగౌరవాన్ని నిలుపుటకే అర్జునితో తననుకాక పెద్దింటి అమ్మాయిని వివాహం చేసుకుంటే కోరిన సారెలన్నీ పొందవచ్చని పలుకుతుంది.

ఏ ఆడపిల్ల మాత్రం తన పుట్టింటి వారిని నిందిస్తుంటే ఊరకుండగలదు. సుభద్ర తన వారు ఐశ్వర్యవంతులయి అన్నీ చేయగలిగి ఉన్నా పుట్టింటివారిని అత్తింట అర్జునుడు నిందించుటతో తనవారు అత్తింట నిందలపాలవడం సహించలేని సుభద్ర తనవారు పేదవారనీ తనకు ఏమీ ఇవ్వలేరనే ద్వంద్వార్థ భావంతో తన ఆవేదన వ్యక్తం చేస్తుంది. అర్జునుని మాటలకు సుభద్ర తన చిన్నన్నయ్య కృష్ణుని ఇంటికి బయలు దేరుతుంది.

"వంటి సొమ్ములు తీసి భరిణెలో పెట్టి - మాసిన బట్టగట్టి మడుగుల్లుదాచి
మువ్వలా ముద్దుణ్ణి చంకబెట్టుకుని - గంటలా కాముణ్ణి చెట్టబట్టుకొని
వెళ్ళెనే సుభద్ర అన్నవాడలకు - వంటింట్లో వదినెల్లు చల్లచేయంగ
వాకిట్లో వారన్న నిద్రశయనించె - అంతిపురిలో వదినె ఎదురు తావచ్చి
ఆడబిడ్డను చూచి అతిజాలి చెంది - నిద్రబోతున్నావు నీలవర్ణుండ
నీ చెల్లి వచ్చింది నిద్రలేవయ్యా "[119]

ఈ గేయంలో సుభద్ర తాను వేసుకున్న నగలను తీసి మాసిన చీర కట్టుకుని పుత్రుడ్ని చంకనబెట్టుకొని సాధరణ స్త్రీగా తన అన్న దగ్గరకు వెళ్ళడాన్ని బట్టి సుభద్రలో అర్జునుడు సారె కోసం తనవారిని నిందించాడన్న రోషంతో అలుకతో తన అన్న కృష్ణుని ఇంటికి బయలుదేరుతుంది.

సుభద్ర తన తల్లిదండ్రులు దేవకీవసుదేవుల దగ్గరకుగానీ, పెద్దన్నయ్య బలరాముని దగ్గరకుగానీ వెళ్ళకపోవడాన్నబట్టి మనకు కొన్ని విషయాలు అర్ధమవుతాయి. బలరాముడు సుభద్రను అతని శిష్యుడు దుర్యోధనునికిచ్చి వివాహం చేయదలచి అర్జునితో వాహానికి ఒప్పుకోనివాడైనందున, సుభద్ర కృష్ణులు ఒకే తల్లి బిడ్డలు, అంతేకాక సుభద్ర మనసును తెలుసుకొని చిన్నతనం నుండీ తాను ప్రేమించిన అర్జునునికిచ్చి వివాహం చేసినవాడు కృష్ణుడు. కావుననే తనకు అత్యంత ప్రియమైన చిన్నన్నయ్య దగ్గరకు వెళ్ళింది. సహజంగా మనం కష్టాల్లో ఉన్నప్పుడు మనకు అత్యంత ప్రియమయిన వారి దగ్గరకే వెళ్ళి మన బాధను విన్న వించుకుంటాం కదా! సుభద్ర కూడా అలాగే చేసి తన చిన్నన్నయ్య దగ్గరకు వెళుతుంది.

లోకంలో ఆడపిల్ల తన భర్తతో పుట్టింటికి వస్తే తల్లిదండ్రులు ఆనంద పడతారు కానీ సుభద్ర ఒక్కతే చంటిబిడ్డను తీసుకొని ఆభరణములను వదలి సాధరణా స్త్రీ వలె తమ దగ్గరకు వస్తే ఏ తల్లిదండ్రులకు మనసులో ఆందోళన ఉండదని తలచినది కాబోలు సుభద్ర తన తల్లిదండ్రుల మనసుకు ఎలాంటి కష్టం కలగకూడదనే భావంతో వారివద్దకు వెళ్ళలేదనవచ్చు.

## 5.3. గంగ

### i.మదం

మదమును గర్వముగానూ పేర్కొనవచ్చు. రూప యౌవ్వన లావణ్య, కుల, ధన, విద్యా విభవైశ్వర్యములచే వ్యక్తులకు గర్వము కలుగును. గంగకు నీటిపై గల అధికార మదముతో నీటిని గౌరికి అందకుండా చేసి తన ప్రాధాన్యతను చాటుకుంది. ఉత్తమురాలయిన గంగను ఆశ్రయించిన ఈ గర్వము మానమనబడును. గౌరి గంగతో నీవు నాతో సరిదానవా అని అన్నందుకు తన ప్రాధ్యాన్యతను చాటుటకే గంగ ఇలా చేస్తుంది.

### ii. ఆధిక్య భావం

గంగలో ఆత్మాధిక్యత భావం అధికం. దీని ప్రకారం వ్యక్తులు ఏ ప్రయోజనాన్ని ఆశించి పనులు చేపడతారో ఆ పనిని సాధించే వరకు తమ ప్రయత్నాన్ని కొనసాగిస్తూనే ఉంటారు. గంగ గౌరీల సంవాద ఫలితంగా గంగ శివుని సొంతం చేసుకోవాలనే కోరికతో తనకు నీటిపైగల అధికార మదంతో నీటిని స్తంభింపచేసి గౌరిని అనేక ఇబ్బందులకు గురిచేసి చివరకు శివుని పొందగలిగింది.

శివుని చిన్న భార్యగా, జలదేవతగా గంగ జానపదులచే పూలజందుకుంటుంది. జానపదులు ప్రతి సంవత్సరం గంగమ్మ పేరుమీద జాతరలు జరుపుతుంటారు. జానపద సాహిత్యంలో గంగాదేవికి ప్రత్యేక స్థానం ఉంది. జానపదుల భారతంలో గంగాగౌరి సంవాదానికి సంబంధించిన అనేక గేయాలు మనకు లభిస్తున్నాయి.

"యెక్కెను గౌరమ్మ యెలనందిమీద
కోసెను పూలన్ని కొమ్మ విరువకను
ముడుచెను ఆ పూలు ముందుగా తాను
ముడువ మిగిలిన పూలు పళ్ళెరమునుంచి
పంపెను గౌరమ్మ గంగ మేడలకు "

గౌరి పంపిన పూలను చూసి, గంగ

"వాడిన పూబంపిన వనిత యెవరమ్మా

వడలిన పూబంపిన వనిత యెవరమ్మా

చాలకుంటే తన్ను సరికొల్లలాడు "[120]

ఈ గేయంలో గౌరి పూలను కోసుకొని వాటిలో కొన్ని తాను అలంకరించుకొని మిగిలిన పూలను గంగ మేడలకు పంపుతుంది. ఆ పూలను చూసిన గంగ వాడిన పూలను పంపినదెవరని చాలకుంటే తన్ను సరికొల్లలాడమంటుంది. సహజంగా స్త్రీలు పసుపు, కుంకుమ, పూలు వంటివాటిని తమ సౌభాగ్యానికి చిహ్నంగా భావిస్తారు. స్త్రీలు పువ్వులను ముడిచే ముందు పూలలో కొన్ని ముత్తైదువులకు ఇచ్చి మిగిలిన వాటిని వారు ముడిచెదరు. కానీ గౌరి కోసిన పూలలో కొన్ని ముందుగా తాముడిచి మిగిలిన పూలను గంగకు పంపుతుంది. వాడిన పూలను పంపించడం తనను అవమానించినట్లుగా భావించిన గంగ గౌరిపై నిష్ఠూరమాడుతుంది.

గౌరి తనతో గంగ సరితూగదనగా గంగ తానూ గౌరితో సమానమని తనకున్న ప్రతేకతను క్రింది గేయంలో చాటుతుంది.

"సరిదాన్నిగాకుంటె శివుడేలదెచ్చు

శివుడేల తెచ్చును జగమేలమెచ్చు - శివుడికి చిన్నాలిని నీకు చెల్లెలను

తన్నెను తనసవతి గుండెల్లు పగుల - అక్కమీపాదాల రాలినమన్ను

సందుల్నిగట్టిస్తు గొందుల్ని గడుదు - కొడుకు వీరన్నకు కోటగట్టిస్తు

కోడలగు భద్రాద్రికి మేడగట్టిస్తు - బసవన్న పడుకునే పంచటరుగేస్తు

శివునికి శివపూజ గద్దిగట్టిస్తు - నీకు అనగ సరిగద్దెకడుదు "[121]

ఈ గేయంలో గంగ గౌరితో సరిదాన్ని కాకుంటే తనను శివుడెలా తీసుకువస్తాడు, జగమెలా మెచ్చుతుందంటుంది. కొడుకు వీరన్నకు కోటను, కోడలు భద్రాద్రికి మేడను, బసవన్నకు అరుగును, శివునికి శివపూజ గద్దెను, గౌరికి సరిగద్దెను కట్టిస్తానంటుంది. గంగ ఈ పనులన్నీ చేయుటకుగల కారణాన్ని గమనిస్తే అందరినీ తనవారిగానే తలచి తనవారికి తానుచేసే గౌరవాలుగా భావించి, గౌరి మనసులో స్థానాన్ని పొందాలనుకుంటుంది. క్రింది గేయంలో గంగ గౌరికి తన శక్తిని, ప్రాధాన్యతను తెలియజేయుటకు నీటిని స్థంభింపజేస్తుంది.

"ఆ కొలను వుదకాలు దాచింది గంగ - అటుబోయి వీరన్న కొలను జూచె

యాకొలను నీరంత దాచింది గంగ - చిలుక సముద్రమును జూడ చిన్నమెత్తు లేదు

పాల సముద్రం జూడ పాతికెత్తు లేవు - ఎచ్చట తిరిగినా వుదకంబులేదు

వీభూదిగుండాన యింకిపోయిన "[122]

ఈ గేయాన్ని బట్టి తనను చులకనగా చూసిన గౌరికి తన విలువను, శక్తిని తెలియజేయుటకే గంగ అన్ని ప్రదేశాలలో నీటిని ఇంకింపోయేలా చేసింది. రూప, యౌవ్వన, లావణ్య, కుల, ధన, విద్యా, విభవైశ్వర్యములచే వ్యక్తులకు గర్వము కలుగును. ఇలాంటి గర్వాన్ని మనం గంగలో చూడవచ్చు. గంగ తాను గౌరికి ఏమాత్రం తీసిపోనని నీటిపై తనకు గల అధికార మదముతోనే నీటిని గౌరికి అందకుండా చేసి తన ప్రాధాన్యతను చాటుతుంది. ఇక్కడ గంగకు కలిగిన గర్వం మానమనబడును. గర్వ రూపమగు మదము కుల, ధన, రూప, యౌవన, శృంగార, కామ, లావణ్య, శౌర్య, అధికార, మూఢ, విద్య అను అనేక రుపములలో ప్రదర్శితమవును. ఉత్తములను ఆశ్రయించునది మానమని, నీచులనాశ్రయించునది గర్వమని చెప్పవచ్చు.

క్రింది గేయంలో గౌరి నీటికోసం అనేక ఆశలను చూపి గంగవద్ద నుండి నీటిని పొందాలనుకుంటుంది.

" నా కొడుకు వీరన్న నీకిస్తుగాని - ఉదకాలజాడలు చెప్పవే గంగ

నీకొడుకు వీరన్న నా కొడుకుగాడా - ఉదకాలజాడలు నేనెరుగనక్కా

నా కోడలు భద్రగిరిని నీకిస్తుగాని - ఉదకాలజాడలు చెప్పవేగంగ

నీకోడలు భద్రగిరి నాకోడలుగాదా - ఉదకాలజాడలు నేనెరుగననెను

నాకున్న రవికెలు నీకిస్తుగాని - ఉదకాలజాడలు చెప్పవేగంగా

నీకున్న రవికెలు నాకునులేవా - ఉదకాలజాడలు నేనెరుగననెను

నాకున్న చీరెలు నీకిస్తుగాని - ఉదకాలజాడలు చెప్పవేగంగా

నీకున్న చీరలు నాకునూలేవా - ఉదకాలజాడలు నేనెరుగననెను

నాకున్న సొమ్ములూ నీకిస్తుగాని - ఉదకాలజాడలు చెప్పవేగంగా

నీకున్న సొమ్ములూ నాకునూలేవా - ఉదకాలజాడలు నేనెరుగననెను

నావక్క శివుని నీకిస్తుగాని - ఉదకాలజాడలు చెప్పవేగంగా

యిప్పుడన్నమాట తప్పకుమి అక్కా - యీ మాటకు సాక్షి యెవరనీ బలికె

భూమి ఆకాశము అ రెండు సాక్షి - ముద్దులూ మాలేళ్ళు అ రెండు సాక్షి

సకల దేవతలు - వారెల్లాసాక్షి

అనగ సంతోషించి గంగప్పతాను - గుప్పు గుప్పున గంగను పొంగుచును

యేరులన్నీ చానలోకమయినిండ గౌరి స్నానమ్ముజేసి శివపూజలచేసి "[123]

ఈ గేయంలో గౌరి గంగకు తన కొడుకు వీరన్నను, కోడలు భద్రాద్రిని ఇస్తానంటుంది. అందుకు గంగ వారు తనకూ కొడుకు, కోడలే అంటుంది. గౌరి తనకున్న చీరలు, రవికెలు, సొమ్ములు ఇస్తానంటుంది. గంగ నీకున్న చీరలు, రవికెలు, సొమ్ములు తనకూ ఉన్నవని అంటుంది. చివరకు గౌరి తనకున్న ఒక్క శివుని ఇస్తాననడంతో గంగ ఈ మాటలకు సాక్షి ఎవరని గౌరిచే సాక్ష్యాలు చూపిచుకొని అప్పుడు గంగ నీటిని ఉప్పొంగిస్తుంది. గంగ శివుని దక్కించుకొనుటకే తాను గౌరిని అనేక ఇబ్బందులకు గుచేసి చివరకు తన దగ్గరకే వచ్చేలా చేసిగౌరి శివుని తనకు ఇచ్చేలా చేస్తుంది.

గంగలో మనకు ఆడ్లర్ ప్రతిపాదించిన 'ఆధిక్యతాభావం' కనిపించును. దీని ప్రకారం వ్యక్తులు ఏ ప్రయోజనాన్ని ఆశించి పనులను చేపడతారో దాన్ని పరిపూర్ణంగా సాధించే వరకు ప్రయత్నిస్తూనే ఉంటారు. దీనికి ఉదాహరణగానే గంగ గౌరి మధ్య జరిగిన సంవాద ఫలితంగా గంగలో శివుని తానే సొంతం చేసుకోవాలనే కోరిక జనించిది. ఆ ఉద్దేశ్యంతోనే గంగ నీటిపై తనకున్న అధికార మదంతో నీటిని స్థంభింపచేసి గౌరిని అనేక ఇక్కట్లకు గురిచేసి చివరకు శివుని పొందగలిగింది.

## 5. 4.గౌరి

### i . Adult Ego State

గౌరికి ఆమె తల్లిదండ్రులు బ్రాహ్మణునికిచ్చి వివాహం చేయమందువా అనగా 'బాపల పనులన్నీ బ్రహ్మపనులన్నా', 'ముత్యాల ముగ్గులు నే పోయలేను' అని, దాసులనిచ్చి వివాహం చేయమందువా అనగా 'అందరికి దండాలు నే మడువలేను I అడుగడుగునకు వంగి నే నడువలేను' అని రాజపుత్రులతో వివాహమనగా 'కత్తులకు తలంబ్రాలు నే బొయ్యలేను' అని కోమటితో వివాహమనగా 'కోమట్ల బేరాలు కొంటె బేరాలు I రొక్కమే సకలంబు రొక్కమే బతుకు' అను మాటలను బట్టి సుకుమారంగా పెరిగిన తాను వీరిని వివాహం చేసుకొని కష్టాలను పడలేని తల్లిదండ్రులకు చెబుతుంది. గౌరి తీసుకున్న ఈ నిర్ణయాలను బట్టి Adult Ego State దశలో వ్యక్తుల ఆలోచనలు హేతుబద్ధంగా వారు తీసుకునే నిర్ణయాలు, చేసే పనులు విచక్షణతో కూడినవై ఉంటాయని తెలుస్తుంది.

### ii.ఆత్మభావన

శివుడు వద్దన్నా వినకుండా గౌరి తన తల్లిదండ్రుల వద్దకుకు వెళుతుంది. తన రాక తన తల్లిదండ్రులకు అనందకరమేనని అమె భావిస్తుంది. కానీ గౌరి తాను అనుకున్న దానికి వ్యతిరేకంగా తనరాక తల్లిదండ్రులకు ఎలాంటి ఆనందాన్ని కలుగజేయకపోగా తండ్రిచే అవమానింపబడి జరిగిన పరాభవానికి అపసామాన్య ప్రవర్తనకు లోనవుతుంది. ఈ స్థితిలో ఆమెకు సంబంధించిన వ్యక్తులు ఆమెకు ఎలాంటి అంగీకారం, సానుభూతి, గౌరవం అందివ్వలేనందున గౌరి తనకు జరిగిన పరాభవానికి మరణమే సరైనదని నిర్ణయించుకుని అగ్నికి ఆహుతి అయినది.

### iii. క్రోధం

గౌరి తండ్రిచే అవమానింపబడిన సందర్భంలో ఆమె తండ్రిపై క్రోధాన్ని ప్రదర్శిస్తుంది. వ్యక్తులు తమకుగానీ తమకు సంబంధించిన వారికిగానీ అవమానము జరిగే సమయంలో తగిన పరాక్రమన్ని చూపి ఆత్మగౌరవాన్ని నిలుకోవాలి కనుక గౌరి తనకు తన భర్త శివునికి తన తండ్రి చేసిన పరాభవానికి ప్రతీకగా తండ్రిని శపించి తానూ అగ్నికి ఆహుతి అవుతుంది. ఉత్తములకు కలుగు కోపము క్షణకాలము మాత్రమే ఉంటుంది.

### iv. సృజనాత్మక ఆత్మ

కొందరు వ్యక్తులు కొన్ని నమ్మకాలు, వైఖరులు, నిర్ణయలతో వారి అంతరాత్మ ఆత్మని ఏర్పరచుకుని ఈ పనిని నా అంతరాత్మ చేయమందని, చేయవద్దన్నదని అనేక సందర్భాలలో అంటుంటారు. దీనినే సృజనాత్మక ఆత్మ అనికూడా అంటారు. గౌరి తనకు నీటిని ఇస్తే శివుని గంగకు ఇస్తానంటుంది. ఈ విధంగా గౌరి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలనే నిర్ణయం కలిగినదై శివుని గంగకు ఇచ్చివేసెననుటకు నిదర్శనంగా శివుని రాకచూసి తలుపు వేస్తుంది.

### v. ఆత్మాధిక్యము

గంగ నీటిని స్థంభింపచేసి గౌరిని అనేక ఇబ్బందులకు గురిచేసిన సందర్భంలో శివుడు గౌరిని వెళ్ళి గంగను నీటి కొరకు వేడుకొనమంటాడు. కానీ గౌరి జాలారిదానితో పొంతేల మనకు అని కుమారునితో చెప్పడాన్ని బట్టి గౌరి గంగ కన్నా తానే అధికురాలిననే భావనతో ఉంటుంది. ఈ భావనతోనే తన కన్నా తక్కువ దానితో మనకు పనేంటి అని ఆత్మాధిక్యత కనిపిస్తుంది.

శివుని అర్థాంగి పార్వతిని జానపదులు గౌరిమాతగా తలచి గౌరిపూజ చేస్తుంటారు. ఈ గౌరిపూజ చేస్తే సకల సౌభాగ్యాలు, అయిదవతనం కలిగి మనసులో ఉన్న కోరికలన్నీ తీరుతాయని వారి నమ్మకం. జానపద సాహిత్యంలో గౌరిదేవికి ప్రత్యేక స్థానం ఉంది.

గౌరికి వివాహ వయస్సురాగానే ఆమె తల్లిదండ్రులు ఎవరికిచ్చి వివాహం చేయాలా! అని గౌరిని పిలచి బ్రాహ్మణునికిచ్చి వివాహం చేయమందువా అనగా గౌరి

"బాపల పనులన్నీ బ్రహ్మపనులన్నా
ఆపనుల నేచెయ్య నా తరము కాదు
వరి బలము గురిబలము నేచదువలేను
నీతిమడుగుల చీర నేమడువలేను
ముత్యాల ముగ్గులు నే పోయలేను "

రాజపుత్రులతో  వివాహమనగా

“రాజుల యిండ్లలో రానివాసాలు

సుక్కపెట్టకపోరు  నగరెళ్ళిరారు

రాదారి కొప్పులూ నే చుట్టలేను

రాజులతో సరితూగ రాసరిగ లేను

కత్తులకు తలంబ్రాలు నే బొయ్యలేను

అరచేత ప్రాణాలు పట్టగా లేను

సామగానములకు నే సిద్ధపడలేను ”

కోమటితో  వివాహమనగా  గౌరి

“కోమటి బేరాలు గోజు బేరాలు

కోమట్ల బేరాలు కొంటె బేరాలు

రొక్కమే సకలంబు రొక్కమే బతుకు ”

దాసులతో  వివాహమనగా

“దాసుల పెండ్లాలు కష్టాలు పాలు

ఊళ్ళోని భిక్షములు గుళ్ళోటి నిద్ర

అందరికి దండాలు నే మడువలేను

అడుగడుగునకు వంగి నే నడువలేను

దాసులతో పొందు సుఖము గాదన్న ” [124]

తల్లిదండ్రులు ఎవరికిచ్చి  వివాహం చేయమందువు  అనగా జంగమదేవునికిచ్చి  వివాహం చేయమంటుంది.

పై గేయాలను పరిశీలించినచో గౌరిలో మనకు ‘ఎరిక్  బర్న్’ ప్రతిపాదించిన సిద్ధాంతం కనిపిస్తుంది. ఇతను ప్రతి మనిషిలో 3 దశలను పేర్కొన్నారు. అవి

1.Child Ego State (చైల్డ్ ఇగో స్టేట్)

2.Adult Ego State (అడల్ట్ ఇగో స్టేట్)

3.Parent Ego State (పేరెంట్ ఇగో స్టేట్)

Adult Ego State దశలో వ్యక్తుల ఆలోచనలు హేతుబద్ధంగా ఉంటాయి. వీరు తీసుకునే నిర్ణయాలు, చేసే పనులు విచక్షణతో కూడినవై ఉంటాయి. గౌరి తన తల్లిదండ్రులు చెప్పిన వారిని వివాహం చేసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనవలసివస్తుందో ముందుగా గ్రహించి వారెవరినీ తాను వాహం చేసుకోనంటుంది.

'బాపల పనులన్నీ బ్రహ్మపనులన్నా', 'ముత్యాల ముగ్గులు నే పోయలేను' అను మాటలను బట్టి బ్రాహ్మణుని వివాహం చేసుకుంటే వారింట ఉండే బ్రహ్మపనులన్నీ గౌరి చేయలేదని తాను చిన్నప్పటి నుండి సుకుమారంగా, గారాబంగా పెరిగిందని తెలుస్తుంది.

'అందరికి దండాలు నే మడువలేను । అడుగడుగునకు వంగి నే నడువలేను' అను మాటలను బట్టి గౌరి ఆత్మాభిమానం కలదిగా చెప్పవచ్చు.

'కత్తులకు తలంబ్రాలు నే బొయ్యలేను' అను మాటలను బట్టి ప్రతిస్త్రీకి వివాహ ఘట్టం ఎంతో ముఖ్యం. వివాహన్ని గురించి తన మనసులో ఎన్నో కలలు కంటుంది. అలాంటి స్త్రీ వివాహ సమయంలో తన భర్త లేకుండా రాజపుత్రుల ఆచారం ప్రకారం కత్తితో వివాహం జరగడం తన కలలన్నీ కల్లలయ్యినట్టుగా భావించి రాజపుత్రుని వివాహం చేసుకోనంటుంది.

'కోమట్ల బేరాలు కొంటె బేరాలు । రొక్కమే సకలంబు రొక్కమే బతుకు' అను మాటలను బట్టి కోమటిని పెళ్ళి చేసుకుంటే వారు అన్నింటినీ డబ్బుతోనే ముడిపెడతారని, కోమట్లు డబ్బు మనుషులని వారిని వివాహం చేసుకుంటే తనకన్నా డబ్బుకే అధికప్రాధాన్యం ఇస్తారని కోమట్లను వివాహం చేసుకోనంటుంది.

పై గేయాలనుబట్టి గౌరి మనసులో శివుడు ఉండటం వల్ల తన తల్లిదండ్రులు ఎవరిని వివాహం చేసుకోమన్నా అందరికీ వంకలు చూపి తన మనసులోని మాటను చెబుతుంది.

శివునికి గౌరి, గంగ అను ఇద్దరు భార్యలున్నారు. సహజంగా సవతులమధ్య ఉండే కయ్యాలు మనం వీరిలోనూ గమనించవచ్చు. దీనికి ఉదాహరణగా క్రింది గేయాన్ని పరిశీలించవచ్చు.

"యెక్కెను గౌరమ్మ యెలనంది మీద

కోసెను పూలన్ని కొమ్మ విరువకను

ముడుచెను ఆ పూలు ముందుగా తాను

ముడువ మిగిలిన పూలు పళ్ళెరమునుంచి

పంపెను గౌరమ్మ గంగ మేడలకు " [125]

ఈ గేయంలో గౌరి పూలను కోసుకొని వాటిలో కొన్ని తాను అలంకరించుకొని మిగిలిన పూలను గంగ మేడలకు పంపుతుంది.

గౌరి పంపిన పూలను చూసి వాడిన పూలను పంపి తనను అవమానించిన గౌరికి గంగ తన విలువను తెలియజేయాలనే నిత్యావసరమయిన నీటిని నిలిపివేస్తుంది. దీంతో గౌరికి ఐదు రోజుల నుండి స్నానం లేదు. అలాగే ఆరు రోజుల నుంచి శివపూజ లేదు. కావున గౌరి తన తండ్రి వద్దనయినా నీరు లభించునేమోనని తన కుమారుని దక్షుని వద్దకు పంపుతుంది.దక్షుడు తన వద్దనూ నీరు లేకపోవడంతో గౌరికి పాలు, నెయ్యిని పంపుటను మనం క్రింది గేయంలో చూడవచ్చు.

"పట్టించు పదివేల పాలకావిళ్ళు - కట్టించు పదివేల నేతికావిళ్ళు

పాలకావిళ్ళొచ్చి పందిళ్ళదిగెను - నేతి కావిళ్ళొచ్చి మేడల్లదిగెను

పాలతోనే గౌరి స్నానంబు జేసె - నేతితో గౌరి శివపూజ జేసె

చీమలు దోమలు చెడకుట్టసాగె - గండుచీమలు మేను చెండుతునుండె " [126]

పై గేయంలో గంగ నీటిని నిలపివేయుటతో గౌరి కుమారుడిని తన తండ్రి దక్షుని దగ్గరకు పంపుటతో దక్షుడు తన వద్దనూ నీరు లేక కుమార్తెకు స్నానానికి పాలు, శివపూజకు నెయ్యి పంపించును. గౌరి పాలతో స్నానము, నెయ్యితో శివపూజ చేయడం వలన గౌరిని చీమలు కుట్టడం మొదలు పెట్టాయి.

గౌరి తన బాధను శివునికి తెలియజేయుటకు కుమారుడిని శివుని వద్దకు పంపుతుంది. శివుడు వీరన్నతో క్రింది విధంగా పలుకును.

"మీ అమ్మ తక్కువేమి నా యేక్కువేమి - పుట్టించ గిట్టించ శివుడు కర్తగును

నోచున నోములకు గౌరితాకర్త - జగములో నీళ్ళకు గంగతా కర్త

యే ప్రొద్దు గంగతో - యెదురువాదంబు

కూడదని చెప్పుమీ ఆ గౌరితోను - యీ ప్రొద్దుగంగకు తా మ్రొక్కమనుము

గంగ సమ్మతిచేత ఘన ఉదక మొచ్చు - నదులన్ని నీళ్ళతో నిండునయ్యా " [127]

ఈ గేయంలో శివుడు వీరన్నతో మీ అమ్మ తక్కువేమి? నేనెక్కువేమి? అని తన వద్దకూడా నీరు లేదని, నీళ్ళకు కర్తగు గంగతో గౌరికి ఎలాంటి కయ్యాలు లేక గంగకు మ్రొక్కమని హితవు చెప్పి పంపెను.

గౌరిని గంగ వద్దకు తాను వెళ్ళక కుమారుడు వీరన్నను పంపించడం క్రింది గేయంలో చూడవచ్చు.

"కంట నీరుంచి తా కఠినంబుగాను - నీచదానింటికి పోవను కొడుకా

జాలారిదానితో పొత్తేల మనకు - నీవైన పోయిరా ముద్దువీరన్న " [128]

పై గేయాన్ని బట్టి గౌరిలో మనకు గంగ మీద ఇంకా కోపం తగ్గనట్టు కనబడుతుంది. శివుడు గౌరినివెళ్ళి నీటి కొరకు గంగకు మ్రొక్కమని వీరన్నకు చెప్పినా గౌరి తాను వెళ్ళకుండా వీరన్నను పంపుతుంది. 'జాలారిదానితో పొత్తేల మనకు' అను మాటలను బట్టి గౌరి గంగను తనకన్నా తక్కువగా చూస్తుంది. దీనికి కారణం శివుని ప్రధమ అర్ధాంగిననే భావనకావచ్చు. ఈ భావమే గౌరి గంగ కన్నా అధికురాలని అనుకొనుటకు కారణం కావచ్చు.

గంగ వద్దకూడా నీరు లేదని తెలుసుకున్న గౌరి చివరకు చేసేది లేక తానే స్వయంగా గంగ మేడలకు వెళుతుంది. గౌరి నీటికోసం గంగకు అనేక విధములా ఆశ చూపుటను క్రింది గేయంలో చూడవచ్చు.

"నా కొడుకు వీరన్న నీకిస్తుగాని - ఉదకాలజాడలు చెప్పవే గంగ

నీకొడుకు వీరన్న నా కొడుకుగాడా - ఉదకాలజాడలు నేనెరుగనక్కా

నా కోడలు భద్రగిరిని నీకిస్తుగాని - ఉదకాలజాడలు చెప్పవేగంగ

నీకోడలు భద్రగిరి  నాకోడలుగాదా - ఉదకాలజాడలు నేనెరుగననెను

నాకున్న రవికెలు నీకిస్తుగాని - ఉదకాలజాడలు చెప్పవేగంగా

నీకున్న రవికెలు నాకునులేవా - ఉదకాలజాడలు నేనెరుగననెను

నాకున్న చీరెలు నీకిస్తుగాని - ఉదకాలజాడలు చెప్పవేగంగా

నీకున్న చీరలు నాకునూలేవా - ఉదకాలజాడలు నేనెరుగననెను

నాకున్న సొమ్ములూ నీకిస్తుగాని - ఉదకాలజాడలు చెప్పవేగంగా

నీకున్న సొమ్ములూ నాకునూలేవా - ఉదకాలజాడలు నేనెరుగననెను

నావక్క శివుని నీకిస్తుగాని - ఉదకలజాడలు చెప్పవేగంగా " [129]

ఈ గేయంలో గౌరి గంగను మంచి చేసుకొనుటకు తనకొడుకు వీరన్నను, కోడలు భద్రాద్రిని ఇస్తానంటుంది. అలాగే నాకున్న చీరలు, రవికెలు, సొమ్ములు ఇస్తానంటుంది. కానీ వీటన్నింకీ అంగీకరించని గంగతో చివరకు తన శివుని ఇస్తానంటుంది.

'నావక్క శివుని నీకిస్తుగాని - ఉదకాలజాడలు చెప్పవేగంగా' అను మాటలను బట్టి గౌరికి ఇద్దరు కుమారులున్నారు గావున ఒకరిని గంగకు ఇవ్వడానికి ఇష్టపడుతుంది. అలాగే తనకు చీరలు, రవికెలు, సొమ్ములు కావలసినన్ని ఉన్నవి  కనుకనే వాటిలో కొన్నింటిని గంగకు ఇవ్వడానికి ఇష్టపడుతుంది. కానీ శివుడు ఒక్కడే కావున అతనిని గంగకు ఇవ్వడానికి మొదట ఇష్టపడకపోయినా చివరకు చేసేదిలేక గంగ శివుని కొరకే  ఈ పనులన్నింటినీ చేయుచున్నదని గ్రహించి తన శివుని ఇస్తానంటుంది.

" యేరులన్నీ  చానలోకమయినిండ గౌరి - స్నానమ్ముజేసి శివపూజలచేసి

శివుడొచ్చురాకలు గౌరితాచూచి - ఘడియ గ్రక్కునబెట్టె గవరమ్మతాను " [130]

ఈ గేయంలో గౌరి స్నానము, శివపూజలు చేసి శివుని రాకనుచూసి తలుపు వేస్తుంది. గౌరి  గంగకు ఇచ్చిన మాటకు కట్టుబడే ఇలా చేస్తుంది. గౌరిలో ఆడ్లర్  సిద్ధాంతాన్ని గమనించవచ్చు. కొందరు వ్యక్తులు కొన్ని నమ్మకాలు, వైఖరులు, నిర్ణయలతో వారి అంతరాత్మ ఆత్మని ఏర్పరచుకుంటారు. దీనినే సృజనాత్మకఆత్మ అని  అంటారు.

వ్యక్తులు కొన్ని విషయాలలో ఈ పనిని నా అంతరాత్మ చేయవద్దన్నదని లేక చేయమన్నదనే మాటలను వింటాము. ఇదే మన సృజనాత్మక ఆత్మ. ఈ అంతరాత్మ వ్యక్తి జీవితానికి అర్థాన్ని కల్పిస్తుంది. ఇక్కడ గౌరి అంతరాత్మ ఇచ్చినమాటకు కట్టుబడి ఉండాలనే నిర్ణయం కలిగినదై తాను గంగకు ఇచ్చిన మాట ప్రకారం శివుని గంగకు ఇచ్చివేసెననుటకు నిదర్శనంగా శివుని రాకచూసి తలుపు వేస్తుంది.

దక్షుడు గౌరీశులు లేకుండా యజ్ఞము చేయుచున్నాడని తెలుసుకున్న గౌరి తన చెలులతో క్రింది విధంగా పలుకును.

''పిలచినారో యేమి పిలువకున్నారేమి - తోయజాక్షిరొ నేను పోయివచ్చెదననుచు

అయినానుగాక మా హరుడుతోనూజెప్పి - ఆజ్ఞబుచ్చుక వేగపోయి వచ్చెదననుచూ

పతి సన్నిధికివచ్చెనూ. ''[131]

ఈ గేయంలో గౌరి తన తండ్రి దక్షుడు యజ్ఞం చేయుచున్నాడన్న వార్తను తెలుసుకొని తన చెలులతో తమను కూడా పిలచినారోయేమి అనీ పిలవకున్నా తాను తన తండ్రి చేయుచున్న యజ్ఞానికి పోయివచ్చెదనని ఒక మాట తన శివునితోగూడ చెప్పి శివుని అనుమతితో వెళ్ళివస్తానని శివుని దగ్గరకు బయలుదేరుతుంది.

గౌరి దక్షుని కుమార్తె కావున తన తండ్రి చేసే యజ్ఞానికి ఆమెకు ప్రత్యేకించి పిలుపు అవసరంలేదనే భావన అమెలో ఉంటుంది. అందుకే యజ్ఞం గురించి తమకు చెప్పినా చెప్పక పోయినా తాను మాత్రం భర్త అనుమతితో తన తండ్రి చేయు యజ్ఞానికి బయలుదేరి వెళ్ళాలనే ఆలోచనలో ఉంటుంది. గౌరిలో తండ్రి తనకు యజ్ఞం గురించి చెప్పకపోయినా తాను యజ్ఞానికి వెళ్ళాలనే ఉద్దేశాన్ని బట్టి సహజంగా ఆడపిల్లలకు పుట్టింట ఉండే మమకారాన్ని తెలియజేస్తుంది. ఎంత మమకారం ఉన్నా భర్త అనుమతి తీసుకొని వెళ్ళాలనుకున్న పార్వతిలో ఆమెకు శివుని పట్ల ఉన్న గౌరవభావాన్ని, భర్త తన మనసును అర్థం చేసుకోగలడన్న నమ్మకాన్ని తెలియజేస్తుంది.

గౌరి శివుని దగ్గరకు వెళ్ళి తన విన్నపాన్ని క్రింది విధంగా తెలియజేయును.

''కన్నవారినిజూడ కలిగేను చిత్తంబు - ఉన్నవారీలోను ఊరడింపగలేను

వెళ్ళెదనని బుద్ధి వేవేగబుట్టినది - మళ్ళదూనాకింక మనసునాబాయదు

అవశ్యమైనా పనులు అతిక్రమించగరాదు - ఆనతినాకిమ్ము అతివేగరమ్మానీ

కరకంఠతగునానతీ. "[132]

ఈ గేయంలో గౌరి శివుని దగ్గరకు వెళ్ళి తన తల్లిదండ్రులను చూడాలనిపిస్తుందని తాను తల్లిదండ్రులను చూసివచ్చుటకు అనుజ్ఞనివ్వమని శివుని కోరుతుంది. 'వెళ్ళెదనని బుద్ధి వేవేగబుట్టినది - మళ్ళదూనాకింక మనసునాబాయదు' అను మాటలనుబట్టి గౌరి తల్లిదండ్రుల వద్దకు వెళ్ళాలని ఉద్దేశ్యంతో ఉంది కావున తన మదిలో అది అది తప్ప వేరే ఆలోచనే లేదని శివునికి విన్నవించి అనుజ్ఞ ఇవ్వమని కోరుతుంది.

మనం ఏదైనా పనిని తలపెట్టినప్పుడు ఆపని చేయడం ఆలస్యమయితే మనకు ఆపని మీద ధ్యాస మళ్ళడం లేదా తరువాత చేద్దామనే భావన కలగడం సహజం. ఇలాంటి సందర్భమే గౌరికి ఎదురయ్యింది. తన తల్లిదండ్రులను చూడాలనే ఉద్దేశంతో శివుని వద్దకు వెళ్ళి అనుజ్ఞను వెంటనే ఇవ్వాల్సిందిగా కోరుతుంది.

శివుడు గౌరిని దక్షునియాగానికి పంపిచుటకు నిరాకరించుటతో గౌరి శివునితో క్రింది విధంగా పలుకును.

"ఏమిసేయుదుదేవ మన నేగై కొమ్మీ - అందరినిచూడకా అణగియుండగలేదు

ముద్దుచేసీవారు ముందారపిలువ రని - పలుకొకటి పలికితిరి భంగమాయెను బ్రతుకు

నాడు మాతండ్రొచ్చె నాగధరమీకడకు - దీక్షబట్టుకమీరు తపసులై యుండగా

నా సన్నిధికివచ్చి నాతిరమ్మని బలికి - హరుడునూ నీవూను అతివేగరమ్మానీ

అతనిపురమునకేగెనూ "[133]

పై గేయంలో గౌరి శివుని ముందుగా పిలువలేదని కావున గౌరిని దక్షుని వద్దకు పంపుటకు నిరాకరించు సందర్భంలో ఈ విధంగా పలుకి తనను అవమాన పరిచారని గౌరి బాధపడుతూ నా తండ్రి వచ్చినప్పుడు మీరు తపసులో ఉండుటచే వారు నా వద్దకు వచ్చి మనల్ని తాను చేయు యజ్ఞానికి ఆహ్వానించారని చెబుతుంది.

గౌరికి పుట్టింటిపైగల మమకారం ఆమె మాటల్లోనే కనిపిస్తుంది. శివుడు మీవారు ముందుగా పిలువలేదని కనుక పిలవని పేరంటానికి నిన్ను ఎలా పంపమంటావని అన్న వెంటనే గౌరి తన తండ్రిపై శివుడు తనను పిలవలేదనే అపవాదు వేయడంతో గౌరి ఆ అపవాదు తనదిగా భావించి భంగమాయెను బ్రతుకు అని బాధపడి శివునితో మీరు తపస్సులో

ఉన్నప్పుడు వచ్చిన నా తండ్రి నా వద్దకువచ్చి మనల్ని ఆహ్వానించెనని తనవారి తప్పును సమర్థించుకుంటుంది. సజహంగా ఆడపిల్ల తన పుట్టింటివారిపై అత్తింట ఎలాంటి అపనిందలూ పడకుండా చూసుకుంటుంది. గౌరికూడా అలాగేచేసి తన పుట్టింటి గౌరవాన్ని కాపాడే ప్రయత్నం చేసింది.

గౌరి తన తండ్రిని సమర్థించుటకు ప్రయత్నించి, చివరకు శివునితో తన తండ్రి చేసిన తప్పులను దయతో క్షమించి తనను తన తల్లిదండ్రుల వద్దకు పంపుమని క్రింది గేయంలో ప్రాధేయ పడుతుంది.

"నాగ కుండలధరా నన్ను నేలిన స్వామీ - నాగధర యీమాట లాడదగునా

ఆడినా నాలుకా నోరుతడియాలేక - తండ్రి జేసిన తప్పు తలపోయుచుండగా

ధరణీశ అడిగితిని తప్పుగలదే అడల - తప్పులు అన్నియును వొప్పుగా క్షమియించి

మమ్ము దయజూడుమా - నిర్మాలాచిత్తుడవు- నిత్యమల్లేశ్వరుడ కేవలము దేవుడవు" [134]

పై గేయంలో గౌరి శివునితో స్వామి నేను మాట్లాడిన మాటల్లో ఏదైనా తప్పుంటే మన్నించండి. నా తండ్రి ఏదైనా తప్పుచేసుంటే వాటన్నింటినీ క్షమించి నా తల్లిదండ్రుల వద్దకు నన్ను పంపుమని వేడుకొంటుంది. శివుని మనసులో తన తండ్రిపై ద్వేషమూ లేకుండా చేయుటకే గౌరి తన తండ్రిని క్షమించ మంటుంది. 'నిర్మాలాచిత్తుడవు- నిత్యమల్లేశ్వరుడ కేవలము దేవుడవు' అను మాటలను బట్టి నిర్మలాచిత్తుడవయిన దేవుడవు నీవు మాపై కోపించుట తగునా దయతో మా తప్పులను క్షమించి నన్ను మా తల్లిదండ్రుల వద్దకు పంపమని శివునిలోని ఔదార్యాన్ని, దైవత్వాన్ని గురించి తెలిపి తన పనిని సాధించుకోవాలనుకుంటుంది. గౌరిలో ఆధిక్యభావం వలనే తాను ఏ ప్రయోజనాన్ని ఆశించి శివుని వద్దకు వెళ్ళిందో దాన్ని సాధించే ప్రయత్నంలో భాగంగానే ఈ విధంగా ప్రవర్తిస్తుంది.

శివుని ఆజ్ఞతో దక్షుని ఇంటికి చేరిన గౌరిని, అల్లుడయిన శివుని పరుషమయిన మాటలతో దక్షుడు అవమానపరిచిన సమయంలో గౌరి పతి మాటలు కాదని వచ్చినందుకు క్రింది విధంగా చింతిస్తుంది.

"అయ్యయ్యొ పతిమాట వినకనేవస్తి - అతివ యింతాసేపు వోర్వంగాలేక

చారించుకొని విలపించుకొని తాను - భూమిలో దుష్టదక్షుని పుత్రినగుకంటె

అడవిలో నొక మ్రాను అయివుండుటేమేలు" [135]

పై గేయంలో గౌరి తండ్రిచే అవమానింపబడి భర్తమాటలు వినక వచ్చినందుకు తగిన మర్యాదే జరిగిందంటూ ఆవేదనతో తాను భూమిపై దక్షుడి కుమార్తెగా కంటే అడవిలో మానుగా పుట్టినా బాగుండేదని తన మనసులో తండ్రిపైనున్న కోపాన్ని ప్రకటిస్తుంది.

తల్లిదండ్రులను చూడ మనసాయెనంటూ శివునితో వాదములాడి తన తల్లిదండ్రుల వద్దకు వచ్చిన గౌరి ఈ విధంగా మాట్లాడినదంటే ఆమె మనసు ఎంత క్షోభించినదో అర్థం చేసుకోవచ్చు

గౌరిని, శివుని దక్షుడు పరుషమాటలతో అవమానించినంతనే గౌరి దక్షుని క్రింది విధంగా శపించి తన శక్తిని, ఆత్మగౌరవాన్ని చాటుతుంది.

"తాలిమీగలదాన్ని తండ్రిచే బాధలకు ఉత్తమా గుణములా పతివ్రతనై తేను
వీరభద్రుడు వచ్చి యాశ్వర్లకీ బుట్టి
తలలు బాహువులు ద్రుంచి పావకునికీ వేల్చి
సంహారకారమా జేసునోవీరన్న" [136]

ఈ గేయంలో గౌరి కోరి ఇంటికి వచ్చిన కుమార్తెను అవమానించినందుకు శివుడు వీరభద్రుని పంపి దక్షుని శిరస్సును ఖండించి అగ్నికి అర్పించి తనకు జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకుంటాడని శపిస్తుంది.

గౌరి తండ్రిచే అవమానానికి గురైన సమయంలోఆమెను అరిషడ్వార్గాలలోని క్రోధం ఆవహించి తండ్రిని శపించును. ఉత్తములకు కలుగు కోపము క్షణకాలము, మాత్రమే ఉండును కావున గౌరి తండ్రిని శపించి వెంటనే అగ్నికి ఆహుతి అవును. తనకుగానీ తన వారికిగానీ అవమానము, హాని జరిగే సమయంలో తగిన పరాక్రమము చూపి తమ ఆత్మగౌరవమును నిలుపుకోవాలి. గౌరిని, శివుని దక్షుడు పరుషమయిన మాటలతో అవమానించుటతో తగిన పరాక్రమమును చూపి ఆత్మగౌరవాన్ని నిలుపుకున్నది.

గౌరి పతి మాటలు చెవినిబెట్టక దక్షుని ఇంటికి వచ్చినందుకు తనకు జరిగిన అవమానానికి బ్రతుకలేక అగ్నికి ఆహుతి అవుతుంది.

‘‘యెన్ని జన్మంబులూ యెత్తిబుట్టినగాని - చావుపుట్టుక లేని సదాశివునికి నేను

భార్యనుగావలెనని పావకుని బ్రార్థించి - మిట్ట మధ్యాహ్నమున మహామునులు జూడగా

బొటన వ్రేలుతోను కట్టడయి వ్రాయగా - మధ్యాహ్నమున మహామునులు జూడగా

మండితామగ్గెసఖియా. ’’ [137]

ఈ గేయంలో గౌరి శివుడు ఎంత చెప్పినా చెవినిపెట్టక తాను దక్షుని ఇంటికి వెళ్ళినందుకు తగిన పరాభవమే జరిగినదని చింతిస్తూ, శివుని వద్దకు తిరిగివెళ్ళలేక బ్రతుకుచాలించాలని నిశ్చయించుకొని అగ్నికి ఆహుతి అవుతుంది. గౌరి తనువు చాలించే ముందు తాను ఎన్నిజన్మలందయినా శివునికే అర్థాంగిని కావాలని కోరుకునిమరీ సజీవ దహనమైపోతుంది.

గౌరిలో కార్ల్ రోజర్స్ ప్రతిపాదించిన ‘self concept(ఆత్మభావన)’ కనబడుతుంది. దీని ప్రకారం గౌరి శివుడు వద్దన్నా వినకుండా తన తల్లిదండ్రుల వద్దకుకు వెళుతుంది. తన రాక తన తల్లిదండ్రులకు అనందకరమేనని భావిస్తుంది. కానీ ఆమె మనో భావాలకు వ్యతిరేకంగా జరిగిన పరాభవానికి ఆమె అపసామాన్య ప్రవర్తనకు లోనవుతుంది. ఈ స్థితిలో ఆమెకు సంబంధించిన వ్యక్తులు ఆమెకు ఎలాంటి అంగీకారం, సానుభూతి, గౌరవం అందివ్వలేనందున గౌరి అపసామాన్య స్థితిలోనే తనకు జరిగిన పరాభవానికి మరణమే సరైనదని నిర్ణయించుకుని అగ్నికి ఆహుతి చేసుకున్నది.

ఇలా అగ్నికి దహనమయిన గౌరి హిమవంతుని కుమార్తెగా జన్మించి శివభక్తురాలిగా పెరిగి పెద్దదవుతుంది. పెళ్ళీడు వచ్చినాక ఒక నాడు తండ్రితో తన మనసులోని మాటను క్రింది విధంగా తెలుపుతుంది.

‘‘ఈశ్వరుని జూడకా యిక నిలువజాలనూ

వనములకు నేబోయి తపసు నొనరించుకొని

ఈశ్వరుని పెండ్లాడి యింటికీవచ్చెదను

అడ్డుజెప్పక మీరు ఆజ్ఞయివ్వక గాని

హారమ్ముమల్ల నని అతివతానూబలికి

అక్కడే నిలచుండెనూ ’’ [138]

ఈ గేయంలో  గౌరి హిమవంతుని కుమర్తెగా జన్మించి, దక్షుని కుమార్తె గౌరిగా తాను అగ్నికి ఆహుతి అయ్యే సందర్భంలో తాను ఎన్ని జన్మలకయినా శివునినే భర్తగా పొందాలని కోరుకొనిమరీ అగ్నికి ఆహుతి అవుతుంది.  ఇలా హిమవంతుని కుమార్తెగా జన్మించినా ఆమె మనసులో శివునినే భర్తగా పొందాలనే  కోరిక మాత్రం బలంగా ఉంది. అందుకే శివుని భర్తగా పొందాలని తాన తపస్సుకై వెళ్ళుటకు తల్లిదండ్రులను అనుమతి కోరుతుంది. తాను శివుని భర్తగా పొందగలననే నమ్మకంతోనే అమె తపస్సుకు బయలుదేరాలనుకుంటుంది. మనం అన్నుకున్నది సాధించడానికి దృఢమయిన సంకల్ప బలంతో సాధించవచ్చు. పార్వతి తాను శివుని భర్తగా పొందాలనే కోరికతో తపస్సుచేసి శివుని భర్తగా పొంది  కైలాసం చేరింది.

## 5.5.చిత్రాంగి

### i.Id

మానవునిలో కోరికలన్నింటికీ మంచి చెడుల జ్ఞానం లేని Id మూలం. అన్ని కోరికలు దీని నుండే పుడతాయి. సృష్టిలో మానవులకు సహజంగా, ప్రకృతిరిత్యా కలిగే కోరికలు Id లో దాగి ఉంటాయి. Id చేసే ప్రేరకాలను Ego తప్పని నిందించి Super Ego వ్యక్తిలోని విలువలను కాపాడుతుంది. చిత్రాంగిలో సారంగుని పొందాలనే కోరిక నైతిక పరంగా, భౌతిక పరంగా, జీవిత వాస్త కతకు వ్యతిరేకంగా ఉన్నప్పటికీ తన కోరికను తీర్చుకోవాలనేది id లో అధికంగా ఉంటుంది.

### ii.హిస్టీరియా

చిత్రాంగిలో హిస్టీరియా లక్షణాలున్నాయనుటకు సారంగుడు పావురం కొరకు చిత్రాంగి మేడలకు వచ్చినప్పుడు నాటకీయతతో చిత్రాంగి సారంగునిలో శృంగార భావోద్రేకాన్ని కలిగించడానికి అనేక విధాల ప్రయత్నించి విఫలమై, చిత్రాంగి సారంగునిపై చేసిన బలాత్కార ప్రత్నమును అతడు తండ్రికి చెప్పిన తనకు శిక్ష తప్పదని గ్రహించి చాకచక్యముతో, ముందుచుపుతో సారంగుడే తనపై బలాత్కారయత్నము చేసెనని అతని తండ్రికి లేఖ వ్రాసి పంపిస్తుంది. చిత్రాంగి నాటకీయతతో సారంగుని ఆకట్టుకోకపోయినా అతనిపై బలాత్కార ప్రయత్నము చేసినాడను నిందను మోపి నాటకీయతను ప్రదర్శించి భర్తచే సారంగునికి శిక్షపడేలా చేస్తుంది. ఎదుటి వారిలో శృంగార భావోద్రేకాన్ని కలిగించడానికి ఎలాంటి పనులయినా చేయడం, నాటకీయతతో ఇతరులను ఆకట్టుకోవాలని చూడటం, అపరిమిత ఆత్మాభిమానం మొదలైన లక్షణాలన్నీ హిస్టీరియా లక్షణాలే.

### iii. కామం

చిత్రాంగి, సారంగునిపైనున్న కామంతో అతనిని ఎలాగైనా దక్కించుకొని కోరిక తీర్చుకోవాలనుకుంది. చిత్రాంగిలోని ఈ కామము కుమారుడయిన సారంగునిపై కామము తగదను బుద్ధిని నశింపచేసి, సారంగుడు చిత్రాంగిని బలాత్కారముగావించబోయాడన్న నిందను మోపి అతని శిక్షకు కారణమవుతుంది. చిత్రాంగి కామ సంకల్పములతో

బుద్ధిని కోల్పోయి ఆమె మనసు అశుద్ధమయింది. సారంగుడిపై అపవాదు మోపినందుకు మరణశిక్షకు గురైన చిత్రాంగి సారంగుని వల్ల మరల జీవితాన్ని పొంది తన తప్పును తెలుసుకొని మనసులో కామ సంకల్పములను తొలగించుకొని శుద్ధమయిన మనసుతో కామాన్ని జయించింది.

తెలుగు సాహిత్యంలో 'సారంగధరుడి' చరిత్ర బహుళ ప్రచారంలో ఉంది. కుమారుడికి చూసిన అమ్మాయిని తండ్రి పెండ్లాడుట ఇందలి ప్రధానాంశం. ఈ కథ జానపదులను బాగా ఆకర్షించి వారి గేయాలలో కథలలో భాగమైంది. ఇందులోని సారంగధరుడు, చిత్రాంగి పాత్రలు జానపదులను బాగా ఆకర్షించాయి.

ఒకనాడు రాచ నగరి నుండి సారంగుడి పావురం

" విధి వీధుల వెంట విడిబడి ఆ పక్షి చిత్రాంగి మేడజేరె

వ్రాలినా గువ్వనూ వనిత చేరదీసి పంజరంబున నుంచెను "

పావురం కోసం వచ్చిన భటులతో చిత్రాంగి

"రాచనగరికి మీరు రారాదు పోరాదు రాజునే బంపుమనెను" [139]

పై గేయన్ని బట్టి సారంగుడి మేడల నుండి వచ్చిన పావురాన్ని చిత్రాంగి కావాలనే పంజరమున ఉంచిందని తెలుస్తుంది. పావురం కోసం వచ్చిన భటులతో సారంగునే వచ్చి పావురాన్ని తీసుకెళ్ళమనుట ద్వారా ఆమె సారంగుని చూడాలన్న భావన వ్యక్తమవుతుంది.

సారంగధరుడు పావురంకోసం చిత్రాంగి మేడలకు వచ్చి

" అమ్మ నా పావురము ఆడంగ వచ్చింది అందియ్యవే నే బొయ్యేనో

తల్లినా పావురము తగులంగ వచ్చింది తెచ్చియ్యవే నే బొయ్యేనో " [140]

ఈ విధంగా సారంగుడు చిత్రాంగితో అమ్మ నా పావురము ఆడుతూ మీ నగరికి వచ్చిందని దాన్ని తెచ్చిస్తే తాను వెళతానంటాడు. చిత్రాంగి సారంగుడి మాటలకు

"మాటిమాటికీ నన్ను అమ్మ అమ్మ  అంటావు బాపు సామ్మేరనీకూ

మాటిమాటికి నన్ను తల్లి తల్లంటావు సబ్బ తల్లేర నీకూ

అమ్మన్ని నోటికీ కమ్మన్ని కజ్జాయ కలదోయి నా నగరిలోనా

ముత్యాల పీటేసి ముందరా కూర్చోని కొడుకు ముచ్చటలడిగెనో" [141]

చిత్రాంగి సారంగుడి తండ్రికి రెండవ భార్య. సారంగుడు చిత్రాంగి కన్న కుమారుడు కాడు. అందుకే చిత్రాంగి ఊరికే నన్ను అమ్మ అమ్మ  అని అంటావు నేనేమన్నా నీ కన్నతల్లినా! అని దబాయిస్తూనే అమ్మన్న ఆ నోటికి కమ్మన్ని కజ్జాయి ఉందంటూ ఆశపెడుతుంది.

చిత్రాంగిలో మనకు సిగ్మండ్ ఫ్రాయిడ్ చెప్పిన 'Id' సిద్ధాంత లక్షణాలు కనిపిస్తాయి. మానవునిలో కోరికలన్నింటికీ ఇదే మూలం. దీనికి మంచి చెడుల జ్ఞానం ఉండదు. అన్ని కోరికలు దీని నుండే పుడతాయి. చిత్రాంగి తాను కోరుకున్న సారంగుడు తనకు దక్కాలనుకుంటుంది. ఈ కోరిక నైతికంగా, భౌతిక పరంగా, జీవిత వాస్తవికతకు వ్యతిరేకంగా ఉన్నప్పటికీ తన కోరికను తీర్చుకోవాలనేది Id లో అధికంగా ఉంటుంది. సృష్టిలో మానవులకు సహజంగా, ప్రకృతిరిత్యా కలిగే కోరికలు Id లో దాగి ఉంటాయి. Id చేసే ప్రేరకాలను తృప్తి పరచడానికి, Ego చేసే కార్యాలను తప్పని నిందించి Super Ego వ్యక్తిలోని  విలువలను కాపాడుతుంది. దీనిని నైతిక శక్తి అనికూడా అంటారు.

మరో గేయంలో చిత్రాంగి తన మనసును బయటపెడుతుంది.

"పెంచెనే మీతండ్రి  పెద్దవానిజేసి పెండ్లిశాయడా యేనూ

భోగాల వారింటి కొత్తువో పోదువో బొంకకా నాకుదెల్పు

కన్ను సైగలు జేసి కాంతలా బిల్చుటకు గాల మిప్పుడువచ్చెను

తల్లి పిల్లిగనెంచి అల్లిబిల్లాడుదము కల్లలూగాదు సుమ్మి

చప్పన్న దేశాల చిత్రపటములు జూచి చిన్నపుడే వరియిస్తిని

వార్థిక్యమూగల వరునకూ నన్నిచ్చ వనజనాభుడు వ్రాసెనా " [142]

ఈ గేయంలో చిత్రాంగి సారంగునితో మీ తండ్రి నిన్ను పెంచి పెద్దవాడిని చేశాడు. నీకు పెళ్ళి వయసు వచ్చింది. మీ తండ్రి నీకు పెళ్ళి చేయడా యేమి? అంటూ భోగాల వారింటి సుఖములను అనుభ వించితివా? భయపడక నాకు చెప్పుమంటూ తల్లిని పిల్లిగానెంచి అల్లిబిల్లి ఆడుదమంటూ అతనిలో కామాన్ని ప్రేరేపిస్తుంది.

చిత్రాంగి ఈ విధంగా చేయుటకు కారణాన్ని పరిశీలిస్తే, పై గేయంలో చిత్రాంగి తను చిన్నతనంలో సారంగుని చిత్ర పటములను చూసి వరించానని, కానీ దైవము తనను వయసుమీరిన భర్తతో ముడివేసి తన కోరికలను చంపేశాడని చెబుతుంది. ప్రతి స్త్రీకి వివాహ విషయంలో, భర్త విషయంలో ఎన్నో ఆశలు, కలలు ఉంటాయి. చిత్రాంగి కూడా తను తన సరిజోడు గల రాకుమారుల చిత్రపటములను చూసి వారిని వరించింది. కానీ తనకన్నా వయసులో పెద్దవాడయిన భర్త తనకు లభించినందుకు చింతిస్తుంది. కానీ చిత్రాంగి మనసులో ఉన్న కోరికలు మాత్రం అలాగే ఉన్నాయి కాబట్టి తను సారంగునితో సంగమించాలనే కోరికతో సారంగునిలో కామాన్ని ప్రేరేపిస్తుంది.

చిత్రాంగి సారంగుని తన గృహములో ఉంచుటకు ఎన్నో ప్రయత్నాలు చేసింది. చివరకు సాహసించి తన మనసులోని కోరికను సారంగునితో తెలుపుతుంది.

"మాటికీ మాటికీ మారు పన్నులు పన్ని మగువ తల్పులెవేసెనూ
చక్కని వోబాల చేత జిక్కితివనుచు రెక్కలా తల్పువేసె
వేడివున్నాచోటవెన్న కరుగవలెను వన్నెకాడా వింటివా
రాజులేని వేళ రమ్యహర్మ్యము కేగి రతికేళిదేలుదాము" [143]

ఈ గేయంలో చిత్రాంగి 'వేడివున్నాచోటవెన్న కరుగవలెను వన్నెకాడా వింటివా' అను మాటలను బట్టి చిత్రాంగి వయసుమీరిన సారంగుని తండ్రితో ఎలాంటి శారీరక సుఖములను అనుభ వించలేదని, ఇంతకాలం తను కామ కోరికలతో విరహవేదనను అనువిస్తున్నదని సారంగుని చూడగానే ఆమెలో ఏదో తెలియని కోరిక అతనితో రతి కేళి చేయమన్నదని తెలుస్తుంది.

కామము చిత్రాంగిలో బుద్ధిని నశింపజేసింది. మనకు లభించిన వాటితో తృప్తిని చెందినపుడు ఇది కావాలి, అది కావాలి అనే సంకల్పములు చేయము. కానీ తన భర్త విషయంలో తన కోరికలకు విరుద్ధంగా వయసుమీరిన పతిని

భర్తగా పొందాననే చింతతో దొరికిన దానికి సంతృప్తి పొందకపోవడంతో తనకు సారంగుడు కావాలనే సంకల్పము కలిగి బుద్ధి నశించి సంకల్పించిన దానికి ఆరాటపడుతుంది.

చిత్రాంగి సారంగుని మానభంగము చేయబోయి పరాభవము పొంది అతని తండికి క్రింది విధంగా లేఖవ్రాసి పంపుతుంది.

"గుబ్బలు గీరుకొని గాజులు గొట్టుకొని గరితరవ్వలు జేసెనూ
ఆటకత్తయిన యీ పాటాలాగంధియు రత్నాంగి కొడుకయితెను
రాకాసి అయినాడు - రవ్వలు బెట్టినాడు తనను సతిగా గోరెను
తంటాలు బెట్టెనని తరుణి లేఖవ్రాసి తండ్రికీ పంపగాను
హర్కారులను బిల్చి సర్కారువారికి జివ్వుననుయిచ్చిరండి " [144]

ఈ లేఖలో చిత్రాంగి సారంగధరుడు తనను సతిగాకోరి తనపై బలాత్కార ప్రత్నము చేసెనని తండ్రికి లేఖ పంపుతుంది. ఈ విధంగా చిత్రాంగి లేఖను పంపుటకు కారణాన్ని పరిశీలిస్తే, చిత్రాంగి సారంగునిపై చేసిన బలాత్కార ప్రత్నమును అతడు తండ్రికి చెప్పిన తనకు శిక్ష తప్పదని గ్రహించి చాకచక్యముతో, ముందుచుపుతో సారాంగుడే తనపై బలాత్కారయత్నము చేసెనని లేఖ వ్రాసిపంపిస్తుంది.

చిత్రాంగి లేఖను అందుకున్న రాజు వెంటనే చిత్రాంగి మందిరానికి వస్తాడు.

"చిలుకలు పలుకవు హంసలు ఆడవు కాంతరాదాయేనెదురూ
కోయిలలుగూయవు అళులయిన మ్రోయవు అతివరాదయె నెదురూ
అప్సరసలాడరూ గంధర్వులు బాడరూ కామినీరాదాయెనూ
నివ్వాళులూరావు నీర జేక్షణరాదు నగరుకళలే దప్పెనూ
సుందరీనీజూచి అదంబుచెడియున్న దంద మేమో దెల్పవే
చంద్రవదనా నీదు చక్కదనమంతానూ యెక్కడాడాగెనొక్కో" [145]

ఈ గేయంలో చిత్రాంగి అలకపాన్పు ఎక్కుతుంది. తన భర్త వచ్చేసరికి మందిరమంతా నిశ్శబ్దంగా ఉంటుంది. అప్సరసల నాట్యములు, గంధర్వ గానములు, కోయిల కూతలు ఇలాంటివేవీ వినిపించవు. రాజును స్వాగతించే వారెవరూ కానరారు. చిత్రాంగి ఇలా చేయుటకు ఆమె అలకే కారణం. అలక తీవ్రతను తెలియజేయుటకే స్త్రీలు ఈ విధంగా ప్రవర్తించెదరు. స్త్రీలకే సొంతమయిన ఈ అలుకతోనే వారు తమకు కావాల్సింది పొందగలుగుతారు. ఒకరకంగా ఇది స్త్రీల ఆయుధంగా చెప్పవచ్చు.

తనను చేరిన పతితో చిత్రాంగి క్రింది విధంగా పలుకుతుంది.

"ముట్టకుమీ వోరాజ మామవయ్యేదునీవు మమ్మి నంటకుమానెనూ
కోడలూ కూతురుతో నెన్నంగదగునని వేదశాస్త్రము బల్కునే
గవ్వముడి తావిప్పి గబ్బి గుబ్బలుజూపి గోరువాటులుజూపెనూ
కోకముడి విడిచి నా కొడుకు జేసిన విధము నాధ యిటు చూడుమనెనూ " [146]

ఈ గేయంలో చిత్రాంగి రాజుతో నన్ను అంటుకోకు ఓ రాజా నీవు నాకు మామవుతావు. కోడలు కూతురుతో సమానమని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయంటుంది. తనకు జరిగిన పరాభవమును రాజుకు చెబుతూ అందుకు సారంగుడి ఆనవాళ్ళను తన శరీరంపై చూపుతుంది. చూశావా రాజా నా కొడుకు ఎంత పనిచేశాడో అని సారంగధరుని కొడుకుగా చెబుతుంది. ఈ గేయంలో చిత్రాంగి సారంగధరును తన కుమారుడిగా చెబుతుంది.

చిత్రాంగి సారంగునిపై బలాత్కార ప్రయత్నముచేసి మరళా ఇప్పుడు సారంగుని తన కుమారుడు అని అనడాన్ని బట్టి ఈమెను అవకాశవాదిగా చెప్పవచ్చు. ఇలాంటివారు పరిస్థితులను బట్టి ఎలా ప్రవర్తించాలో తెలుసుకొని ఎంతో చాకచక్యంగా వ్యవహరిస్తుంటారు. కుమారుడి వరసయిన సారంగధరుడిపైన బలాత్కార ప్రయత్నము చేసిన చిత్రాంగి రాజు దగ్గర నా కొడుకు అని సంబోధించుట వలన చిత్రాంగి సారంగుని కన్న కుమారునిలా చూసుకుంటుందన్న నమ్మకాన్ని రాజుకు కలిగించుటకే 'నా కొడుకు' అన్న పదాన్ని వాడిందనవచ్చు.

చిత్రాంగి మోపిన నేరానికి సారంగునికి అంగవిచ్ఛేద శిక్ష విధించబడి రాజనరేంద్రముకు యోజనా దూరములో కొండలమీద రుద్రవృక్షము క్రింద సారంగుని కాళ్ళుచేతులు నరకబడి అక్కడి మునుల వల్ల, దైవానుగ్రహంవల్ల

సారంగుడు తిరిగి తన అవయవాలను పొందగలుగుతాడు. విషయాన్ని తెలుసుకున్న రాజరాజనరేంద్రుడు కుమారుడయిన సారంగుని కలిసెను. సారంగుడు చిత్రాంగి మరణశిక్షకు గురయిందని తండ్రి ద్వారా తెలుసుకొని చిత్రాంగికి జీవంపోస్తాడు. [147]

సారంగునిద్వారా తిరిగి జీవం పొందిన చిత్రాంగి సారంగునితో ఇలా అంటుంది.

" అయ్యో నా పుత్రుడా అపకీర్తి పాలయితి నేనయినయిటుజేస్తినే

మా తప్పులను మన్నించి మమ్ముర‌క్షించి మహియంత యేలవయ్య" [148]

పై గేయంలో చిత్రాంగి సారంగునివల్ల జీవం పొంది. తన తప్పును తెలుసుకొని కుమారుని మన్నించమంటుంది. తాను సారంగునిపై మోపిన నేరారోపణ వల్ల తాను అపకీర్తి పాలయ్యానని మన్నించి మమ్మేలమంటుంది. చిత్రాంగి పశ్చాత్తాపంతో తాను చేసింది తప్పని తెలుసుకుంటుంది.

మనసు శుద్ధం, అశుద్ధం అని రెండు విధాలుగా ఉంటుంది. కామ సంకల్పములుగల మనసు అశుద్ధం అనీ, కామ సంకల్పములు లేని మనసు శుద్ధం అని రెండు విధాలు. ప్రారంభములో చిత్రాంగి కామ సంకల్పములతో బుద్ధిని కోల్పోయి ఆమె మనసు అశుద్ధమయింది. కానీ ఆమె తన తప్పును తెలుసుకొని మనసులో కామసంకల్పములను తొలగించుకొని శుద్ధమయిన మనసుతో కామాన్ని జయించింది. ఈ కామం అరిషడ్వర్గాలలో ఒకటి. మనసును, బుద్ధిని అహంకరం కప్పివేస్తూ స్వార్థ బుద్ధితో అరిషడ్వర్గాల ద్వారా ఏదో ఒక మార్గంలోకి మళ్ళించి గమ్య స్థానం చేరకుండా చేస్తుంది. మానవులు అరిషడ్వర్గాలను జయించడం ఎంతో కష్టమయిన పని. వయసు పెరిగేకొద్దీ తన అనుభవాల ద్వారా ఈ అరిషడ్వర్గాలను జయించవచ్చు. చిత్రాంగి పశ్చాత్తాపంతో అరిషడ్వర్గాలలో ఒకటయిన కామాన్ని జయించింది.

వేదవ్యాసుడు సంస్కృతంలో రచించిన భాగవతగాథను పోతన తెలుగులోకి అనువదించారు. సంస్కృతం నుండి భాగవతాన్ని తెలుగులో అనువదించునప్పుడు పోతన మూలంలో లేని, జానపదులలో కథలుగా, గేయాలుగా ప్రసిద్ధి చెందిన అనేక ఘట్టాలను స్వీకరించి భాగవతంలో చేర్చారు. పోతన తరువాత అనేక మంది పోతనగారి భాగవతాన్ని అనుసరించే భాగవతాన్ని రచించారు. జానపద గేయానికి దగ్గరైనది మరియు గాన యోగ్యమైన ద్విపద ఛందస్సులో అనేక మంది భాగవతాన్ని రచించడాన్ని బట్టి ప్రజాదరణ పొందిన జానపద సాహిత్యం పట్ల మనం ఎంతగా ఆకర్షితులమయ్యామో చెప్పవచ్చు. సామాన్య మానవుని అభ్యున్నతికి ఉపయోగపడే సత్యం, సర్వభూతదయ, సత్ప్రవర్తన వంటి విషయాలెన్నో భాగవతంలో ప్రతిపాదించబడి జానపదులను ఆకర్షించి వారి కథలలో, గేయలలో, దృశ్యరూపకంగా, వారి జీవనంలో భాగమైంది. [149]

జానపదుల గేయాలలో రామాయణానికి ఉన్నంత ప్రాముఖ్యత భాగవతానికి లేదు. భాగవత గాథలను జానపదులు గేయరూపం కంటే దృశ్యరూపంలో ప్రదర్శించి ప్రాముఖ్యతను చాటుకున్నారు. అందుకే వేళ్ళమీద లెక్కించగలిగేన్ని గేయాలు మాత్రమే జానపదుల భాగవతంలో లభ్యమవుతున్నాయి.

## 6.1. సత్యభామ

### i.అసూయ

పారిజాత పుష్పాన్ని కృష్ణుడు రుక్మిణికి అలంకరించాడని తెలుసుకున్న సత్య, పారిజాత పుష్పం తనకు కాకుండా రుక్మిణికి దక్కినందుకు అసూయతో అలకపాన్పు ఎక్కుతుంది. ఇతరుల ధనమును, రూపాన్ని, పరాక్రమాన్ని, సత్కార గౌరవాలను చూసి మానవులలో అసూయ కలుగుతుంది. పారిజాత పుష్పం అలంకరణ వలన రుక్మిణికి కలిగిన గౌరవాన్ని చూసి ఒర్వలేని తనంతో సత్యలో అసూయ కలుగుతుంది.

### ii. చైల్డ్ ఇగో స్టేట్

'చైల్డ్ ఇగో స్టేట్' లోని వ్యక్తులు చిన్న పిల్లల్లా ప్రవర్తించడం, తాము అందరిలోనూ ప్రత్యేకంగా ఉండాలని, తమను అందరూ మెచ్చుకోవాలని కోరుకుంటారు. ఇలాంటి మనస్తత్వం సత్యభామలో ఉండటం వలన కృష్ణుడి సతీమణులందరినూ సత్యభామే అధికురాలిగా ఉండాలని కోరుకుంది. ఎప్పుడయితే కృష్ణుడు పారిజాతాన్ని రుక్మిణికి అలంకరించాడో దాంతో తన ఆధిక్యత కోల్పోయినదిగా భావించింది. 'చైల్డ్ ఇగో స్టేట్' లోని వ్యక్తులు తాము కోరుకున్న దానినిన సాధించడానికి ఎలాంటి పనులనయినా చేస్తారు. ఈ మనస్తత్వమే సత్యభామ పారిజాత వృక్షాన్ని తన పెరటిలో నాటించుకునే వరకు తెచ్చింది.

### iii. హిస్టిరియా

'హిస్టీరియా' లక్షణాలున్న వ్యక్తులు తాము కోరుకున్నది సాధించడానికి ఎలాంటి పనులయినా చేస్తారు. దీనికి ఉదాహరణగా పారిజాత పుష్పాన్ని కృష్ణుడు రుక్మిణికి అలంకరించిన సందర్భంలో సత్యభామ నాటకీయతతో అలకపాన్పునెక్కి కృష్ణునిచేత పారిజాత వృక్షాన్ని పెరటిలో నాటించుకుంది.

### iv. భద్రతారాహిత్యం

మనశ్శాంతి లేకపోవడం, అధిక భావోద్రేకం, భయాందోళన మొదలైన ఉప లక్షణాల వలన మనిషిలో భద్రతారాహిత్యం ఏర్పడుతుంది. ఈ భద్రతారాహిత్యం వలన కృష్ణుడు తనకు దక్కకుండా పోతాడేమోనన్న

భావంతో సత్యభామ పుణ్యక్రవతం చేపడుతుంది. వివాహమైన స్త్రీకి భర్తే సర్వస్వం. స్త్రీ తన భర్త నీడలోనే తనకు భద్రత ఉంటుందని నమ్ముతుంది. తన భర్త తననుగాక పరస్త్రీవైపు కన్నెత్తి చూసినా తన భద్రకు ప్రమాదం కలుగునేమోనని భావిస్తుంది. ఈ భద్రతారాహిత్య భావంతోనే సత్యభామ ఈ పుణ్యక వ్రతంతో కృష్ణుడు తనకు మాత్రమే అమరి ఉండునని నమ్ముతుంది.

**v. ఆత్మన్యూనత**

సత్యభామలో 'ఆత్మన్యూనత' సిద్ధాంత లక్షణాలు కనిపిస్తాయి. ఆత్మన్యూనతా భావాన్ని అధికమించడానికి వ్యక్తులు చేసే వ్యర్థ ప్రయత్నాల వలన వారు న్యూరోటిక్ గా మారుతారు. ఆశలు అడిఆశలు అయి, తాము కోరుకున్న ఆధిక్యతను పొందలేక మానసిక రుగ్మతకు లోనవుతారు. సత్యభామకు కూడా కృష్ణుడు తమకు మాత్రమే సొంతం కావాలనే ఆశతో పుణ్యక్రవతం మొదలుపెట్టింది కానీ కృష్ణుని సొంతం చేసుకోలేక పోయింది. ఆ భాగ్యం రుక్మిణికి దక్కింది. దీంతో సత్యభామ తానుకోరుకున్న ఆధిక్యతను పొందలేక ఆమె ఆశలు ఆడియాశలయినాయి.

**vi. ఆత్మాధిక్యము**

సత్యభామలో ఆధిక్యతాభావం కనిపిస్తుంది. దీని వలన వ్యక్తులు ఏ ప్రయోజనం కొరకు తమ పనులను చేపడతారో ఆ పనులను తాము సాధించే వరకు ప్రయత్నిస్తూనే ఉంటారు. సత్యభామ కూడా తను కృష్ణుని పొందుటకు ధనము కొరకు ఎన్నో ప్రయత్నాలు చేస్తుంది. సఖులతో పతిని తూచుటకు తగు ధనమును తెమ్మని అనేక విధాల ప్రయత్నం చేస్తుంది. సత్యభామ ఆత్మాధిక్యతాభావం వలన తనను ఉన్నతంగా చిత్రించుకుంటుంది.

సాహిత్యంలో ఎన్ని స్త్రీ పాత్రలున్నా మన మనసుకు హత్తుకునే పాత్రలు కొన్ని మాత్రమే. అటువంటి వాటిలో సత్యభామ పాత్ర ఒకటి. జానపదులు అనేక కల్పనలతో వీర, శృంగార మూర్తిగా సత్యభామను తీర్చిదిద్దారు. కృష్ణునికి 16వేలమంది గోపికలు, 8 మంది భార్యలున్నా అందరిలోనూ సత్యభామదే ప్రత్యేక స్థానం.

కృష్ణుడు రుక్మిణీ సమేతుడైనవేళ నారదుడు స్వర్గలోకం నుండి పారిజాత పుష్పాన్ని తీసుకువచ్చి ఆ పుష్పాన్ని కృష్ణుని ఇష్టసఖికి ఇవ్వమనగా కృష్ణుడు ఆ పుష్పాన్ని రుక్మిణికి అలంకరిస్తాడు.

నారదుడు పారిజాత పుష్ప మహిమను క్రింది విధంగా వివరిస్తాడు.

" వికసించుండును వాడదు యెన్నడు వాసనచెడదూ
ఒకయేడూ యాపూవు వనరుగ నీవద్దవుంటే
సకలమైన వస్తువులనూ సమకూర్చుకు వుండూ" [150]

నారదుడు పారిజాత పుష్ప గొప్పదనాన్ని వివరిస్తుండగా, ఆ మాటలు విన్న సత్యభామ చెలికత్తెలు విషయాన్ని సత్యభామకు చెప్తారు. ఈ వార్త విన్న సత్యభామ తనలోని అసూయను క్రింది విధంగా చూయిస్తుంది.

"సరసిజాక్షులారా సర్వజ్ఞుండని యెరిగి
యెలమీ నడుపుకు వస్తి యిందరి సవతులలోపలనూ
నాకంటెక్కువ అని తలచెన రుక్మిణి నిపుడు
అని తలకాయను బిగియించి తరుణి మౌనముచేత
సొలయుచు నవరత్నమ్ములు కలిసిన సొమ్ములు సళ్ళించె
చెదిరిన కొప్పటు విడిచి - శిథిలముగా ముడుచుకొని
సొలయుచు నవరత్నమ్ములు కలిసిన మందిరములు దాటి
పూరింటిలో నొక్కా కీలడుగు మంచముపయి
చీరొక్కటి పరుచుకు పవళించెను శ్రీహరులనుదలచీ" [151]

ఈ గేయంలో సత్యభామ తనకంటే అధిక ప్రాధాన్యమిచ్చి, పారిజాత పుష్పాన్ని శ్రీకృష్ణుడు రుక్మిణికి అలంకరించుటతో, కృష్ణుడు తనకు అధిక చనువుని, స్వేచ్ఛని ఇవ్వడం వలన కృష్ణుని సతులందరిలో సత్యదే అగ్రస్థానంగా ఉండేది. కానీ పారిజాత పుష్పాన్ని రుక్మిణికి అలంకరించడంతో సత్యకు అందరిలో ప్రాధాన్యం తగ్గిపోయి రుక్మిణికి ప్రాధాన్యం పెరుగుతుందనే అవేదన సత్యభామలో కనబడుతుంది. బుద్ధి దోషాలలో ఒకటైన 'అసూయ'ను పారిజాత పుష్పాన్ని కృష్ణుడు రుక్మిణికి ఇచ్చిన సందర్భంలో సత్యభామలో గమనించవచ్చు. నారదుడు ఇచ్చిన పారిజాత పుష్పాన్ని భర్త తనకే ముందు ఇవ్వాలనే భావన, రుక్మిణికి ఇచ్చాడన్న ఒర్వలేని తనం సత్యలో ఉన్నాయి.

జిడ్డుకృష్ణమూర్తిగారు అసూయ గురిచి వివరిస్తూ మానవులు ఇతరులకున్న వాటితో తనకున్నవాటిని పోల్చిచూసి అసంతృప్తితో అసూయ పడతాడు. ఎన్నింటినో తాను సొంతం చేసుకోవాలనుకుంటాడు. సంపాదించాలన్న ఆకాంక్షే మనిషిలో అసూయను పెంచుతుంది. మనిషిలో ఈ అసూయ స్థాయి పెరిగే కొద్దీ అంతా కావాలనుకుంటాడు. అన్నీ తనకే దక్కాలని అనుకోవడానికి అసూయకు చాలా దగ్గర సంబంధం ఉందంటారు కృష్ణమూర్తిగారు. కృష్ణమూర్తిగారు చెప్పిన ఈ లక్షణాలే పారిజాతపుష్పం సంఘటనలో సత్యభామలో చూడవచ్చును.

ప్రఖ్యాత మానసిక శాస్త్రవేత్త 'ఎరిక్ బర్న్' సిద్ధాంతాల ప్రకారం ప్రతి వ్యక్తిలో 'చైల్డ్ ఇగో స్టేట్' ఒకటి ఉంటుంది. ఈ దశలోని వ్యక్తులు చిన్నపిల్లల్లా ప్రవర్తిస్తూ, అందరిలోనూ ప్రత్యేకంగా ఉండాలని, తనను అందరూ మెచ్చుకోవాలని అనుకుంటారు. ఈ మనస్తత్వం వల్లనే సత్యభామ కృష్ణుని సతీమణులందరిలో తానే ప్రత్యేకంగా (అధికురాలుగా)ఉండాలని కోరుకుంది. అలాగే ఉంది కూడా. కానీ ఎప్పుడయితే కృష్ణుడు పారిజాత పుష్పాన్ని రుక్మిణికి అలంకరించాడో అప్పటి నుండి తాను ఆధిక్యతను కోల్పోయినట్లు భావించి, ఈ అవమానాన్ని భరించలేక తాను అలంకరించుకున్న నగలను, పట్టు వస్త్రాలను విడచి సాధారణ వస్త్రాలను ధరించి పూరింటిలో పట్టె మంచంపై శ్రీకృష్ణుని కొరకు వేచిచూస్తుంది.

సత్య విడచిన ఆభరణాలు, వస్త్రాలను సవతులకు తనపట్ల ఉన్న గౌరవానికి, భయానికి ప్రతీకలుగా చెప్పవచ్చు. ఈ ఆభరణాలు, వస్త్రాలు తనను వీడినట్లే సవతుల మదిలో తన పట్ల గౌరవ, భయ భావాలు వీడాయనే భావనగా చెప్పవచ్చు. మరొక విధంగా పరిశీలించినచో నవరత్నాలతో, పట్టు వస్త్రాలతో నిత్యనూతనంగా వెలుగొందే సత్య ఈనాడు తన ఆభరణాలను, వస్త్రాలను విడచి సాధారణ చీరను కట్టుకొని, పట్టె మంచంపై పనుకొనుటకు ఆమె అలుక అక్కడి చెలులకు, శ్రీకృష్ణునికి తెలియాలనే సత్యభామ ఇలా ప్రవర్తి స్తుంది.

కృష్ణుడు సత్య అలుకకు కారణం తెలుసుకొని ఆమె అలుకను తీర్చుటకు

''చక్కని పారిజాతం కొనితెస్తును సరసవనములోదీ

యెక్కువతో నాటింతూ నీ పూల వనములోనూ

అని హరిబల్కగ యింతీ గ్రక్కునా లేచీ

మక్కువతోడుత శాక పాకమ్ములు మరిసేయూమనెనూ

జలకమాడి ఒక్కా సన్నావలిపెంగట్టి

అలికులవేణి రత్నాభరణములన్నీ ధరియించె "[152]

అని పలుకగా సత్యభామ తన అలుకను వదిలి, జలకమాడి మునుపటిలా తన ఆభరణాలను, వస్త్రాలను ధరించి ముస్తాబయింది. ఈ గేయాన్నిబట్టి సత్యభామ తన అలుకకు కారణమైన పారిజాత పుష్పాన్ని తీసుకువచ్చి కృష్ణుడు తన పెరటిలోనే నాటించెదనన్న మాటతో ఆమె అలుక చాలిస్తుంది. దీన్ని సాధించుటకే కాబోలు సత్య అలుకను ప్రదర్శించి, తాను కోరుకున్న దానిని సాధించింది. ఇలాంటి మనస్తత్వాన్ని మనం 'చైల్డ్ ఇగో స్టేట్'లో చూడగలం. వీరు తాము కోరుకున్న దాన్ని సాధించడానికి ఎలాంటి పనులయినా చేస్తారు. పారిజాత పుష్పాన్ని తన పెరటిలో నాటించుకున్నచో సత్యభామ పూర్వవైభవం అనగా సవతులందరిలో ఆధిక్యతను, తన ప్రత్యేకతను చాటినట్లుగా భావిస్తుంది.

సత్యభామలో మనం 'హిస్టీరియా' లక్షణాలను గమనించవచ్చు. నాటకీయతతో ఇతరులను ఆకర్షించాలనుకోవడం వీరి లక్షణం. ఈ విధంగానే సత్య తాను నాటకంతోనే కృష్ణుడు పారిజాతాన్ని తీసుకువస్తానని మాట ఇచ్చేవరకు దారి తీస్తుంది. శ్రీకృష్ణుడు పారిజాతాన్ని తీసుకువస్తానన్న మాటలకే సత్యభామ ఆ పుష్పాన్ని సాధించినట్లుగా భావించి అలుకను మానిందంటే ఆమెకు తన భర్త సామర్ధ్యంపై గల నమ్మకాన్ని తెలియజేస్తుంది. పారిజాత పుష్పాన్ని స్వర్గలోకం నుండి తెచ్చి సత్య తన పెరటిలో నాటింది.

"పూచిన పువులన్నీ రుక్మిణి కడ కపుడూ వెళ్ళే

తుమ్మెదలయి పువులు అన్నీ రుక్మిణిపయి వ్రాలే

వేశ్య కాంతవు గనుక నీవు పువులన్ని ముట్టరాదు

అంటరాదు అని కృష్ణుడు తాబలికె "[153]

పారిజాత పుష్పాలన్నీ పూచినవి పూసినట్లే రుక్మిణి దగ్గరకు వెళుతున్నాయని, అలాగే పూవులపై వాలిన తుమ్మెదలు రుక్మిణిపైనే వాలుతున్నాయని నారదుడు సత్యతో చెప్పుచుండగా కృష్ణుడు 'వేశ్య కాంతవు గనుక పూవులను ముట్టరాదు అంటరాదు'అని అంటాడు. ఇక్కడ సత్యను వేశ్యగా చెప్పడానికి కారణం పరిశీలిస్తే ఆనాడు అనేకమంది స్త్రీలు విదుషీమణులుగా, సాహిత్య సమరాంగణలుగా ఉంటూ రాజుల పత్నులుగా గౌరవాన్ని అధికారాన్ని కలిగి ఉండేవారని వేశ్యగా పేర్కొంటారనవచ్చు. బహుశా వీరి వలనే జానపదులు సత్యభామను ఈ విధంగా భావించి ఉండవచ్చు. [154]

ఒకనాడు నారదుడు

" సత్యభామ నగరికేగి అచట పూజలంది తాను
భక్తి జూచి తలాపెట్టె వ్రతము నొక్కటీ
తులసి పూజజేసి తేను తోయజాక్షి నీకు వేగ
వైకుంఠ పదవి వచ్చు వారిజాక్షిరో
యింతకన్న నెక్కువైన వ్రతమునాకు దెల్పవయ్య
ముందు జన్మలోన కృష్ణుడు మగడు ఔటకూ
అంతకన్న నెక్కువైన వ్రతము నొక్కటుండెగాని
చెప్పగాను జేయవేమొ సిగ్గు చేతనూ
గోపికామనోహరుండు గోపాలకృష్ణమూర్తి
భర్తనా కమరియుండ సిగ్గులేమిటికి
పతినిదానమిచ్చినట్టి వారి పుణ్యమేమొగాని
వైకుంఠ వాసులైన నణగివుందురూ
శ్రీలక్ష్మి పార్వతమ్మ యింద్రాణి మొదలుగాను
దేవి శక్తులైనగాని జడియుచుందురూ " [155]

ఈ గేయంలో నారదుడు సత్యభామ నగరానికి వచ్చి సేవలు పొంది సత్యభామతో ఒక వ్రతం గురించి వరిస్తాడు. తులసి పూజ చేస్తే వైకుంఠ పదవి వచ్చుననెను. కానీ సత్యభామ దానికన్నా అధికమయిన వ్రతము గురించి చెప్పమనుటనుబట్టి ఆమెకు పదవీ వ్యామోహం లేదనే చెప్పవచ్చు. కృష్ణుడు తనకు అమరి ఉండే వ్రతమును గురించి చెప్పమనుట ద్వారా పతిపై ఆమెకున్న అనురాగాన్ని, కృష్ణుడు తనకు దక్కడేమోనన్న అనుమానన్ని తెలియజేస్తుంది.

సత్యభామ పుణ్యక వ్రతమును చేయుటకు ప్రధాన కారణం 'భద్రతారాహిత్యం' అని చెప్పవచ్చు. మనశ్శాంతి లేకపోవడం, అధికోద్రేకం, భయాందోళన మొదలైన ఉప లక్షణముల వలన ఈ భద్రతారాహిత్యం బయటపడుతుంది. సత్యభామకు భర్తకు మించి వేరే భాగ్యం లేదు. భారతీయ సంప్రదాయం ప్రకారం వివాహమైన స్త్రీకి భర్తే సర్వస్వం కదా! స్త్రీ తన భర్త నీడలోనే తనకు భద్రత ఉంటుందని నమ్ముతుంది. తన భర్త తనను గాక పరస్త్రీలవైపు కన్నెత్తి చూసినా తన భద్రతకు ప్రమాదం కలుగునని భావిస్తుంది. సత్యభామ పుణ్యకవ్రతం చేయుటకు భద్రతారాహిత్యమే కారణం. తన భర్త ఎప్పటికీ తన దగ్గరే ఉండాలన్న భావన సత్యభామలో కనిపిస్తుంది. ఈ భావన సత్యలో కలుగుట సమంజసమే. ఎందుకంటే కృష్ణునికి అష్టభార్యలు, వేలగోపికలు కలరు కదా! [156]

నారదుడు సత్యభామకు పతినిదానమిచ్చి, అతనికి సరిసమానమైన కనకముచే తూచి తిరిగి పొందవచ్చని నారదుడు చెప్పిన వ్రతమునకు అంగీకరించి సత్య వ్రతమును ప్రారంభించెను. సత్యభామ కృష్ణుని నారదునికే దానమిచ్చి తిరిగి పొందుటకు సత్యభామ

"కోటలోను వున్నవన్ని వరహాలు మొహరీలు
అన్ని వేసి తూచినాను మొగ్గదాయెనూ
యింటనున్న పలకసర్లు పతకమూలు దెచ్చినాను
తూగడాయె కృష్ణమూర్తి చోద్యమందగా
యిరుగుపొరుగు సొమ్ములన్ని దెచ్చివేసి చూడగాను
మొగ్గదాయె దైవమాయ తెలియదెవరికీ

తనకు సత్రజిత్తుడిచ్చినట్టి గొప్ప ముత్యసరులు

తెచ్చివేసి చూడగాను తూగదాయెను

కృష్ణమూర్తి యింద్రపదవి చూడబోయి తెచ్చినట్టి

కనకమంతవేసెగాని తూగదాయెనూ

నరకసురును సంహరించి దెచ్చినట్టి మూలధనము

నన్ని వేసి చూచెగాని మొగ్గదాయెనూ "[157]

సత్యభామ ఈ విధంగా తమ కోటలో ఉన్న ధనాన్ని, తనకు సత్రాజిత్తు ఇచ్చినధనమును, కృష్ణుడు ఇంద్ర లోకానికి వెళ్ళి తెచ్చిన ధనమును, నరకాసురుని సంహరించి తెచ్చిన ధనమును అంతటినీ తెచ్చి తూచినా కృష్ణుని తూచలేక పోయింది.

"సత్యభామ చింతనొంది సఖులజూచి యిట్లుబలికె

యేమిసేతు నెట్లుదెత్తు నాదుభర్తనూ

నారదుండు జెప్పగాను మంచి వ్రతము దొరకెననుచు

పూని నేను చేసితిని పతినిదానమూ

చేసినందుకేమి చింత చెలియలార మీరుకొంత

ధనము తెచ్చితేను వచ్చునాదు కృష్ణుడూ "[158]

సత్యభామ తాను చేసిన తప్పును తెలుసుకొని చింతిస్తూ సఖులజూచి, నారదుడు చెప్పగా మంచి వ్రతమని తలచి ఈ వ్రతమును చేశాను. కానీ పతిని తిరిగి పొందుటకు తన దగ్గరున్న ధనము సరిపోలేదంటూ మీ వద్దనున్న ధనమును తెచ్చి పతిని దక్కించమని వారిని వేడుకుంటుంది.

ఈ గేయంలో సత్యభామ తానుచేసిన వ్రతమునకు చింతిస్తుంది. సత్యభామలో మనకు ఆల్ ఫ్రెడ్ ఆడ్లర్ 'ఆధిక్యతాభావం' కనిపిస్తుంది. వ్యక్తులు ఏ ప్రయోజనం కొరకు తమ పనులను చేపడతారో ఆ పనులను తాము సాధించే వరకు ప్రయత్నిస్తూనే ఉంటారు. సత్యభామ కూడా తను కృష్ణుని పొందుటకు ధనము కొరకు ఎన్నో

ప్రయత్నాలు చేస్తుంది. సఖులతో పతిని తూచుటకు తగు ధనమును తెమ్మని అనేక విధాల ప్రయత్నం చేస్తుంది. సత్యభామ ఆత్మాధిక్యతాభావం వలన తనను ఉన్నతంగా చిత్రించుకుంటుంది.

కృష్ణుని మాటలతో రుక్మిణి మందిరానికి వచ్చిన సత్యతో రుక్మిణి నీ రాకకు కారణమేమని అడుగగా, సత్యభామ.

"పెద్దదానవనుచు మిమ్ము జూడవచ్చితి
వొక్కనాడు నారదుండు వచ్చినన్ను వ్రతముజేయు
మనుచుదెల్పగానుజేస్తి పతినదానమూ
నతనియెత్తు కనకమిచ్చినపుడు మనముపుచ్చుకోగ
వ్రతముపూర్తి జేస్తి నమ్మ వూరకుండక
కొండపొడవు కనక రాశి గొప్పముత్యసరములెల్ల
నిండుగాను వేసినాను తూగడాయెను
నాకువల్ల కాకపోయి సిగ్గుచేత మోమువంచి
మిమ్ముచేరి మ్రొక్కినాను చిన్నదానను " [159]

సత్యభామ రుక్మిణితో తాను చేసిన వ్రతము గురించి చెబుతుంది. పతిని స్వీకరించుటకు తన దగ్గర తగినంత ధనములేక భర్తను స్వీకరింపలేక పోయితినని తనకు అసాధ్యమైన వ్రతమును చేసితినని చింతిస్తూ, సిగ్గుచేత తప్పు చేసినదానివలె తన ముఖమును రుక్మిణి చూపలేక తలదించుకుంటుంది. సత్య తానుచేసినది తప్పని తలచినట్టు రుక్మిణి ముందు తలదించుకుంటుంది.

సహజంగా మనం ఎవరి దగ్గరకయినా సహాయానికి వెళ్ళే సమయంలో వారిని ఆ సమయంలో మనకన్నా ఉన్నతంగానే భావిస్తాం. వారి ముందు ఆధిక్యతను ప్రదర్శించక వినమ్రతగా మన సమస్యను చెప్పి సహాయం పొందడం సజమేకదా! ఈ విధంగానే సత్య రుక్మిణి వద్ద ప్రవర్తించింది.

రుక్మిణి సత్యకు తన వద్ద ధనమేమీ లేదని అంతకంటే ముఖ్యమైనవస్తువు తన వద్ద ఉందని చెప్పి తులసి దళమును తీసుకువచ్చి సత్యకు ఇచ్చి దీంతో కృష్ణుని తూచమంటుంది. ఆ మాటలకు సత్య రుక్మినితో క్రింది విధంగా పలుకును.

"తులసిదళము నేనుపట్ట నలిగిపోవునూ

మృదువైన తులసిదళము మీరుదెచ్చి తూచవలెను" [160]

సత్యభామ సుకుమారమైన తులసిదళమును పట్టుకున్నచో అది నలిగిపోవునని కనుక రుక్మిణినేవచ్చి తులసిదళంతో కృష్ణుని తూయమంటుంది. సత్యభామ మదిలో తన భాండాగారంలోని ధనమంతా తెచ్చి తూచినా తూగని కృష్ణుడు ఈ తులసిదళం తీసుకెళ్ళి తూచిన తూగునా అనే సందేహము కలిగి రుక్మిణినే వచ్చి తూయమంటుంది.

కృష్ణుని దక్కించుకొనుటకు రుక్మిణినే చివరి ఆధారంగా భావించింది కనుక సత్య రుక్మిణి ధనాన్ని కాక తులసి దళమును తీసుకొచ్చి దీనితో తుయమనగా మనసులో అనుమానం ఉన్నా రుక్మిణిమీద ఉన్న నమ్మకంతో ఆమెనే వచ్చి కృష్ణుని తులసిదళంతో తూచమంటుంది.

రుక్మిణి కృష్ణుని తులసి దళంతో తూచి అతనిని నారదుని వద్దనుండి తిరిగి పొందినది. కృష్ణుడు రుక్మిణితో ఆమె అంతఃపురానికి వెళ్ళగా సత్యభామ తన తప్పును తెలుసుకొని క్రింది విధంగా ప్రవర్తింస్తుంది.

"సత్యభామ కనులయందు నీరు గుప్పుచూ

చెలులజూచి మందిరంబు జేరియుండె సిగ్గుచేత

జనులజూడ మనసురాక భీతిచెందియూ " [161]

తులసి దళముచే రుక్మిణి కృష్ణుని తూచి కృష్ణునితో అంతఃపురమున కేగెను. సత్యభామ తానుచేసిన పనికి సిగ్గుపడి అవమాన భారంతో ప్రజలయెదుట నిలువలేక కన్నీటితో అంతఃపురనికి చేరుకున్నది.

సత్యభామలో మనకు ఆడ్లర్'ఆత్మన్యూనత' సిద్ధాంత లక్షణాలు కనిపిస్తాయి. ఆత్మన్యూనతా భావాన్ని అధికమించడానికి వ్యక్తులు చేసే వ్యర్థ ప్రయత్నాల వలన వారు న్యూరోటిక్ గా మారుతారు. ఆశలు అడిఆశలు అయి,

తాము కోరుకున్న ఆధిక్యతను పొందలేక మానసిక రుగ్మతకు లోనవుతారు. సత్యభామకు కూడా కృష్ణుడు తమకు మాత్రమే సొంతం కావాలనే ఆశతో పుణ్యకవ్రతం మొదలుపెట్టింది కానీ కృష్ణుని సొంతం చేసుకోలేక పోయింది. ఆ భాగ్యం రుక్మిణికి దక్కింది. దీంతో సత్యభామ తానుకోరుకున్న ఆధిక్యతను పొందలేక ఆమె ఆశలు ఆడియాశలయినాయి.

సత్యభామకు ఆత్మాధిక్యత భావం ఎక్కువ. అందుకే ఎవరినీ సంప్రదించకుండా పుణ్యక వ్రతానికి శ్రీకారం చుట్టి రుక్మిణి చేతిలో భంగపడి అవమాన భారంతో అంతఃపురానికి చేరుకుంది.

## 2.రుక్మిణి

### i.కోపం

కృష్ణుడు అధిక సమయాన్ని సత్యభామ వద్దే గడపడం వల్ల రుక్మిణికి సత్యభామ పై కోపం కలుగుతుంది. 'యేమిజూచీ వలచెనే - కోమలీ - అది యెంత సుందరమ్మ' అను మాటలనుబట్టి కృష్ణుడు సత్యలో ఏమిచూసి వలచాడోనని తన కోపానికి కారణమైన దాన్ని ఎదుర్కోవలనే ఉద్దేశ్యం రుక్మిణిలో కనబడుతుంది. దీని వల్ల కృష్ణుడు సత్యాలోలుడగుటను నివారించవచ్చనుకుంటుంది. మన మిత్రులు, సోదరులు, ఆత్మీయులు మొదలైనవారు మనకు వ్యతిరేకంగా ప్రవర్తించినప్పుడు వారిపై కలిగే కోపమే ఆత్మ కర్తృత్వం. ఈ ఆత్మ కర్తృత్వం వల్లే రుక్మిణి తన కోపానికి కారణమైన సత్యభామను ఎదుర్కోవాలనుకుంటుంది. రుక్మిణికి సత్యభామపైనే కాకుండా కృష్ణుణిపై కూడా కోపం ఏర్పడుతుంది. దీంతో కృష్ణుడు చిన్నతనం నుండి స్త్రీ లోలుడయి గోపికలతో రాసలీలలు సాగించేవాడని ఎంత మంది స్త్రీలయినా అతని కౌగిటకు సరిపోరని కృష్ణుని నిందిస్తుంది.

### ii.వ్యత్యయీకరణం

మనం ఒత్తిడులకు, అసహనానికి గురైన సందర్భంలో వాటిని తగ్గించుకోడానికి మనకు లోబడిన వ్యక్తుల మీద, వస్తువుల మీద మన కోపాన్ని ప్రదర్శించడం జరుగుతుంది. కొన్ని సమయాలలో మనకు లోబడని వ్యక్తులమీద కూడా ఈ కోపాన్ని ప్రదర్శించడం జరుగుతుంది. ఇలాంటి మనస్తత్వాన్ని 'వ్యత్యయీకరణం'. కృష్ణుడు సత్యాలోలుడగుట వలన రుక్మిణి సత్యభామపై ఉన్న కోపాన్ని కృష్ణునిపై ప్రదర్శిస్తుంది.

### iii.అసూయ

ఇతరుల ధనమును, బల పరాక్రమాలను, వంశ ప్రతిష్టను, సత్కార గౌరవాలను చూసి మనిషిలో అసూయ కలుగుతుంది. ఈ అసూయ వలన రుక్మిణి, కృష్ణుడు సత్యభామకు అధిక ప్రాధాన్యతనిచ్చి సాహసగాథల్లో, సిరిసంపదల్లో తనకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వలేదనే అసూయను పుణ్యక వ్రత సమయంలో సత్య రుక్మిణి వద్దకు వచ్చిన సమయంలో రుక్మిణి ఎత్తిపొడుపు మాటలతో సత్యపై తనలోని అసూయను బయటపడేలా చేస్తుంది.

రుక్మిణికి తన తల్లిదండ్రులు ఇష్టంలేని వాహం చేయటానికి ప్రయత్నించుటతో మేనమామ కొడుకయిన కృష్ణుని పెండ్లాడుటకు విప్రుని కృష్ణుని వద్దకు రాయబారము పంపెను. అతనివద్ద నుండి వివరములు తెలియక పోవుటచే రుక్మిణి కృష్ణుని వద్దకు చిలుకను రాయబారానికి పంపుతుంది.

" విప్రుని బంపితీ కబురు తెలియాదాయె చిలుకారో

ఏ విధమ్మునవైన తన విభునితోడితేవే

భీష్మని కొమారుడు పంతాముతో పట్టుబట్టెనే

శిశుపాలునికిచ్చి పెండ్లిచేతూననుచు బల్కేనే

తా పెద్దకొడుకాని యెదురూగ తానిలచి పలికేనూ

తాబట్టినా కుందేటికి మూడే కాళ్ళాననూ

కమలనాభుని పొందు యెన్నాడు కన్నూలగందూనూ

కరుణాకటాక్షులూ యెన్నాడు తన్ను మోహించునో

పరమాదయాళూడు వచ్చీ తనా యెదుట నిలచునా

కరుణాతో నన్ను పెండ్లాడునా " [162]

ఈ గేయంలో రుక్మిణిని శిశుపాలునికి ఇచ్చి వాహం చేయదలిచారని ఈ వివాహం తనకు ఇష్టంలేదని తనను వచ్చి తీసుకెళ్ళమని కృష్ణునికి విప్రుని ద్వారా వార్తను పంపించిన రుక్మిణి విప్రుడు రాకకై చూసి విప్రుడు ఇంకను రాక పోవుటచే చిలుకను రాయబారానికి పంపుతుంది.

రుక్మిణి కోరుకున్నది కృష్ణుడిని. కానీ పెద్దలు నిశ్చయించింది వేరొకరిని. దీంతో రుక్మిణి తాను కోరుకున్న కృష్ణుడు తనకు దక్కడనే ఆవేదన తనకు పెద్దలు వేరే వ్యక్తితో వివాహం చేయదలిచారనే వార్తను కృష్ణునికి తెలియజెప్పుటకు విప్రుని రాయబారానికి పంపుతుంది. వెళ్ళిన విప్రుడు ఇంకనూ రాకపోవుటచే తాను పంపిన వార్త కృష్ణునికి చేరినదో లేదోననే సందేహముతో మరల చిలుక రాయబారాన్ని పంపుతుంది.

ఈ గేయంలో రుక్మిణి 'పరమదయాళూడు వచ్చీ తనా యెదుట నిలచునా కరుణాతో నన్ను పెండ్లాడునా 'అని చిలుకతో పలుకుటను బట్టి కృష్ణుడు వస్తాడో రాడోనని, వచ్చినా తనను పెండ్లాడునో లేదో అన్న సందేహమును వ్యక్తము చేసి విచారిస్తుంది. కృష్ణునిమీద మనసున్న రుక్మిణికి కృష్ణుడు వచ్చి తనను వివాహం చేసుకోనిచో పెద్దలు కుదిర్చిన వాహం చేసుకోవాల్సి వస్తుందన్న బాధ, తాను కోరుకున్న వాడు తనకు దక్కలేదన్న ఆవేదన ఆమెలో కనిపించును.

రుక్మిణిదేవిముచ్చట్లు అనే గేయంలో రుక్మిణి సత్యభామ గురించి క్రింది విధంగా అంటుంది.

''యిదియేడ సవతి తనకు - కోమలీ - యిది యెవ్వతె తనకునూ
యింత దుండగ తనములు - కోమలి - యీ యింతికె చెల్లును
యే యింతికె చెలునే - కోమలి - యీ యింతికె చెల్లును
పిలిచినా పలుకదమ్మా - దానికి - బడాయియేమోకాని
నిలచినా నిలువదమ్మా -దాని - యహంకారమేమోకాని
వంచిన వంగదమ్మ- దానివ - య్యారమేమొకాని
చూచినా చూడదమ్మ - దాని పండ్లు - మింటనే అంటున్న
యెల ంతో శ్రీకృష్ణుడు - దానికి - యింత చను చ్చినాడే
యేమిజూచీ వలచెనే - కోమలీ - అది యెంత సుందరమ్మ '' [163]

రుక్మిణి సత్యభామ గురించి ఇది ఎక్కడి సవతి. పిలిచినా పలుకదు, నిలచినా నిలువదు, చూచినా చూడదు ఎంత అహంకారము సత్యకు. కృష్ణుడు ఆమెకు ఇంత చనువిచ్చుటకు అంతగా సత్యలో ఏమున్నది. అంటూ రుక్మిణి తన మనసులోని బాధను చెబుతుంది.

అరిషడ్వార్గాలలో క్రోధానికున్న 3 అవస్థలలో కోమలావస్థ యందున్న కోపాన్ని రుక్మిణిలో చూడవచ్చు. ఉత్తములలో కోపము క్షణకాలము మాత్రమే ఉండును. ఈ క్రోధం ఆత్మకర్తృత్వం, అన్యకర్తృత్వం అని రెండు విధములుగా కలుగును. మానవుడు తన మిత్రులు, సోదరులు, ఆత్మీయులు మొదలైనవారు తనకు వ్యతిరేకంగా

విలువగల వస్తువులను పగులగొట్టుట, తన శత్రువులతో కలిసి ఉండటం వంటి పనులు చేసినచో వారి మీద కలిగే కోపమే ఆత్మకర్తృత్వం. రుక్మిణిలోనూ ఇదే కోపాన్ని చూడవచ్చు. క్రోధమును భరించుటకు పరాక్రమవంతులు, ధీరులగు క్షత్రియులు వంటివారే సమర్థులు గానీ సామాన్య మానవులు ఈ క్రోధమును భరించనలవిగాదు.

రుక్మిణికి సత్యభామను శత్రువుగానే చెప్పవచ్చు ఎందుకంటే ఇద్దరు సవతుల మధ్య మనసులో ఎక్కడో ఒకచోట ఈ భావము ఉంటుంది కదా! ఎవరు మాత్రం తన భర్తను వేరే స్త్రీతో పంచుకోవడానికి ఇష్టపడతారు. సత్యతో కలిసి కృష్ణుడు అధిక సమయాన్ని ఆమె దగ్గరే గడపడం వల్ల రుక్మిణికి కృష్ణునిపై కోపం కలుగుతుంది. కానీ ఈ కోపం క్షణకాలం మాత్రమే. రుక్మిణి కృష్ణునిపై కోపమునకు కారణమయిన సత్యభామపై కూడా తన కోపాన్ని ప్రదర్శించింది కాబట్టే ఈ కోపాన్ని బయటపెట్టుటకు సత్యను నిందిస్తుంది.

మరో రకమైన కోపం ఆ కోపానికి కారణమయినదాన్ని ఎదుర్కోవాలనే ఆలోచనతో వస్తుంది. 'యేమిజూచీ వలచెనే - కోమలీ - అది యెంత సుందరమ్మ' అను రుక్మిణి మాటలనుబట్టి తన కోపానికి కారణమయిన సత్యభామను ఎదుర్కొనాలని అనుకుంటుంది. కృష్ణుడు సత్యభామా విధేయుడిగా ఉండుటకు గల కారణాలను తెలుసుకోవాలని ఈ కారణాలను గురించి తెలుసుకుంటే కృష్ణుడు సత్యాలోలుడగుటను కొంతయినా నివారించవచ్చని రుక్మిణి అనుకుంది.

మరో గేయంలో రుక్మిణి కృష్ణుని బుద్ధిని క్రింది గేయంలో వరిస్తుంది.

"పుట్టు మొదలు దిమ్మరై - పశువులతో - బోయడై తిరిగినాడె
కౌమరు ప్రాయపు స్త్రీలను - పట్టుకొని -సూడిగంబులు సేయుచు
పలుగాకు లెల్లగూడి - ఆగొల్ల - పడుచులను మరగినాడు
పదహారువేలస్త్రీలు - ఎనమండ్రు - పట్టపు దేవులమ్మ
వారలందరుచాలరె - యిప్పటి - వారకాంతలు చాలరే
ఎందరైనను జాలరే - పడతిగో - విందుని కౌగిటాకు "[164]

ఈ గేయంలో రుక్మిణి కృష్ణుడు బాల్యము నుండి పశువులతో తిరుగుతూ, గొల్లభామలను మరిగినాడు. కృష్ణునికి పదహారువేలమంది గోపికలు, అష్టభార్యలు ఎందరున్నా వాని కౌగిటకు సరిపోరని అంటుంది.

సహజంగా భార్య భర్త ప్రేమను పూర్తిగా పొందాలనుకుంటుంది. అలాగే సవతిపోరు లేకుండా చూసుకుంటుంది. ఎందుకంటే సవతి పోరుంటే భర్త ప్రేమను, భద్రతను పూర్తిగా పొందలేననే భావన ఆమెలో ఉంటుంది ఇక్కడ కృష్ణుడు సత్యాలోలుడయి అధిక సమయం ఆమె దగ్గరే గడపడంవల్ల రుక్మిణి కృష్ణునిపై కోపంతో అతను చిన్నతనం నుండీ స్త్రీ లోలుడయి, గోపికలతో రాసలీలలు సాగించేవాడని ఎంతమంది స్త్రీలున్నా కృష్ణుడి కౌగిటకు సరిపోరని అంటుంది.

రుక్మిణిలో మనకు వ్యత్యయీకరణ లక్షణాలు కనిపిస్తాయి. ఒక వస్తువు పైకి పంపిన మానసిక శక్తి మరో వస్తువుపైకి మరల్చడం వ్యత్యయీకరణం. దీనికి తెలుగులో మంచి సామెతకూడా ఉంది అది 'అత్తమీదకోపం దుత్తమీద చూపడం'.

ఈ విధంగా వ్యక్తులు ఒకరిమీదున్న కోపాన్ని మరొకరి మీద చూపడానికి కారణాలను పరిశీలిస్తే, మనం అసహనానికి, తీవ్ర వత్తిడులకు, ఉద్రిక్తలకు గురయిన సందర్భంలో దానిని తగ్గించుకొనుటకు మనం మనకు లోబడిన వ్యక్తుల, వస్తువులమీద కోపాన్ని ప్రదర్శించడం జరుగుతుంది. రుక్మిణి సత్య భామ మీదున్న కోపాన్ని కృష్ణునిపై చూపిస్తూ 'ఎందరైనను జాలరే - పడతిగో- విందుని కౌగిటాకు' అని అంటుంది. రుక్మిణి సత్యభామ మీదున్న కోపాన్ని మాటలలో మాత్రమే వ్యక్త పరిచింది.

పుణ్యకవ్రత సమయంలో సత్యభామ కృష్ణుని తిరిగి దక్కించుటకు రుక్మిణి దగ్గరకు రాగా ఇదే సమయమనుకొని ఇంతకాలం తనలో ఉన్న అసూయను రుక్మిణి సత్య ముందు క్రింది విధంగా బయటపెడుతుంది.

''నావద్ద ధనములే దెన్నడయినగాని విభు
డెంత సొమ్ముతెచ్చినాను నాకు యిచ్చెనా
తనకు సత్రజిత్తుడిచ్చినట్టి గొప్ప ముత్యసరులు
విభుడు నీకు దాచియిచ్చె వేడ్కతోడనూ

యింద్రపదవి బోయిజూచి తెచ్చినట్టి కనకమెల్ల

యింపుగాను నీకుయిచ్చె కృష్ణమూర్తియూ

నరకసరుని సంహరించితెచ్చినా ములధనము

నీయింటదాచినాడు మోదమందియూ

పెండ్లినాడు కట్టినట్టి పాలపూసలే గాని

యితరసొమ్ము లేవి యునునాకు లేవుగా "[165]

ప్రతి మనిషిలో అసూయ అనేది ఉంటుంది. అసూయ కొందరిలో త్వరగా బయటపడుతుంది. మరికొందరిలో సమయాన్ని బట్టి అసూయ వ్యక్తమవుతుంది. పారిజాత పుష్పాన్ని రుక్మిణికి ఇచ్చాడన్న అసూయతో సత్య పారిజాత వృక్షాన్నే దక్కించుకుంది, కానీ రుక్మిణి మాత్రం సత్యపై తనలో ఉన్న అసూయను వెంటనే ప్రదర్శించలేదు.

ఈ గేయాంలో రుక్మిణి తన భర్త సత్యభామకే అధిక ప్రాధాన్యమిచ్చాడని, సాహసగాథల్లో గానీ, సిరిసంపదల్లోగానీ తనకు ఎటువంటి స్థానాన్ని ఇవ్వలేదనే అసూయను మనం రుక్మిణిలో గమనించవచ్చు. సత్యభామ తను చేస్తున్న వ్రతంలో పతిని తిరిగి పొందుటకు తన వద్ద పతిని తూచుటకు తగినంత బంగారం లేదని రుక్మిణి వద్ద తనకు కావలసిన బంగారం దొరుకుతుందేమోనని రుక్మిణి దగ్గరకు వస్తుంది. ఈ సమయంలో రుక్మిణి ఇంతకాలం తన మనసులో సత్యపై ఉన్న అసూయ, ఈర్ష్యలను ఎత్తిపొడుపు మాటలలో బయటపెడుతుంది.

'పెండ్లినాడు కట్టినట్టి పాలపూసలేగాని యితరసొమ్ము లేవియునునాకు లేవుగా' అను రుక్మిణి మాటలనుబట్టి లోకంలో సహజంగా స్త్రీలకు వస్త్రములపై, బంగారు ఆభరణములపైగల మక్కువను తెలియజేస్తుంది. కృష్ణుడు తన పెళ్ళి సమయంలో కట్టిన పాలపూసల ఆభరణములేగానీ ఇతర సొమ్ములేవీ చేయించలేదని దానికి కారణమయిన సత్యభామపై తన ఆవేదనను వ్యక్తం చేస్తుంది.

## 3. చెంచిత

### i.వ్యత్యయీకరణం

లక్ష్మిదేవిలో మనకు వ్యత్యయీకరణ లక్షణాలు కనిపిస్తాయి. నారాయణుడు చెంచితతో సరసాలాడుతున్నాడని తనను అశ్రద్ధ చేస్తున్నాడనే భావంతో వ్యత్యయీకరణ లక్షణాలయిన తీవ్రవత్తిడి, ఉద్రిక్తతకు లోనయిన లక్ష్మిదేవి ఇంటికి వచ్చిన నారాయణునికి తలుపు తీయక తన కోపాన్ని ప్రదర్శిస్తుంది.

### ii.Ego

Ego వ్యక్తుల ప్రవర్తనను సూచించేదిగా ఉంటుంది. అడవిలో ఇంటరిగా ఉన్న చెంచీతను చూసిన కృష్ణుడు ఎవ్వరిదానవే చెంచిత ఎందుకొస్తివే చెంచిత అని ప్రశించడంతో సమాజంలో వ్యక్తులను పరిసరాలకు అనుగుణంగా ప్రవర్తించమని Ego నిర్దేశిస్తుంది. కావున అడవిలో ఒంటరిగా ఉన్న చెంచిత పరిచయంలేని వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలి కావున కష్ణునితో తాను అడవికి ఎందుకొస్తే నీకేమి నే నెవ్వరినైతే నీకేమని జవాబిస్తుంది.

### iii. Super Ego

Ego చేసే పనులను తప్పని చెబుతూ Super Ego వ్యక్తిలోని విలువలను కాపాడుతుంది. అందుకే చెంచిత కృష్ణునితో తాను దుప్పివేటకు వచ్చానని సమాధానమిచ్చి తన విలువలను కాపాడుకుంటుంది.

### iv. తదాత్మీకరణం

వ్యక్తులు తదాత్మీకరణ లక్షణాలవలన తమను గొప్పగా చిత్రించుకొని తమ అభిరుచులను కలిగిన వ్యక్తులతోనే స్నేహం చేయడం, సామాజిక కట్టుబాట్లకు లొంగడం వంటి చేస్తారు. చెంచిత కూడా తనలాగే కృష్ణుడు కూడా వేటలో ప్రావీణ్యం గలవాడైనవాడేమోనని తెలుసుకొనుటకే అతనికి వేటకు సంబంధించిన ప్రశ్నలు వేస్తుంది.

### v. క్రోధం

కృష్ణుడు చెంచీతను వివాహం చేసుకొని రాజ్యానికి తీసుకువచ్చినప్పుడు రుక్మిణి, సత్యభామలు చెంచితతో నీవు మాతో సరిదానవా? అని అపహాస్యం చేయు సందర్భంలో చెంచితలో క్రోధ లక్షణాలు కనిపించును. ఎవరికైనా

అవమానము జరిగినప్పుడు తగిన పరాక్రమాన్ని చూపి ఆత్మ గౌరవాన్ని నిలుపుకోవాలి కనుక చెంచిత రుక్మిణితో నేనేమీ నీలా తల్లిదండ్రుల మాటలు కాదని అన్నకు తలవంపులు తెచ్చి కృష్ణుని పిలిపించుకొని వివాహమాడలేదే అని, సత్యభమతో మగని వంచించి పారిజాత వృక్షాన్ని సాధించుకొనలేదే అని చురకలు అంటించి తన ఆత్మగౌరవాన్ని నిలుపుకుంది చెంచిత. బాహ్య సన్నివేశాల వలన వచ్చిన ఇలాంటి కోపాలు కొద్దిసేపు మాత్రమే ఉండును.

## A.లక్ష్మీదేవి

హిరణ్యకశిపుని కుమారుడు ప్రహ్లాదుడు తండ్రికి వ్యతిరేకంగా విష్ణు భక్తుడగుట సహించలేని తండ్రి కుమారుని హింసించి విష్ణుభక్తిని అతనిలో లేకుండా చేయాలనుకుంటాడు. కానీ ప్రహ్లాదుని భక్తి ఏ మాత్రమూ తగ్గదు. ఇలాంటి పరిస్థితుల్లో తన భక్తుడిని రక్షించుకొనుటకు విష్ణువు నరసింహావతారం దాల్చి హిరణ్యకశిపుని సంహరించి ప్రహ్లాదుని కాపాడును. ఈ సందర్భంలో లక్ష్మీదేవి తను కూడా చెంచులక్ష్మి అవతారంతో నరసింహుని వరించును. [166]

జానపదులు లక్ష్మీదేవి నరసింహావతారియైన విష్ణువుపై అనేక గేయాలను అల్లుకుని పాడుకునేవారు. ఒకనాడు లక్ష్మీదేవి తన భర్త పరస్త్రీలతోకూడి వచ్చాడన్న అనుమానం క్రింది గేయంలో ప్రదర్శిస్తుంది.

"యాటలంట నీవె బొయ్యి ఎవతితోనో కూడూకోని
మాయ బొంకూలేల బొంకేవూ - ఓ నరసింహా
మాయబొంకులేలా బొంకేవూ
మాటలంటానువ్వేబొయ్యి - వల్లంతా పసుపూలేడి
ఓ నరసింహా మాయబొంకూలేలా బొంకేవూ " [167]

ఈ గేయంలో లక్ష్మి తన భర్త పరస్త్రీలతోకూడి వచ్చాడని, అతని వంటిపై ఉన్న చిహ్నములద్వారా గ్రహించి నిలదీస్తుంది. లోకంలో సహజంగా స్త్రీ దేనినయినా ఎవరితోనయినా పంచుకుంటుందిగానీ, భర్త విషయంలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉంటుంది. భర్త ప్రేమానురాగాలు తనకు మాత్రమే దక్కాలనే స్వార్థం, ప్రేమ ఉంటాయి.

ఒకనాడు నారాయణుడు ఇంటికి వచ్చేసరికి లక్ష్మీదేవి తలుపు గడియ వేస్తుంది. దానికి కారణమేమని నారాయణుడు ప్రశ్నించగా లక్ష్మీదేవి 'కొంచెపు జాతి చెంచీత నాకు సవతి యనుచు' అంటూ చెంచీతను తనకు

సవతిని చేస్తున్నావంటుంది. నరసింహుడు లక్ష్మిని ప్రసన్నం చేసుకోవాలని

''కలికి కవాటము దెరిచి నపుడు యీ కంఠహారమిచ్చేనే

జిలుగు బుటేదారి చీరెలు దెస్తిని చేకొనవేమే లక్ష్మీ, నన్ను చేకొనవేమే లక్ష్మీ

మల్లె పువ్వుల, విప్ప పువ్వుల దండలు తెస్తిని ఇంకనైనా గైకొనవే '' [168]

పై ధంగా నరసింహుడు లక్ష్మీదేవికి ఆశచూపి గడియ తెరిపించాలనుకుంటాడు. దీనికి కారణం సహజంగా స్త్రీలకు ఆభరణముల, వస్త్రములపై ఉండే కాంక్షే. కానీ లక్ష్మి అవన్నీ చెంచీతకు ఇచ్చి కీర్తిని పొందమంటుంది. నరసింహుడు

''దండిగా తప్పులు చాలా చేసి దండమయిన

చేకొనవే లక్ష్మీ! దండమైన చేకొనవే''

అనడంతో లక్ష్మి

''పెండ్లి కుమారుడవయినందుకు నా దీవెనలివిగో స్వామి! నా దీవెనలివిగో''

అని వెటకారంగా సమాధానమిస్తుంది. చివరకు నారాయణుడు తన తప్పును తెలుసుకొన్నానని చెబుతూ

''శరణు శరణు శ్రీ లక్ష్మి శరణు శరణు యిందిరా నీకు, లక్ష్మీ,శరణు యిందిరా నీకు''

అని శరణువేడడంతో లక్ష్మి నారాయణునికి తలుపుతీస్తుంది. [169]

లక్ష్మిదేవిలో వ్యత్యయీకరణ లక్షణాలు కనిపిస్తాయి. వ్యక్తులు అసహనానికి, తీవ్ర వత్తిడులకు, ఉద్రిక్తలకు గురయినప్పుడు వాటిని తగ్గించుకొనుటకు తమకు లోబడిన వారిపై, వస్తువులపై కోపాన్ని ప్రదర్శించడం జరుగుతుంది. కొన్ని సందర్భాలలో మనకు లోబడని వ్యక్తుల మీద కూడా ఇలాంటి వారు తమ కోపాన్ని ప్రదర్శించును. నారాయణుడు చెంచీతతో సరసాలాడుతున్నాడని తనను అశ్రద్ధ చేస్తున్నాడనే భావంతో వ్యత్యయీకరణ లక్షణాలయిన తీవ్రవత్తిడి, ఉద్రిక్తతకు లోనయిన లక్ష్మిదేవి ఇంటికి వచ్చిన నారాయణునికి తలుపు తీయక తన కోపాన్ని ప్రదర్శిస్తుంది.

## B.చెంచిత

సత్యభామ, రుక్మిణి తదితర భార్యలందరూ కృష్ణుడు వంటివాడ్ని భర్తగాపొందిన తమ సౌభాగ్యనికి గర్వించుట చూసి కృష్ణుడు వారి గర్వాన్ని అణచుటకు వారికన్నా అందమయిన చెంచితను సృష్టించి వారి గర్వాన్ని అణచడమే చెంచిత వృత్తాంతం. ఈ కథ కేవలం జానపదుల ఊహాచాతుర్యమే.

ఒకనాడు కృష్ణుడు వేటకు వెళ్ళిన సందర్భంలో అక్కడ కృష్ణునికి చెంచిత కనిపించినపుడు వారి మధ్య జరిగే సంవాదం క్రింది గేయంలో చూడవచ్చు.

“ కృష్ణుడు : పచ్చని సరిగళ్ళ పారుటాకు చీరపైదోగు గంధాలు పాపా!

ఎందుకొచ్చావే చెంచీతా! ఎవ్వరి దానవే!

చెంచీత : ఎందుల కొస్తే నీకేరా నేనెవ్వరైతే నీకేరా ఏట కొచ్చాను మగవాడా

నల్లమల నుండి దుప్పేట కొచ్చాను పోపోవోయ్ ” [170]

ఈ గేయంలో అడవిలో ఒంటరిగా ఉన్న చెంచితను చూసి కృష్ణుడు ఎందుకొచ్చావే ఎవ్వరిదానవే చెంచిత అని చెంచీతను అడిగిన వెంటనే చెంచీత ఎందుకొస్తే నీకేమి నేనెవ్వరైతే నీకేమి అంటూనే తాను వేటకొచ్చానని అంటుంది.

చెంచితలో మనకు .Ego (చేతన/అహం) లక్షణకు కనిపిస్తాయి. ఇది వ్యక్తి ప్రవర్తనను సూచించేదిగా ఉంటుంది. నలుగురిలో ఉన్నప్పుడు వ్యక్తి ప్రవర్తన ఒక విధంగానూ ఏకాంతంగా ఉన్నప్పుడు మరొకరకంగా ఉంటుంది. వ్యక్తుల సాంఘిక ప్రవర్తనలోని Id కోరికలను అణచి సమాజంలో వ్యక్తులు ఎలా ప్రవర్తించాలో పరిసరాలకు తగినట్లుగా అహం ప్రవర్తింపచేస్తుంది. చెంచిత ఒంతరిగా అడవిలో ఉన్నది కనుక పరిచయం లేని వ్యక్తులతో జాగ్రత్తగా ఉం డాలి కనుక కృష్ణునితో తాను అడవికి ఎందుకొస్తే నీకేమని, ఎవ్వరినైతే నీకేమని అంటుంది.

చెంచితలో మనకు Super Ego(అంతరాత్మ) లక్షణాలు కనిపిస్తాయి. వ్యక్తుల అంతరాత్మను super Egoగా చెప్పవచ్చు. Ego చేసే కార్యలను తప్పని నిందించి Super Ego వ్యక్తిలోని విలువలను కాపాడుతుంది. అందుకే చెంచిత వెంటనే తాను దుప్పివేటకు వచ్చానని కృష్ణునికి సమాధానమిచ్చి తన విలువలను కాపాడుకుంటుంది.

కృష్ణుడు తాను శ్రీకృష్ణమూర్తినని తెలిపి తనను పెండ్లాడమనడంతో, చెంచిత క్రింది గేయంలో ఈ విధంగా పలుకును.

"ఏడు గూడెములాలొ యెన్నికగలదైన - యెలుపోతూరెడ్డి కూతుర్ని

ఏడుగురుఅన్నలు గలదాన్ని - ఏడుగురు వదినెలు గలదాన్ని " [171]

చెంచిత తాను ఏడు గూడెములలో పేరున్నటువంటి యెలపోతురెడ్డి కూతుర్ననీ, తనకు ఏడుగురు అన్నలు, వదినెలు ఉన్నారనీ కృష్ణుని భయపెడుతుంది. ఇలా భయపెడితే కృష్ణుడు తన జోలికి రాడనే భావంతో తనవారి గురించి చెబుతుంది.

కృష్ణుడు చెంచిత గురించి తెలుసుకొని తనకు చెంచీత మేనత్త కూతురనీ మనకు మేనరికమున్నదనీ తనను పెండ్లాడమనడంతో చెంచీత కృష్ణుని తనకు సరియైనవాడేనాయని తెలుసుకొనుటకు క్రింది విధంగా పలుకును.

"నిమ్మాలగిరిమీద నిమ్మూగతిరిగేటి - కొమ్మూలగురుపోతునేశేవా

ఏడు పందులనెయ్య నేరూతువా- అడవిదుప్పులనెయ్య నేరుతువా

అనుపులున్నాజాడ లెరుగూదువా - పుట్టతేనెలుబట్టనేరూతువా

పరిగతేనెలుపట్ట నేరూతువా - కొండ తేనెలుబట్ట నేరుతువా " [172]

ఈ గేయంలో చెంచిత కృష్ణుని కొమ్ముల గురుపోతును, ఏడు పందులను, అడవి దుప్పిని కొట్టగలవా అంటూ కొండతేనెలు, పుట్టతేనెలు పట్టడం వంటి వచ్చా అని కృష్ణునితో చెంచీత వేటకు సంబంధించిన ప్రశ్నలు వేస్తుంది.

చెంచిత వేటకు సంబంధించిన ప్రశ్నలు వేయటాన్ని బట్టి, కృష్ణుడికి ఇలాంటివేమీ చేతకావని తలచి అలాంటి ప్రశ్నలు వేస్తే తనను పెండ్లామని చెంచీతను అడుగక తనదారిన తాను వెళతాడనే ఉద్దేశ్యంతో వేటకు సంబంధించిన ప్రశ్నలు వేసినదనుకోవచ్చు. మరో కోణంలో పరిశీలించినట్లయితే కృష్ణుడు తనను పెండ్లాడుటకు తనతో సరిసమానుడేనా అని తెలుసుకొనుటకే చెంచిత ఇలాంటి ప్రశ్నలు వేస్తుంది.

చెంచితలో మనకు తదాత్మీకరణం (Identification) లక్షణాలు కనిపిస్తాయి. దీని ప్రకారం వ్యక్తులు తమను గొప్పగా చిత్రించుకొని తమ అభిరుచులను కలిగిన వ్యక్తులతోనే స్నేహం చేయడం, సామాజిక కట్టుబాట్లకు లొంగడం

వంటి  చేస్తారు. వీటిద్వారా మనిషి తనకుండే భయాన్ని పోగొట్టుకుంటాడు. చెంచిత కూడా తనలాగే కృష్ణుడు కూడా వేటలో ప్రావీణ్యం గలవాడైనవాడేమోనని తెలుసుకొనుటకే అతనికి వేటకు సంబంధించిన ప్రశ్నలు వేస్తుంది.

చెంచితతో కృష్ణుడు చెంచీత చెప్పినవన్నీ చెయ్యగలనని పలుకుతున్న సమయంలో చెంచీత అన్నలు వచ్చుచుండగా తాను కృష్ణునితో ఈ  విధంగా పలుకును.

" పోవయ్య పోవయ్య కృష్ణుడా - నీకు ప్రొద్దేలపోదయ్య నాసామి
మాయన్నలొచ్చేరు కృష్ణుడా - గోరింటపొదలోకి కృష్ణుడా
పరుగు పరుగున వెళ్లు గృష్ణుడా - అలుగులేవేసేరు కృష్ణుడా
గోరింతపొదలోకి చెంచీత - నాకుపోనుభయమేస్తాది చెంచితా
నీవురాపోదాము  చెంచితా - మనమిద్దరుందాము చెంచీత
వాదులనాడేవు కృష్ణుడా - నేనువచ్చెదనయ్య నాస్వామి
నిన్ను గూడెదనయ్య నాసామి - మాయన్న లొచ్చేరుకృష్ణుడా
నిన్నుగోపించేరు నాసామి - అంబులేవేసేరు నాసామి "[173]

ఈ గేయంలో చెంచిత కృష్ణునితో మా అన్నలొచ్చేరు గోరింట పొదలలోకి వెళ్ళి దాక్కోమనంటుంది. కానీ కృష్ణుడు నీవూరా పోదామని అనుటతో నాతో వాదులాడవద్దు నేనూవచ్చి నీతో కూడుతాను మా అన్నలొచ్చి అంబులేవేసేరు త్వరగా వెళ్ళి చెట్టు పొదలలో దాగమంటుంది.

'మాయన్నలొచ్చేరు కృష్ణుడా - గోరింటపొదలోకి కృష్ణుడా పరుగు పరుగున వెళ్లు గృష్ణుడా' అను చెంచిత మాటలను బట్టి తన  అన్నలు వచ్చిన  కృష్ణుని చూసి అతనికి ఏదైనా ఆపద తలపెడతారేమోననే భయంతో కృష్ణుని చెట్టు పొదలలో దాగమంటుంది. ఇక్కడ చెంచీతలో తన కారణంగా ఒక వ్యక్తికి తన అన్నల ద్వారా ఇబ్బంది కలుగరాదనే భావంతో కృష్ణుని పొదలలో దాగి ఉండమంటుంది. చెంచితకు కృష్ణుడిపై అనురాగము కలిగినది కావునే అతనిని తన అన్నల వద్ద నుండి కాపాడాలనే భావనతో కూడా ఇలా చేసిందనవచ్చు.

కృష్ణుడు చెంచితను కూడా తనతో పాటుగా రమ్మనుటతో చెంచిత తానుకూడా వస్తానని చెప్పి, తన అన్నలు వచ్చిన కృష్ణుని కోపించేరని త్వరగా వెళ్ళమంటుంది. ఇక్కడ చెంచితలో కృష్ణునిపై ప్రేమ కనబడుతుంది. అందుకే అతనితో తనుకూడా వస్తానని అంటుంది.

మనం కొన్ని సందర్భాలలో ఇతరులు ఎంత చెప్పినా వారి మాట వినకపోవడం వల్ల వారు తమ మాటలను మనం వినుటకు కొన్ని సందర్భాలలో మనతో ఏకీభ వించినట్లు చెప్పవలసి వస్తుంది. చెంచిత కూడా ఇక్కడ కృష్ణుడు తనతో పాటుగా చెంచితను రమ్మని వాదనచేయు సందర్భంలో తన అన్నలకు చిక్కునేమోననే భయంతో అతనితో వాదాలు అవసరమని గ్రహించి అతనికి తన అంగీకారం తెలుపుతుంది. దీని వలన అతను తాను చెప్పింది చేసి తన అన్నల కంటపడడని ఆమె భావించినదై ఇలా ప్రవర్తిస్తుంది.

కృష్ణుడు చెంచీత మాటలు వినక పోవడంతో చెంచిత చేసేది లేక క్రింది విధంగా పలుకుతుంది.

"నీమీదిమోహము కృష్ణుడా - నేను పట్టలేకున్నాను కృష్ణుడా
తాళలేకున్నను నాసామి - వట్టిమాటలచేత కృష్ణుడా
యింత వాదేలపోదాము కృష్ణుడా "[174]

ఈ గేయంలో చెంచిత కృష్ణునిపై మోహాన్ని పట్టలేకున్నానని చెబుతూ, వట్టి మాటలతో కాలాన్ని వ్యర్థం చేయక ఇక్కడి నుండి వెళ్ళిపోదామంటుంది. ఈ మాటలనుబట్టి చెంచిత కృష్ణుని వివాహమాడుటకు ఇష్టపడినదై తన అన్నలు తనను చూడక ముందే తాను కృష్ణుడితో నగరానికి వెళ్ళి వివాహం చేసుకోవాలని నిశ్చయించుకుంది. అందుకే కాలాన్ని వ్యర్థం చేయక బయలుదేరుదామంటుంది. తన అన్నలు చూసిన కృష్ణునితో వివాహానికి అంగీకరించరనే భావన కూడ అమెలో ఉండవచ్చు.

చెంచిత అంగీకారంతో కృష్ణుడు ద్వారకకు తీసుకెళ్ళి వివాహం చేసుకుంటాడు. చెంచీతను చూసి రుక్మిణి, సత్యభామలు తమతో సరిదానవటే చెంచీత అని అపహాస్యం చేయు సందర్భంలో చెంచిత ఈ విధంగా సమాధాన మిచ్చును.

రుక్మిణితో

" తల్లిదండ్రులమాట దలపాక మీయన్నకు - దలవంపు శాయగదగునటవే

బలిమీరి మగనిని బతిమాలిగతిమాలి బిలిపించుకోలేదె రుక్మిణీ "

సత్యభామతో

"చంచలాక్షి పారిజాతముకయి మగని వంచనాచేసినాడెరుగవా" [175]

చెంచిత తనను అవమాన పరచినందుకుగాను రుక్మిణితో నేనేమీ నీలాగా తల్లిదండ్రుల మాటలు వినక అన్నకు తలవంపులు తెచ్చిపెట్టి కృష్ణుని పిలిపించుకొని వివాహమాడలేదే. అని చురకలు అంటిస్తుంది.

అలాగే సత్యభామతో నేనేమీ మగని వంచించి పారిజాత వృక్షాన్ని సాధించుకొనలేదే. అని సత్యభామకు చురకలు అంటించి తన గౌరవాన్ని నిలుకుంది చెంచీత.

చెంచితలో మనకు క్రోధ లక్షణాలు కనిపించును. తనకు అవమానము జరిగే సమయంలో తగిన పరాక్రమము చూపి చెంచిత తన ఆత్మగౌరవమును నిలుపుకుంది. జిడ్డు కృష్ణమూర్తిగారు తన చేతన గ్రంథంలో కోపాన్ని 2 విధాలుగా చెబుతారు. బాహ్య సన్నివేశాల వలన వచ్చే కోపం భౌతిక పరమైన కోపమనీ ఈ కోపం ఎక్కువసేపు ఉండక క్షణకాలం మాత్రమే ఉంటుందంటారు. మరో రకమైన కోపం ఆ కోపానికి కారణమయినదాన్ని ఎదుర్కోవాలనే ఆలోచనతో వస్తుందంటారు. బాహ్య సన్నివేశం వలన అనగా సత్యా రుక్మిణులు చెంచీతను అవమాన పరిచే సమయంలో ఆమెకు వారిపై కొంత కోపము కలిగి తన గౌరవాన్ని నిలుపుకుంది.

రుక్మిణి, సత్యలవలె చెంచిత తానేమీ కృష్ణుని ముందుగా వరించలేదనీ కృష్ణుడే తనను ముందుగా వరించి వివాహం చేసుకున్నాడనే భావంతోనే చెంచిత రుక్మిణి, సత్యలతో ఈ విధంగా ప్రవర్తించింది.

# 4. యశోద

## i.అస్తిత్వవాద సిద్ధాంతం

ఈ సిద్ధాంతం ప్రకారం వ్యక్తుల జీవితాలు వారు తీసుకునే నిర్ణయాల మీద ఆధారపడి ఉంటాయి. ఈ సిద్ధాంతం ప్రకారం యశోదలో మనకు 'Being for Others' లక్షణాల వలన బాల్యంలో యశోదకు ఆమె తండ్రి తనకు ఇచ్చిన పండును ముని ఆకలి తీర్చడానికి ఉపయోగించింది. ఇందులో ఆమెకు ముని ఆకలితీర్చడమే ఆమెకు కలిగే ఆనందం. ఈ విధంగా కొందరు వ్యక్తులు తమకోసం తాము జీవించకుండా ఇతరుల కోసం జీవిస్తారు. ఇతరుల కోసం జీవించడంలో ఆ వ్యక్తుల జీవితపు విలువలు నిర్ధారణ అవుతాయి.

## ii.Adult Ego State

'Adult Ego State' లోని వ్యక్తులు తీసుకునే నిర్ణయాలు, ఆలోచనలు మొదలైనవన్నీ హేతుబద్ధంగా, విచక్షణతో కూడినవై ఉంటాయి. ఈ లక్షణాల వలనే యశోద తనకు తండ్రి ఇచ్చిన పండును ఆకలితో ఉన్న మునికి ఇవ్వాలనే విచక్షణాత్మక నిర్ణయతో ఆ పండుతో ముని ఆకలి తీర్చింది.

## iii. భయం

చిన్నికృష్ణుడు గోపికలను ఏడిపించడం, వెన్నను దొంగిలించడం వంటి అల్లరి చేష్టలతో పాటు సింహాలు, పులులే నా చుట్టాలని, తల్లి తనకు ఇచ్చిన పాలను పాలను పిల్లులకు కుక్కలకు ఇవ్వడం వంటి పనులతో యశోద ఏది మంచి ఏది చెడు అని తెలియని పసివాడివి నీవు నిన్ను ఎలా దండించనయ్యా అని అంటుంది. నిన్ను శిక్షించుటకు నాకు మనసురాదంటూ రోటికి కట్టెస్తానని అంటుంది. సింహాలు పులులె నాచుట్టాలు అనే చిన్నికృష్ణుడి మాటలకు కృష్ణుడు బయటికి వెళ్ళి ఏదైనా ప్రమాదాన్ని తెచ్చుకుంటాడేమోనని రోటికి కట్టివేసి తన కళ్ళముందే ఉంచి కాపాడుకునుటకే కృష్ణుని రోటికి కట్టివేస్తానని అంటుంది కానీ శిక్షించుటకు కాదు. కృష్ణుడు కాళింగి మడుగువైపు వెళ్ళి మడుగులోని సర్పంతో ఏదైనా ప్రమాదాన్ని తెచ్చుకుంటాడేమోనన్న భయం యశోదలో ఉంటుంది. ఈ భయంతో ఏన్నో సార్లు కృష్ణుని అటు వైపు వెళ్ళవద్దని హెచ్చరిస్తుంది.

## iv. తల్లి ప్రేమ

యశోద హరియే తన కుమారుడు(కృష్ణుడు)గా జన్మించాడని తెలిసినా ఆమెలోని తల్లిప్రేమ కృష్ణుని ఏనాడూ భగవంతునిగా చూడక కన్నబిడ్డగానే చూసేది. కృష్ణుడు చేసే అల్లరి పనులకు యశోద తెలిసీ తెలియని పసివాడనే అనుకుంటుందిగానీ లోకాలనేలే విష్ణువని ఆమె తలపుకైనా రాకపోవడంలోనే అమ్మ మనసు, ప్రేమ మనకు వ్యక్తమవుతుంది. గోపికలను ఏడిపించడం, వారి ఇంట వెన్నను దొంగిలించడం వంటి పనులనుతో ఏదైనా ఆపద తెచ్చుకుంటాడేమోననే బాధ తప్పితే కృష్ణుడి అల్లరి చేష్టలు తల్లిగా యశోదకు ప్రియమే కదా!

యశోదకు 10 సంవత్సరాల వయసులో ఆమె తండ్రి ఆమెకు పూజాఫలంగా మామిడి పండును ఇచ్చి దానిని తినమంటాడు. కానీ యశోద ఆ పండును తినకుండా తీసుకెళ్ళి అక్కడ దేవాలయ ప్రాంతంలో ఉన్న ఒక ఋషికి ఆహారంగా ఇవ్వాలని నిశ్చయించుకొని ఆ ముని వద్దకు వెళ్ళి పండును ఇస్తుంది.

"తాతాకన్నులు తెరవు ఏది నీచేయి చాపు

ఒక తాయిల మిచ్చేను తినుమిపుడే ఆకలితీర "

యశోద ఋషికి మామిడి పండును ఇచ్చి అకలి తీర్చుకోమంటుంది. తనకు తండ్రి ఇచ్చిన ఫలాన్ని తీసుకెళ్ళి ఆకలితో ఉన్న ఋషికి ఇచ్చిన యశోద ఆ పండు తిన్న ఋషి హరికి తల్లివౌదువని దీ స్తాడు. [176]

ఈ గేయంలో యశోదకు తన తండ్రి ఇచ్చిన పండును తీసుకెళ్ళి ముని ఆకలిని తీర్చుటలో యశోద దయార్ధ్ర హృదయం అర్ధమవుతుంది.

యశోదలో మనకు జీన్‌పాల్ సార్త్రే, ఫ్రోమ్,మాస్లో, ఆల్‌పోర్ట్, రోజర్స్ వంటివారు రూపొందించిన అస్తిత్వవాద సిద్ధాంత లక్షణాలు కనిపిస్తాయి. దీని ప్రకారం వ్యక్తుల జీవితాలు వారు తీసుకునే నిర్ణయాల మీద ఆధారపడి ఉంటాయి. జీన్‌పాల్‌సార్త్రేగారు తన సిద్ధాంతంలో

1. Being for it Self 2. Being in it Self 3. Being for Others అను మూడు విభజనలను చేశారు.

పై మూడింటిలో యశోదలో మనకు Being for Others లక్షణాలు కనిపిస్తాయి. దీని ప్రకారం వ్యక్తులు తమకోసం తాము జీవించకుండా ఇతరుల కోసం జీవిస్తారు. ఇతరుల కోసం జీవించడంలో ఆ వ్యక్తుల జీవితపు విలువలు

నిర్ధారణ అవుతాయి. యశోదకు ఆమె తండ్రి తనకు ఇచ్చిన పండును ముని ఆకలి తీర్చడానికి ఉపయోగించింది. ఇందులో ఆమెకు ముని ఆకలితీర్చడమే ఆమెకు కలిగే అనందం.

యశోదలో మనకు ఎరిక్ బర్న్ సిద్ధాంత లక్షణాలు కనిపిస్తాయి. ఇతను మానవునిలో 1.Child Ego State 2.Adult Ego State 3.Parent Ego State అను మూడు దశలుంటాయని పేర్కొన్నారు.

పై దశలలో Adult Ego State లోని వ్యక్తులు తీసుకునే నిర్ణయాలు, ఆలోచనలు మొదలైనవన్నీ హేతుబద్ధంగా, విచక్షణతో కూడినవై ఉంటాయి. ఈ లక్షణాల వలనే యశోద తనకు తండ్రి ఇచ్చిన పండును ఆకలితో ఉన్న మునికి ఇవ్వాలనే విచక్షణాత్మక నిర్ణయంతో ఆ పండుతో ముని ఆకలి తీర్చింది.

ఈ విధంగా యశోద బాల్యంలో ముని అకలిని తీర్చి ఆ మునిచే హరికి తల్లివౌదువనే దీవెన, వరం పొందినది. దీని ఫలితంగానే విష్ణువు దేవకీవసుదేవుల పుత్రుడిగా జన్మించినా యశోద కుమారుడిగా పెరిగి పెద్దవాడవుతాడు.

కృష్ణుడు బాల్యంలో చేసే అల్లరి పనులకు గోపికలు విసిగిపోయి యశోదకు చిన్ని కృష్ణుని అల్లరిని గురించి వివరించడం క్రింది గేయంలో చూడవచ్చు.

"గోపిక : పెరుగు చిలుకు చుండగా నా మరుగున నిలుచున్న క్రిష్ణుడు
పెరుగు చారెడు నించుకోని జుర్రి పరుగిడి పోయినాడు
అడుగావే తల్లి అడుగావే
యశోద : అడిగినంత వెన్న నీకు పెడుదునే మన యింట్లోలేదా
దుడుకుతనము పొరూగిండ్లకు దొంగిలీ తినబోవనేల క్రిష్ణా
పడుచులపై నీకు చలమేలనురా " [177]

" గోపిక : గొల్ల భామలంత గూడి చల్లలమ్మను బోవుచుండగ
చల్లబానకు సుంకమిమ్మని చిల్లులూ పడగొట్టినాడు అడుగావే తల్లీ
యశోద : యేమిరామకృష్ణయ్య! గొల్లభామలు చల్లనమ్మబోతె
చల్లబానకు సుంకమిమ్మని చిల్లులూ పడగొట్టినావట కృష్ణా " [178]

ఈ గేయాలలో గోపికలు తమ ఇంట కృష్ణుడు వెన్నను దొంగిలిస్తున్నాడనీ, చల్లబానకు సుంకమడుగుచూ కుండలు పగులగొడుచున్నాడనీ గోపికలు విన్నవించడంతో యశోద కృష్ణుని మందలిస్తూ, నీకు అడిగినంత వెన్నను ఇంట పెడుతున్నాను. కానీ నీవు ఎందుకు ఇలా గోపికల ఇంట వెన్నను దొంగిలిస్తున్నావని మందలిస్తుంది. అలాగే గోపికల చల్ల బానలను ఎందుకు పగులగొడుతున్నావని నిలదీస్తుంది.

అల్లరి చేయడం చిన్నపిల్లల లక్షణం. ఈ అల్లరి కృష్ణుడిలో మరీఎక్కువ. నగరిలో గోపికలను ఏడిపించడం, వారి ఇంట వెన్నను దొంగిలించడం వంటి పనులనుతో ఏదైనా ఆపద తెచ్చుకుంటాడేమోననే బాధ తప్పితే కృష్ణుడి అల్లరి చేష్టలు తల్లికి ప్రియమే కదా!

ఈ కింది గేయంలో చిన్నికృష్ణుడ్ని దండించడానికి యశోద చేసిన ప్రయత్నాలను కృష్ణుడు తన ప్రేమతో గెలుస్తాడు.

“పాలముంతల గొట్ట నేలరాయనిన
మురిపాలముద్దుల వాన గురిపించు
జేజికి దణ్ణాలు బెట్టరా యన్న
జేజికి జేజిని నేనెయని పలుకు
చుట్టాలు నినుజూడ వచ్చినారనిన
సింహాలు పులులె నాచుట్టాలు అనును
కాచిన పాలకడవ ముక్కలు జేసి
కుక్కలను పిల్లులను పిలవ వేయనును
రోటికి కట్టెద చూడు చూడనిన
రోలుదెచ్చి అమ్మకట్టవే అనును” [179]

యశోద క్రింది గేయంలో తెలిసీ తెలియని బాలుడవు నీ అల్లరి గురించి గోపికలు చెప్పారని నిన్నెట్లా దండింతునని అంటుంది.

" తెలిసీ తెలియని బాలుడవు నీవు

కసితోడు నిన్నెట్లు దండింతునయ్యో

శిక్షవేయక నీకు బుద్ధిరాక పోయె

శిక్షించుటకు నాకు మనసురాదాయె "

అని ఆక్రోశించి

"కఱ రోటికి నిన్ను కట్టిపెట్టెదనంచు

అటకెక్కి రజ్జువుల నన్నిటిని దెచ్చి"

కట్టబోతె

"అన్నెన ఎన్నెన తాళ్ళు సరిపడవాయె

అతివ దు:ఖమునకు అంతులేదాయే

అలసిసొలసి అమ్మను జూసి ఆ

బాలుండు చిరుత్రాటికే బందుడాయె " నట [180]

పై గేయాలలో యశోద కృష్ణునితో పాల కుండలను పగులగొడుతావేమని అడుగగా కృష్ణుడు తల్లిని ముద్దులతో ముంచేస్తాడు. దేవునికి దండం పెట్టమంటే తానే దేవుడనంటాడు. నినుచూడ చుట్టాలొచ్చారంటే సింహాలు, పులులే నా చుట్టాలంటాడు. పాలను పిల్లులకు కుక్కలకు ఇచ్చును. ఈ విధంగా కృష్ణుడు చేసే అల్లరికి యశోద ఏది మంచి ఏది చెడు అని తెలియని పసివాడివి నీవు. గోపికలు చెప్పారని నిన్ను ఎలా దండించనయ్యా అని అంటుంది. నిన్ను శిక్షించుటకు నాకు మనసురాదంటూ రోటికి కట్టెస్తానని అంటుంది.

యశోదకు కుమారుడి అల్లరికి ఎలాంటి కోపము రాలేదు. కానీ శిక్షిస్తాననడానికి కారణం. 'సింహాలు పులులె నాచుట్టాలు అనును' అన్న మాటలను బట్టి తనబిడ్డకు ఏదైనా ప్రమాదము వాటిల్లుననే భయంతో చిన్నికృష్ణుడు బయటికి వెళ్ళి ఏదైనా ప్రమాదాన్ని తెచ్చుకుంటాడేమోనని రోటికి కట్టివేసి తన కళ్ళముందే ఉంచి కాపాడుకునుటకే కృష్ణుని రోటికి కట్టివేస్తానని అంటుంది కానీ శిక్షించుటకు కాదు.

యశోద క్రింది గేయంలో కాళింగి మడుగు వంకకు పోవద్దని చిన్నికృష్ణునికి బుద్ధులు చెబుతుంది.

" కాళాంగి దారి మడుగు - కాళాంగి దారి మడుగు

పోబోకురా కృష్ణ- రాబోకురాకృష్ణ ||కాళాంగి||

వానలు కురవంగ వంకలు దొర్లంగ పామూసేరున్నాదన్నా || కాళాంగి||

దెమ్మా ఈశ్వరూని దలచి - మచ్చు మంత్రము నేర్చి || బె ||

రాజ్యమేలేను కృష్ణా పోబోకురా కృష్ణ - రాబోకురా కృష్ణా ||కాళాంగి || " [181]

ఈ గేయంలో యశోద కాళాంగి మడుగులో సర్పం ఉందని కృష్ణుడి అల్లరితో అటువైపు వెళ్ళి ఆ మడుగులో పడబోతాడేమోనన్న భయం యశోద మనసులో ఉంటుంది. అందుకే కృష్ణుని ఎల్లప్పుడూ కళ్ళలోపెట్టి కాపాడుకుంటుంది. ఒక తల్లిగా యశోదకు కుమారునిపై ప్రేమ ఉండటం సహజం. ఈ సహజమయిన ప్రేమతోనే కృష్ణుడు ఎంత అల్లరి చేసినా దండించేది కాదు.

యశోద కృష్ణుడు ఎంత అల్లరి చేసినా ఆ ఆల్లరి వల్ల కృష్ణునికి పెద్దగా ప్రమాదము జరిగేది కాదు. కానీ కాళింగమడుగు వైపు వెళ్ళినచో అక్కడి సర్పముల వల్ల తన కుమారుడి కేమైనా ఆపద కలుగునేమోనని తలచి కృష్ణుని అటువైపు వెళ్ళవద్దని హెచ్చరిస్తుంది.

యశోద చిన్ని కృష్ణుడ్ని కాళింగ మడుగు వద్దకు వెళ్ళవద్దని చెప్పి పంపిన తరువార ఆ మడుగు సమీపంలో అపశకునములతో యశోద మనసు కలతచెంది ఆమె ఆవేదన క్రింది గేయంలో బయటపడుతుంది.

" ఆవేళ మందలో అపశకునమాయె - పెక్కులుతోచె నందాదులకును

పగలు చుక్కలుపొడిచె గ్రద్దల యెగిరె - కాకులు మూకలై కూయంగదొడగె

కుడికన్ను అదరెనే యశోదకపుడు - నందగోపుని ఎడమబాహువపుడదరె

ఆరాటమున కాంత లంతంతనిలువ - ఊరికే కన్నీరు ఉరముపై వ్రాలె

ఎక్కడనందనుడని తల్లడింపుచూ - ఆకృష్ణ హాకృష్ణయనిమూర్ఛపోయె " [182]

యశోద కృష్ణుని కాళింగ మడుగువద్దకు వెళ్ళవద్దని చెప్పిపంపింది. కానీ ఆ ప్రాంతములో కనబడే అపశకునములవలన తన బిడ్డకేమైనా ఆపద కలిగిందేమోనన్న ఆందోళనతో యశోదకు కుడికన్ను అదురుతుంది. కన్నీరుపొంగి తన చిన్ని కృష్ణుడు ఎక్కడున్నాడోనని తల్లడిల్లి మూర్ఛపోతుంది.

యశోద హరియే తన కుమారుడు(కృష్ణుడు)గా జన్మించాడని తెలిసినా ఆమెలోని తల్లిప్రేమ కృష్ణుని ఏనాడూ భగవంతునిగా చూడక కన్నబిడ్డగానే చూసేది. కనుకనే తన బిడ్డకు ఆపద కలిగిందేమోనని తలచింది. యశోద కృష్ణుని తెలిసీతెలియని పసివాడనే అనుకుంటుందిగానీ లోకాలనేలే విష్ణువని ఆమె తలపుకైనా రాకపోవడంలోనే అమ్మ మనసు, ప్రేమ మనకు వ్యక్తమవుతుంది.

మూర్ఛిల్లిన యశోద తేరుకొని కృష్ణునిచేరి క్రింది విధంగా తన బాధను వెలిబుచ్చుతుంది.

''పామున్న వెరతువే పద్మనాభుడా యెరిగి యీ మడుగులో యేల దుమికితి
నీ కర్మ గతివచ్చి నిన్ను తోసెనుగా - అడవులలో తిరిగి దురితము లవన్నీ
పారగాదోలి బాలుర గాతువయ్య - తల్లేల తండ్రేల మధుసూదనుడా
బాలులకు ఆధారమైన శ్రీకృష్ణ - నీ తల్లిదండ్రులా సోకములు మాన్పా
నీవిటు రావయ్య నీల వర్ణుడా - నా శోకములు మాన్పు నారాయణూడ " [183]

ఈ గేయంలో యశోద కృష్ణునిచేరి ఈ మడుగులో ఎందుకు దూకావని, నీవులేనిదే నీ తల్లిదండ్రులు బ్రతుకగలరాయని ప్రశ్నించి, ఎందుకు మాకు ఇలాంటి శోకమును కలిగిస్తావంటూ యశోద కృష్ణునిపై తనకున్న ప్రేమను వ్యక్త పరుస్తుంది.

## 5. ఉష

### i.ఉపచేతన

జ|గదావస్థలోఉష మెలకువగా ఉండి తనకు కాబోయేవాడి మీద మనసు లగ్నం చేసి అతని గురించే ఆలోచిస్తూ, చేతనలోని ఈ ఆలోచనలతో ఉప చేతనలోకి వెళ్ళి తరువాత అచేతనలోకి వెళ్ళి కలల రూపందాల్చి అమె వింత ప్రవర్తనకు కారణమయ్యాయి. ఉపచేతన మనసులో ఉండే పొరలలో చేతన తరువాత ఉండే కలల ప్రపంచం. మానవునిలో తీరని, అణచవేయబడిన కోరికలు, భావాలు మొదలైనవన్నీ వారు ఏకాంతంలోగానీ, నిద్దురలోగానీ ఉన్నప్పుడు కలల రూపంలో వస్తాయి.

### ii.కామం

మనం చేసే ప్రతిపనికీ కామచేష్టితమే కారణమని మనువు చెప్పాడు. ధర్మ విరుద్ధం కాని కామ సంకల్పములు జగత్కల్యాణానికి కారణమగును. ఈ విధంగా యవ్వనంలో ఉన్న ఉష తను నచ్చిన వాని సాంగత్యమును, ప్రేమను కోరుకొనుట సహజమే. అయితే స్త్రీకి తనకు వివాహం చేయమని తన తల్లిదండ్రులను అడగలేదు కాబట్టి ఉష అనిరుద్ధుని ప్రేమిస్తున్నదనే విషయాన్ని తన చెలికత్తె చిత్రాంగి ద్వారా తన తండ్రికి తెలియజేసి తన తల్లిదండ్రులు ఉష వివాహం గురించి అలోచించేలా చేసింది.

### iii.సిగ్గు

చిత్రాంగి ఉషకు కలలో వచ్చింది అనిరుద్ధుడేనా అని తెలుసుకునే సందర్భంలో ఉషలో సిగ్గును చూడవచ్చు. సిగ్గుచే తలయెత్తక కాలివేలితో నేలపై రాస్తూ, పయిటను సవరించుచూ, పాపటి దిద్దుకొనుచూ, ముక్కెరను దిద్దుకొనుచూ, కురులు సవరిస్తూ, ముఖముపై చెమ్మటను తుడుచుచూ, రవికముడి గిల్లుచూ అనేక విధములా ఉష తనలోని సిగ్గును ప్రకటిస్తుంది. కాలివేలితో నేలపై రాయడం, పయిటను సవరించడం, పాపటి దిద్దుకొనడం, కురులు, సవరించడం ఇలాంటివన్నీ ఉష సిగ్గును ఆ సిగ్గులో కలలో వచ్చిన అనిరుద్ధుని తాను పొందాలనే కోరికను తెలియజేయును.

ఉష శివ భక్తుడయిన బాణాసురుని కుమార్తె. అనిరుద్ధుని భార్య. ఉషకు కలలో కనిపించినవాడే ఆమెకు భర్త అవుతాడని పరమేశ్వరి చెబుతుంది. చిత్రరేఖ ఉషకు అత్యంత ప్రియమైన చెలికత్తె. ఉషకు కలలో వచ్చిన అనిరుద్ధుడు ప్రద్యుమ్నుని కుమారుడు. ప్రద్యుమ్నుడు శ్రీకృష్ణుని కుమారుడు. [184]

భాగవతంలోని ఉషానిరుద్ధుల కథ జానపదులను బాగా ఆకర్షించి వారి గేయాలలో భాగమైంది. ఉషకు ఒక నాడు వచ్చిన కలను బట్టి ఆమె క్రింది విధంగా ప్రవర్తిస్తుంది.

"అన్నంబు దినదాయె నాటలకుబోదాయె నట్టె నిలిచుండునంత
నిదురపోదాయెను నీరంబుగొనదాయె నేల బరుండు నెపుడు
కలువరించుచునుండు కలగంటి ననుచుండు పలుకదెవ్వరితోడనూ" [185]

ఈ గేయంలో ఉష తనకు వచ్చిన కలను బట్టి అన్నం తినకుండా, ఆటలాడకుండా, ఎవరితో పలుకకుండా నేలపై నిద్దురపోవడం లాంటివి చేస్తుంది.

ఉష జాగ్రదావస్థలో మెలకువగా ఉండి తనకు కాబోయేవాడి మీద మనసు లగ్నం చేసి దాని గురించి ఆలోచించి అనుభవాన్ని పొందినది. దీన్నే మనం చేతన అంటున్నాం. ఉషలోని ఈ ఆలోచనలు తరువాత ఉప చేతనలోకి వెళ్ళి తరువాత అచేతనలోకి వెళ్ళి కలల రూపందాల్చి అమె వింత ప్రవర్తనకు కారణమయ్యాయి. ఉపచేతన మనసులో ఉండే పొరలలో చేతన తరువాత ఉండే కలల ప్రపంచం. మానవునిలో తీరని, అణచవేయబడిన కోరికలు, భావాలు మొదలైనవన్నీ వారు ఏకాంతంలోగానీ, నిద్దురలోగానీ ఉన్నప్పుడు కలల రూపంలో బయటపడతాయి.

ఉష నిద్రాహారాలు మాని పరధ్యానంగా ఉండుటకు ఆమెకు వచ్చిన కలే కారణం. ఉష కలగన్న తరువాత కూడా ఆ కల నుండి బయటకు రాలేక బాహ్య ప్రపంచంతో ఏమీ సంబంధం లేదన్నట్లు నిద్రాహారాలు మాని పరధ్యానంగా ఉంటుంది.

చిత్రరేఖ ఉష ప్రవర్తనకు కారణం ఆమెకు వచ్చిన కలయని తెలుసుకొని కలలో వచ్చింది ఎవరనేది తెలుసుకొనుటకు అనేక విధాల ప్రయత్నించి చివరకు అనిరుద్ధుడని తెలుసుకుంటుంది. క్రింది గేయంలో జానపదులు ఉష చిత్రరేఖల మధ్య సంభాషణలను ఎంతో రమణీయంగా చిత్రించారు.

“అనగానె చెలికత్తెయంతయును దెలిసికొని అతివ యింద్రుడువచ్చెనా

అనగానె కాదమ్మ యమరనాయకునన్న నతిపాపమబ్బునాకు

అనగానె చెలికత్తె యంతయును దెలిసికొని యబ్జభవుడే తెంచెనా

అనగానె కాదమ్మ యబ్జసంభవునన్న నతిపాప మబ్బునాకు

అనగానె చెలికత్తె యంతయును తెలుసుకొని పార్వతీ భుడొచ్చెనా

అనగానె కాదమ్మ హరుడంచు బల్కినను నతిపాపమబ్బునాకు

అనగానె చెలికత్తె యంతయును దెలుసుకొని యాజయంతుడు వచ్చెనా

అనగానె కాదమ్మ యలజయంతునినన్న నతిపాపమబ్బునాకు

అనగానె చెలికత్తె యంతయును తెలుసుకొని యలవసాంతుడు వచ్చెనా

అనగానె కాదమ్మ యా వసంతునన్న తన పాప మబ్బునాకు

అనగానె చెలికత్తె యంతయును తెలుసుకొని యా కుబేరుడు వచ్చెనా

అనగానె కాదమ్మ యక్షేశునినచో నతిపాప మబ్బునాకు

అనగనె చెలికత్తె యంతయును తెలుసుకొని యబ్జబంధుడు వచ్చెనా

అనగానె కాదమ్మ యబ్జబంధుండనిన నతిపాప మబ్బునాకు

అనగానె చెలికత్తె యంతయును తెలుసుకొని యా నిశాపతి వచ్చెనా

అనగానె కాదమ్మ యా నిశాపతినన్న నతిపాప మబ్బునాకు

అనగానె చెలికత్తె యంతయును తెలుసుకొని యంబుజాక్షుడు వచ్చెనా

అనగానె కాదమ్మ యంబుజాక్షునురూప మమరునే కొంచెముగను

అనగానె చెలికత్తె యంతయును దెలిసికొని యా మన్మథుడు వచ్చెనా

అనగానె కాదమ్మ యా మన్మథుని రూప మమరెనే చాలవరకు

అనగానె చెలికత్తె యంతయును దెలుసుకొని యనిరుద్ధుడేతెంచెనా

అనగానె కాదంచు నౌనంచుబల్కక యతివ శిరమును వంచెను "[186]

పై గేయంలో చిత్రరేఖ ఉషకు కలలో ఎవరొచ్చారనే విషయాన్ని తెలుసుకొనుటకు ఇంద్రుడు, జయంతుడు, మన్మథుడు, మహేశ్వరుడు, కుబేరుడు వంటి వారి పేర్లు ఎన్ని చెప్పినా ఉష అలాంటి వారు నా కలలోకి వచ్చారనే నిందనుమోపిన మహాపాపమని చితరేఖతో పలుకును. చివరకు చిత్రరేఖ అనిరుద్ధుడేమయినా కలలోకి వచ్చెనా అని ఉషను అడుగగా ఉష కాదనీ, ఔననీ పలుకక తలవంచుకుని సిగ్గుపడుతుంది.

పై గేయంలో చిత్రాంగి ఉషతో మన్మథుడేమయినా కలలో వచ్చెనా అనగానే అందుకు సమాధానంగా ఉష 'మన్మథుని రూప మమరెనే చాలవరకు' అని పలుకుటనుబట్టి ఉషకు అనిరుద్ధుడు రూపంలో మన్మథునిలా కనబడ్డాడు. సజహంగా మనం ఎవరినా ఇష్టపడితే మన కళ్ళకు ఎదుటివాళ్ళు ఎంతో అందంగా కనబడతారు. ఇక్కడ మనం చూడటం అనేది కళ్ళతో జరిగిన ప్రక్రియ కాదు, మనసుతో జరిగిన ప్రక్రియ.

ఉష చిత్రాంగికి కలలో వచ్చినవాని రూపురేఖలు చెప్పుటకు మాత్రమే మన్మథుని రూపాన్ని చూపినది. అంటే అంతటి అందగాడని చిత్రరేఖకు చెప్పడమన్నమాట. చిత్రరేఖకు ఉష ఇచ్చిన ఆధారంతో చిత్రరేఖ, కలలో అనిరుద్ధుడొచ్చెనా అని సందేహంతో ఉషను ప్రశ్నించగా 'కాదంచు నౌనంచుబల్కక యతివ శిరమును వంచెను' ఉషలోని ఈ మౌనమే చిత్రాంగిలో కలలో ఉష మనసును దోచుకున్నది అనిరుద్ధుడేనను నిర్ణయానికి తీసుకువచ్చేలా చేసింది. స్త్రీకి సహజమయిన సిగ్గుచే అనిరుద్ధుని ప్రస్తావన రాగానే అవుననీగానీ, కాదనిగానీ పలుకక తలవంచుకుని తన మనసును బయటపెట్టింది.

క్రింది గేయంలో జానపదులు ఆడపిల్లలు సిగ్గుచే ఎలా ప్రవర్తిస్తాడో అన్న విషయాన్ని ఉష ద్వారా అద్భుతంగా కళ్ళకు కట్టినట్లు చూపించారు.

"చేతితో తలయెత్తి చెలికత్తె న వ్వనను సిగ్గుచే దలయెత్తదు

కాలివేలితోడ నేలను వ్రాయుచును కాంత తా దలయెత్తదు

పయిట సవరించును పాపటా దిద్దుచును పడతి తా తలయెత్తదు

మురుగులొత్తుకొనుచు ముక్కరనుదిద్దుచును ముదిత తా తలయెత్తదు

కురులు దిద్దుకొనుచు కొప్పు సవరించుచు తరుణి తా తలయెత్తదు

ముఖముపై చెమ్మటను ముదముతో దుడుచుచు సఖియ తా తలయెత్తదు

రత్నాల హారమును రదనముల గోరుచును రమణి తా తలయెత్తదు

రవిక ముడిగిల్లుచును రాయిడి నొప్పుచును నువిద తా తలయెత్తదు'' [187]

ఉష సిగ్గుచే తలయెత్తక కాలివేలితో నేలపై రాస్తూ, పయిటను సవరించుచూ, పాపటి దిద్దుకొనుచూ, మురుగులొత్తుకొనుచూ,ముక్కెరను దిద్దుకొనుచూ, కురులు, సవరిస్తూ, ముఖముపై చెమ్మటను తుడుచుచూ, రవికముడి గిల్లుచూ అనేక విధములా ఉష తనలోని సిగ్గును ప్రకటిస్తుంది.

స్త్రీ, పురుషులు తమకు ఇష్టమైనవారు ఎదురైనప్పుడు జుట్టును సవరించుకోవడం ఎదుటివారి దృష్టిలో తాము అందంగా కనిపించాలనే భావనను తెలుపును. జుట్టును సవరించుకోవడం అవతలి వాళ్ళకు తమ ఇష్టాన్ని ప్రకటించడమే. [188]

చిత్రరేఖ ఉషతో కలలో వచ్చింది అనిరుద్ధుడేనా అనగానే ఆ మాటలకు ఉష 'కురులు దిద్దుకొనుచు కొప్పు సవరించుచు తరుణి తా తలయెత్తదు'. ఈ విధంగా కురులు సవరిస్తూ చిత్రరేఖతో కలలో వచ్చింది అనిరుద్ధుడేనని, అతనంటే తనకు ఇష్టమని ఆమె ప్రవర్తనతో చిత్రరేఖతో చెప్పకనే చెబుతుంది.

ఉష కాలివేలితో నేలపై రాయడం, పయిటను సవరించడం, పాపటి దిద్దుకొనడం, కురులు, సవరించడం ఇలాంటివన్నీ ఉష సిగ్గును ఆ సిగ్గులో కలలో వచ్చిన అనిరుద్ధుని తాను పొందాలనే కోరికను తెలియజేయును.

చిత్రరేఖ ఉష స్వప్నము గురించిన విషయమును మహారాజుకు విన్నవించి ఈ విషయాన్ని మరళా ఉషతో చెప్పడంతో ఉష అనందానికి అంతులేకుండా పోతుంది. ఉషలోని ఆనందాన్ని మనం క్రింది గేయంలో చూడవచ్చు.

''ఆకొన్న మనుజునకు నన్నంబు దొరికినట్లాయె సంతోషమొందె

పేదకును లభియించు పెన్నిధి విధంబునను వెలది సంతోషమొందె

నడియేట మనుజునకు నావదొరకినయట్లు నాతి సంతోషమందె

వడగొన్న సస్యంబు వానదడిసినయట్లు వనిత సంతోషమొందె "[189]

ఉష అనిరుద్ధుని వరించినదన్న విషయం చిత్రాంగి ఆమె తండ్రికి తెలిపినందుకు ఎంతో ఆనందించింది. ఆకలిగొన్నవానికి అన్నం దొరికినట్లు పేదవానికి పెన్నిధిలా, నడియేట నావ దొరికినట్లు, సస్యంబు వనదడిసినట్లు ఉష ఎంతో ఆనందాన్ని ప్రకటించింది. ఈ ఆనందానికి కారణం తన తండ్రిని తను వరించిన అనిరుద్ధునికిచ్చే తనకు వివాహం జరిపిస్తాడన్న నమ్మకమే. ఉష అనిరుద్ధుని వరించడం వరకే ఆమె చేతిలోని పని. కానీ వివాహం జరిపించడం తల్లిదండ్రులు చేయవలసిన పని. అందుకే తన తన తండ్రికి ఉష అనిరుద్ధుని వరించినదనే విషయం తెలిసి, తన తండ్రిని తన ఇష్టప్రకారమే అనిరుద్ధునితో వివాహం జరిపించునని ఉష భావన.

ఉషలో ఆమె కోరుకున్న వాడు తనకు దక్కాలనే సంకల్పము ఆమెలోని కామ చేష్టితమే. మనం చేసే ప్రతిపనికీ కామచేష్టితమమే కారణమని మనువు చెప్పెను. ధర్మ విరుద్ధం కాని కామ సంకల్పములు జగత్కళ్యాణానికి కారణమగును. ఉష యవ్వనంలో ఉన్నది కావున తను నచ్చిన వాని సాంగత్యమును, ప్రేమను కోరుకొనుట సహజమే. యవ్వనంలో స్త్రీ పురుషులు వివాహం చేసుకొన్ని సహజీవనం చేయడం లోక విదితమే. అయితే స్త్రీకి తనకు వివాహం చేయమని తన తల్లిదండ్రులను కోరదు. కానీ ఇక్కడ చిత్రాంగి ఉష అనిరుద్ధుని ప్రేమిస్తున్నదనే విషయాన్ని అమె తండ్రికి చెప్పి వారు ఉష వివాహం గురించి అలోచించేలా చేసింది.

పై గేయంలో చెప్పిన విధంగా ఆకలిగొన్నవానికి అన్నందొరినట్లు అనుటలో ఆకలిగొన్నది ఉష. అన్నం ఆమె వరించిన అనిరుద్ధుడని చెప్పడంలో ఎలాంటి సందేహమూలేదు. ఆకలిగొన్నవానికి అన్నం అతని ఆకలి తీర్చినట్లు మనం కోరుకున్నది మనకు దక్కితే ఎంతటి ఆనందము కలుగునో అలాంటి ఆనందమే ఉషలోనూ కలిగింది.

## పరిశోధన లక్ష్యం

1.జానపదానికి, మనోవిశ్లేషణకు ఉన్న సంబంధం ఏమిటి?

2.జానపదాన్ని మనోవిశ్లేషణ సిద్ధాంతాలకు ఎందుకు అనువర్తింపచేసి చూడాలి?

3. దీని వలన మనకు చేకూరిన లాభం ఏమిటి?

ఇలా మనం కొన్ని ప్రశ్నలను వేసుకున్నట్లయితే మనకు కొన్ని సమాధానాలు లభిస్తాయి. అవి ఏమిటంటే జానపదుల కాలంనాటి అనేక కట్టుబాట్లు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, మనకు కనిపిస్తాయి. అలాగే జానపదులు తాము రూపొందించే పాత్రలకు తమ మనసత్త్వాలను ఆపాదించి రచనలు సాగిస్తారు. దీన్ని బట్టి జానపద సాహిత్యాన్ని ఇతర శాస్త్రాల (మనోవిశ్లేషణ)తో పోల్చి చూసినప్పుడు మనకు ఆ కాలంనాటి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, జానపదుల మనస్తత్వం ఇలా అనేక విషయాలు తెలుస్తాయి.

ఈ పరిశోధనకు జానపదుల పౌరాణిక సంబంధ గేయాలను రామాయణం, భారతం, భాగవతం నుండి ముద్రణా రూపాన్ని ధరించిన గేయాలను మాత్రమే సేకరించి వాటిలో పరిశోధనలో భాగమైన 'స్త్రీల మనోవిశ్లేషణ'కు తావిచ్చే పౌరాణిక గేయాలను మాత్రమే స్వీకరించడమైనది.

జానపదులు రామాయణం, భారతం, భాగవతం వంటి పురాణాలకే ప్రాధాన్యమిచ్చి గేయాలలోనూ, కథలలోనూ, దృశ్యరూపంగానూ ఇలా ఎన్నో ప్రక్రియలలో పురాణ గాథలను తమ జీవితంలో భాగంగా చేసుకున్నారు. జానపద సాహిత్యంలో పురాణాలకు సంబంధించిన సాహిత్యం అధికంగానే ఉంది. వీరి బుర్రకథలలో, తోలుబొమ్మలాటలలో, పౌరాణిక కథలలో, గేయాలలో ఇలా అనేక రూపాలలో పురాణ సాహిత్యం నిక్షిప్తమైనది. జానపదులు పురాగాథలు ఇతరులకు చెప్పడం ద్వారా, ఇతరులు చెప్పిన దాన్ని వినడం ద్వారా పుణ్యం లభిస్తుందని విశ్వాసం. జానపదులు పురాణ (పౌరాణికాలు) కథలను గేయాలుగా మలిచి పాడుకునేవారు.

ప్రస్తుత పరిశోధనాంశం**'జానపద పౌరాణిక గేయాలలో స్త్రీ పాత్రల మనస్తత్వ విశ్లేషణ'** అను పరిశోధనా గ్రంథాన్ని సౌలభ్యం కోసం 7అధ్యాయాలుగా చేసుకొని పరిశోధనగావించాను.

1.జానపదం -వస్తు ప్రక్రియా వైవిధ్యం

2.జానపదుల పౌరాణిక గేయాలు విషయ వర్గీకరణ

3.మనస్తత్వ శాస్త్రం మానవుల స్వభావ వైవిధ్యం

4.రామాయణం -స్త్రీల మనస్తత్వ విశ్లేషణ

5.భారతం స్త్రీల మనస్తత్వ విశ్లేషణ

6. భాగవతం స్త్రీల మనస్తత్వ విశ్లేషణ

7.ముగింపు

## 1. జానపదం - వస్తు ప్రక్రియా వైవిధ్యం

మొదటి అధ్యాయంలో జానపదుల ప్రస్తావన, జానపద విజ్ఞానం-సాహిత్యం, జానపదుల సాహిత్యంలో గేయాలకున్న ప్రాధ్యాన్యత - లక్షణాలు, జానపద గేయాలలో కథా గేయాలకున్న ప్రాధన్యత - లక్షణాలు, కథా గేయాలకు పాశ్చాత్యులు, భారతీయులు, తెలుగు వారు చేసిన కృషిని వివరించాను.

## 2. జానపదుల పౌరాణిక గేయలు - విషయ వర్గీకరణ

రెండవ అధ్యాయంలో పురాగాథలు - పౌరాణిక గేయాల ప్రస్తావన, పౌరాణిక గేయాలను పరిశోధనా సౌలభ్యం కోసం క్రింది విభనలతో తరువాతి అధ్యాయాలలో పరిశోధన.

1.రామాయణం - జానపద గేయాలు

2. మహాభారతం - జానపద గేయాలు

3. భాగవతం - జానపద గేయలు

4. ఇతర పురాణ గేయాలు

## 3. మనస్తత్వ శాస్త్రం - మానవుల స్వభావ వైవిధ్యం

ఈ అధ్యాయంలో ప్రధానంగా సిగ్మండ్ ప్రాయిడ్ , ఆడ్లర్ , యూంగ్ వంటి మనస్తత్వ శాస్త్రిజ్ఞుల సిద్ధాంతాలు, ఇంకా అనేక మంది పాశ్చాత్యుల మనోవిశ్లేషణ సిద్ధాంతాలను వివరించాను. పాశ్చాత్యులు మతాన్ని, మనస్తత్వ సిద్ధాంతాలను వేరుగా పేర్కొన్నారు. కానీ భారతీయులు మతంలోనే మస్తసత్త్వ సిద్ధాంతాలను పేర్కొని ఇవే మోక్షానికి మార్గాలన్నారు. ఇలా భారతీయుల మనోవిశ్లేషణ సంబంధ సిద్ధాంతాలను కూడా వివరించాను. వీటిలో అంతఃకరణములను, అరిషడ్వర్గాలను వివరించాను.

## 4. రామాయణం -స్త్రీల మనస్తత్త్వ విశ్లేషణ

రామాయణంలో స్త్రీపాత్రలెన్నో ఉన్నా కైక, సీత, ఊర్మిళ, శూర్పణఖ వంటి పాత్రలే రామాయణ కథకు ప్రధాన పాత్రలుగా నిలచాయి.

### కైక

దశరథుని ముద్దుల భార్య కైక. మందర మాటలతో మనసును పాడుచేసుకొని తన కుమారుడు భరతుడే అయోధ్యకు రాజుగా ఉండాలనే స్వార్ధ బుద్ధితో, గతంలో దశరథుడు తనకు ఇస్తానన్న వరముల ద్వారా రాముని 14 సంవత్సరాలు అడవులపాలు చేస్తుంది. కుటుంబంలో వ్యక్తుల స్వార్ధము ఆ కుటుంబాన్ని ఎలా నాశనం చేస్తుందో కైక పాత్ర ద్వారా తెలుసుకోవచ్చు.

### శూర్పణఖ

అడవిలో రాముని అందచందాలను చూసి, వరించి రాముని పొందే ప్రయత్నంలో ముక్కూచెవులను పోగొట్టుకొంటుంది. తనకు జరిగిన అవమానాన్ని సహించనిదై ఎలాగైనా సీతను రాముని నుండి వేరుచేసి అతనిని పొందాలనే ఉద్దేశ్యంతో సీత అందచందాలను తన అన్న రావణునికి చెప్పి సీతను రాముని నుండి దూరం చెయ్యడం. రామరావణ యుద్ధానంతరం కూడా యతి వేషంలో వచ్చి రాముని నుండి గర్భవతిగా ఉన్న సీతను దూరం చేసి అడవుల పాలు చేయడంలో రాముని పొందాలనే కోరిక ఆమెలో ఎంతగా ఉందో తెలుసుకోవచ్చు. ఈ విధంగా శూర్పణఖ రామాయణంలో ప్రముఖ పాత్రగా ఉంది.

### సీత

14 సంవత్సరాలు కైక రాముని వనవాసానికి వెళ్ళమన్నప్పుడు సీతకు భర్తే సర్వస్వం కావున తానూ రామునితోనే అడవులకు బయలుదేరుతుంది. ఒకనాడు సీత అడవిలో బంగారు జింకను చూసి తనకు బంగారు జింకను తెచ్చివ్వమని రాముని కోరింది. లోకంలో బంగారు జింక ఎక్కడా ఉండదు. కానీ సీత బంగారు జింకను చూసి ఇలాంటిది మరెవరివద్దా ఉండరాదనే ఉద్ధేశ్యంతో కాబోలు ఆ సమయంలో ఆమెలోని బుద్ధిని కోల్పోయి నిజాన్ని తెలుసుకోలేక బంగారు జింకను కోరి రావణునిచే అపహరణకు గురై రామరావణ యుద్ధానికి కారణమైనది.

**భూదేవి**

జానపదులు భూదేవి పాత్ర ద్వారా కుమార్తె విషయంలో తల్లికి ఉండాల్సిన భాద్యతలను సీత అప్పగింతలు వంటి గేయలలో పేర్కొన్నారు. అలాగే లక్ష్మణుడు రాముని ఆజ్ఞమేరకు సీతను అడవులకు తీసుకువచ్చి ప్రాణాలు తీసే సమయంలో ఒక తల్లిగా తన బిడ్డను కాపాడుకోవడం, లవకుశులతో యుద్ధానంతరం రామునికి సీత పుత్రులను అప్పగించి తను తన తల్లి భూదేవిలో లీనమవ్వడం ఇలా అనేక సందర్భాలలో తల్లికి బిడ్డపై ఉండాల్సిన ప్రేమను, భాద్యతను భూదేవి పాత్ర ద్వారా తెలియజేశారు.

**ఊర్మిళ**

రామునితో పాటు తమ్ముడు లక్ష్మణుడు కూడా అన్నావదినలకు తోడుగా అడవులకు వెళ్ళే సమయంలో లక్ష్మణుని నిలువరించక భర్త నిద్రను తాను స్వీకరించి 14 సంవత్సరాలు సీతారాముల వనవాసం అయ్యేంత వరకూ నిరంతరం ఘాడ నిద్రలోనే గడిపింది ఊర్మిళ. ఈమె కూడా రామాయణానికి ప్రధాన పాత్రగానే చెప్పవచ్చు. అసలు ఊర్మిళ లక్ష్మణుని అడవులకు పంపకుండా ఉంటే కథ మరోలా ఉండేదేమో.

**మండోదరి**

మండోదరి రావణుని భార్యగా అధర్మ పక్షాన ఉన్నా ఆమె రావణుడు సీతాపహరణ సమయంలో రామరావణ యుద్ధం వంటి సందర్భాలలో ఆమె ధర్మపక్షాన ఉన్నది. రావణుడు సీతాపహరణ చేసి రామరావణ యుద్ధ సమయంలో మండోదరి రావణుడితో వారి సీతను వారికిచ్చి చేసిన తప్పుకు క్షమాపన కోరమంటుంది. ఇక్కడ మండోదరి రావణుడి వల్ల ఎక్కడ తమ వంశము, సామ్రాజ్యము నాశనమవుతాయోనన్న భయంతో భర్యగా రావణునికి హితవులు చెప్పి వంశాన్ని, రావణుని కాపాడాలనుకుంటుంది.

**సులోచన**

సులోచన ఇంద్రజిత్తు భార్య రావణుని కోడలు. ఈమె వృంత్తాంతము అవాల్మీకము. ఈమె పాతాళ అధిపతి ఆదిశేషుని కుమార్తె. రామలక్ష్మణుల చేతిలో హతుడైన తన భర్త శరీరమును తెచ్చుకొని సహగమనాన్ని చేసిన పతివ్రత. కథాగమనము కొరకు, రసపుష్టి కొరకు ఇలాంటి పాత్రలను రంగనాథరామాయణకర్త సంస్కృతం నుండి, జనశ్రుతుల నుండి గ్రహించి తన రామాయణంలో చేర్చుకున్నాడు.

## 5. భారతం - స్త్రీల మనస్తత్వ విశ్లేషణ

భారతంలో ప్రధానంగా చెప్పుకోవలసిన స్త్రీ పాత్రలు కుంతి, ద్రౌపది, సుభద్ర వంటి పాత్రలు ఎన్నో ఉన్నాయి.

### ద్రౌపది

పాండవుల వనవాసానికి, కురుక్షేత్ర యుద్ధానికి ప్రధాన కారణం ద్రౌపది. ఈమె లేకపోతే అసలు భారతమే లేదనుటలో ఎలాంటి సందేహమూ లేదు. జానపదులు వారి జానపద గేయాలలో ద్రౌపదిని పరాశక్తిగా భావించారు. ద్రౌపదిని కౌరవ సభలో అవమానించే సందర్భంలో భీముడు దురోధనుని, దుశ్శాసనుని వధించి ద్రౌపదికి జరిగిన అవమానానికి ప్రతీకారాన్ని తీర్చుకుందునని ప్రతిజ్ఞ చేయడం మనం జానపదేతర భారతాలలో విన్నాము. కానీ జానపదులు ద్రౌపదిని పరాశక్తిగా భావించినందున ఆమె పరాక్రమన్ని శక్తిని చాటుటకు భీముని ప్రతిజ్ఞకు బదులుగా ద్రౌపదే తనను అవమానించిన దురోధనుని, దుశ్శాసనుని వధించెదనని ప్రతిజ్ఞ చేయడం జానపదుల భారతంలో వారి కల్పనా చాతుర్యానికి నిదర్శనం.

### సుభద్ర

సుభద్ర బలరాముడు, కృష్ణుల గారాల చెల్లెలు. చిన్నతనం నుండీ ఈమె అర్జునిని వరించి బలరామునికి వ్యతిరేకంగా కృష్ణుని అండతో అర్జునుని వివాహమాడుతుంది. జానపదులు ఆనాడు సమాజంలో స్త్రీ పుట్టింటి సారెగా మెట్టినింటికి ధన, కనక, వస్తు సముదాయము తెచ్చే ఆచారము కలదు. ఈ విధానమును జానపదులు సుభద్ర పాత్రద్వారా అద్భుతంగా మలిచారు. సుభద్ర పెద్దలకు వ్యతిరేకంగా వివాహం చేసుకుంది కావున ఆమెకు పుట్టినింటి నుండి సారె లభించలేదు. కానీ అర్జునుడు కొంత కాలానికి సారె తెమ్మని సుభద్రను పుట్టింటికి పంపించి సారె తెప్పించుకుంటాడు. ఈ ఘట్టాన్ని జానపదులు ఎంతో అద్భుతంగా తమ జీవన విధానానికి తగినట్టుగా మలిచారు.

### గంగ

శివుని చిన్నభార్యగా జానపదులు గంగకు ఎంతో ప్రాముఖ్యతనిచ్చి గంగమ్మ జాతరలు జరుపుకుంటారు. జానపదులు శివుని మొదటి భార్య గౌరి రెండవ భార్య గంగకు మధ్య అనేక సంవాదాలను సృష్టించారు. గౌరి గంగను కొంత చులకన భావంతో చూడటంతో గంగ నీటిపై తనకు గల అధికార మదంతో నీటి స్థంభింపచేసి తన అవసరాన్ని

గౌరికి తెలియజేసి చివరకు శివుని గంగ సొంతం చేసుకుంటుంది. ఈ సంఘటనకు సంబంధించిన అనేక సంవాద గేయాలను జానపదులు గంగ-గౌరిసంవాదం పేరుతో రచించి గానం చేసుకునేవారు.

**గౌరి**

జానపదులు గారి పేరుమీద గౌరిదేవి వ్రతం చేస్తారు. సామూహికంగా స్త్రీలందరూ కలిసి గౌరి పూజ చేస్తారు. దక్షుని కుమార్తెగా శివుని మొదటి భార్యగా గౌరికి జానపదులలో ప్రత్యేక స్థానం ఉంది. భర్త మాట కాదని తన తండ్రి చేయు యజ్ఞానికి వెళ్ళి భంగపడి తన భర్తకు మొహం చూపించలేక అగ్నికి ఆహుతి అయి, మరళా తిరిగి హిమవంతుని కుమార్తెగా జన్మించి శివుని భర్తగా పొందాలని తపస్సుచేసి చివరకు శివుని భర్తగా పొందుతుంది.

**చిత్రాంగి**

చిత్రాంగి రాజరాజనరేంద్రుని భార్య. రాజరాజనరేంద్రుని కుమారుడు సారంగుడ్ని వివాహమాడాల్సిన చిత్రాంగి విధివశాత్తు అతని తండ్రిని వివాహమాడుతుంది. ఒకనాడు సారంగుడి పావురం చిత్రాంగి మేడలకు పోగా పావురం కోసం చిత్రాంగి మేడలకు వచ్చిన సారంగుని మోహించిన చిత్రాంగి అతడు కుమారుడి వరసని తెలిసినా అతనిని బలాత్కరించబోయి భంగపడి ప్రతీకారేచ్ఛతో సారంగుడే తనను బలాత్కరించబోయాడన్న నిందతో అతని కాళ్ళుచేతులు నరికించి వేస్తుంది. ఋషుల వల్ల సారంగుడు తన అవయవాలను పొంది తానూ ఋషులలో కలిసిపోతాడు. రాజరాజు సారంగునిపై మోపిన నింద చిత్రాంగి పన్నాగమని తెలుసుకొని ఆమెను ఉరి తీయిస్తాడు. కొంత కాలానికి రాజరాజు అడవిలో సారంగుని కలుసుకొని జరిగిన విషయన్ని చెప్పగా సారంగుడు చిత్రాంగికి తిరిగి ప్రాణం పోస్తాడు.

## ౬. భాగవతం -స్త్రీల మనస్తత్వ విశ్లేషణ

భాగవతంలో చెప్పుకోదగ్గ స్త్రీ పాత్రలు దేవకి, యశోద, రుక్మిణి, సత్యభామ వంటి పాత్రలు కలవు. దేవకీవసుదేవులకు జన్మించి కృష్ణుడు యశోద వద్ద పెరగడం సత్యారుక్మిణులను వివాహమాడటం సత్యాదేవి కొరకై పారిజాతాపహరణ, తులాభారం ఇలా ఎన్నో ఘట్టాలకు వీరే కారకులయ్యారు.

### యశోద

కృష్ణునికి దేవకి జన్మనిచ్చినా పెరిగింది యశోద ఒడిలోనే. కృష్ణునిపై అపారమైన ప్రేమతో చిన్ననాటి నుండి కృష్ణుడు ఎంత అల్లరి చేసినా కృష్ణుడి అల్లరి చేష్టలలో మాతృత్వంలోని మాధుర్యాన్ని అనుభవించేది తప్ప కృష్ణుని దండించేది కాదు యశోద. అల్లరి చేయడం చిన్నపిల్లల లక్షణం. ఈ అల్లరి కృష్ణుడిలో మరీఎక్కువ. నగరిలో గోపికలను ఏడిపించడం, వారి ఇంట వెన్నను దొంగిలించడంలాంటి పనులతో ఏదైనా ఆపద తెచ్చుకుంటాడేమోననే బాధ తప్పితే యశోదకు కృష్ణుడి అల్లరి చేష్టలు బాధ కలిగించవు. తల్లి బిడ్డపై ఎంతటి అనురాగాన్ని హృదయంలో దాచుకుంటుందో యశోద పాత్ర ద్వారా మనకు తెలియజేశారు జానపదులు. విష్ణువే కృష్ణుడని తెలిసినా యశోద కృష్ణుని కన్న బిడ్డగానే చూసింది. లేకుంటే కృష్ణుడు కాళింగ మడుగువద్దకు వెళ్ళాడని తెలిసినప్పుడు తన బిడ్డకు ఎదన్నా ప్రమాదము జరుగునేమోనన్న సహజమైన తల్లిప్రేమ వలన ఆవేదనతో మూర్ఛిల్లుతుంది. జానపదులు యశోద కృష్ణుల పాత్రల ద్వారా కన్నబిడ్డ లోకాలనేలే పరమాత్ముడయినా తల్లికి మాత్రం బిడ్డడేనన్న విషయాన్ని అద్భుతంగా చూపారు.

### రుక్మిణి

మేనత్తకొడుకయిన కృష్ణుడ్ని వలచి, ఇష్టంలేని వివాహాన్ని తప్పించుకొనుటకు రుక్మిణి కృష్ణుని వద్దకు విప్రుని, చిలుకను రాయబారానికి పంపి, కృష్ణుడు వచ్చి రుక్మిణిని వివాహం చేసుకునేలా చేసుకొంటుంది. రుక్మిణి సత్యభామ గురించి ఇది ఎక్కడి సవతి పిలిచినా పలుకదు, నిలచినా నిలువదు, చుచినా చూడదు ఎంత అహంకారము సత్యకు. కృష్ణుడు ఆమెకు ఇంత చనువిచ్చుటకు అంతగా సత్యలో ఏమున్నది. అంటూ రుక్మిణి తన మనసులోని బాధను చెబుతుంది. కృష్ణుడు సత్యాలోలుడయి అధిక సమయం ఆమె దగ్గరే గడపడంవల్ల రుక్మిణి కృష్ణునిపై కోపంతో అతను చిన్నతనం నుండీ స్త్రీలోలుడయి, గోపికలతో రాసలీలలు సాగించేవాడని ఎంతమంది స్త్రీలున్నా కృష్ణుడి

కౌగిటకు సరిపోరని అంటుంది. సత్య కృష్ణుని తులాభారం చేసే సందర్భంలో తులసితో కృష్ణుని తూచి సొంతం చేసుకున్న రుక్మిణిలో కృష్ణుని యెడల నిర్మలమయిన భక్తి, ప్రేమానురాగములు తప్ప కృష్ణునిపై అధికార భావం కనబడదు.

**సత్యభామ**

కృష్ణుని అష్ట భార్యలలో సత్యభామకు ప్రత్యేక స్థానం ఉంది. కృష్ణుడు నారదుడిచ్చిన పారిజాత పుష్పాన్ని రుక్మిణికి అంలంకరించడం తెలిసిన సత్య ఈర్ష్యా భావంతో, నాటకీయతతో కృష్ణునిచే పారిజాత వృక్షాన్నే దక్కించుకుని తన పెరటిలో నాటించుకుని అందరిలోనూ తన ప్రత్యేకతను చాటుకుంది. కృష్ణుడు తనకు మాత్రమే సొంతం కావాలని పుణ్యక వ్రతాన్ని చేపట్టి అందరిలోనూ నవ్వులపాలయ్యింది.

**చెంచిత**

సత్యభామ, రుక్మిణి తదితర భార్యలందరూ కృష్ణుడ్ని భర్తగా పొంది తమ సౌభాగ్యానికి గర్వించుటను చూసి కృష్ణుడు వారి గర్వాన్ని అణచుటకు వారికన్నా అందమయిన చెంచితను సృష్టించి వారి గర్వాన్ని అణచడమే చెంచీత వృత్తాంతం. ఈ కథ కేవలం జానపదుల ఊహాచాతుర్యమే.

హిరణ్యకశిపుని కుమారుడు ప్రహ్లాదుడు తండ్రికి వ్యతిరేకంగా విష్ణు భక్తుడగుట సహించలేని తండ్రి కుమారుని హింసించి విష్ణుభక్తిని అతనిలో లేకుండా చేయాలనుకుంటాడు. కానీ ప్రహ్లాదుని భక్తి ఏ మాత్రమూ తగ్గదు. ఇలాంటి పరిస్థితుల్లో తన భక్తుడను రక్షించుకొనుటకు విష్ణువు నరసింహావతారం దాల్చి హిరణ్యకశిపుని సంహరించి ప్రహ్లాదుని కాపాడును. ఈ సందర్భంలో లక్ష్మిదేవి తను కూడా చెంచులక్ష్మి అవతారంతో నరసింహుని వరించును.

**ఉష**

ఉష శివ భక్తుడయిన బాణాసురుని కుమార్తె. అనిరుద్ధుని భార్య. ఉషకు కలలో కనిపించినవాడే ఆమెకు భర్త అవుతాడని పరమేశ్వరి చెబుతుంది. చిత్రరేఖ ఉషకు అత్యంత ప్రియమైన చెలికత్తె. ఉషకు కలలో వచ్చిన అనిరుద్ధుడు ప్రద్యుమ్నుని కుమారుడు. ప్రద్యుమ్నుడు శ్రీకృష్ణుని కుమారుడు.

జానపదులు ఉషా స్వప్నం గురించిన అనేక గేయలను ఎంతో అద్భుతంగా మలచుకుని పాడుకునే వారు. ఉషకు స్వప్నంలో వచ్చింది అనిరుద్ధుడేనని చిత్రరేఖ తెలుసుకున్న సందర్భంలో ఉషలో స్త్రీకి ఉండే సహజమైన సిగ్గును జానపదులు ఎంతో రమణీయంగా కళ్ళకు కట్టినట్లుగా చెప్పారు.

ఈ విధంగా జానపదుల రామాయణ, భారత, భాగవతాలలో స్త్రీ పాత్రలు ఎంతో ప్రత్యేకతను సంతరించుకుని ఒక్కో పాత్ర ఒక్కొక్క మనస్తత్త్వాన్ని కలిగి ఆనాటి జానపదుల సంప్రదాయాలు, సంస్కృతులు, సామాజిక కట్టుబాట్లు ఇలా ఎన్నో అంశాలను మనకు తెలియజేస్తున్నాయి. మనస్తత్త్వ శాస్త్రం అనేది మనసుకు సంబంధించిన శాస్త్రం కనుక వ్యక్తుల మనసులోని భావాలు వారి ప్రవర్తన ద్వారా బహిర్గతమై వారి వ్యక్తిత్వాన్ని తెలియజేశాయి.




**Sigmund_freud**




**Alfred-adler**




**Carl-gustav-jung**




**Karen Horney**




**Carl rogers**





**Erik erikson**





**Jean-Paul Sartre** **Ericberne Gordon**





**Willard Allport** **Abraham-maslow**

## పాద సూచికలు


1. కృష్ణకుమారి, నాయని: తెలుగు జానపద విజ్ఞానం సమాజం - సంస్కృతి - సాహిత్యం, పుట. 14-15.

2. రామాచార్యులు, బి: జానపద నృత్యకళ గౌరవ సంప్రదాయం, పుట.1- 9.

3. కృష్ణకుమారి, నాయని: తెలుగు జానపద విజ్ఞానం సమాజం- సంస్కృతి-సాహిత్యం, పుట. 61.

4. అరుణ, జి: తెలుగు- హిందీ పౌరాణిక గేయ పరిశీలన, పుట. 6.

5. రామాచార్యులు, బి: శిష్ట సాహిత్యంలో జానపద విజ్ఞాన ధోరణులు, పుట.10.

6. సుందం, ఆర్వీయస్: ఆంధ్రుల జానపద విజ్ఞానం, పుట. 113-115.

7. శంభుప్రసాద్ , శివలెంక: భారతి;1956: సం.33: పుట.399 .

8. రామానుజరావు, డి. *తెలుగు పరిశోధనలో రజితోత్సవ సంచిక,* పుట. 145.

9. వెంకట్రామయ్య, రసాని: జానపద గేయాలలో పురాణాలు, పుట. 4-5.

10. కృష్ణకుమారి, నాయని: తెలుగు జానపద గేయ గాథలు, పుట. 41.

11. నాగయ్య, జి: దక్షిణాత్య సాహిత్య సమీక్ష (మొ.సం), పేజి. 33.

12. రామకృష్ణారెడ్డి, పగడాల: గోదావరి సీమ జానపద కళలు క్రీడలు వేడుకలు, పుట.372-375.

13. నాగయ్య, జి: దక్షిణాత్య సాహిత్య సమీక్ష (మొ.సం), పేజి. 33 - 34.

14. రామకృష్ణారెడ్డి, పగడాల: గోదావరి సీమ జానపద కళలు క్రీడలు వేడుకలు, పుట. 374.

15. సుబ్బలక్ష్మి, మర్ల: తెలుగు జానపద సాహిత్యం పౌరాణిక గేయ గాథలు, పుట. 108-109.

16. సుబ్బలక్ష్మి, మర్ల: తెలుగు జానపద సాహిత్యం పౌరాణిక గేయ గాథలు; పుట. 149.

17. కృష్ణశ్రీ: స్త్రీల పౌరాణికపు పాటలు, పుట. 215.

18. Clifford T. Morgan : . Introduction to Psychology, 8-26.

19. రంగనాధాచార్యులు, కె.కె :ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు, పుట. 170-173.

20. వెంకటేశ్వరరావు, మాముదాల: విశ్వనాథ నవలలు మనస్తత్త్వ చిత్రణ, పుట.5.

21. కృష్ణమూర్తి, జిడ్డు: చేతన, పుట. 24-25.

22. కృష్ణకుమారి, నాయని: (సం.పా.) వాఙ్మయి(మే-జూ1997), పుట. 7.

23. వెంకటేశ్వరరావు, మాముదాల: విశ్వనాథ నవలలు మనస్తత్త్వ చిత్రణ, పుట. 6-7.

24. పైదే, పుట. 7-8.

25. కృష్ణకుమారి, నాయని: (సం.పా.) వాఙ్మయి(మే-జూ1997), పుట : 6.

26. పైదే, పుట. 11.

27. వెంకటేశ్వరరావు, మాముదాల: విశ్వనాథ నవలలు మనస్తత్త్వ చిత్రణ, పుట -9.

28. పైదే, పుట. 11.

29. పైదే, పుట. 11-12.

30. శ్రీరామమూర్తి, కోడూరి: తెలుగు నవలా సాహిత్యంలో మనో విశ్లేషణ, పుట 22-29.

31. http://en.wikipedia.org/wiki/Alfred_Adler

32. శ్రీరామమూర్తి, కోడూరి: తెలుగు సాహిత్యంలో నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ, పుట 22-29.

33. పైదే, పుట. 30-32.

34. వెంకటేశ్వరరావు, మాముదాల: విశ్వనాథ నవలలు మనస్తత్త్వ చిత్రణ, పుట. 20.

35. http://en.wikipedia.org/wiki/Karen_Horney#Feminine_ psychology

36. శ్రీరామమూర్తి, కోడూరి: తెలుగు నవలా సాహిత్యంలో మనో విశ్లేషణ, పుట 31-32.

37. కృష్ణకుమారి, నాయని: (సం.పా.) వాఙ్మయి(మే-జూ1997), పుట.7-8.

38. http://en.wikipedia.org/wiki/Carl_Rogers#Selected_works_By_Carl_Roge

39. వెంకటేశ్వరరావు, మాముదాల: విశ్వనాథ నవలలు మనస్తత్త్వ చిత్రణ, పుట : 22-23.

40.వెంకట సుబ్బయ్య, మన్నం: ప్రాచ్య- పాశ్చాత్య తత్త్వ పరంపర తులనాత్మక అధ్యయనం,పేజి: 124-125.

41. ప్రభాకరరావు, ముదివేడు: భారతీయ సంప్రదాయ భూమిక భిన్నత్వంలో ఏకత్వం, పుట : XV-XVI

42. గోపాలకృష్ణశాస్త్రి, ముక్తినూతులపాటి : మనస్తత్త్వశాస్త్రం, పుటః 8.

43. పైదే, పుట. 668.

44. పైదే, పుట. 669.

45. పైదే, పుట.  177.

46. పైదే, పుట. 52.

47. వెంకటేశ్వరరావు, త్రిపురనేని: భారత తత్త్వశాస్త్రి పరిశీలన, పుట. 353.

48.భారతీయ సంప్రదాయ భూమిక భిన్నత్వంలో ఏకత్వం; పుట. XXVIII

49. గోపాలకృష్ణశాస్త్రి, ముక్తినూతులపాటి.మనస్తత్త్వశాస్త్రిము, పుట.142 - 147.

50. గోపాలకృష్ణశాస్త్రి, ముక్తినూతులపాటి : మనస్తత్త్వశాస్త్రిం, పుట. 156-177.

51. పైదే, పుట. 191-192.

52. పైదే, పుట. 179-190.

53. పైదే, పుట.  260-264.

54. పైదే, పుట.  262.

55. పైదే, పుట.  266.

56. పైదే, పుట. 268.

57. పైదే, పుట. 275-300.

58. పైదే, పుట.  275-339.

59. పైదే, పుట. 109.

60. పైదే, పుట. 547.

61. పైదే, పుట.  110-128.

62. కృష్ణశ్రీ: స్త్రిల రామాయణపు పాటలు, పుట.102.

63. పైదే, పుట. 102.

64. పైదే, పుట. 103.

65. వెంకట్రామయ్య, రసాని :జానపదగేయలలో పురాణాలు, పుట. 26.

66. గంగప్ప, యస్: జాతికి ప్రతిబింబం జానపద సాహిత్యం, పుట. 21.

67. గంగాధరం, నేదునూరి : మున్నేరు ; పుట. 31-32.

68. వెంకట్రామయ్య, రసాని : జానపద గేయాలలో పురాణాలు, పుట. 32.

69. నారాయణ రెడ్డి, సి: , ఆంజనేయ శర్మ, వేమూరి: , సుబ్రహ్మణ్యం, చిర్రావూరి: (సంపా) స్రవంతి : డిసెంబరు. 1982; పుట : 15.

70. కృష్ణశ్రీ. స్త్రీల రామాయణపు పాటలు; పుట.11.

71. పైదే, పుట. 171.

72. పైదే, పుట.171.

73. పైదే, పుట. 242.

74. నారాయణ రెడ్డి, సి: , ఆంజనేయ శర్మ, వేమూరి: , సుబ్రహ్మణ్యం, చిర్రావూరి: (సంపా), స్రవంతి : డిసెంబరు 1982 ;పుట : 20.

75. కృష్ణశ్రీ. స్త్రీలరామాయణపు పాటలు; పుట.274.

76. పైదే, పుట. 273-290.

77. పైదే, పుట. **280.**

**78.** వేంకటసుబ్బయ్య, అప్పజోడు : జీవన చిత్రాలు, పుట. 15-16.

79. సరస్వతీదేవి, ఇల్లిందల: జాతి రత్నాలు, పుట. 71.

80. కృష్ణశ్రీ. స్త్రీల పౌరాణికపు పాటలు, పుట. 243-244.

81. సరస్వతీదేవి, ఇల్లిందల: జాతిరత్నాలు, పుట. 73.

82. కృష్ణశ్రీ. స్త్రీల పౌరాణికపు పాటలు; పుట. 244.

83. కృష్ణశ్రీ. స్త్రీల రామాయణపు పాటలు; పుట. 276-277.

84. పైదే, పుట.24.

85. పైదే, పుట.24.

86. పైదే, పుట.25.

87. పైదే, పుట. 3.

88. పైదే, పుట. 3.

89. పైదే, పుట. 4.

90. పైదే, పుట. 25.

91. పైదే, పుట. 272.

92. పైదే, పుట. 274.

93. వెంకట్రామయ్య, రసాని : జానపద గేయాలలో పురాణాలు, పుట. 43.

94. పైదే, పుట. 43-44.

95. కృష్ణశ్రీ. స్త్రీలరామాయణపు పాటలు: పుట.407.

96. పద్మకుమారి, ఎం. రంగనాథ ఏకోజి రామాయణములు తులనాత్మక పరిశీలన, పుట. 77.

97. పైదే, పుట. 78.

98. పైదే, పుట. 78.

99. పైదే, పుట. 79.

100. పైదే, పుట. 79.

101. http://www.eemaata.com/em/issues/200701/1051.html

102. పైదే.

103. పైదే.

104. స్త్రీల రామాయణపు పాటలు, పుట. 280-281.

105. వెంకట్రామయ్య, రసాని : జానపద గేయాల్లో పురాణాలు, పుట. 70.

106. జానపద పారమార్థిక గేయ సాహిత్యం, పుట. 39-40.

107. వెంకట్రామయ్య, రసాని: జానపద గేయలలో పురాణాలు, పుట. 71.

108. కృష్ణశ్రీ. స్త్రీల పౌరాణికపు పాటలు, పుట. 215.

109. వెంకట్రామయ్య, రసాని: జానపద గేయాలలో పురాణాలు, పుట. 76.

110. సుబ్బలక్ష్మి, మర్ల : తెలుగు జానపద సాహిత్యం పౌరాణిక గేయ గాథలు, పుట. 149.

111. కమల,ఆర్ : స్త్రీల పౌరాణిక గీతాలు, పుట.76.

112. సుబ్బలక్ష్మి, మర్ల : తెలుగు జానపద సాహిత్యం పౌరాణిక గేయ గాథలు, పుట. 117.

113. కృష్ణశ్రీ. స్త్రీలపౌరాణికపు పాటలు, పుట. 207.

114. పైదే, పుట. 207.

115. పైదే, పుట. 214-215.

116. పైదే, పుట. 217.

117. కమల,ఆర్ : స్త్రీల పౌరాణిక గీతాలు ; పుట. 58.

118. పైదే, పుట. 58.

119. పైదే, పుట. 58.

120. కృష్ణశ్రీ. స్త్రీల పౌరాణికపు పాటలు, పుట. 295.

121. కమల,ఆర్ : స్త్రీలపౌరాణిక గీతాలు, పుట. 104.

122. పైదే, పుట.105.

123. పైదే, పుట.107-108.

124. http://www.eemaata.com/em/issues/200703/1083.html

125. కృష్ణశ్రీ. స్త్రీల పౌరాణికపు పాటలు, పుట. 295.

126. కమల,ఆర్ : స్త్రీల పౌరాణిక గీతాలు, పుట : 105-106.

127. పైదే, పుట.106.

128. పైదే, పుట. 107.

129. పైదే, పుట.107-108.

130. పైదే, పుట.108.

131. కృష్ణశ్రీ. స్త్రీల పౌరాణికపు పాటలు, పుట. 4.

132. పైదే, పుట.4-5.

133. పైదే, పుట. 5.

134. పైదే, పుట. 5.

135. పైదే, పుట.9.

136. పైదే, పుట.10.

137. పైదే, పుట. 10.

.138. పైదే, పుట. 13.

139. పైదే, పుట. 271.

140. గంగప్ప, యస్: జాతికి ప్రతిబింబం జానపద సాహిత్యం, పుట. 74.

141. పైదే, పుట. 74.

142. పైదే, పుట.171.

143. పైదే, పుట.272.

144. పైదే, పుట. 272.

145. పైదే, పుట. 272.

146. పైదే, పుట.273.

147. పైదే, పుట.276-279.

148. పైదే, పుట.279.

149. సుబ్బలక్ష్మి, మర్ల : తెలుగు జానపద సాహిత్యం పౌరాణిక గేయ గాథలు, పుట-151.

150. కమల,ఆర్ : స్త్రీల పౌరాణిక గీతాలు, పుట. 10.

151. పైదే, పుట. 11.

152. పైదే, పుట. 13-14.

153. పైదే, పుట.15.

154. సుబ్బలక్ష్మి, మర్ల : తెలుగు జానపద సాహిత్యం పౌరాణిక గేయ గాథలు, పుట. 219.

155. కమల,ఆర్ : స్త్రీల పౌరాణిక గీతాలు, పుట. 50.

156. కృష్ణకుమారి, నాయని: (సం.పా.) వాఙ్మయి (మే-జూ:1997), పుట.9-10.

157. కమల,ఆర్ : స్త్రీల పౌరాణిక గీతాలు, పుట.52.

158. పైదే, పుట.53.

159. పైదే, పుట.54.

160. పైదే, పుట. 55.

161. పైదే, పుట. 56.

162. కృష్ణశ్రీ. స్త్రీల పౌరాణికపు పాటలు, పుట. 132.

163. పైదే, పుట.176.

164. పైదే, పుట..177.

165. పైదే, పుట.196.

166. వెంకట్రామయ్య, రసాని : జానపద గేయాలలో పురాణాలు, పుట. 96.

167. పైదే, పుట.పుట.99.

168. http://www.eemaata.com/em/issues/200703/1083.html

169. పైదే.

170. పైదే.

171. కృష్ణశ్రీ. స్త్రీలపౌరాణికపు పాటలు, పుట . 187.

172. పైదే, పుట.188.

173. పైదే, పుట. 189.

174. పైదే, పుట.190.

175. పైదే, పుట.190.

176. సుబ్బలక్ష్మి, మర్ల: తెలుగు జానపద సాహిత్యం పౌరాణిక గేయ గాథలు, పుట.180.

177. వెంకట్రామయ్య, రసాని : జానపద గేయాలలో పురాణాలు, పుట. 83.

178. పైదే, పుట. 84.

179. సుబ్బలక్ష్మి, మర్ల :తెలుగు జానపద సాహిత్యం పౌరాణిక గేయ గాథలు, పుట.183.

180. పైదే, పుట.184.

181. వెంకట్రామయ్య, రసాని: జానపద గేయాలలో పురాణాలు, పుట.85-86.

182. కృష్ణశ్రీ. స్త్రీల పౌరాణికపు పాటలు, పుట.81.

183. పైదే, పుట.83.

184. వెంకటరెడ్డి, కసిరెడ్డి. భారతీయమహిళ, పుట .48.

185. కృష్ణశ్రీ. స్త్రీల పౌరాణికపు పాటలు, పుట.198.

186. పైదే, పుట. 199-200.

187. పైదే, పుట. 200.

188. రాధాకృష్ణమూర్తి, కంఠంనేని: బాడీ సైకాలజీ, పుట.26.

189. కృష్ణశ్రీ :స్త్రీలపౌరాణికపు పాటలు, పుట. 200.

## ఉపయుక్త గ్రంథసూచి


1.అరుణ, జి.   *తెలుగు హిందీ పౌరాణిక గేయ పరిశీలన.*హైదరాబాద్ : హైదరాబాదుయూనివర్సిటీ, 1998.

2.కమల,ఆర్.   *స్త్రీల పౌరాణిక గీతాలు.* హైదరాబాదు : అర్చన పబ్లికేషన్స్, 2000.

3.కురుగంటి, శ్రీలక్ష్మి & ప్రేమలత, రావి . జానపద  జ్ఞాన పరిశీలన, హైదరాబాద్ : వరలక్ష్మి ప్రింటింగ్ ప్రెస్.

4. కృష్ణకుమారి, నాయని.  (సం.పా) తెలుగు జానపద  జ్ఞానం సమాజం - సంస్కృతి. హైదరాబాదు: పొట్టిశ్రీరాములు తెలుగు  శ్వ ద్యాలయం, 2000.

5.కృష్ణకుమారి, నాయని.   తెలుగు జానపద గేయ గాథలు, హైదరాబాద్ : 1977.

6.కృష్ణకుమారి, నాయని.  *పరిశోధన.* హైదరాబాదు : ఆంధ్రసారస్వత పరిషత్, 1979.

7. కృష్ణకుమారి, నాయని. తిరుమలరావు, జయధీర్ , (సం.పా.) వాఙ్మయి. హైదరాబాద్ : పొట్టిశ్రీరాములు తెలుగు శ్వ ద్యాలయం. (మే-జూ:1997).

8. కృష్ణమూర్తి, జిడ్డు.    చేతన.  జయవాడ : పల్ల  & నవోదయా పబ్లికేషనన్స్, 1996.

9. కృష్ణమూర్తి, జిడ్డు.    *మనజీ తాలు.* హైదరాబాద్ :  ప్రగతి పబ్లిషర్స్, 1997.

10. కృష్ణశ్రీ.    *స్త్రీల పౌరాణికపు పాటలు.* హైదరాబాద్ :  పద్మావతీ ఆర్ట్స్ ప్రింటర్స్.

11. కృష్ణశ్రీ.    *స్త్రీల రామాయణపు పాటలు.* హైదరాబాద్ :  పద్మావతీ ఆర్ట్స్ ప్రింటర్స్.

12. కృష్ణారావు, జి. .  *నవతోరణం.* తెనాలి : ప్రభాస్ పబ్లికేషన్స్.

13. కోదండరామారావు, టి. *జగన్మిథ్యా తత్వ పరిశీలనము.* పుదుచ్చేరి : శ్రీ అర ందాశ్రమము, 1976.

14.గణపతిశాస్త్రి, చర్ల. *వేద జ్ఞానము.* వాల్తేరు : 1985.

15. గోపాలకృష్ణశాస్త్రి, ముక్తినూతులపాటి. *మనస్తత్వశాస్త్రము.* మద్రాస్: వా ళ్ళ ప్రెస్, 1940.

16.గంగప్ప, ఎస్. *ప్రసంగ సాహితి.*హైదరాబాద్ : తెలుగునాడు ప్రచురణలు, 1978.

17. గంగప్ప, యస్. *జాతికి ప్రతిబింబం జానపద సాహిత్యం*, గుంటూరు: 1984.

18.గంగాధరం, నేదునూరి. *మిన్నేరు.* రాజమండ్రి : ప్రాచీన గ్రంథావళి.

19. గంగాధరం, నేదునూరి. *మున్నేరు.* రాజమండ్రి : ప్రాచీన గ్రంథావళి. సరస్వతీ పవర్ ప్రెస్.

20. పద్మకుమారి, ఎం. *రంగనాథ -ఏకోజీ రామాయణములు తులనాత్మక పరిశీలన.*హైదరాబాద్ : నవోదయబుక్ హౌస్, 1999.

21. ప్రభాకరరావు, ముదివేడు. *భారతీయసాంప్రదాయభూమికభిన్నత్వంలోఏకత్వం.*తిరుపతి:ఉమా ప్రింటర్స్.

22. ప్రేమలత, రావి . *తెలుగు జానపద సాహిత్యము - పురాగాథలు.* సికింద్రాబాద్ : అవేర్ ప్రింటింగ్ ప్రెస్, 1983.

23. రంగనాధాచార్యులు, కె.కె. *ఆధునిక తెలుగు సాహిత్యంలో భిన్నధోరణులు,* హైదరాబాదు, పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్,1982.

24. రాధాకృష్ణమూర్తి, కంఠంనేని. *బాడీ సైకాలజీ,* హైదరాబాదు: శాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

25. రామకృష్ణ, ఎ.యస్. *విద్యామనో విజ్ఞాన శాస్త్రం .* గుంటూరు: NEP Newyear Publications.

26. రామకృష్ణారెడ్డి, పగడాల. *గోదావరిసీమ జానపద కళలు క్రీడలు వేడుకలు.* ఆంధ్ర శ్వకళాపరిషత్తు, 1991.

27. రామాచార్యులు, బి. *జానపదనృత్య కళ గౌరవ సంప్రదాయం.* హైదరాబాదు : దక్షిణ భారతదేశ ప్రెస్.

28. రామాచార్యులు, బి. *శిష్టసాహిత్యంలో జానపద విజ్ఞాన ధోరణులు.* హైదరాబాద్ :

శ్రీలక్ష్మీవేంకటేశ్వర పవర్ ప్రెస్, 1990.

29. రామానుజరావు, డి. *తెలుగు పరిశోధనలో రజితోత్సవ సంచిక,* 1985.

30. వెంకట్రామయ్య, రసాని. *జానపద గేయాలలో పురాణాలు,* తిరుపతి:శారదా ప్రింటర్స్.

31. వెంకటరెడ్డి, కసిరెడ్డి. *జాతి జీవనంపై రామాయణ ప్రభావం.* హైదరాబాదు : నవభారతి ప్రచురణలు, 1980.

32. వెంకటరెడ్డి, కసిరెడ్డి. *భారతీయమహిళ.* నవయుగభారతిప్రచురణలు, హైదరాబాదు : 1998.

33. వెంకటేశ్వరరావు, అల్లూరి. *నిత్యజీవితంలో సైకాలజీ.* హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1993.

34. వెంకటేశ్వరరావు, త్రిపురనేని. *భారత తత్త్వశాస్త్ర పరిశీలన.* విజయవాడ: 1956.

35. వెంకటేశ్వరరావు, మాముదాల. విశ్వనాథ నవలలు -మనస్తత్వ చిత్రణ. హైదరాబాద్ :

సరస్వతి ఆఫ్‌సెట్ ప్రింటర్స్, నల్లకుంట. 2003.

36. వెంకటేశ్వరులు, బులుసు. *భారతీయ తత్త్వశాస్త్రము.* కాకినాడ: జార్జిప్రెస్, 1954.

37.వేంకటసుబ్బయ్య, అప్పజోడు. *జీవనచిత్రాలు.* గుంటూరు : టి.ఎన్. ప్రింటర్స్.

38. వెంకట సుబ్బయ్య, మన్నం. *ప్రాచ్య- పాశ్చాత్య తత్త్వ పరంపర తులనాత్మక అధ్యయనం.* తిరుపతి: 1994.

39. సరస్వతీదే , ఇల్లిందల. *జాతి రత్నాలు.* 1951.

40. సుబ్రహ్మణ్యం, జి. . *పురాణ వాఙ్మయం,* హైదరాబాదు : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1975.

41. సుబ్రహ్మణ్యశాస్త్రి, వేదుల. *జానపదగేయ సాహిత్యప్రభ,* హైదరాబాద్ : ఎక్స్వేరియన్ ప్రింటింగ్ హౌస్.

42. సుబ్బలక్ష్మి, మర్ల. *తెలుగు జానపద సాహిత్యం పౌరాణిక గేయ గాథలు.* హైదరాబాదు : 2003.

43. సుందం, ఆర్వీయస్. *ఆంధ్రుల జానపద జ్ఞానం,* పొట్టిశ్రీరాములు. , హైదరాబాద్ :

తెలుగు విశ్వవిద్యాలయం.

44.నాగయ్య, జి. *దక్షిణాత్య సాహిత్య సమీక్ష* (మొ.సం) మద్రాసు : నవోదయ పబ్లిషర్స్, 1976.

45. శ్రీరామమూర్తి, కోడూరి. *తెలుగు నవలా సాహిత్యంలో మనో శ్లేషణ,* హైదరాబాద్: శాలాంధ్రా

పబ్లిషింగ్ హౌస్.

# English Books

1. Clifford T. Morgan, Richard A king : *Introduction to Psychology*, Published by Tata Mcgran hill ED,1956.

2.Indian Folk Life : june 2008. National Folklore Support centre Guest Editors : Y.A. Sudhakar Reddy and P.S. kanaka durga.

# web Sites

1. **www.archive**.org
2. Dli.iiit.ac.in
3. www.eemaata.com

*6.* www.new.dli.ernet.in

4. www.telugubharati.com
5. www.**vidyanidhi.org**.in
6. www.wikipedia.org

# పత్రికలు

1. స్రవంతి (డిసెంబర్ 1982) ; (సంపా) సి. నారాయణ రెడ్డి, వేమూరి ఆంజనేయ శర్మ, చిర్రావూరి సుబ్రహ్మణ్యం.

3. స్రవంతి (ఏప్రిల్ 1992) ; (సంపా) వేమూరి ఆంజనేయశర్మ, ఈమని దయానంద, పిన్నమనేని ప్రసాదరావు, దక్షిణ భారత హిందీ ప్రచార సభ - ఆంధ్ర, ఖైరతాబాదు, హైదరాబాద్.

2. స్రవంతి (అక్టోబర్ 1996) ; (సంపా) వేమూరి ఆంజనేయశర్మ, ఈమని దయానంద, అన్నదానం శంకరశాస్త్రి, దక్షిణ భారత హిందీ ప్రచార సభ - ఆంధ్ర, ఖైరతాబాదు, హైదరాబాద్.

4.స్రవంతి (డిసెంబర్ 1996) ; (సంపా) వేమూరి ఆంజనేయశర్మ, ఈమని దయానంద, అన్నదానం శంకరశాస్త్రి, దక్షిణ భారత హిందీ ప్రచార సభ - ఆంధ్ర, ఖైరతాబాదు, హైదరాబాద్.

6. శంభుప్రసాద్ , శివలెంక, భారతి , సం.33, నవంబరు, 1956:

5. శ్రీవాణి(1998) ; (సంపా) చంద్రశేఖర్, కొమరగిరి, రామానాయుడుపేట, మచిలీపట్నం.